సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 311

శనివారం 1-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



నానాటికి బంగారం, వజ్రం, వెండి ధరలు పెరుగుతున్న ఈ తరుణంలో..
మీ సంతోషాన్ని దృష్టిలో ఉంచుకొని నా వంతుగా చేస్తున్న సహాయం ఇది.

అన్ని బంగారు నగలపై

మార్కెట్ కంటే మా తక్కువ తరుగులో ఇంకా **తగ్గింపు 1%**

అన్ని వజ్రాభరణాలు

క్యారెట్‌కు **రూ.5000 తగ్గింపు**

1 Carat = 200 Milligrams

వెండి వస్తువులకు ప్రత్యేక తగ్గింపు.

త్వరపడండి, పరిమితకాల ఆఫర్ !





ధరలు పోల్చండి!

నగల ధరలు కంపేర్ చేసేటప్పుడు ఈ డిజైన్ అలా ఉంది.. పనితనం ఇలా ఉంది.. అని మార్కెట్‌లో తికమక పెడుతున్నారా? లలితా జ్యూవెల్లరిలో మీకు నచ్చిన నగకు ఎస్టిమేట్ స్లిప్ తీసుకోండి. ఆ నగను మొబైల్‌లో ఫొటో కూడా తీసుకోండి. రెండింటిని పెట్టుకుని నాలుగైదు షోరూంలలో కంపేర్ చేయండి. ఎక్కడ ధర తక్కువగా ఉంటే.. అక్కడే కొనండి!

లలితా జ్యూవెల్లరి మార్ట్ లిమిటెడ్

బంగారం • వజ్రం • వెండి

ఆంధ్రప్రదేశ్ • తెలంగాణ • తమిళనాడు • పుదుచ్చేరి • కర్ణాటక

లక్షలాది డిజైన్లు! | Customer Care: 90 99 999 916 | BIS 916 హాల్‌మార్క్

www.lalithaajewellery.com

మీ లలితా జ్యువెల్లరిలో.. మార్కెట్ లోనే అధిక ఆదాయం అందించే

2 నగల కొనుగోలు పథకాలు

FREE & FLEXI

11 నెలల
'నగలు కొనుగోలు పథకం'!
బంగారం ధర
పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం

100%
తరుగు లేదు
అన్ని బంగారు నగలు, అన్‌కట్ వజ్రాభరణాలు
మరియు వెండి వస్తువులకు వర్తిస్తుంది.

బంగారం ధర పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం

వజ్రాభరణాలకు ప్రత్యేక ఆఫర్ కలదు!

చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 / రూ.5000
రూ.10000 / రూ.15000 / రూ.20000 / రూ.25000



Lalithaa EXCHANGE UTSAV

అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్
ఖర్చు లేకుండా,
ముందుగా పాత నగలు ఇచ్చి,
కొత్త నగలు తీసుకోవచ్చు!

100%
తరుగు లేదు

5వ నెల ఆఖరు నుంచి, కొనే నగను బట్టి,
తరుగు (V.A.) లేకుండా నగలు కొనొచ్చు.

11 నెలల తర్వాత నగలు తీసుకొంటే ఏ బంగారు నగ అయినా కానీ,
తరుగు ఛార్జీలు ఇవ్వాల్సిన పనిలేదు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్,
ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

పాత నగలతో మాత్రమే కాదు,
నగదు చెల్లించి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు!

అన్ని బంగారు నగలపై
మార్కెట్ కంటే మా తక్కువ తరుగులో ఇంకా 1% తగ్గింపు











వజ్రాభరణాలు
క్యారెట్‌కు రూ. 5000 తగ్గింపు
1 Carat = 200 Milligrams

ఇతర షోరూం మాదిరిగా తరుగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
నాణ్యత సర్టిఫికెట్ | కలర్ & క్లారిటి | ఎక్స్‌ఛేంజ్ పాలసి





వెండి వస్తువులకు ప్రత్యేక తగ్గింపు.

Lalithaa®
www.lalithaajewellery.com

లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్


Customer Care 90 99 999 916 | BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

హైదరాబాద్ - సోమాజిగూడ: SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040-6748 6677.
దిల్‌సుఖ్‌నగర్: అర్చన కాంప్లెక్స్,కమలా నగర్ రోడ్, 1558 మెట్రో పిల్లర్‌కు ఎదురుగా, చైతన్యపురి సర్కిల్. ఫోన్: 9133832704 / 040-29334505.
కూకట్‌పల్లి: PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం. ఫోన్: 040-2384 2277 / 2200 / 2299.
చందానగర్: ఇన్ఫినిటి మాల్. ఫోన్: 040 - 2934350 / 7799775815.
సుచిత్రా సర్కిల్: గ్రీన్ పార్క్ అవెన్యూ, సుచిత్రా రోడ్. ఫోన్: 040 - 2703 5555 / 2784 5555.

నిజామాబాద్- ద్వారకా నగర్, గోపాల్‌బాగ్, హైదరాబాద్ రోడ్. ఫోన్: 08462-233555.
వరంగల్: రాయ్‌పుర, హన్మకొండ మెయిన్‌రోడ్, హన్మకొండ. ఫోన్: 89258 48144 / 45.
మిర్యాలగూడ: సాగర్ రోడ్, వైష్ణవి హోటల్ ఎదురుగా, నల్గొండ. ఫోన్: 89259 90413 / 14.

తమిళనాడు • పుదుచ్చేరి • కర్ణాటక

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 311
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సంస్కరణల మోత.. వృద్ధికి చేయూత!




- ఆర్థిక సర్వే 2024–25లో చెబుతోంది ఇదే...
- పార్లమెంట్‌లో నివేదిక ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఆర్థిక మందగమనానికి తక్షణ చికిత్స అవసరం
- వచ్చే ఏడాది జీడీపీ వృద్ధి 6.3–6.8 శాతంగా అంచనా... 2047కల్లా 'వికసిత దేశ'మే లక్ష్యం
- వచ్చే 20 ఏళ్ల పాటు 8% వృద్ధితోనే ఇది సాధ్యం

17లో

'ఐటీ' కటాక్షం.. గేమ్ చేంజర్!
నేడే 2025-26 కేంద్ర బడ్జెట్..

- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల
- పేద, మధ్య తరగతికి 'లక్ష్మీ కటాక్షం..' అంటూ బడ్జెట్‌కు ముందు ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మోదీ మూడోసారి గెలిచాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇది
- వ్యవసాయం, ఇన్‌ఫ్రా, చిన్నతరహా పరిశ్రమలపై ఫోకస్
- ఆదాయ పన్ను విషయంలో విప్లవాత్మక నిర్ణయాలు!
- కొత్త పన్నుల విధానంలో రూ.10 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు అంటూ ప్రచారం



- 2లో

మూడో పర్యాయం.. మూడింతల వేగం



➤ దేశ అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ వేగంతో పనిచేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. శుక్రవారం పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం సాధించిన ఘనతలను వివరించారు. కీలకమైన జమిలి ఎన్నికలతోపాటు వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రభుత్వం ముందడుగు వేసిందని అన్నారు.

6లో

పేదలు, మధ్య తరగతిపై లక్ష్మీకటాక్షం



➤ పేదలు, మధ్య తరగతి ప్రజలపై సంపదల దేవత లక్ష్మీదేవి కటాక్షం చూపాలని తాను ప్రార్థిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ బడ్జెట్‌లో పేదలు, మధ్య తరగతితోపాటు మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

6లో




రామోజీపై 'రాజ' భక్తి!
'మార్గదర్శి' అక్రమ డిపాజిట్ల వసూలుపై నోరెత్తని బాబు సర్కారు

- వసూలు చేసిన ఆ డిపాజిట్లు చెల్లించేశారని హైకోర్టుకు వెల్లడి
- సెక్షన్ 45ఎస్ గురించి నామమాత్రంగానూ ప్రస్తావించని వైనం
- మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందా? అన్నదానిపైనా విచారణ జరపాలని అభ్యర్థన
- రామోజీ చనిపోయారు కాబట్టి కేసు కొట్టేయాలన్న మార్గదర్శి
- విచారణ జరపడం నిష్ప్రయోజనమంటూ అనుబంధ పిటిషన్
- పూర్తిస్థాయి వాదనలకు ముందు ఈ విషయాన్ని తేల్చాలని అభ్యర్థన
- విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు
- గతంలో మార్గదర్శి తరఫున కేసుల్లో హాజరయ్యానని వెల్లడి

14లో

నేను కొడితే.. వట్టిగ ఉండదు
4 రోజులు కానీయ్ అని చూస్తున్నా... ఎర్రవల్లిలో పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్



ఎర్రవల్లిలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కేసీఆర్

- రాష్ట్రంలో జరుగుతున్నవి గంభీరంగా, మౌనంగా చూస్తున్నా
- ఏడాదిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారు
- నాలుగైదు నెలలైతే జీతాలూ ఇవ్వడం కష్టమనే దుస్థితి
- పాలనలో లోపాలను ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతున్నారు
- కాంగ్రెస్ వాళ్లు దొరికితే కొడతామన్నట్టు జనం ఉన్నారు
- ప్రాణం పోయినా సరే.. తెలంగాణకు గులాబీ జెండాయే రక్షణ
- ప్రత్యక్ష పోరాటాలు లేవదీసి నీళ్లు, ప్రాజెక్టులు సాధించుకుందాం
- ఫిబ్రవరి చివరిలో సభతో తెలంగాణ శక్తి చాటుదామని పిలుపు

సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను నేను గంభీరంగా, మౌనంగా చూస్తున్నా.. నాకు కొడితే వట్టిగా కొట్టుడు అలవాటు లేదు కదా. నాలుగు రోజులు కానీయ్ అన్నట్లు చూస్తున్నా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. సంగమేశ్వర, బసవేశ్వర, పాలమూరు ఎత్తిపోతల పథకాలు నిలిచిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్నరు. ఈ అన్యాయాలపై ఫిబ్రవరి నెలాఖరులో బహిరంగ సభ పెట్టి వీళ్ల సంగతి చూడాలి. పెద్ద ఎత్తున సభకు తరలివచ్చి తెలంగాణ శక్తిని మరోమారు చాటాలి. కాంగ్రెస్ మెడలు వంచి భవిష్యత్తు కోసం కొట్లాడాలి' అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామం నుంచి వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 140 కిలోమీటర్లు పాదయాత్ర చేసి శుక్రవారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''మన పార్టీకి కులం, మతం, జాతి అనే భేదభావం లేదు. తెలంగాణ సరిహద్దు లోపల ఉన్న వారందరికీ న్యాయం జరిగి బాగుపడాలి. తెలంగాణకు అన్యాయం జరిగితే కొట్లాడేందుకు ఎవరూ ముందుకు రారు. ప్రాణం పోయినా సరే తెలంగాణకు రక్షకులం మనమే. తెలంగాణ

మిగతా 8వ పేజీలో ▶

దమ్ముంటే అసెంబ్లీకి రా.. తేల్చుకుందాం
మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ మొగిలిగిద్ద బహిరంగ సభలో సీఎం ప్రసంగం



మొగిలిగిద్ద సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఫామ్‌హౌస్‌లో పడుకుని ఎవరిని గంభీరంగా చూస్తున్నావ్..
- త్వరలో అసెంబ్లీలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చ పెడతాం
- పొంకనాలు కొట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా
- నీ రాక కోసం ప్రజలెవరూ ఎదురు చూడటం లేదు
- వేములవాడ రాజన్నను మోసం చేసిన చరిత్ర నీది
- కేసీఆర్ ఓ చెల్లని వెయ్యి రూపాయల నోటు.. ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదని వ్యాఖ్య

సాక్షి,రంగారెడ్డి జిల్లా: ''కేసీఆర్ గత 14 నెలలుగా ఫామ్‌హౌస్‌లో పడుకొని గంభీరంగా చూస్తున్నానని అంటున్నారు. ఎవరిని చూస్తున్నావు? ఎందుకు చూస్తున్నావు? బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించేందుకు ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నాం. ఫామ్‌హౌస్‌లో పడుకుని పొంకనాలు కొట్టడం కాదు. దమ్ముంటే అసెంబ్లీకి రా.. అన్ని లెక్కలు తేల్చుకుందాం.'' అని మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకొని కొడుకు, అల్లుడిని ఊర్లపైకి ఉసిగొల్పుతున్నడు. జహంగీర్‌పీర్ దర్గా, వేములవాడ రాజన్నలను మోసం చేసిన చరిత్ర నీది. నీ రాక కోసం తెలంగాణ ప్రజలెవరూ ఎదురు చూడటం లేదు.

సరిగ్గా నిలబడటం నేర్చుకో..

నువ్వో చెల్లని వెయ్యి రూపాయల నోటువు. ఆ నోటును ఎవరైనా జేబులో పెట్టుకునిపోతే.. జైలుకు వెళ్లడం ఖాయం. కొడితే బలంగా కొడతానని అంటున్నారు. కొట్టడం కాదు ముందు సరిగ్గా నిలబడటం నేర్చుకో. సోషల్ మీడియా టిక్‌టాక్‌లో తనకు ఎక్కువ మార్కులు వచ్చాయని

మిగతా 8వ పేజీలో ▶

సొంత ఆదాయంలో రాష్ట్రం టాప్!

- సామాజిక ఆర్థిక సర్వే (2024–25)లో కేంద్రం వెల్లడి
- తెలంగాణ ఎంఎస్ఎంఈ పాలసీతో ఈ–కామర్స్ వ్యాప్తికి దోహదం
- రాష్ట్రంలో 100 శాతం గ్రామాలకు రక్షిత మంచినీరు
- స్థూల ఉత్పత్తిలో సేవల రంగం వాటా 6 శాతం.. దేశంలో ఏడో స్థానంలో తెలంగాణ... ఐటీ సేవల్లో కర్ణాటక తర్వాత రెండో ప్లేస్..
- బెంగళూరు, ముంబైతో పోటీగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఐటీ, ఫిన్‌టెక్ సేవల విస్తృతి కారణంగా ఆఫీసులు, నివాస స్థలాలకు మంచి డిమాండ్



3లో

9 రోజులు తల్లి మృతదేహంతోనే..



- అనారోగ్యంతో తల్లి చనిపోయిందనే బాధతో డిప్రెషన్‌లోకి ఇద్దరు కుమార్తెలు
- దహన సంస్కారాలకు డబ్బుల్లేక, ఏం చేయాలో పాలుపోక దీనస్థితిలో..
- సికింద్రాబాద్ వారాసిగూడ పరిధిలో ఘటన

2లో

ఇంతేసంగతి




అబ్బే! రోబో కాదు మన ఎంపీ గారే.. ముందు జాగ్రత్త చర్యగా...!!

(సాక్షి, బిజినెస్ డెస్క్, సాక్షి, అమరావతి)

ఐటీ కటాక్షం.. గేమ్ చేంజర్!

నేడే 2025-26 కేంద్ర బడ్జెట్..



- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- పేద, మధ్యతరగతికి 'లక్ష్మీ కటాక్షం' అంటూ బడ్జెట్‌కు ముందు ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మోదీ మూడోసారి గెలిచాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇది
- వ్యవసాయం, ఉపాధి, ఇన్‌ఫ్రా, చిన్నతరహా పరిశ్రమలపై ఫోకస్
- ఆదాయపు పన్ను విషయంలో విప్లవాత్మక నిర్ణయాలుంటాయని ఊహాగానాలు
- కొత్త పన్నుల విధానంలో రూ.10 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు అంటూ ప్రచారం
- రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షలు ఆర్జించే వారి కోసం 25 శాతంతో కొత్త శ్లాబ్ పెట్టే అవకాశం

మరి కొద్ది గంటల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో వెలువడిన కేంద్ర ఆర్థిక సర్వేతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు వేతన జీవులు, మధ్య తరగతి వర్గాల్లో ఆశలను పెంచుతున్నాయి. 2014 నుంచి పన్నుల శ్లాబులు మార్చకపోవడం.. మండిపోతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెరగని నేపథ్యంలో ఈదఫా వేతన జీవులకు ఊరట లభిస్తుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. శుక్రవారం విడుదలైన ఆర్థిక సర్వే ఇదే సంకేతాలనిచ్చింది. 2023-24లో కంపెనీల లాభాలు 22.3 శాతం పెరగగా ఇదే సమయంలో ఉద్యోగాల కల్పన వృద్ధి కేవలం 1.3 శాతానికి పరిమితం కావడం.. సంస్థలు వ్యయాల నియంత్రణ పేరుతో సిబ్బంది సంఖ్యతో పాటు వేతనాల్లో కోత పెడుతుండటంపై సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. 2002-03లో దేశ జీడీపీలో 2.1 శాతంగా ఉన్న కార్పొరేట్ కంపెనీల లాభాల శాతం 2023-24 నాటికి ఏకంగా 4.8 శాతానికి చేరుకున్నాయని, ఇదే సమయంలో వేతనాల పెరుగుదల చాలా తక్కువగా ఉండటం ఆర్థిక అసమానతలను పెంచుతుందని సర్వే పేర్కొంది. అయితే మన దేశ ఆర్థిక పరిస్థితేమీ అంత గొప్పగా లేదు. వృద్ధి నెమ్మదించింది. అమెరికాలో ట్రంప్ విజయం సాధించటమేకాక... భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు పెంచుతామని బెదిరిస్తున్నారు. స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థలు పెట్టుబడుల్ని అదేపనిగా ఉపసంహరించుకుంటున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా విపరీతంగా పెరగటంతో... ఇపుడు బ్లూచిప్, చిన్న, పెద్ద అనే తేడాల్లేకుండా అన్ని కంపెనీల్లోనూ విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఫారిన్ ఫండ్స్) తమ వాటాలను అయినకాడికి తెగ నమ్మేస్తున్నాయి. ఇక ద్రవ్యోల్బణం పెరుగుతోంది... డాలర్‌తో పోలిస్తే రూపాయి భారీగా పతనమవుతోంది. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందే తప్ప తగ్గటం లేదు. ఇలాంటి సమస్యలతో దేశం ఉక్కిరిబిక్కిరవుతున్న సమయంలో 2025-26 కేంద్ర బడ్జెట్‌ను శనివారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నారు. ఆమె వరుసగా ఎనిమిదోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నా... మోదీ ప్రభుత్వం మూడోసారి గెలిచాక ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్. ఎందుకంటే ఎన్నికలు సంవత్సరం మధ్యలో రావటంతో మిగిలిన కాలానికి ఓటాన్ అకౌంట్‌తో నెట్టుకొచ్చారు. ఇప్పుడు పూర్తి బడ్జెట్ పెడుతున్నారు. మరి ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కోవాలంటే సరికొత్త గేమ్ ఛేంజర్ విధానాలు అవసరమన్నది నిపుణుల మాట. ఒకవైపు పేద, మధ్యతరగతి వర్గాలకు రక్షణ కల్పిస్తూనే వృద్ధిని పరుగులెత్తించాల్సిన బాధ్యత బడ్జెట్లో ఆర్థిక మంత్రి ఏ మేరకు నెరవేరుస్తారన్నదే సర్వత్రా చర్చనీయమవుతోంది.

ఇన్‌ఫ్రాకు బూస్ట్

కొంతకాలంగా ప్రభుత్వం మౌలిక వసతుల నిర్మాణంపై దృష్టి సారించడం వల్ల ఇన్‌ఫ్రా రంగంమీద ఫోకస్ ఉంటుంది. అయితే ఈ రంగంలో ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిరుత్సాహకరంగా ఉన్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వాలకిచ్చే మూలధన వ్యయం మద్దతును పెంచే అవకాశముంది. వివిధ పరిశ్రమలలో ఇప్పటికే మంచి ఫలితాలను చూపించిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని విస్తరించడం ద్వారా తయారీ రంగాన్ని బలోపేతం చేసే అవకాశం కనిపిస్తోంది. వినియోగాన్ని పెంచడం తక్షణ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రైవేట్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పోటీతత్వం, ఉపాధి అవకాశాలను పెంచే దీర్ఘకాలిక వ్యూహాలపై బడ్జెట్ దృష్టి పెట్టే చాన్స్ ఉంది.

ఆదాయపు పన్నులో మరింత ఊరట!

బడ్జెట్ వచ్చిందంటే మధ్య తరగతి ఎదురుచూసేది ఆదాయపు పన్ను సవరణల గురించే. ఎందుకంటే పన్ను తగ్గితే జేబులో నాలుగు రూపాయలు మిగులుతాయనే ఆశ. పైపెచ్చు ఈసారి ఆదాయ పన్ను విషయంలో ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలను ప్రకటించే అవకాశముందని కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో రకరకాల కథనాలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్ల కిందట ప్రభుత్వం కొత్త పన్ను విధానాన్ని తెచ్చింది. ఎలాంటి మినహాయింపులూ లేకుండా పన్ను శ్లాబులను మాత్రం సవరించింది. పాత పన్ను విధానంలోనైతే గృహ రుణం, స్కూలు ఫీజుల నుంచి మనం చేసిన వివిధ సేవింగ్స్‌ను కూడా మినహాయించుకునే అవకాశముండేది. కొత్త విధానంలో అలాంటి మినహాయింపులేవీ లేవు. కాకపోతే పన్ను రేట్లు కాస్త తక్కువ. జీతాన్ని బట్టి ప్రస్తుతం ఎవరి లెక్కలు వారు వేసుకుని, ఎవరికి ఏది అనుకూలమంటే దాన్ని ఎంచుకుంటున్నారు. కాకపోతే రెండేళ్ల ప్రభుత్వం కొత్త పన్ను విధానంలో ఆకర్షణీయమైన మార్పులు చేస్తూ... పాత పన్ను విధానం నుంచి ఎవరికి వారు స్వచ్ఛందంగా కొత్త విధానంలోకి మారేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈసారి ఆ దిశగా మరింత దూకుడు పెంచి... పాత విధానం వృథా అనేలా చేసే అవకాశం కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త పన్నుల విధానంలో 72 శాతం మందికి పైగా రిటర్నులు దాఖలు చేశారు. పాత పన్నుల విధానాన్ని రద్దు చేసి.. కొత్త పన్నుల విధానంలో పలు రాయితీలను ప్రకటించడం ద్వారా మధ్య తరగతి ప్రజల ఆగ్రహాన్ని కట్టడి చేయవచ్చన్నది ఆర్థిక మంత్రి ఆలోచనగా ఉన్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం... కొత్త విధానంలో రూ.10 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని, రూ.15-20 లక్షల వరకు ఆదాయానికి 25% కొత్త పన్ను శ్లాబ్‌ను ప్రవేశపెట్టాలనే వాదనలు వస్తున్నాయి. ఈ విషయంలో ఆర్థిక మంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటే బడ్జెట్లో మిడిల్‌క్లాస్‌కు మేలు జరిగినట్లే. మరోవైపు శుక్రవారం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు పన్ను మినహాయింపులపై ఆశలు పెంచేలా ఉన్నాయి. మధ్యతరగతి, పేదలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... వారికి లక్ష్మీకటాక్షం లభిస్తుందని పేర్కొనడం గమనార్హం.

వ్యవసాయం, గ్రామీణ ఆర్థికంపై ఫోకస్

వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ఎక్కువ మద్దతు లభించే అవకాశం ఉంది. రైతులు రుణాలను సులభంగా పొందడానికి ప్రభుత్వం క్రెడిట్ గ్యారంటీ పథకాలను విస్తరించవచ్చు. ఈ రంగానికి మరింత మద్దతుగా, ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి మరిన్ని కేటాయింపులు చేసే అవకాశం ఉంది. పంట నిల్వల కోసం గోదాముల నిర్మాణం, వ్యవసాయ మార్కెటింగ్ కోసం మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వొచ్చు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ వంటి కార్యక్రమాలు నీటిపారుదలను గణనీయంగా పెంచినప్పటికీ, ఇంకా పురోగతికి అవకాశం ఉంది. పరిశోధన, అభివృద్ధితో సహా సమర్థవంతమైన మార్కెటింగ్ వ్యవస్థలతో వ్యవసాయ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే ప్రయత్నం చేయొచ్చు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెంచడానికి రైతులకు మరింత మద్దతు అవసరం. గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో ఇళ్లకి పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకుని, అందుబాటు గృహాల నిర్మాణం మరో ముఖ్యమైన అంశంగా ఉండొచ్చు. ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి ఉపాధి పథకాలకు నిధులు పెంచి, దాని పరిధిని విస్తరించే అవకాశముంది.

యువత ఉపాధి, కీలక రంగాలకు మద్దతు

రాబోయే రోజుల్లో లక్షల మంది యువతీ యువకులు డిగ్రీ పట్టాలతో మార్కెట్లోకి వస్తారు. వీళ్లందరికీ ఉద్యోగాలు లభిస్తేనే ఆర్థిక వృద్ధి జోరందుకుంటుంది. ఇందువల్ల ఉద్యోగ కల్పనపై కూడా బడ్జెట్ ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది. నిర్మాణం, జౌళి, ఇ-కామర్స్, పర్యాటక రంగాలు సాధారణంగా పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగాలకు బడ్జెట్లో మరిన్ని కేటాయింపులు ఉండొచ్చు. దీనికి అదనంగా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం వారికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించడం లక్ష్యంగా విధానాలు ప్రకటించవచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి ప్రభుత్వం నుంచి నిరంతర సహాయం అందేలా చర్యలు తీసుకునే వీలుంది. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొనే ఆర్థిక సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం రుణ హామీ పథకాలను విస్తరించడం, ఎగుమతులకు అదనపు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలను పరిశీలించవచ్చు. వీటికి తోడు చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై విధించే పన్నుల సరళీకరణ కూడా బడ్జెట్లో ఉండొచ్చు.

క్లుప్తంగా...

ఉపరాష్ట్రపతితో బీఆర్ఎస్ ఎంపీల భేటీ


శుక్రవారం ఢిల్లీలో ధన్‌ఖడ్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌తో బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ ఎంపీలు భేటీ అయ్యారు. ఉభయ సభల్లో శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగం.. అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్‌రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డిలు మర్యాదపూర్వకంగా రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్‌లతో భేటీ అయ్యారు. రాజ్యసభలో మాట్లాడాల్సిన పలు అంశాలపై వీరు చర్చించారు.

కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలిపేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు.

ట్యూషన్ సెంటర్ నుంచి విద్యా సంస్థల అధినేతగా..

కరీంనగర్‌కు చెందిన వూట్కూరి నరేందర్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీజీ చేశారు. 1991లో కరీంనగర్‌లో ఓ చిన్నగదిలో ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించిన ఆయన ప్రస్తుతం అల్ఫోర్స్ పేరిట 54 విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. 2018లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. అదే సంవత్సరం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించినప్పటికి పార్టీ టికెట్ లభించలేదు. 2024లో లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్‌నుంచి పోటీ చేసే అవకాశం వచ్చినప్పటికీ, పట్టభద్రులకు సేవ చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడానికి నిర్ణయించుకున్నారు.

రాష్ట్రపతి ప్రసంగం నిరాశాజనకం: మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగం నిరాశాజనకంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగంలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగులు, రైతుల ప్రస్తావనే లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై సోషల్ మీడియాలో పెట్టిన పోల్ బీఆర్ఎస్ పనేనని మల్లు రవి ఆరోపించారు.

పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీ ముగిసేంత

సమయం కావాలా?

మహారాష్ట్ర స్పీకర్ మాదిరి వ్యవహరిస్తారా?

- ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- ఎంత సమయం కావాలో అడగడానికి హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదన్న ధర్మాసనం
- పది నెలలుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న పిటిషనర్ల న్యాయవాదులు



సాక్షి, న్యూఢిల్లీ: 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారు? అసలు మీకెంత సమయం కావాలి? అసెంబ్లీ కాలపరిమితి ముగిసేంత సమయం కావాలా?' అంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మీకెంత సమయం కావాలో చెప్పండంటూ ఆదేశించింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి, పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఈనెల 15న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ పేర్లతో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై బీఆర్ఎస్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరుల పేర్లతో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎస్ఎల్పీపై శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మసిహ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

పది నెలలుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు

పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై పది నెలలుగా స్పీకర్ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు దామ శేషాద్రి నాయుడు, పానుగోటి మోహిత్‌రావు సుప్రీంకోర్టుకు తెలిపారు. తమ పిటిషన్లపై హైకోర్టు ఉత్తర్వులు వచ్చి ఏడు నెలలైనా స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని నివేదించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారని స్పీకర్ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పగా.. ఫిర్యాదులపై నోటీసులు ఇచ్చేందుకు స్పీకర్ కార్యాలయానికి పది నెలల సమయం పట్టిందా అంటూ ధర్మాసనం ప్రశ్నించింది.

రీజనబుల్ టైం అంటే ఎంత?

పార్టీ ఫిరాయింపులపై స్పందించేందుకు స్పీకర్ దృష్టిలో రీజనబుల్ టైం అంటే ఎంత అని న్యాయవాది రోహత్గీని జస్టిస్ గవాయి ప్రశ్నించారు. ఇందుకు రోహత్గీ బదులిస్తూ.. స్పీకర్ నిర్ణయానికి సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పును చదివి వినిపించారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని ఆ తీర్పులో ఆదేశాలు ఇచ్చిందన్నారు. జస్టిస్ గవాయి జోక్యం చేసుకుని 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో అసెంబ్లీ కాలపరిమితి ముగింపు దశలో నిర్ణయం తీసుకుంటారా? అనర్హత విషయంలో మహారాష్ట్ర స్పీకర్ మాదిరిగా వ్యవహరిస్తారా?' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపులపై స్పందించేందుకు ఎంత సమయం కావాలో అసెంబ్లీ సెక్రటరీ కనుక్కుని చెప్పాలని ధర్మాసనం సూచించింది. ఇందుకు మీకెంత సమయం కావాలో చెప్పాలని ధర్మాసనం రోహత్గీని అడగ్గా.. రెండు వారాలు కావాలని బదులిచ్చారు. రోహత్గీ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ.. 'ఈ అంశం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరమైతే లేదు. ఫోన్ కాల్ సరిపోతుంది' అంటూ జస్టిస్ గవాయి చమత్కరించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 10కి ధర్మాసనం వాయిదా వేసింది.

9 రోజులు తల్లి మృతదేహంతోనే

ఇద్దరు కూతుళ్లు


లలిత కూతుళ్లతో మాట్లాడుతున్న పోలీసులు


లలిత (ఫైల్)

అనారోగ్యంతో తల్లి చనిపోయిందనే బాధలో డిప్రెషన్‌లోకి..

- దహన సంస్కారాలకు డబ్బుల్లేక, ఏం చేయాలో పాలుపోక దీనస్థితిలో..

బౌద్ధనగర్: బాధ్యతలు చూసుకోవాల్సిన తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు... అప్పటి నుంచి తల్లి వారికి అన్ని విధాలా అండగా ఉంటూ ఆదరించింది. ఇప్పుడు ఆ తల్లి అనారోగ్యంతో మరణించింది. కంటికి రెప్పలా చూసుకున్న తల్లి (45) కన్నుమూయడంతో ఇద్దరు కూతుళ్లు తామూ చనిపోవాలని భావించారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో తల్లి శవం పక్కనే పెట్టుకుని తొమ్మిది రోజులపాటు రోజువారీ కార్యకలాపాలు చేసుకున్నారు. సికింద్రాబాద్ వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... ఉస్మానియా వర్సిటీలో ఉద్యోగం చేసే రాజు, లలిత దంపతులు. వీరికి రవళిక (25), అశ్విత (22) అనే ఇద్దరు కూతుళ్లున్నారు. రాజు 2020 లోనే భార్య, పిల్లలను వదిలిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. రెండు నెలలుగా లలిత ఇద్దరు కూతుళ్లతో కలిసి బౌద్ధనగర్‌లోని ఓ బహుళ అంతస్తుల భవనంలోని 4వ ఫ్లోర్‌లో ఉంటోంది. రవళిక ఓ బట్టల షాపులో పని చేస్తుండగా.. అశ్విత ఈవెంట్స్ నిర్వాహకుల వద్ద చేస్తోంది. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్న లలిత ఈ నెల 23న ఇంట్లోనే కన్నుమూసింది. తల్లి కన్నుమూయడంతో ఆ ఇద్దరు పిల్లలకు ఏంచేయాలో పాలుపోక తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. దహన సంస్కారాలకు డబ్బులు లేక, ఎవరి సహాయం తీసుకోవాలో తెలియక వారు కూడా చనిపోవాలని నిశ్చయించుకున్నారు. కానీ మళ్లీ ధైర్యం రాక, ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో 9 రోజుల పాటు తల్లి మృతదేహాన్ని పక్కనే పెట్టుకుని అలాగే ఉండిపోయారు. శుక్రవారానికి కొద్దిగా తేరుకున్న వాళ్లు తల్లి చనిపోయిన విషయాన్ని బాహ్య ప్రపంచానికి తెలియచేయాలనే ఉద్దేశంతో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే పద్మారావు కార్యాలయానికి వచ్చి చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు వారి బంధువుల గురించి ఆరా తీసి వారికి సమాచారం అందించారు. చనిపోయి 9 రోజులు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం నెలకొంది. విషయం తెలిసి ఈ భవనంలో ఉండే వాళ్లంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల నివసించే వాళ్లు కూడా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


గిరిజనులను అవమానించడమే

రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలను ఖండించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు గిరిజన సమాజాన్ని అవమానించడమే అని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రపతిని రబ్బర్ స్టాంప్, గరీబ్ మహిళ (పేద మహిళ) అంటూ ఎగతాళి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతిగా ముర్ము అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆమెను 'రబ్బర్ స్టాంప్'అని, ఇప్పుడు 'గరీబ్ మహిళ'అని ఎగతాళి చేస్తూ.. ఆమె సామర్థ్యాలను కాంగ్రెస్ పార్టీ పదే పదే కించపరచింది. ఎందుకంటే ఆమె గిరిజన సమాజం నుంచి వచ్చారు కాబట్టి. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన మహిళా రాష్ట్రపతిపై దాడి చేయడం దేశాన్ని అవమానించడమే'అని పేర్కొన్నారు.

సోనియా వ్యాఖ్యలు సరికావు: ఎంపీ రఘునందన్‌రావు



వంద ఏళ్ల చరిత్ర ఉందని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముపై చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్రపతి కుర్చీని గౌరవించే సంస్కారం కాంగ్రెస్ పార్టీ కోల్పోతోందని దుయ్యబట్టారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచీ ద్రౌపదీ ముర్మును అవమానిస్తున్నారని, ఇది కాంగ్రెస్‌కు, దేశానికి మంచిది కాదని సూచించారు.

30 ఏళ్ల కల సాకారమవుతోంది

ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- రూ.2,700 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయ నిర్మాణం
- రెండేళ్లలో ఆస్పత్రి సిద్ధం.. హెలీప్యాడ్ కూడా..
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సీఎం రేవంత్ చిత్రంలో పొన్నం, భట్టి, కోమటిరెడ్డి, అనిల్ కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో 30 ఏళ్ల కల సాకారమవుతోందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆస్పత్రి నమూనా ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి.. అంతర్జాతీయ బ్రాండ్

అనంతరం గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడారు. వివిధ రకాల కేసులు కోర్టుల్లో ఉండటం వల్ల ఇన్నాళ్లు జాప్యం జరిగిందన్నారు. అఫ్జల్‌గంజ్ ఉస్మానియా ఆస్పత్రి అంటే ఒక అంతర్జాతీయ బ్రాండ్..ప్రజల ఆరోగ్యానికి భరోసా, అటువంటి ఆస్పత్రిని ఈ ప్రాంతానికి దగ్గర్లోనే నిర్మించాలని గోషామహల్ గ్రౌండ్‌ను ఎంపిక చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉస్మానియా 22 ఎకరాల్లో ఉందని, కొత్త భవన సముదాయానికి 26.32 ఎకరాలు కేటాయించామని, మరో 11 ఎకరాలు గ్రౌండ్ కోసం విడిచిపెట్టామని మంత్రి తెలిపారు. ఓపీ, ఐపీ, రెసిడెన్స్, ఆడిటోరియం, అకాడమీ అని ఐదు భాగాలుగా విభజించామన్నారు. రాబోయే రెండేళ్లలో పనులు పూర్తి చేసి 2 వేల పడకలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఉస్మానియా సంబంధిత 9 ఆస్పత్రులు, మరో 8 కొత్త డిపార్ట్‌మెంట్లు కలిపి మొత్తం 40 విభాగాలు ఇక్కడ పనిచేస్తాయని చెప్పారు. ఆస్పత్రి నిర్మాణ వ్యయం రూ.2,700 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాలుగు వైపులా విశాలమైన రహదారులు నిర్మిస్తామని, చిరు వ్యాపారులకు నష్టం లేకుండా అందరికీ మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాటసారులకు ఇబ్బందులు లేకుండా స్కై వాక్‌లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అత్యవసర సేవల కోసం హెలీప్యాడ్‌ను నిర్మించనున్నామన్నారు. ఈ శాసనసభలో ఎక్కువ మంది వైద్యులు ఉన్నారని, వారందరికీ ఈ ఆస్పత్రిపై ఆరాటం ఉందన్నారు.

జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు

తెలంగాణను స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం 'డార్క్ మేటర్ టెక్నాలజీస్'పేరిట కెనడాకు చెందిన కాన్‌స్టలేషన్ సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'పరిశ్రమల అభివృద్ధికి నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. కంపెనీలు ఉద్యోగాల్లోకి తీసుకున్న తర్వాత తమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాయి. కానీ విద్యార్థులు తమ చదువు పూర్తి చేసుకునే నాటికే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. తెలంగాణలో తక్కువ పెట్టుబడితో ఆవిష్కరణలు చేసే సత్తా నైపుణ్యం ఉంది. కానీ డీప్‌సీక్ లాంటి అధునాతన ఆవిష్కరణలు చేయలేకపోతున్నాం. ఇప్పటికైనా హైదరాబాద్‌లోని పరిశ్రమలు ఈ అంశంపై దృష్టి సారిస్తే ప్రభుత్వం తరఫున మద్దతు ఇస్తాం. ఇప్పటికే తెలంగాణలో 400 జీసీసీలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, మరికొన్ని ప్రముఖ సంస్థలు కూడా జీసీసీల ఏర్పాటుకు సిద్ధమవుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)కు చెందిన ఐదు దిగ్గజ జీసీసీలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఈ రంగంలో 10 లక్షల మంది నిపుణులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో కంపెనీలను స్థాపించేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. త్వరలోనే క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తాం. కెనడాకు చెందిన కాన్‌స్టలేషన్ సాఫ్ట్‌వేర్‌లో వేయికి పైగా కంపెనీలున్నాయి. ఈ సంస్థ భారత్‌లోనే తన మొదటి జీసీసీని హైదరాబాద్‌లో డార్క్ మేటర్ టెక్నాలజీ పేరిట ప్రారంభించింది. ఈ సెంటర్ ద్వారా 800 మందికి ఉపాధి కలుగుతుంది. భవిష్యత్‌లో ఈ సంఖ్య 2వేలకు చేరుతుంది అని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాన్‌స్టలేషన్ సర్వీసెస్ (పెర్సియస్ డివిజన్) ప్రెసిడెంట్ స్కాట్‌స్మిత్, డార్క్ మేటర్ టెక్నాలజీస్ సీఈవో, సీఆర్వో సీన్ దుగాన్, డార్క్ మేటర్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రవివర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

భూదాన గంగోత్రి పోచంపల్లిని సందర్శిస్తా

- ప్రథమ భూదాత మనవడితో ప్రధాని నరేంద్రమోదీ



ప్రధాని మోదీని సన్మానిస్తున్న అరవిందారెడ్డి

భూదాన్‌పోచంపల్లి: భూదానోద్యమం ద్వారా ప్రపంచఖ్యాతి గడించి, భూదాన గంగోత్రిగా పేరొందిన భూదాన్‌పోచంపల్లిని తప్పక సందర్శిస్తానని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి మనవడు, సర్వోదయ సమితి ఆలిండియా అధ్యక్షుడు వెదిరె అరవిందారెడ్డి శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిశారు. 1959లో గాంధీజీ శిష్యుడైన ఆచార్య వినోబా భావే పోచంపల్లిని సందర్శించిన సందర్భంగా భూదానోద్యమానికి దారితీసిన పరిస్థితులు, తన తాత వెదిరె రామచంద్రారెడ్డి పేదలకు 100 ఎకరాల భూమిని దానం చేసిన విధానాన్ని ప్రధానికి వివరించారు. అనంతరం 10 నిమిషాల నిడివి గల భూదానోద్యమ డాక్యుమెంటరీని ప్రధానికి చూపించారు.

ఎన్నికల కోడ్ సాకుతో రైతుల పొట్ట కొట్టొద్దు

- కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు రైతుభరోసా నిధులు వారి ఖాతాల్లో వేయాల్సిందేనని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో రైతన్నల పొట్ట కొట్టొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కోడ్ సాకుతో రైతుభరోసాను నిలిపేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇది కొనసాగుతున్న పథకమే కాబట్టి రైతు భరోసా డబ్బుల చెల్లింపునకు ఎన్నికల సంఘం నుంచి ఇబ్బంది ఉండదని బండి సంజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు కూలీల ఖాతాల్లో వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేస్తే అఖిలపక్షంతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు అనుమతి తీసుకుందామన్నారు.

సొంత ఆదాయంలో రాష్ట్రం టాప్!

సామాజిక ఆర్థిక సర్వే (2024-25)లో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

- తెలంగాణ ఎంఎస్ఎంఈ పాలసీతో ఈ-కామర్స్ వ్యాప్తికి దోహదం
- రాష్ట్రంలో 100 శాతం గ్రామాలకు రక్షిత మంచినీరు
- ఇస్రో భువన్ ద్వారా రాష్ట్రంలో ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రా నిర్వహణ
- రాజస్థాన్, ఏపీల తర్వాత సిమెంట్ పరిశ్రమల్లో మూడో స్థానం
- స్థూల ఉత్పత్తిలో సేవల రంగం వాటా 6 శాతం.. దేశంలో ఏడో స్థానంలో తెలంగాణ
- ఐటీ సేవల్లో కర్ణాటక తర్వాత రెండో ప్లేస్.. తలసరి ఆదాయంలో ఐటీదే అగ్రస్థానం
- బెంగళూరు, ముంబైతో పోటీగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఐటీ, ఫిన్‌టెక్ సేవల విస్తృతి కారణంగా ఆఫీసులు, నివాస స్థలాలకు మంచి డిమాండ్
- ఫర్వాలేదనిపించే స్థాయిలో పారిశ్రా మిక అభివృద్ధి సాధించినట్టు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సొంత ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంలో తెలంగాణ దూసుకుపోతోందని సామాజిక, ఆర్థిక సర్వే 2024-25 వెల్లడించింది. దేశంలోని 15 రాష్ట్రాల్లో వసూలవుతున్న పన్నుల్లో సగం కంటే ఎక్కువ మొత్తం సొంత పన్నుల ద్వారానే వస్తోందని.. అందులో అత్యధికంగా తెలంగాణలో సొంత పన్నుల రాబడి 88శాతంగా ఉందని తెలిపింది. కర్ణాటక, హరియాణా రాష్ట్రాలు 86 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయని వెల్లడించింది. శుక్రవారం ప్రారంభమైన లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ సర్వే ప్రకారం.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చాలా అంశాల్లో ముందంజలో ఉందని వెల్లడైంది. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు తెలంగాణ హబ్‌గా మారిందని.. కర్ణాటక, మహారాష్ట్రలతో పోటీగా ఇక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారం వృద్ధి చెందుతోందని ఈ సర్వే తెలిపింది. రాష్ట్రంలో 100శాతం గ్రామాలకు రక్షిత మంచినీరు అందుతోందని, 86 శాతం సాగుయోగ్యమైన భూములకు నీటి సౌకర్యం ఉందని పేర్కొంది. సామాజిక, ఆర్థిక సర్వే (2024-25)లో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, సామాజిక పరిస్థితులకు సంబంధించిన విశేషాలివీ..

- ఎగుమతుల పెంపు కోణంలో దేశంలోని చాలా రాష్ట్రాలు ఈ-కామర్స్ మార్కెట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక విధానం ఈ-కామర్స్ వ్యాప్తికి ఇతోధికంగా దోహదపడనుంది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ పోర్టల్‌లో అమ్మకపు సంస్థల ప్రాతినిధ్యాన్ని పెంచేదిగా ఉంది.
- 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను ప్రారంభించినప్పుడు దేశంలోని 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలు (17శాతం) మాత్రమే రక్షిత మంచినీటి సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. 2024 నవంబర్ 26 నాటికి ఈ పథకం కింద మరో 12.06 కోట్ల కుటుంబాలకు రక్షిత మంచినీరు అందుతోంది. ప్రస్తుతం దేశంలోని 79.1 శాతం గ్రామీణ కుటుంబాలకు నల్లా నీరు చేరుతోంది. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు 100 శాతం గ్రామీణ కుటుంబాలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నాయి. ఇందులో తెలంగాణ ఒకటి.
- ఇస్రో చేపట్టిన అనేక భౌగోళిక వేదికల ద్వారా గ్రామీణాభివృద్ధి, పట్టణ ప్రణాళిక, న్యాయ, ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రా రంగాల్లో సామర్థ్యం పెరగడంతోపాటు ఆయా రంగాల్లో రాష్ట్రాలు సాధిస్తోన్న పురోగతిని తెలుసుకునే వీలు కలుగుతోంది. ఇందులో భాగంగా తెలంగాణలో భువన్ వేదిక ద్వారా వెబ్‌జీఐఎస్ పోర్టల్‌తో ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రా నిర్వహణ సాధ్యమవుతోంది.
- ప్రపంచంలో చైనా తర్వాత సిమెంట్ ఉత్పత్తి అత్యధికంగా జరుగుతోంది మన దేశంలోనే. మన దేశంలోని రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే 87 శాతం సిమెంట్ పరిశ్రమలున్నాయి.
- రాష్ట్రాల స్థూల ఉత్పత్తిలో సేవల రంగం గణనీయ పాత్ర పోషిస్తోంది. ఇందులో మహారాష్ట్ర, కర్ణాటకల్లోని సేవల రంగం వాటా దేశంలోని అన్ని రాష్ట్రాల వాటాలో 25 శాతాన్ని మించుతోంది. తెలంగాణలో స్థూల ఉత్పత్తిలో సేవల రంగం వాటా 6 శాతంగా నమోదైంది. దేశంలో ఈ రంగంలో తెలంగాణ ఏడో స్థానంలో ఉంది.
- రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సేవల రంగాల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, హరియాణా, తమిళనాడు ముందంజలో ఉన్నాయి. బెంగళూరు, ముంబై, హైదరాబాద్, గుర్గావ్, చెన్నై నగరాల్లో ఎక్కువ వృద్ధి కనిపిస్తోంది. ఆయా నగరాల్లో ఐటీ, ఫిన్‌టెక్ సేవల విస్తృతి కారణంగా ఆఫీసు, నివాస స్థలాల కోసం విపరీతమైన డిమాండ్ నెలకొంది.
- కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాలు సర్వీసుల రంగంలో మంచి ప్రతిభ కనబరుస్తున్నా..

> కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఐటీ సర్వీసుల విస్తృతి గణనీయంగా ఉంది. వాణిజ్య సేవల రంగమైన ఐటీ రంగమే తెలంగాణ తలసరి ఆదాయ వాటాలోనూ సింహభాగం నమోదు చేస్తోంది.

> మహిళా పారిశ్రామికవేత్తలకు తెలంగాణ హబ్‌గా మారుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న సహకారం ఇందుకు దీర్ఘకాలికంగా దోహదపడనుంది. దేశంలోనే మహిళా పారిశ్రామికవేత్తల ఇంక్యుబేటర్ రాష్ట్రంగా తెలంగాణ రూపొందింది.

> 2016-21 మధ్య దేశవ్యాప్తంగా సాగునీటి సౌకర్యం బాగా పెరిగింది. పంజాబ్ (98శాతం), హరియాణా (94), తెలంగాణ (86), ఉత్తరప్రదేశ్ (84శాతం)లలో సాగుయోగ్యమైన భూములకు ఎక్కువగా నీటి సౌకర్యం అందుతోంది.

పారిశ్రామిక అభివృద్ధిలో ఫర్వాలేదనిపించే స్థాయిలోనే ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోని ఆర్థిక వ్యవస్థ పట్టణీకరణ కేంద్రంగా ముందుకెళుతుండటమే ఇందుకు కారణం.

- సామూహిక అభ్యాస కార్యక్రమాల ద్వారా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ మోడల్ విద్య కొనసాగుతోంది. తద్వారా తక్కువ సంఖ్యలో ఉండే సమూహాలు అభ్యసనం, బోధన తదితర కార్యకలాపాల్లో నిమగ్నమయ్యాయి.

కాంగ్రెస్‌కు ఆర్థిక సర్వే చెంపపెట్టు

- బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ మోడల్ విజయానికి సాక్ష్యం
- మా పాలనపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టింది
- ఆర్థిక సర్వే నివేదికపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఆర్థిక సర్వే (2024 -2025) బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ మోడల్ సాధించిన విజయానికి సాక్ష్యమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆర్థిక సర్వే నివేదిక కాంగ్రెస్ అబద్ధపు ప్రచారానికి చెంపదెబ్బ లాంటిదని వేర్వేరు ప్రకటనల్లో వారు విమర్శించారు.' ఆదాయ వనరుల్లో 88 శాతం తెలంగాణ స్వయంగా సేకరించుకోవడం బీఆర్ఎస్ అమలు చేసిన ఆర్థిక పాలన నైపుణ్యానికి నిదర్శనం. రాష్ట్రంలో 90 శాతానికి పైగా సాగు భూమికి నీటి సదుపాయం ఉందని ఆర్థిక సర్వే చెప్పడం ద్వారా సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టింది. వీ హబ్, వంద శాతం తాగునీటి సరఫరా, సేవల రంగంలో అత్యుత్తమ ప్రదర్శన, ఐటీ, స్టార్టప్, ఫిన్‌టెక్ రంగాల్లో అభివృద్ధి, దిగ్గజ కంపెనీల భారీ పెట్టుబడులు తదితరాల్లో బీఆర్ఎస్ పాలన బాగుందని సర్వే వెల్లడించింది'అని కేటీఆర్ సూచించారు.

దేశానికి రోల్ మోడల్: హరీశ్‌రావు

'కేంద్ర ఆర్థిక సర్వే బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ ప్రచారానికి చెంపపెట్టు లాంటి సమాధానం. మిషన్ భగీరథపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేసింది. ఐటీ రంగంలో కర్ణాటకతో పాటు తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని సర్వే వెల్లడించింది. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం బోగస్ అని స్పష్టం చేసింది'అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదు

- పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడింది
- మా పాలనలో విజన్‌తో పట్టణాభివృద్ధి
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడి ప్రజల ఆస్తుల విలువ భారీగా పడిపోయిందని అన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి హైడ్రా, మూసీ ప్రాజెక్టుల పేరిట కూల్చివేతలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఆత్మీయ సత్కార కార్యక్రమం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వాన్ని నడిపేవారి ఆలోచనలు సానుకూలంగా ఉంటేనే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. సమైక్య రాష్ట్రంలో మురికి కూపాలుగా ఉన్న మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టితో పనిచేయాలని బీఆర్ఎస్ పాలనలో దిశా నిర్దేశం చేశారు. ఆర్థిక ఇంజన్లుగా ఉన్న పట్టణాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచాం. సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన నిధులు అందించడంతో పట్టణాలు అభివృద్ధి బాటలో నడిచాయి. తెలంగాణ పట్టణాలకు పది సంవత్సరాల్లో అనేక జాతీయ అవార్డులు దక్కాయి. పదేండ్లు మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు అద్భుతంగా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగింది'అని కేటీఆర్ వివరించారు. నల్లగొండ మున్సిపాలిటీలో నాలుగు నెలలుగా సిబ్బందికి వేతనాలు లేకున్నా జిల్లా మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, లింగయ్య, డాక్టర్ ఆనంద్, కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లను కేటీఆర్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి
శనివారం, 1 ఫిబ్రవరి 2025

వృద్ధి సాధనకు ఊతం ఏదీ?

ప్రపంచవ్యాప్తంగా చాలామేరకు ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నా, ఉపాధి కల్పన మెరుగ్గా కనబడుతున్నా వాణిజ్య వ్యవహారాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, దేశాల మధ్య పెరుగుతున్న పోటీ ఒక రకమైన అనిశ్చిత వాతావరణానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆర్థిక సర్వే విడుదల చేసింది. పరస్పర ఆధారిత వర్తమాన ప్రపంచంలో ఏ దేశమూ సమస్యలనూ, సంక్షోభాలనూ తప్పించుకోలేదు. అలాగే వాటి పరిష్కారానికి సాగే కృషిలో భాగస్వామి కాకుండా ఒంటరిగా దేన్నీ అధిగమించలేదు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు ముందుంచిన ఆర్థిక సర్వే దీన్నంతటినీ ప్రతిబింబించింది. మనది ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. ఇతర దేశాలతో పోలిస్తే మనది చురుకైన ఆర్థిక వ్యవస్థ. కానీ ఇటీవలి కాలంలో అది కొంత మంద గమనంతో కదులుతోంది. 2023లో 8.2 శాతంగా ఉన్న వృద్ధి రేటు నిరుడు 6.5 శాతానికి క్షీణించింది. ఇది 2026 వరకూ ఈ స్థాయిలోనే వుంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఈ నెల 17న అంచనా వేసింది. పట్టణ ప్రాంత వినియోగంలో క్షీణత, ఆహార పదార్థాల ధరల్లో పెరుగుదల, వేతన స్తంభన, అంతంతమాత్రంగా ఉన్న ఉపాధి కల్పన, ప్రైవేటు రంగ పెట్టుబడుల మందకొడితనం స్పష్టంగా కనబడుతోంది. ఒక్క కర్ణాటక, మహారాష్ట్రల్లో మాత్రమే వినియోగిత పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతక్రితం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెరుగ్గా ఉన్న వినియోగిత ఎన్డీయే సర్కారు వచ్చాక క్షీణించింది. 'మొత్తంమీద ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నా ఆహార పదార్థాల ధరలు ఇప్పటికీ అధికంగానే ఉన్నాయ'ని సర్వే అంగీకరించింది. గత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం ఉండగా, అదిప్పుడు 4.9 శాతానికి చేరుకుంది. ఆహారేతర, ఇంధనేతర సరుకుల ధరల తగ్గుదల ఇందుకు కారణం. వాస్తవానికి పంపిణీ మెరుగుకావటం, వాతావరణం అనుకూలించటం వంటి కారణాల వల్ల చాలా దేశాల్లో ఆహార సరుకుల ధరలు తగ్గాయి. మన దేశమూ, చైనా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఇందుకు భిన్నమైన పోకడ కనబడుతోంది. నిరుడు 7.5 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ప్రస్తుతం 8.4 శాతానికి చేరుకుంది. పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా కూరగాయలు, పప్పులు వగైరా ధరల్లో పెరుగుదల నమోదవుతున్నదని నిపుణుల అభిప్రాయం. రాగల రోజుల్లో కూరగాయల ధరలు తగ్గుతాయని, ఖరీఫ్ పంటలు మార్కెట్లో అడుగుపెడితే ఇతర ధరలు కూడా సర్దుకుంటాయని సర్వే ఆశాభావం వ్యక్తం చేస్తున్నా అదంతా ప్రపంచ స్థితిగతులపై ఆధారపడి వుంటుంది. ముమ్మందు ప్రపంచ సాగుపంటల ధరవరలు పెరుగుతాయని, వాతావరణ మార్పులు కూడా అనుకూలించకపోవచ్చని అంచనాలున్నాయి. అదనంగా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉండనే ఉన్నాయి.

ఎదగదల్చుకున్నవారికి ఆశావహ దృక్పథం అవసరం. స్వాతంత్ర్యం వచ్చి 2047కి వందేళ్లవుతాయి కాబట్టి అప్పటికల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకోవాలని ఎన్డీయే సర్కారు కోరుకుంటోంది. కానీ వరసగా రెండు దశాబ్దాలపాటు 8 శాతం నిలకడైన జీడీపీ కొనసాగితేనే ఇది సాధ్యం. ప్రస్తుత జీడీపీలో పెట్టుబడుల వాటా 31 శాతం. దీన్ని కనీసం 35 శాతానికి తీసుకెళ్లాలి. ముఖ్యంగా తయారీరంగం వృద్ధి చెందాలి. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో విస్తరిస్తున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలి. ఇవన్నీ జరిగితేనే 'వికసిత్ భారత్' సాకారమవుతుంది. అందుకు భూసంస్కరణలు, కార్మికరంగ సంస్కరణలు అత్యవసరం అంటున్నది ఆర్థిక సర్వే. కానీ కార్మిక రంగ సంస్కరణలను ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బ్రిటిష్ వలస పాలకుల కాలంనుంచి ఇంతవరకూ పోరాడి సాధించుకున్న అనేక హక్కుల్ని లేబర్ కోడ్ హరిస్తున్నదని వాటి ఆరోపణ. ముఖ్యంగా ట్రేడ్ యూనియన్ల ఏర్పాటును కష్టతరం చేయటం, ఇప్పటికేవున్న ట్రేడ్ యూనియన్ల గుర్తింపు రద్దుకు వీలు కల్పించటం, సమ్మె హక్కును కాలరాయటం, మధ్యవర్తిత్వ ప్రక్రియకు ప్రతిబంధకాలు ఏర్పర్చటం, లేబర్ కోర్టుల మూసివేత, ట్రిబ్యునల్ ఏర్పాటు వంటివి ఉన్నాయంటున్నారు. వీటిపై కార్మిక సంఘాలతో చర్చించటం, పారదర్శకత పాటించటం, అవసరమైన మార్పులకు సిద్ధపడటం వంటి చర్యలద్వారా అపోహలు తొలగించటానికి కేంద్రం కృషి చేస్తే కార్మిక రంగ సంస్కరణల అమలు సాఫీగా సాగిపోతుంది. ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చటానికి సంస్కరణలు అవసరం అనుకున్నప్పుడు ఇదంతా తప్పనిసరి.

వాస్తవాలను గమనంలోకి తీసుకుని జాగురూకతతో అడుగులేయకపోతే లక్ష్యసాధన కష్టమవుతుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం నిరుడు లిస్టెడ్ కంపెనీల లాభార్జన 22.3 శాతం పెరిగింది. చెప్పాలంటే ఆర్థిక, ఇంధన, ఆటోమొబైల్ రంగాల కార్పొరేట్ సంస్థలకు లాభాలు వచ్చిపడ్డాయి. కానీ ఆ రంగాల్లో ఉపాధి కల్పన పెరిగింది లేదు. వేతనాలు స్తంభించాయి. పరిస్థితులిలా వుంటే వినియోగిత పెరుగుతుందా? తగినంత డిమాండ్ లేనప్పుడు తయారీ రంగంలో పెట్టుబడుల వృద్ధి సాధ్యమవుతుందా? ఈ వ్యత్యాసాలపై దృష్టి పెట్టనంతకాలమూ ఆర్థిక రంగ స్వస్థత సులభం కాదు. వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వీలుగా రుణాల వడ్డీ రేట్లు తగ్గించాలని రిజర్వ్‌బ్యాంకును నిర్మలా సీతారామన్‌తోపాటు కేంద్ర వాణిజ్యమంత్రి పీయుష్ గోయల్ కూడా కోరుతున్నారు. మంచిదే. తమవంతుగా ఉద్యోగకల్పన, వేతనాల పెంపుపై కూడా కేంద్రం దృష్టి సారించాలి. శనివారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో అందుకు తగిన ప్రతిపాదనలుంటాయని ఆశిద్దాం.

కేంద్ర రాష్ట్రాల సయోధ్యతోనే వృద్ధి

విశ్లేషణ



దువ్వూరి సుబ్బారావు

రాజ్యాంగం ప్రవచించిన భారత సమాఖ్య విధానం కాల పరీక్షకు తట్టుకుని దృఢంగా నిలిచింది. అధికారాల విభజన, లిఖిత రాజ్యాంగం, స్వతంత్ర న్యాయవ్యవస్థ వంటివి సమాఖ్య లక్షణాలు. వీటిని బలమైన కేంద్ర ప్రభుత్వం, అత్యవసర సందర్భాలకు అనువైన నిబంధనలు, కేంద్ర నియమిత గవర్నర్ల వ్యవస్థలతో అనుసంధానం చేశారు. ఎంతో నేర్పుగా జరిగిన ఈ మేళవింపు ఒక అద్భుతం. కాబట్టే... పలు ప్రాంతీయ అస్తిత్వాలు, మరెన్నో సవాళ్లు ఉన్నప్పటికీ, ఇంత పెద్ద దేశ పరిపాలన సుసాధ్యమైంది. భిన్నత్వంలో ఏకత్వం సాధించగలిగాం.

ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ...

కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ఉద్రిక్తతలు లేవని కాదు. ఉన్నాయి. అయితే ఏ సమాఖ్య దేశంలో ఇవి లేవు? కెనడాలో సుదీర్ఘకాలం నుంచీ క్యూబెక్ వేర్పాటు ఉద్యమం నడుస్తోంది. క్యాటలన్ స్వాతంత్ర్య ఉద్యమంతో స్పెయిన్ సతమతమవుతోంది. అమెజాన్ అడవుల నరికివేత సమస్య బ్రెజిల్ కేంద్ర–రాష్ట్ర సంబంధాలను దెబ్బతీస్తోంది. ఇక నైజీరియా, ఇథియోపియాలు అక్కడి జాతుల ఘర్షణతో అట్టుడికిపోతున్నాయి. వనరుల పంపకంలో తలెత్తిన అసంతృప్తి జ్వాలలు చివరకు ఇండోనేషియా నుంచి ఈస్ట్ తిమోర్ వేరుపడేందుకు దారి తీశాయి. వీటితో పోల్చి చూసుకుంటే, మన ఉద్రిక్తతలు అదుపు తప్పకుండా మనం సర్దుకుపోగలుగుతున్నాం. మన రాజ్యాంగం ఏర్పరచిన 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' ఇందుకు కారణం.

మన సమాఖ్య విధానం కాలానుగుణ మార్పులను తనలో ఇముడ్చుకుంటూ సాగిపోతోంది. అయితే, మన సహకార సమాఖ్య విధానం... పోరాట సమాఖ్య విధానం దిశగా జరిగిపోయింది. ఇదొక అపశ్రుతి. తమ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని ప్రాంతీయ పార్టీలు, జాతీయ ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు భావిస్తున్నాయి. కేంద్ర వైఖరి పట్ల అక్కడ వ్యతిరేకత పెరిగిపోతోంది. ఇది రాజకీయ కోణం.

ఆర్థిక కోణం నుంచి చూస్తే, ఈ చీలిక మరీ తీవ్రంగా ఉంది. కేంద్ర నిధుల బదలాయింపులు తగినంతగా ఉండటం లేదని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. తమ సొంత ఆదాయాలకు తమ వ్యయ బాధ్యతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్రం భర్తీ చేయాలని కోరుతున్నాయి. అంతేకాదు, కేంద్రం ఇచ్చే నిధులను ఎలా ఖర్చు చేయాలనే అంశంలో వాటికి పూర్తి స్వయం ప్రతిపత్తి ఉండటం లేదు. దీనికి తోడు, అవి ఎంత అప్పు చేయాలో, ఎవరి నుంచి తీసుకోవాలో కూడా కేంద్రం నిర్ణయిస్తోంది.

రాష్ట్రాలకు వ్యతిరేకం కాదు!

ఈ వాదన చర్చనీయం. ఆర్థిక సమాఖ్య విధానం అత్యుత్తమమైంది కాదనుకున్నా, నిధుల బదిలీ ఏర్పాట్లు రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఉన్నాయనడం సరికాదు. ఎలానో ఒక ఉదాహరణ చెప్పుకుందాం. రాజ్యాంగం ఒరిజినల్‌గా నిర్దేశించిన ప్రకారం, రాష్ట్రాలకు రెండే రెండు కేంద్ర పన్నుల్లో వాటా లభించాల్సి ఉంటుంది.. ఒకటి వ్యక్తిగత ఆదాయ పన్ను, రెండు కేంద్ర ఎక్సైజ్ సుంకాలు. 2000 సంవత్సరంలో చేసిన రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ఏర్పాటును రాష్ట్రాలకు అనుకూల రీతిలో మార్చారు. దీని ప్రకారం, కేవలం రెండు పన్నుల్లోనే కాకుండా కేంద్రం వసూలు చేసే అన్ని పన్నుల్లో వాటికి వాటా దక్కింది. అలాగే, ప్రణాళికా సంఘం రద్దుతో రాష్ట్రాల ఆర్థిక స్వయం ప్రతిపత్తి సైతం పెరిగింది.



◆ వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం తమ ప్రయోజనాలను హరించివేయడానికి తమ మెడలు వంచి మరీ తెచ్చారని రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇది వాటి హ్రస్వదృష్టి అవుతుంది.

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం అమల్లోకి రావడంతో మరో యుద్ధానికి తెరలేచింది. తమ ప్రయోజనాలను హరించి వేయడానికి తమ మెడలు వంచి మరీ దీన్ని తీసుకు వచ్చారని రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇది వాటి హ్రస్వదృష్టి అవుతుంది. కొత్త పన్నులు వేయడంలో వాటికి ఉన్న స్వేచ్ఛను కొంత కోల్పోయి ఉండొచ్చు. కేంద్రం కూడా అలాగే కోల్పోయిందని గుర్తుంచుకోవాలి. క్రమేణా, జీఎస్టీ వల్ల పన్ను పరిధి విస్తరిస్తుంది. ఎగవేతలకు బ్రేక్ పడుతుంది. తద్వారా కేంద్రం, రాష్ట్రాలు రెండూ ప్రయోజనం పొందుతాయి.

ఆర్థిక సమాఖ్య విధానం నిబంధనలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయన్న రాష్ట్రాల భావన వాస్తవం కాదు. అదే సమయంలో, రాష్ట్రాల ఆర్థిక సవాళ్ల పట్ల కూడా కేంద్రం ఎంతో సానుభూతి కనబరచాలి, వాటితో సంప్రదింపులకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. అయితే ఇలా జరుగుతోందా? ఉదాహరణకు, కేంద్రం పన్నులు పెంచడానికి బదులు సెస్సులు, సర్‌ఛార్జీలు పెంచుకుంటూ పోతోంది. కేంద్రం విధించే అన్ని పన్నుల నుంచీ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలంటూ 2000 సంవత్సరంలో రాజ్యాంగ సవరణ చేసినప్పుడు, కేంద్రం పరిమితంగానే సెస్సులు, సర్‌ఛార్జీలు విధిస్తుందని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా జరుగుతోంది. వాటిలో తమకు వాటా రాదు కాబట్టి జాతీయ పన్ను ఆదాయంలో న్యాయబద్ధంగా తమకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని, ఇది తమను మోసం చేయడమేనని రాష్ట్రాలు బాధపడుతున్నాయి.

2047 గేమ్ ప్లాన్?

ఆర్థిక గురుత్వ కేంద్రం రాష్ట్రాల దిశగా జరిగిందని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి. ఉజ్జాయింపు అంచనా ప్రకారం, కేంద్రం ఉమ్మడి రెవెన్యూ వసూళ్ల (కేంద్రం, రాష్ట్రాలవి కలిపి) 60 శాతం ఉండగా, ఉమ్మడి వ్యయాల్లో కేంద్రం వాటా 40 శాతం మాత్రమే ఉంటోంది. రాష్ట్రాల విషయంలో ఇందుకు పూర్తి భిన్నంగా జరుగుతోంది. వాటన్నిటి ఉమ్మడి రెవెన్యూ వసూళ్లు కలిసి 40 శాతం కాగా, ఖర్చు మాత్రం 60 శాతం చేస్తున్నాయి. దీని అర్థం ఏమిటంటే, దేశ స్థూల ఆర్థిక సుస్థిరత, తద్వారా పెట్టుబడులు పెంచే సామర్థ్యం కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి ఆర్థిక బాధ్యత మీద ఆధారపడి ఉంటుంది.

2047లో మనం వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకొంటాం. అప్పటికి ఇండియా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలని ఉవ్విళ్లూరుతున్నాం. ఆ స్థాయికి చేరడానికి మన ముందున్న ఎజెండా కూడా అంత పెద్దది, సంక్లిష్టమైంది. కేంద్రం రాష్ట్రాలు ఉమ్మడి వ్యూహంతో ముందడుగు వేస్తే తప్ప మనం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించలేం. ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను మెరుగు పరచుకోవడానికి అవసరమైన రెండో తరం సంస్కరణలను అమలు చేయడం మన గేమ్ ప్లాన్‌లో భాగం అయితీరాలి. 1990ల తొలితరం సంస్కరణలు పెట్టుబడులు, వాణిజ్యం, ఫైనాన్స్ రంగాల సరళీకరణపై దృష్టి సారించాయి. ఇవన్నీ తన పరిధిలోనివే కాబట్టి, వీటిని ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదించాల్సిన అవసరం లేకపోయింది. రెండో తరం సంస్కరణలు అలా కాదు. ఉత్పాదకతను పెంచడానికి అవసరమైన ఈ సంస్కరణలు భూమి, కార్మికులు, పన్నులతో ముడిపడి ఉంటాయి. వీటికి రాష్ట్రాల సమ్మతి మాత్రమే కాదు, అమలులో చురుకైన భాగస్వామ్యం కూడా కావాలి. రాజ్యాంగం ద్వారా మన కోసం మనం చేసిన ప్రతిజ్ఞ నెరవేరాలంటే కేంద్ర రాష్ట్రాల మధ్య సయోధ్య కీలకం.

వ్యాసకర్త భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్, యేల్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ఫెలో

('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

◆ 2000లో చేసిన రాజ్యాంగ సవరణ వల్ల, రెండు (వ్యక్తిగత ఆదాయ పన్ను, ఎక్సైజ్ సుంకాలు) పన్నుల్లోనే కాకుండా కేంద్రం వసూలు చేసే అన్ని పన్నుల్లో రాష్ట్రాలకు వాటా దక్కింది.

◆ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు, కేంద్రం పరిమితంగానే సెస్సులు, సర్‌ఛార్జీలు విధిస్తుందని భావించారు. అందుకు విరుద్ధంగా జరుగుతోంది. వాటిలో తమకు వాటా రాదు కాబట్టి, ఇది తమను మోసం చేయడమేనని రాష్ట్రాలు బాధపడుతున్నాయి.

◆ 1990ల తొలితరం సంస్కరణలు పెట్టుబడులు, వాణిజ్యం, ఫైనాన్స్ రంగాల సరళీకరణపై దృష్టి సారించాయి. వీటిని ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదించాల్సిన అవసరం లేకపోయింది. కానీ రెండో తరం సంస్కరణలు అలా కాదు. ఇవి భూమి, కార్మికులు, పన్నులతో ముడిపడి ఉంటాయి. వీటికి రాష్ట్రాల సమ్మతే కాదు, వాటి చురుకైన భాగస్వామ్యం కూడా కావాల్సి ఉంటుంది.

సోషల్ మీడియా

పరిష్కారం చూపుతుందా?



భారత మధ్యతరగతి ఇంతకుముందులా కొనుగోళ్లు జరపడం లేదు. వస్తువులు మరీ ఖరీదైనవి కావడం, వారి సంపాదన చాలినంత లేకపోవడం దీనికి కారణం. పన్నులను తగ్గించి, వినియోగదారుల చేతుల్లో మరింత డబ్బు ఆడేట్టు చేయడం ద్వారా బడ్జెట్ ఈ సమస్యను పరిష్కరించగలదా?

– అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

భూమ్మీద ఉంచేట్టు...



6 పరుగుల కోసం 15 బంతులు, పైగా ఒక నజాఫ్‌గఢ్ రైలు టికెట్ కలెక్టర్ చేతిలో క్లీన్ బౌల్డ్. అందుకే లెజెండ్స్ కూడా రంజీ ట్రోఫీ ఆడుతుండాలి. అది వాళ్లను భూమ్మీద ఉండేలా తోడ్పడుతుంది (క్రికెటర్ విరాట్ కోహ్లీని ఉద్దేశించి).

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

లెక్కలు బాలేకపోతే...



అమెరికాలో 8వ తరగతి పిల్లల్లో 75 శాతం మందికి గణితంలో నైపుణ్యం లేదు. దీన్ని తక్షణం పరిష్కరించలేకపోతే, మనం మన పిల్లలకు అన్యాయం చేస్తున్నట్టే; మన దేశ భవిష్యత్తును చైనా చేతుల్లో పెడుతున్నట్టే.

– వివేక్ రామస్వామి, అమెరికా నాయకుడు

వాటి దిశగా...



ఎకనామిక్ సర్వేను జాగ్రత్తగా చదివితే, 'ఒక దేశం ఒక ఎన్నిక', వ్యవసాయ రంగ ప్రైవేటీకరణ కోసం ఎన్నడూ లేనంత గట్టిగా వాదించినట్టు అర్థమవుతుంది.

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

ఎందుకీ అసహనం?



ఖురాన్‌ను కాల్చితే ఒక ముస్లిం చంపడం, ఆవును చంపితే ఒక హిందువు చంపడం రెండూ ఒకటే. రెండూ తప్పే. రెండూ అసహనాన్నీ, అమానవీయతనూ ప్రతిబింబిస్తాయి.

– దారాబ్ ఫారూఖీ, సినిమా రచయిత

రంగుల రంగవల్లి

విలక్షణ దృష్టితో, వినూత్న సృష్టితో చిత్రకళకు పరిపూర్ణత్వాన్నిచ్చిన వారు కొండపల్లి శేషగిరిరావు. తెలుగునాట సంప్రదాయ చిత్రకళకు విజ్ఞాన సర్వస్వంలా భాసిల్లిన ఆయన శతజయంతి సందర్భంగా హైదరాబాద్ మాదాపూర్‌లోని ఆర్ట్ గ్యాలరీలో చిత్రకళా ప్రదర్శన ఏర్పాటై కనువిందు చేస్తోంది.

1924 జనవరి 27న తెలంగాణలోని పెనుకొండలో ఆయన జన్మించారు. విఖ్యాతకవి రవీంద్రుని శాంతినికేతనంలో ప్రముఖ చిత్రకారులు నందలాల్ బోస్, దేవీ ప్రసాద్ రాయ్ చౌధురిల వద్ద చిత్రకళలో మెళకువలు గ్రహించారు. అనంతరం హైదరాబాద్ జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో అధ్యాపకులుగా చేరి, వందలాది మంది శిష్యుల్ని చిత్రకళా రంగంలో దిద్ది తీర్చారు. వారిలో ప్రఖ్యాత చిత్రకారులు ఉల్చి (కృష్ణమూర్తి) ఒకరు. వారు చిత్రకళలో ఎన్నో ప్రయోగాలు చేశారు. సంప్రదాయ తైలవర్ణ చిత్రాలతో పాటు, ఆక్వాటిక్చర్, పెన్సిల్ స్కెచ్, వాటర్ పెయింటింగులు, దక్కన్, పాశ్చాత్య చిత్రకళా రీతుల్లో రసమయ చిత్రాలు సృష్టించారు. అజంతా, ఎల్లోరా, రామప్ప, లేపాక్షి వంటి చారిత్రక ప్రదేశాల్లో పర్యటించి, అనేక శిల్ప చిత్రకళా కృతులకు జీవం పోశారు. 'రాణీ రుద్రమ' చిత్రం రాజసంతో మనల్ని పలకరిస్తుంది. 'ఝాన్సీరాణి' వీర రస స్ఫూర్తినిస్తుంది. అందం, భక్తి భావం ప్రశాంతత, తాత్త్విక కత ఉట్టిపడే 'పోతన' చిత్రం చూపరుల గుండెల్లో నిలిచిపోయింది. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి వారు గీసిన 'తెలుగు తల్లి' చిత్రం శాశ్వత నమూనాగా భాసిస్తుంది. ఈ చిత్రానికి ప్రతిబింబంగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగు తల్లి విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్ఠింపచేశారు.



కొండపల్లి శేషగిరిరావు

తెలంగాణ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న కొండలు, గుట్టలు, ప్రకృతి అందాలు వారి కుంచెలో జీవం పోసుకున్నాయి. ఆయన శైలి 'కొండపల్లి శైలి'గా చిత్రకళా ప్రపంచంలో గుర్తింపు పొందింది. తెలుగు చిత్ర కళను అంతర్జాతీయ వేదికలపై సగౌరవంగా ఆవిష్కరించిన చిత్రకారుల్లో కొండపల్లి వారు ఒకరు కావడం తెలుగు వారికి గర్వకారణం. ఆయన చిత్రాలు అమెరికా, లండన్, రష్యా, ఇటలీ దేశాల్లో జరిగిన చిత్రకళా ప్రదర్శనల్లో ప్రదర్శింపబడి ప్రశంసలందుకున్నాయి. ఒకానొక రసదృష్టితో యోగిలా, 70 సంవత్సరాలకు పైగా జీవితాన్ని చిత్రకళకే అంకితం చేసిన కొండపల్లివారిని ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి. సంస్థలు పురస్కారాలతో పూజించాయి. 'ఆంధ్ర ప్రదేశ్ చిత్రకళ', 'తెలంగాణ చిత్రకళా రామణీయకత' వంటి విలువైన గ్రంథాలు, ఎన్నో వ్యాసాలూ రాశారు. మహాకవి దాశరథి 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటే కొండపల్లి 'నా కుంచియ రసరేఖల్లో మురిసే రంగుల రాగరాగిణి' – అన్నారు.

గాంధేయవాదిగా, సౌమ్యునిగా, సహృదయ కళాహృదయునిగా జీవితాన్ని పరిపూర్ణంగా పండించుకున్న స్వీయ చిత్రకళా సామ్రాజ్య స్రష్ట శేషగిరిరావు. 2012 జూలై 26న తమ బంగారు కుంచెను, రమణీయ చిత్రాలను తరగని కళాసంపదగా మనకు మిగిల్చి అస్తమించారు. జాతీయ చిత్రకారుడిగ గుర్తింపు పొంది, అంతర్జాతీయంగా మన చిత్రకళకు వన్నె, వాసి తెచ్చిన కొండపల్లి వారికి నిండు మనసుతో శతజయంతి నివాళి!

– డా॥ బీరం సుందరరావు, కవి | 63034 43302

పనామాపై ఈ ప్రకటన మతలబేమిటి?

అభిప్రాయం



బుడ్డిగ జమిందార్

ట్రంప్ తన అధ్యక్షపదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో... 'పనామా కాలువ నిర్వహణ చైనా చేస్తోంది. దాన్ని మేం పనామాకు ఇచ్చాము కానీ చైనాకు కాదు గనుక ఆ కాలువ అధికారాన్ని పనామా నుండి వెనుకకు తీసేసుకుంటాము' అన్నారు. పనామా కాలువ నిర్వహణను పనామా తటస్థ వైఖరితో చేయాలనీ, చైనా లేదా మరెవ్వరి జోక్యం ఉండకూడదనీ, అమెరికాపై, దాని నావికాదళంపై, వాణిజ్య నౌకల ద్వారా వ్యాపారం చేస్తున్న కార్పొరేషన్లపై అధిక టోల్ ధరలు, ప్రయాణ రేట్లను వసూలు చేసే అధికారం పనామాకు ఇవ్వలేదనీ ట్రంప్ గత డిసెంబరు 22 నాడు అన్నారు. సెంట్రల్ అమెరికా దగ్గర అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను 80 కిలోమీటర్ల కృత్రిమ పనామా కాలువ కలుపుతుంది. అనేక కష్టాలతో 25 వేలమంది శ్రామికుల బలిదానంతో నిర్మించిన ఈ కాలువను ప్రారంభంలో అమెరికా ఉంచుకొని ప్రెసిడెంట్ కార్టర్ కాలం (1978)లో దశలవారీగా పనామాకు ఇవ్వటానికి ఒప్పుకొని, 1999 నాటికి పూర్తిగా ఇచ్చారు. 2021లో ఈ కాలువ అజమాయిషీకి మరొక 25 సంవత్సరాల గడువు పెంచారు. ప్రస్తుతం నాల్గింట మూడువంతుల నౌకా రవాణా అమెరికా చేస్తుండగా చాలా వ్యత్యాసంతో చైనా 2వ స్థానంలో ఉంది. పనామా జీడీపీలో 7.7% వాటా ఈ కాలువ ద్వారానే లభిస్తోంది. ప్రపంచ నౌకా రవాణా మార్గంలో 6 శాతం ఈ కాలువకు వాటా ఉంది. 80 కిలోమీటర్ల పనామా కాలువ దాటడానికి ఒక నౌకకు 8 గంటలు పడుతుంది. అదే నౌక దక్షిణ అమెరికా చివరి భాగమైన కేప్‌హార్న్ మీదుగా ప్రయాణం చేయాలంటే వారం రోజులు పడుతుంది. దూరం సుమారు 20 వేల కిలోమీటర్లు ఉంటుంది.



లాటిన్ అమెరికా దేశాలలో చైనా ప్రతిష్ఠ పెరుగుతుండగా, గత 10 సంవత్సరాల కాలంలో చైనా అనేక వర్తక, వాణిజ్య ఒప్పందాలు చేసుకొంది. ముఖ్యంగా చైనా 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్టులోకి దక్షిణ అమెరికా దేశాలు చేరుతున్నాయి. ప్రప్రథమంగా 2017లో పనామా చేరింది. చైనా పెట్టుబడులకు ప్రతిఫలంగా పనామా తనకు తైవాన్‌తో గల దౌత్య సంబంధాలను కూడా రద్దు చేసుకొంది. పనామా కాలువను స్వాధీనం చేసుకోవటం ద్వారా చైనా ఆధిపత్యాన్ని తగ్గించే వ్యూహంలో ట్రంప్ ఉన్నారు.

కాలువకు రెండు వైపుల హాంకాంగ్‌కు చెందిన హాచిసన్ వాంపోవా కంపెనీకి అట్లాంటిక్ వైపు క్రిస్టోబాల్, పసిఫిక్ వైపు బాల్బోవాకి నౌకాశ్రయాలు ఉన్నాయి. హాంకాంగ్ లీజు యూకేతో ముగిసి ప్రస్తుతం స్వయం ప్రతిపత్తిగల దేశంగా ఉన్నప్పటికీ, దౌత్యపరంగా చూస్తే ఎప్పటికైనా చైనాలో అంతర్భాగంగా పరిగణించాలి గనుక బహుశా ఈ రెండు నౌకాశ్రయాల్ని ట్రంప్ చైనాకు చెందినవిగా అనుకొంటూ ఉండవచ్చు. కాలువకు ఆనుకుని ఉన్న మొత్తం 5 ఓడరేవుల్లో అమెరికాకు చెందినది ఒకటీ, మిగతావి విదేశాలకు చెందినవీ ఉన్నాయి. కానీ ఈ ఓడరేవులన్నీ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పనిచేస్తున్నాయనేది పనామా వాదన.

పనామా కాలువ ఆలోచన మొట్టమొదటిసారిగా స్పానిష్ విజేత వాస్కోలార్బోవా మెదడు నుండి ఉద్భవించి పనామా ఇస్తమస్‌ను భూమార్గం ద్వారా దాటాడు. ఆ తర్వాత నౌకామార్గం కోసం రెండు అమెరికా ఖండాల మధ్య కాలువను తవ్వాలనే కోరిక యూరప్ దేశాల్లో పుట్టింది. అప్పటికి నేటి అమెరికా ఇంకా లేనే లేదు. సూయిజ్ కెనాల్‌కు ఆద్యుడు ఫ్రెంచ్ ఫెడినాంగ్ లెస్సెప్స్ ఆలోచనతో ఫ్రాన్స్ సామ్రాజ్యం 1881–1899 మధ్య పనామా కాలువ తవ్వక పనులు చేపట్టింది. అయితే ఆర్థిక ఇబ్బందులు, వర్షారణ్య అడవుల్లో వేలాది మంది కార్మికులు చనిపోవటంతో మధ్యలోనే ప్రాజెక్టును ఆపేసింది. తదనంతరం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో 1904 సంవత్సరం నుండి 1914 వరకూ అమెరికా ఈ కాలువ పనులను ముమ్మరం చేసి అప్పట్లో 40 కోట్ల డాలర్ల వ్యయంతో కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి, 1999 వరకూ షరతులతో తన ఆధీనంలో ఉంచుకొని ప్రతిఫలాలను అనుభవించింది. దీనికోసమై పనామా దేశాన్ని కొలంబియా నుంచి విమోచన చేయించి దౌత్య సంబంధాలను ప్రారంభించింది. తనకు అనుకూల ప్రభుత్వం పనామాలో లేదని 1989లో బుష్ ప్రభుత్వం యుద్ధానికి దిగి తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించుకొంది.

ప్రపంచ వాణిజ్యానికి జల రవాణా అతి ప్రధానమైన అంశం గనుకనే ఈ జల మార్గాల దగ్గర అగ్రరాజ్యాలు ముఖ్యంగా అమెరికా అనేక ప్రత్యక్ష లేక పరోక్ష యుద్ధాలకు దిగుతూ ఆధిపత్యం చలాయిస్తోంది. ఈజిప్టు అధ్యక్షుడు సూయజ్ కాలువను జాతీయం చేయగానే బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ దేశాలు 1956లో యుద్ధానికి దిగిన సంగతీ ఇక్కడ గమనార్హం. పనామా – ఈజిప్టులు కాలువల ద్వారా ఆర్థికాభివృద్ధి ఎంత సాధిస్తున్నాయో అంతకంటే ఎక్కువ రవాణా ఖర్చులను, రవాణా సమయాన్ని ప్రపంచ దేశాలన్నీ పొదుపు చేస్తూ ప్రపంచ వాణిజ్యంతో లబ్ధి పొందుతున్నాయనటం అతిశయోక్తి కానేకాదు. ట్రంప్ చైనాను దెబ్బ తీయాలనే తలంపుతో దుందుడుకు ప్రకటనలు చేయడం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ఒడిదుడుకులపాలు చేస్తోందన్నది వాస్తవం!

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, కె.ఎల్. యూనివర్సిటీ | 98494 91969

అసలైన ఆస్తికులు

కొండలు, కోనలు, అడవులు, పక్షులు, పశువులు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు– ఇవన్నీ మనల్ని ప్రేరేపిస్తాయి. ఏకాగ్రచిత్తంతో ప్రకృతిని పరిశీలిస్తూ పోగా, పోగా అది అద్భుతం అనిపిస్తుంది! ఎంతో విజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ప్రకృతి పరిశీలకులుగా ఆరంభించి ఆ ప్రకృతి ప్రేమికులుగా, ఆరాధకులుగా మారిపోతాం. దత్తాత్రేయుని లాగా, ఆంగ్లకవి విలియం వర్డ్స్‌వర్త్ లాగా ప్రకృతిని మన గురువుగా, దైవంగా పరిగణిస్తాం. అయితే అక్కడే ఆగిపోతే కేవలం హేతువాదులుగా, భౌతిక వాదులుగా మిగిలిపోతాం. లేదా నాస్తికులుగా మిగిలిపోయే అపాయం కూడా ఉంది.

జ్యోతిర్మయం

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు: "భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనసు, బుద్ధి, అహంకారం అని నా ప్రకృతి ఎనిమిది విధాలుగా ఉది. ఈ ప్రకృతిని 'అపరా' లేక 'జడ ప్రకృతి' అని అంటారు. ఇది కాక ఈ సంపూర్ణ జగత్తును ధరించునట్టి మరొక ప్రకృతి ఉంది. అదే నా జీవ రూప పరాప్రకృతి' లేక 'చేతన ప్రకృతి' అని తెలుసుకో" (భగవద్గీత 7–అ 4, 5 శ్లోకాలు).

అంటే... జడప్రకృతి, చేతనా ప్రకృతి అనేవి దైవం అనే నాణేనికి రెండు వైపులన్నమాట (బొమ్మ, బొరుసు)! జడప్రకృతిని పరిశీలించి, ప్రేమించి, ఆరాధిస్తున్నవారు అంతటితో తృప్తి పడక చేతనా ప్రకృతిని కూడా పరిశీలించి, పరిశోధించటానికి పరిశ్రమిస్తే- అంటే రెండో వైపును కూడా చూడటానికి ప్రయత్నించి చూస్తే వారే దార్శనికులు, ద్రష్టలు, ఋషులు అవుతారు; పరిపూర్ణ ఆస్తికులవుతారు. అయితే తమాషా ఏంటంటే కొంత మంది కనపడే ప్రకృతిని మాత్రమే నమ్మి నాస్తికులవుతారు. మరి కొందరు కనపడని దైవాన్ని గుడ్డిగా నమ్మి ప్రత్యక్షంగా కనబడే దైవ ప్రతిరూపాలే అయిన మనుషులను దూషిస్తారు, ద్వేషిస్తారు. దైవానికి ఉన్న రెండువైపులను చూసినవారు పరా ప్రకృతిని, అపరా ప్రకృతిని ప్రేమిస్తారు, పూజిస్తారు. దేన్నీ నిరాకరించరు. వారే నిజమైన ఆధ్యాత్మికత్వం కలవారు, స్వచ్ఛమైన ఆస్తికులు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.తదియ ప.2.33 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శతభిషం ఉ.7.07 వరకు, తదుపరి పూర్వాభాద్ర తె.5.51 వరకు (తెల్లవారితే ఆదివారం), **వర్జ్యం:** ప.1.12 నుండి 2.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.41 నుండి 8.10 వరకు, **అమృతఘడియలు:** రా.10.10 నుండి 11.41 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.37, **సూర్యాస్తమయం:** 5.50.

క్లుప్తంగా...

బాధితురాలి వద్దకే న్యాయమూర్తి



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న జడ్జి శివనాయక్

భద్రాచలం టౌన్: భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణకు వచ్చిన మహిళ మెట్లు ఎక్కలేని పరిస్థితిలో ఉండటంతో న్యాయమూర్తే కిందకు దిగొచ్చి విచారణ చేపట్టారు. భద్రాచలానికి చెందిన ఉరిమెళ్ల పద్మావతి ఓ వ్యక్తిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేయగా ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో శుక్రవారం విచారణ ఉండటంతో ఆమె వచ్చినా మొదటి అంతస్తులో ఉన్న కోర్టుకు వెళ్లేందుకు మెట్లు ఎక్కడానికి ఇబ్బంది ఎదురొ్కంది. ఈ విషయాన్ని జడ్జి శివనాయక్ దృష్టికి న్యాయవాదులు తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన బాధితురాలి వద్దకే వచ్చి విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. మానవత్వంతో వ్యవహరించిన జడ్జికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయంలో 172 మంది సెక్షన్ ఆఫీసర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో కీలకమైన సెక్షన్ ఆఫీసర్లను ప్రభుత్వం భారీ ఎత్తున బదిలీలు చేసింది. శుక్రవారం ఒక్కరోజే దాదాపు 172 మంది సెక్షన్ ఆఫీసర్లను వివిధ శాఖలకు బదిలీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు రావడంలో కీలకంగా వ్యవహరించేది సెక్షన్ ఆఫీసర్లే. ప్రతీ పథకం, లేదా ఉత్తర్వులను రూపొందించేది సెక్షన్ ఆఫీసర్లే. ప్రభుత్వ నిర్ణయాలు ముందుగా ఆయా సెక్షన్‌కు ఉన్న అధికారికి వెళ్లిన తర్వాత అంచెలంచెలుగా ఆ శాఖ కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిల ఆమోదం తర్వాత జారీ చేయాల్సింది సెక్షన్ ఆఫీసర్లే. సెక్షన్ ఆఫీసర్ల నుంచే పలు రకాలుగా సమాచారం బయటకు వెళ్తోందన్న ప్రచారం నేపథ్యంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ బదిలీలు చేసినట్లు చెబుతున్నారు. ఇంతభారీ స్థాయిలో బదిలీలు గతంలో ఏకకాలంలో ఎప్పుడూ జరగలేదని సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రస్తుతం బదిలీ అయిన వారు చాలాకాలంగా అవే సెక్షన్లలో పనిచేస్తున్నారని, బయట మూడేళ్లకోసారి బదిలీలు ఉన్నా.. సచివాలయంలోని సెక్షన్లలో మాత్రం దీర్ఘకాలం బదిలీలు లేకుండా ఉన్నారని సమాచారం. ఇటీవల కొత్తగా ఎన్నికైన సచివాలయ ఉద్యోగుల సంఘం కూడా ఈ దీర్ఘకాలంగా ఒకేస్థానంలో పనిచేస్తున్న వారిని మార్చాలని ప్రభుత్వానికి సూచించిందన్న ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి బాసరలో వసంత పంచమి వేడుకలు

- మూడురోజుల పాటు నిర్వహణ
- భక్తుల కోసం ఏర్పాట్లు సిద్ధం

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో శనివారం వసంత పంచమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. మాఘశుద్ధ పంచమి రోజు సరస్వతి అమ్మవారి జన్మదినం జరుపుతుంటారు. మూడు రోజులపాటు వసంత పంచమి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బాసరకు వచ్చి సమీక్షించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు కొట్టివేయండి

- హైకోర్టులో రాధాకిషన్‌రావు క్వాష్ పిటిషన్
- జైలు నుంచి విడుదల

సాక్షి, హైదరాబాద్/సైదాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చక్రధర్ చేసిన ఫిర్యాదులో ఏ–1గా హరీశ్, ఏ–2గా రాధాకిషన్‌రావు పేర్లను పోలీసులు చేర్చారు. ఇదే కేసులో మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలంలోని విషయాలనే చక్రధర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారని రాధాకిషన్‌రావు చెప్పారు. ఇప్పటికే 10 నెలలుగా జైలులో ఉన్నానని.. విచారణకు ముందే జైలు విధించాలనే లక్ష్యంతో చక్రధర్ ఫిర్యాదు చేశారని, దీని వెనుకు కుట్ర ఉందన్నారు. ఇప్పటికే హైకోర్టు పాత కేసులో బెయిలు మంజూరు చేసిందని చెప్పారు. కాగా, రాధాకిషన్‌రావు జైలు నుంచి విడుదలయ్యారు. ఫోన్ ట్యాపింగ్ చేశారన్న అభియోగాలతో నమోదైన కేసులో 10 నెలలుగా ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. గురువారం న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పత్రాలు శుక్రవారం సాయంత్రం జైలు అధికారులకు అందడంతో ఆయన విడుదలయ్యారు. విడుదల తర్వాత జైలు బయట మీడియాతో మాట్లాడటానికి నిరాకరించిన రాధాకిషన్‌రావు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వారి వాహనంలో వెళ్లి పోయారు.

దివాళా అంచున విత్తనాభివృద్ధి సంస్థ

మోయలేని భారంగా ఓవర్ డ్రాఫ్ట్ బకాయి

- యూనియన్ బ్యాంకులో రూ.400 కోట్ల ఓడీ
- ప్రతినెలా వడ్డీ కిందనే రూ.3 కోట్లు చెల్లింపు
- ప్రస్తుతం బ్యాంకు బ్యాలెన్స్ రూ.3.66 కోట్లు
- విత్తన సంస్థలకు ఇవ్వాల్సిన బకాయి రూ.80 కోట్లు
- సంస్థకు మిగిలిన ఓడీ పరిమితి రూ.2 వేలు మాత్రమే

సాక్షి, హైదరాబాద్: దేశానికి అవసరమైన విత్తనాల్లో 70 శాతం తామే అందిస్తున్నామని, విత్తన భాండాగారంగా వెలుగొందుతున్నామని చెప్పుకుంటున్న రాష్ట్రంలో ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ దివాళా అంచున నిలబడింది. ప్రైవేటు విత్తన సంస్థలు ఏటా రూ.కోట్లు ఆర్జిస్తుంటే, విత్తనాభివృద్ధి సంస్థ మాత్రం ఏటికేడు నష్టాల్లో కూరుకుపోతోంది. సంస్థ 2016లో యూనియన్ బ్యాంకు నుంచి ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) కింద రూ.100 కోట్లు తీసుకుంది. ఆ మొత్తాన్ని సకాలంలో తిరిగి చెల్లించకపోవడం, ఏటా మరింత మొత్తం తీసుకోవటంతో ప్రస్తుతం అది రూ.400 కోట్లకు చేరింది. దీనికి ప్రతినెలా రూ.3 కోట్ల చొప్పున వడ్డీని సంస్థ చెల్లిస్తోంది. అప్పుల భారం పెరగడంతో ఉద్యోగుల జీతాలకు కూడా ఇబ్బందిపడే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం సంస్థ బ్యాంకు ఖాతాలో రూ.3.66 కోట్ల మేర నిల్వలు ఉండగా, ఫిబ్రవరి ఒకటో తేదీ తరువాత అందులో నుంచి రూ.3 కోట్లు వడ్డీ కింద బ్యాంకు జమ చేసుకుంటుంది. మిగిలే రూ.66 లక్షలను ఉద్యోగులకు వేతనాల కింద సర్దుబాటు చే యాల్సి ఉంటుంది. పోనీ మళ్లీ ఓడీ తీసుకుందామంటే.. సంస్థకు ఇప్పుడున్న క్రెడిట్ అవకాశం రూ.2 వేల వరకు మాత్రమే.

స్వయంకృతం

విత్తనాల కోసం అభివృద్ధి చేసిన వరి, ఇతర పప్పు ధాన్యాలను సకాలంలో రైతులకు విక్రయించకపోవడం సంస్థకు ఏటా రివాజుగా మారింది. దాంతో సీజన్ దాటగానే సీడ్ (విత్తనాలు)ను నాన్ సీడ్‌గా మార్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. 2023లో 50 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను నాన్‌సీడ్‌గా మార్చి విక్రయించటంతో రూ.94 కోట్ల నష్టం వచ్చింది. 2015–16 నుంచి విత్తన సంస్థలకు చెల్లించాల్సిన బకాయిల్లో ఇంకా రూ.80 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వం విత్తనాలకు సబ్సిడీని విడుదల చేయడం లేదు. ఈ సబ్సిడీ మొత్తం రూ.450 కోట్లవరకు రావాల్సి ఉందని ఓ అధికారి తెలిపారు. 9 ప్రాసెస్ యూనిట్లు, ఆగ్రోస్ విక్రయ కేంద్రాలు, సొసైటీల ద్వారా విత్తనాలను విక్రయించే సంస్థ సరైన ప్రణాళిక లేక దివాళా దశకు చేరిందని వ్యవసాయ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బోర్డు ఆమోదం లేకుండానే టెండర్లు

వచ్చే 2025–26లో వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతులకు అందించేందుకు 2.73 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాల కోసం సంస్థ టెండర్లు పిలిచింది. అందుకు కార్పొరేషన్ బోర్డు ఆమోదం తీసుకోనే లేదు. 1.78 లక్షల క్వింటాళ్ల 8 రకాల వరి విత్తనాలు, 50 వేల క్వింటాళ్ల సోయాబీన్.. పెసర, కంది, శనగ, వేరుశనగ, జొన్న మొదలైన 2,73,500 క్వింటాళ్ల విత్తనాల కోసం సంస్థ తరపున ఇన్‌చార్జి ప్రొడక్షన్ మేనేజర్ నోటిఫికేషన్ ఇచ్చారు. జనవరి 27వ తేదీ టెండర్ల దాఖలుకు చివరి తేదీ కాగా, ఒక్క విత్తన సంస్థ కూడా టెండర్ వేయకపోవటంతో గడువు తేదీని ఫిబ్రవరి 11 వరకు పొడిగించారు.

గత సర్కారు నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయాలే విత్తనాభివృద్ధి సంస్థ నష్టాలకు కారణం. సంస్థకు రావాల్సిన సబ్సిడీని విడుదల చేయలేదు. సీడ్‌ను నాన్ సీడ్‌గా మార్చి విక్రయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రాసెస్ చేసిన విత్తనాలను పూర్తిస్థాయిలో విక్రయించే ఏర్పాట్లు చేశాం. 2024లో ఆ ఫలితాలు కనిపించాయి. కొత్త టెండర్లకు బోర్డు ఆమోదం అవసరం లేదు. ఇది రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ. – అన్వేశ్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

ఓబీసీ జాబితాలోకి మరో 40 కులాలు

- కేంద్రం ఓబీసీ లిస్టులో చేర్చాలన్న రాష్ట్ర బీసీ కమిషన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కేంద్రప్రభుత్వం నిర్దేశించిన ఓబీసీ కులాల జాబితాలో మరో 40 కులాలను చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ డిమాండ్ చేసింది. ఈ కులాలను ఓబీసీ లో చేర్చేందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రా యాలని నిర్ణయించింది. శుక్రవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిరంజన్ రాష్ట్రంలోని బీసీ కులాలకు సంబంధించిన అంశాలను మంత్రి ముందు ప్రస్తావించి చర్చించారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా బహిరంగ విచారణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఈ బహిరంగ విచారణలో దాదాపు 40 కులాలకు చెందిన సంఘాలు ఓబీసీ జాబితాలో లేవని గుర్తు చేశారు. దీంతో ఆయా కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా కేంద్రానికి లేఖ రాసేందుకు చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలి

- గవర్నర్‌కు బీజేపీ నేత ప్రభాకర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అప్పుల ఊబిలోకి కూరుకుపోయినందున వెంటనే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లి, రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం, పరిస్థితులపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శుక్రవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినప్పటికీ, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆర్థికపరిస్థితి దిగజారిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు, దుబారా ఖర్చులు, రాజకీయ నియామకాలు, కోట్లాది రూపాయల ప్రజాసొమ్మును అడ్వర్టైజ్‌మెంట్లుగా ఇవ్వడంతో మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థికవేత్తలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

దర్బార్‌లో కోడ్ తెచ్చిన తంటా

- కార్యక్రమం సాగుతుండగా మంత్రి సీతక్క, కాంగ్రెస్ నేతల ఎంట్రీ
- వేదికపైనున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు పక్క రూమ్‌లోకి..
- రెండు గంటలకుపైగా ఆ ఇరుకు గదిలోనే అధికారులు



అధికారులు వేదికపై నుంచి వెళ్లిపోవడంతో నిశ్చేష్టులై చూస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో అధికారులకు తంటాలు తప్పలేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం తెలిసిందే. దీంతో అధికార యంత్రాంగమే గిరిజన దర్బార్ కార్యక్రమ నిర్వహణ చేపట్టింది. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతోపాటు ఇతర జిల్లా స్థాయి అధికారులంతా వేదికపై ఆసీనులై ఉన్నారు. ఆఫీసర్లు, ఆదివాసీ సంఘాల నేతల ప్రసంగాలు ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆ సమయంలో మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు కాంగ్రెస్ నేతలు దర్బార్‌కు వస్తున్నారని పోలీసుల ద్వారా కలెక్టర్‌కు సమాచారం చేరవేశారు. అంతలోనే వారు దర్బార్ జరుగుతున్న హాల్‌లోకి వచ్చేస్తుండడంతో కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వో, ఇతర అధికారులంతా దర్బార్‌ను ఆనుకొని ఉన్న ఓ గదిలోకి వెళ్లారు. ఆ సమయంలో ఆదివాసీ సంఘాల నేతలు ఏం జరుగుతుందో తెలియక కొంతసేపు గందరగోళానికి గురయ్యారు. ఆపై మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలంతా వేదికపై ఆసీనులయ్యారు. కాగా నేతల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు రెండు గంటలకు పైగా కొనసాగాయి. కార్యక్రమం ముగిసి నేతలంతా వెళ్లిపోయేవరకు ఆ ఇరుకు గదిలోనే పది మంది జిల్లా అధికారులందరూ ఉండిపోవాల్సి వచ్చింది. మొత్తంగా కోడ్ తెచ్చిన తంటా అధికారులను ఇబ్బందికి గురిచేయగా, రాజకీయ నేతల తీరుపై మాత్రం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్న వారే కాకుండా మాజీ ప్రజాప్రతినిధులు కూడా దర్బార్ వేదికపై ఉపన్యాసాలు ఇవ్వడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

బీజేపీ నేతలు కూడా...

కాంగ్రెస్ నేతల కంటే ముందుగా ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు కూడా దర్బార్‌కు వచ్చి నేరుగా జనాలను కలిసేందుకు వెళ్లారు. ఆ సమయంలోనూ జిల్లా అధికారులంతా ఇలాగే రూమ్‌లోకి వెళ్లారు. అయితే బీజేపీ ప్రజాప్రతినిధులు కొద్దిసేపటికే వెళ్లిపోవడంతో అధికారులు తిరిగి వేదికపైకి వచ్చారు. మంత్రి సీతక్క దర్బార్ వేదిక పైనుంచి ప్రసంగించారు. ఆదివాసీ ఆచారాలు, సంస్కృతిని కాపాడుకోవాలని హితవు పలికారు. అలాంటప్పుడే మన జాతుల ప్రత్యేకత ప్రపంచానికి తెలుస్తుందని వివరించారు. తద్వారా ఈ ప్రాంతాభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు.

సీతక్క స్పెషల్ అట్రాక్షన్



ప్రత్యేక వస్త్రధారణలో మంత్రి సీతక్క, కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ

గిరిజన దర్బార్‌లో పాల్గొన్న మంత్రి సీతక్క స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఆదివాసీ వస్త్రధారణతోపాటు ఆభరణాలు ధరించిన ఆమె ప్రత్యేకంగా కనిపించారు. కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ కూడా ఇలాంటి వస్త్రధారణలోనే హాజరయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్ ధోవతితో విచ్చేశారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- ప్రభుత్వాస్పత్రిలో చేర్పించిన సిబ్బంది
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కళాశాలలో విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత.. అర్ధగంట కొకరు చొప్పున కడుపునొప్పితోపాటు వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. సహచర విద్యార్థినులు వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. సాయంత్రం వరకూ ఆగి.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అస్వస్థతకు గురైన వారిలో ఉమేధియా, శ్రావ్య, జ్యోహా, నందిని, కీర్తిమణి ఉన్నారు. కొత్త బియ్యం కావడంతో సరిగ్గా ఉడక్క జీర్ణం కాలేదని విద్యార్థినులు తెలిపారు. ఆహారం కలుషితం కావడంతోనే ఇలా జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక..

- ఇద్దరు విద్యార్థుల బలవన్మరణం



నందిని

దామెర/వర్ధన్నపేట: హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాంధన్ తండాకు చెందిన గుగులోతు నందిని (13) టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ పర్వతగిరి గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చింది. సెలవులు ముగిసినా స్కూల్‌కు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నందిని గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు ఆందోళన చెంది గ్రామమంతా వెతుకుతున్న సమయంలో వ్యవసాయ బావి వద్ద కనిపించిందని తెలియడంతో బావిలో ఎంత వెదికినా లభించలేదు. తిరిగి శుక్రవారం ఉదయం బావిలో మరోసారి వెతకగా నందిని మృతదేహం దొరికింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ తెలిపారు.

కాగా, హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పసరగొండకు చెందిన గజ్జి పాల్ (16) ములుగు సమీపంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాలుడు తిరిగి వెళ్లేందుకు నిరాకరించాడు. దీంతో తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై గురువారం సమీపంలోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం బాలుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

సంక్షేమ వసతిగృహాల్లో ఆహార నాణ్యతకు ఎన్ఐఎన్ సహకారం

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో ఆహార నాణ్యత ప్రమాణాల విషయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఇటీవల వరుసగా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు నమోదవడం, కొన్నిచోట్ల పరిస్థితి విషమించి విద్యార్థులు తీవ్ర అనారోగ్యం పాలవడం, ఒకట్రెండు చోట్ల మరణాలు కూడా నమోదయ్యాయి. దీంతో నాణ్యమైన ఆహారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. ఇందులో భాగంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీలో నాణ్యమైన ఆహారం పంపిణీ కోసం ఎన్ఐఎన్ సహకారాన్ని తీసుకోనుంది. ఈ సొసైటీ పరిధిలో 268 గురుకుల పాఠశాలలున్నాయి. ఈ విద్యాసంస్థలకు సరుకుల సరఫరా, ఆహారం తయారీ, వడ్డించే విషయంలో ఎన్ఐఎన్ సూచనలు పాటించాలని సొసైటీ ఆదేశించింది. ఈమేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్ఐఎన్ సూచనలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయి ఉద్యోగులు తప్పకుండా ఈ సూచనలు పాటించేలా చర్యలు తీసుకోవాలంది. డైట్ మెనూ, వంట పద్ధతుల్లో నాణ్యత లోపించకుండా నిర్ణీత ప్రమాణాలు, వంట గదితో పాటు స్టోర్ రూమ్, భోజనం వడ్డించే చోట నిర్దిష్టమైన పద్ధతులను (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) అనుసరించాలని సొసైటీ తేల్చిచెప్పింది. ఉద్యోగులు, సిబ్బందికి ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ వర్గాలు వెల్లడించాయి.

వితంతువులకూ పరిహారం ఇవ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వితంతువులను ప్రత్యేక కుటుంబంగా పరిగణించి పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ముంపు గ్రామమైన వేములఘాట్‌లో 2019లో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, నిర్వాసితులైన వితంతువులకు పరిహారం చెల్లించలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. గంగవ్వతో పాటు మరో 35 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన పిటిషనర్లకు పునరావాస పథకం కింద పరిహారం చెల్లించడానికి అధికారులు నిరాకరించారన్నారు. దీనిపై వినతిపత్రం సమర్పించగా కలెక్టర్ పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

మూడో పర్యాయం.. మూడింతల వేగం

దేశ అభ్యున్నతి కోసం అసాధారణ వేగంతో పనిచేస్తున్న కేంద్రం

పేదలు, మధ్యతరగతి ప్రజలు, యువత, మహిళలు, రైతుల సంక్షేమానికి అగ్రతాంబూలం

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పష్టీకరణ
- పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం



న్యూఢిల్లీ: దేశ అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ వేగంతో పనిచేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, యువత, మహిళలు, రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు, విధానాలను అమల్లోకి తీసుకొచ్చిందని చెప్పారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల్లో వేగంగా మూడు రెట్లు పెరిగిందని అన్నారు. ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా అంకితభావంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లోక్‌సభ చాంబర్‌లో పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. 60 నిమిషాలపాటు సాగిన ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ ప్రగతి ప్రయాణంలో అమృతకాలం నడుస్తోందని, ఇప్పటిదాకా సాధించిన అపూర్వమైన విజయాలతో ప్రభుత్వం దేశానికి నూతన శక్తిని ఇచ్చిందని తెలిపారు. మహా కుంభమేళాలో మౌని అమావాస్య రోజు తొక్కిసలాటలో భక్తులు మరణించడం పట్ల రాష్ట్రపతి సంతాపం ప్రకటించారు. ఇటీవల కన్నుమూసిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన ఘనతలను వివరించారు. ద్రౌపదీ ముర్ము ప్రసంగం ఆమె మాటల్లోనే...

జమిలి ఎన్నికలపై ముందడుగు

''బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోంది. పేద కుటుంబాలకు ఇళ్లు ఇవ్వబోతోంది. గ్రామీణులకు ప్రాపర్టీ కార్డులు అందజేసింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వేగంగా ముందుకు సాగుతోంది. 70 ఏళ్లు దాటినవారిలో 6 కోట్ల మందికి ఆరోగ్య బీమా పథకం వర్తింపజేస్తోంది. కీలకమైన జమిలి ఎన్నికలతోపాటు వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రభుత్వం ముందడుగు వేసింది. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న తరుణంలో భారత్ మాత్రం ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిరత్వంలో ఒక మూలస్తంభంగా నిలిచింది. ఈ విషయంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారింది. భారతదేశ బలాలు, విధానాలు, ఉద్దేశాల పట్ల ప్రపంచ దేశాలు విశ్వాసం కనబరుస్తున్నాయి. క్వాడ్, బ్రిక్స్, షాంఘై సహకార సంస్థతోపాటు జీ20లో ఇండియాదే కీలకపాత్ర.

అప్పుడే అభివృద్ధికి సార్థకత

శ్రీహరికోటలోని షార్ నుంచి ఇస్రో వంద రాకెట్ ప్రయోగాలు పూర్తిచేయడం ప్రశంసనీయం. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న గగన్‌యాన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్లే రోజు ఇక ఎంతో దూరంలో లేదు. కోవిడ్–19 మహమ్మారి, ఇతర దేశాల్లో యుద్ధాలు, తద్వారా అంతర్జాతీయంగా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతోంది. మన బలాన్ని ఆర్థిక వ్యవస్థ చాటి చెబుతోంది. సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. ఒకే దేశం.. ఒకే పన్ను అనే విధానంతో జీఎస్టీని తీసుకొచ్చింది. దీనితో అన్ని రాష్ట్రాలూ ప్రయోజనం పొందుతున్నాయి. అభివృద్ధి ఫలాలు సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి సైతం అందాలి. అప్పుడే ఈ అభివృద్ధికి ఓ సార్థకత ఉంటుంది. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద ప్రభుత్వం 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించింది. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద 10 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చింది. సౌభాగ్య యోజన కింద 80 కోట్ల మందికి రేషన్ సరుకులు అందజేస్తోంది. స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి జల జీవన్ మిషన్‌ను అమలు చేస్తోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలతో తాము గౌరవంగా జీవించగలమన్న విశ్వాసం ప్రజల్లో పెరిగింది. పేదలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందిస్తే.. పేదరికాన్ని జయించగలమన్న ధీమా వారిలో పెరుగుతుంది. ప్రభుత్వ కృషితో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. వారంతా ఒక నూతన మధ్యతరగతి వర్గంగా మారారు. దేశ పురోభివృద్ధికి వారు ఒక చోదకశక్తి.

డిజిటల్ విప్లవంలో ముందంజ

భారతదేశ సామాజిక, ఆర్థిక, జాతీయ భద్రతకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్ ఫేక్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సమస్యను కలిసికట్టుగా పరిష్కరించుకోవాలి. భౌతికమైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూనే సామాజిక మౌలిక సదుపాయాల విప్లవంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత పదేళ్లలో ప్రగతిలో కొత్త అధ్యాయం లిఖించింది. డిజిటల్ విప్లవంలో మనం ముందంజలో ఉన్నాం. డిజిటల్ టెక్నాలజీ రంగంలో ఇండియా అతిపెద్ద గ్లోబల్ ప్లేయర్‌గా అవతరించింది. మన దేశంలో ప్రజలకు 5జీ సర్వీసులు అందుతున్నాయి. ఇక మన డిజిటల్ చెల్లింపులు ప్రపంచ దేశాలను అబ్బురపరుస్తున్నాయి. ప్రపంచం మొత్తంలో 50 శాతానికి పైగా రియల్–టైమ్ డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి. సామాజిక న్యాయం, సమానత్వానికి డిజిటల్ టెక్నాలజీని ప్రభుత్వం ఒక సాధనంగా వాడుకుంటోంది.

మహిళలకు ఆర్థిక స్వాతంత్య్రం

'మహిళల సారథ్యంలో ప్రగతి' అనేది ప్రభుత్వ విధానం. మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తోంది. 91 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 10 కోట్ల మంది మహిళలకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఆయా సంఘాలకు రూ.9 లక్షల కోట్లు అందజేసింది. వారు ఆర్థిక స్వాతంత్య్రం గణనీయంగా పెంచుకుంటున్నారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న లక్ష్యంతో నారీశక్తి వందన్ అధినియంను ప్రభుత్వం తీసుకొచ్చింది. రైల్వే నెట్‌వర్క్ ద్వారా కన్యాకుమారితో కశ్మీర్ అనుసంధానమైంది. ఉధంపూర్–బారాముల్లా–శ్రీనగర్ రైలు ప్రాజెక్టు పూర్తయ్యింది. దేశవ్యాప్తంగా 71 వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రధాన నగరాల సమీపంలో 100కుపైగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రూ.28,000 కోట్లు పెట్టుబడి పెట్టబోతోంది.

ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ

దేశంలో వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలని కేంద్రం సంకల్పించింది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2023–14లో దేశంలో రికార్డు స్థాయిలో 322 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రభుత్వం రైతులకు రూ.41,000 కోట్లు అందజేసింది. పంటలకు కనీస మద్దతు ధరలను పెంచింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ మన దేశంలోనే ఉంది. ఇప్పటికే వెయ్యి కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది. రూ.8,000 కోట్లతో అదనంగా 52,000 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నూతన పరిపాలనా విధానానికి సంస్కరణ, పనితీరు, మార్పు అనేవి పర్యాయ పదాలుగా మారాయి'' అని రాష్ట్రపతి ముర్ము స్పష్టంచేశారు.

అందరికీ నాణ్యమైన వైద్య సేవలు

సమాజంలో అన్ని వర్గాలకు ప్రజలకు తక్కువ రుసుముతో నాణ్యమైన వైద్య సేవలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వ చర్యలతో ఆరోగ్య సంరక్షణ ఖర్చులు క్రమంగా తగ్గుతున్నాయి. దేశవ్యాప్తంగా 1.75 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాబోయే ఐదేళ్లలో మెడికల్ కాలేజీల్లో కొత్తగా 75 వేల సీట్లు రాబోతున్నాయి. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం అత్యాధునిక విద్యా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. గత పదేళ్లలో ఉన్నత విద్యా సంస్థల సంఖ్య భారీగా పెరిగింది. వాటిలో నాణ్యత కూడా మెరుగుపడింది.

మధ్య తరగతికి సొంత గూడు

ప్రభుత్వ పథకాలతో దళితులు, గిరిజనులు, బీసీలు అత్యధికంగా లబ్ధి పొందుతున్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో వారు భాగస్వాములవుతున్నారు. సొంత గూడు కలిగి ఉండాలన్నది మధ్య తరగతి ప్రజల కల. దాన్ని నిజం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గృహరుణాలపై వడ్డీ రాయితీని ప్రభుత్వం అందజేస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో మోసాలకు తావులేకుండా 'రెరా' వంటి చట్టాలు తీసుకొచ్చింది. 'అందరికీ ఇళ్లు' అనేది ప్రభుత్వ లక్ష్యం.


సమతుల్య అభివృద్ధి అత్యంత కీలకం

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధికి సానుకూల వాతావరణం ఏర్పడింది. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలు ఏమిటో ప్రభుత్వానికి తెలుసు. తాము ఒంటరి మన్న భావనను వారిలో తొలగించడానికి కృషి చేస్తోంది. ఈశాన్యంలో శాంతి సాధన కోసం పదికిపైగా ఒప్పందాలు కుదిరాయి. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సమతుల్య అభివృద్ధి అత్యంత కీలకం. దేశమంతటా అన్ని ప్రాంతాలూ సమానంగా పురోగతి సాధించాలన్నదే కేంద్రం ఉద్దేశం. అండమాన్, నికోబార్ దీవులు, లక్షదీవుల్లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రారంభించింది.

పేదలు, మధ్య తరగతిపై లక్ష్మీకటాక్షం

బడ్జెట్ స్వరూపంపై ప్రధాని మోదీ పరోక్ష సంకేతం

సాక్షి, న్యూఢిల్లీ: పేదలు, మధ్య తరగతి ప్రజలపై సంపదల దేవత లక్ష్మీదేవి కటాక్షం చూపాలని తాను ప్రార్థిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయా వర్గాలకు లక్ష్మీదేవి ప్రత్యేకంగా ఆశీస్సులు అందజేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ బడ్జెట్‌లో పేదలు, మధ్య తరగతితోపాటు మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం బడ్జెట్ సమావేశాలకు ముందు పార్లమెంట్ ప్రాంగణంలో మోదీ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. మహిళలకు సమాన హక్కులు ఉండాలన్నారు. వారిపై వివక్ష అంతం కావాలని ఆకాంక్షించారు. మహిళల గౌరవాన్ని పెంచే చర్యలు చేపట్టబోతున్నామని ప్రకటించారు. ఇప్పటికే మహిళల సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈసారి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పలు చరిత్రాత్మక బిల్లులు, ప్రతిపాదనలపై చర్చించబోతున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు. దేశాన్ని మరింత బలోపేతం చేసే చట్టాలు రాబోతున్నాయని పేర్కొన్నారు.



యువ ఎంపీలే విధాన రూపకర్తలు

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఎదిగేందుకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు విశ్వాసాన్ని, శక్తిని నింపుతాయని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని 140 కోట్ల మంది పౌరులు ఈ తీర్మానాన్ని సమష్టిగా నెరవేరుస్తారని ఆయన నొక్కి చెప్పారు. మూడో దఫా ప్రభుత్వంలో భౌగోళికంగా, సామాజికంగా, ఆర్థికంగా సమగ్ర అభివృద్ధి దిశగా మిషన్ మోడ్‌లో ముందుకు సాగుతోందని, ఆవిష్కరణలు, చేరికలు, పెట్టుబడులు స్థిరంగా దేశ ఆర్థిక రోడ్‌మ్యాప్‌కు పునాదిగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశాన్ని బలోపేతం చేసే చట్టాలకు దారితీసే అనేక చరిత్రాత్మక బిల్లులు, ప్రతిపాదనలు ఈ సెషన్‌లో చర్చిస్తామన్నారు. స్త్రీల గౌరవాన్ని పెంచేలా, ప్రతి మహిళకు సమాన హక్కులు కల్పించడంతోపాటు మతపరమైన చిచ్చుల , వర్గ విభేదాలు లేకుండా చేయడం .. తమ ప్రాథామ్యాలని ఆయన నొక్కిచెప్పారు. ఈ లక్ష్య సాధన దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. వేగవంతమైన అభివృద్ధిని సాధించడంలో సంస్కరణలు, పనితీరు, మార్పు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. దేశం అపారమైన యువశక్తితో తొణికిసలాడుతోందని, ఈ రోజు 20–25 సంవత్సరాల వయస్సు గల యువత 45–50 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి అభివృద్ధి చెందిన భారతదేశంలో అతిపెద్ద లబ్ధిదారులు అవుతారని అన్నారు. వారంతా విధాన రూపకల్పనలో కీలక స్థానాల్లో ఉంటారని, అభివృద్ధి చెందిన భారతాన్ని రాబోయే శతాబ్దంలో గర్వంగా నడిపిస్తారన్నారు. 1930, 1940లలో స్వాతంత్య్రం కోసం పోరాడిన యువతతో వారిని పోల్చారు. యువ ఎంపీలకు ఇది సువర్ణావకాశమని, సభలో వారి చురుకైన భాగస్వామ్యంతో వికసిత్ భారత్‌కు సాక్షులుగా ఉంటారని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో ప్రతి ఎంపీ, ముఖ్యంగా యువ ఎంపీలు వికసిత్ భారత్ ఎజెండాకు ఇతోధికంగా కృషి చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. 'సంస్కరణలు, పనితీరు, పరివర్తన' తమ మంత్రంగా ఉంటుందన్నారు. వేగంగా అభివృద్ధిని సాధిస్తామని, సంస్కరణలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే మార్పు సాధ్యమన్నారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తాము పనిచేస్తామని పేర్కొన్నారు.

పదేళ్లలో విదేశీ జోక్యం లేని సమావేశాలివే

గడిచిన పదేళ్లలో విదేశీ జోక్యం లేకుండా జరుగుతున్న మొదటి పార్లమెంట్ సమావేశాలు ఇవేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రతి సమావేశాలకు ముందు విదేశాల నుంచి అగ్గిరాజేయడం పరిపాటిగా వస్తోందని, ఈసారి మాత్రం అలాంటిదేమీ జరుగలేదని విపక్షాలకు చురకలు వేశారు. ''2014 నుంచి నేను గమనిస్తున్నాను. ప్రతి సమావేశానికి ముందు ఇక్కట్లు సృష్టించేందుకు చాలామంది సిద్ధంగా ఉంటారు. ఇక్కడ దేశంలో ఈ ప్రయత్నాలను ఎగదోసే వారికి కొదవలేదు. విదేశీ మూలాల నుంచి ఎలాంటి జోక్యం లేని మొదటి సమావేశం ఇదే'' అని వ్యాఖ్యానించారు.

ఆలయాల్లో వీఐపీ సంస్కృతిని అరికట్టేలా

మార్గదర్శకాలు జారీ చేయలేం

అందుకు సమాజం, ఆలయ కమిటీలే చొరవ తీసుకోవాలి ● సుప్రీంకోర్టు వెల్లడి



న్యూఢిల్లీ: దేవాలయాల్లో చాలా ముఖ్యమైన వ్యక్తులకు(వీఐపీలు) అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ రాచమర్యాదలు చేస్తూ ప్రత్యేక దర్శనాలు కల్పించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించింది. బృందావన్‌లోని శ్రీరాధా మదన్‌మోహన్ ఆలయంలో సేవాయత్‌గా పని చేస్తున్న విజయ్‌కిశోర్ గోస్వామి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆలయాల్లో వీఐపీలకు ప్రత్యేక మర్యాదలు చేయడం, సామాన్యులు ప్రత్యేక దర్శనం చేసుకోవాలంటే అదనంగా రుసుము వసూలు చేయడాన్ని ఆయన సవాలు చేశారు. 12 జ్యోతిర్లింగాల్లో వీఐపీ దర్శనాల సంస్కృతి విపరీతంగా ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆలయాల్లో వీఐపీ సంస్కృతిని అరికట్టేలా ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు. పౌరులంతా సమానమేనని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 సూచిస్తున్నట్లు గుర్తుచేశారు. దర్శనాలకు అదనంగా రుసుము వసూలు చేయడం సమానత్వ హక్కులను, మత స్వేచ్ఛను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. విజయ్‌కిశోర్ గోస్వామి పిటిషన్ శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. దేవాలయాల్లో వీఐపీ సంస్కృతిని అరికట్టేలా ప్రభుత్వాలను ఆదేశిస్తూ తాము మార్గదర్శకాలు జారీ చేయలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది. సమస్యను పరిష్కరించడానికి సమాజం, ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీలే చొరవ తీసుకోవాలని సూచించింది. ఆలయాల్లో ప్రముఖులకు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇవ్వకూడదని, భక్తులందరినీ సమానంగా చూడాలన్న అభిప్రాయం తమకు కూడా ఉందని పేర్కొంది. కానీ, మార్గదర్శకాలు మాత్రం జారీ చేయలేమని వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 పరిధిలోకి ఈ కేసు వస్తుందని తాము భావించడం స్పష్టంచేసింది. పిటిషన్‌ను విచారించలేం కాబట్టి తిరస్కరిస్తున్నామని తెలియజేసింది. అయితే, పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడం అనేది వీఐపీ సంస్కృతిని అరికట్టే సంబంధిత అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోకుండా అడ్డుకోలేదని ఉద్ఘాటించింది. ఆలయాల్లో వీఐపీలకు ప్రత్యేక మర్యాదలు చేయకుండా స్థానికంగా చర్యలు తీసుకోవచ్చని పరోక్షంగా తేల్చిచెప్పింది.

జన్మతః పౌరసత్వం బానిసల సంతానానికే

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: జన్మతః పౌరసత్వం వెసులుబాటును వాస్తవానికి బానిసల సంతానం కోసం తీసుకొచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అంతేతప్ప, ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు వచ్చి తిష్ట వేయడానికి, ఆక్రమించుకోవడానికి మాత్రం కాదని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ఆయన జారీ చేసిన ఉత్తర్వును మరునాడే సియాటిల్‌లోని ఫెడరల్ కోర్టు కొట్టివేయడం తెలిసిందే. దీనిపై తాము అప్పీల్ చేస్తామని గురువారం ట్రంప్ అన్నారు. సుప్రీంకోర్టు కూడా తీర్పును తమకు అనుకూలంగా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసులో విజయం సాధిస్తే ప్రపంచ దేశాల్లోనే ఇటువంటి చట్టాన్ని తీసుకువచ్చిన మొదటి దేశం అమెరికా అవుతుందన్నారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. 'అర్హత లు లేని వ్యక్తులు, పూర్తిగా అర్హులు కాని వారి పిల్లలు..ఇలా ఎవరుపడితే వారు వచ్చి ఇక్కడే ఉండిపోతున్నారు. వాస్తవానికి ఈ చట్టం బానిసల సంతానం కోసం తీసుకొచ్చిన ఎంతో మంచి చట్టం. వారి కోసమే అయితే ఈ చట్టానికి వందశాతం మద్దతిస్తున్నా'అని అన్నారు.

సోనియా వ్యాఖ్యలు దురదృష్టకరం

ఖండించిన రాష్ట్రపతి భవన్ ● ఆ కుటుంబానికి పేదలంటే లెక్కే లేదన్న మోదీ

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో ద్రౌపదీ ముర్ము ప్రసంగాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ చులకనగా మాట్లాడారంటూ వచ్చిన వార్తలపై రాష్ట్రపతి భవన్ స్పందించింది. 'కాంగ్రెస్ అగ్ర నేతలు దేశ అత్యున్నత పదవికున్న గౌరవాన్ని కించపరిచారు. సోనియా గాంధీ మాటలు, దురదృష్టకరం, అంగీకార యోగ్యం కానివి. కాంగ్రెస్ నాయకులకు హిందీ, ఇతర భారతీయ భాషల్లోని యాస వంటివి తెలియకపోవడం వల్ల తప్పుడు అభిప్రాయంతోనే రాష్ట్రపతి అలసిపోయి ప్రసంగించినట్లుగా అనిపించి ఉండొచ్చు. ప్రసంగ సమయంలో ఏ దశలోనూ రాష్ట్రపతి అలసిపోలేదు. నిజానికి, అట్టడుగు వర్గాల ప్రజలు, మహిళలు, రైతుల కోసం మాట్లాడే సమయంలో ఆమె ఎన్నడూ అలసిపోరు'అంటూ ఒక ప్రకటనలో రాష్ట్రపతి భవన్ స్పష్టం చేసింది. రాష్ట్రపతిపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యాలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఆ రాజ కుటుంబానికి పేదలు, అణగారిన వర్గాల ప్రజలంటే ఏమాత్రం గౌరవం లేదన్నారు. 'ఈ దేశానికి తామే యజమానులమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ రాచకుటుంబం అహంకారం మరోసారి తేటతెల్లమైంది. మన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీ ఈ రోజు పార్లమెంట్‌లో ప్రసంగించారు. దేశం సాగించిన ప్రగతి, అభివృద్ధి చెందిన భారత్ భవిష్యత్ దార్శనికతను గురించి మాట్లాడారు. హిందీలో ఆమె ధారాళంగా మాట్లాడకున్నా, మాతృభాష ఒడియాలో చాలా చక్కని ప్రసంగం చేశారు'అని ప్రధాని చెప్పారు. 'కానీ, ఆ ప్రసంగం గురించి కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారు. బోరింగ్ అని ఒకరంటే మరొకరు ఇంకో అడుగు ముందుకేశారు. ఆమె ప్రసంగాన్ని పూర్, టైర్డ్ అంటూ అవమానకరంగా మాట్లాడారు. మాతృభాష ఒడియాను కించపరుస్తూ ఇలా మాట్లాడటం దేశంలోని 10 కోట్ల మంది గిరిజన సోదరులు, సోదరీమణులను, ప్రతి పేద వాడినీ అవమానించినట్లే'అని ఆయన పేర్కొన్నారు. అసలేం జరిగిందంటే.. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం ముగిశాక కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, రాహుల్ గాంధీ పార్లమెంట్ సముదాయంలో రాష్ట్రపతి ప్రసంగంపై మీడియా ఎదుట చర్చించుకున్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ, 'పాపం, రాష్ట్రపతి ప్రసంగం ముగిసే సరికి అలసిపోయారు. అతికష్టమ్మీద మాట్లాడారు'అని అన్నారు. బదులుగా రాహుల్ గాంధీ..రాష్ట్రపతి ప్రసంగం బోరు కలిగించిందా అంటూ ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. ఈ వివాదంపై ప్రియాంకా గాంధీ స్పందిస్తూ.. సోనియా గాంధీ వ్యాఖ్యలను వక్రీకరించారని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అంటే ఆమెకు ఎనలేని గౌరవముందని వివరించారు.

ఆప్‌కు ఏడుగురు ఎమ్మెల్యేల గుడ్‌బై

టికెట్లు దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు ఐదురోజుల ముందు ఆమ్ ఆద్మీ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. ఫిబ్రవరి 5న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికి ఆప్ వీరికి టికెట్లు నిరాకరించడంతో కలిసికట్టుగా పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమ రాజీనామా లేఖలను శుక్రవారం సోషల్‌మీడియాలో పెట్టారు. వీరంతా ఇతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తనతో పాటు మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్ వెల్లడించారు. అలాగే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ రాంనివాస్ గోయల్‌కు పంపినట్లు తెలిపారు. భావనా గౌర్, నరేశ్ యాదవ్, రోహిత్ మెహరౌలియా, పవన్ శర్మ, బి.ఎస్.జూన్, రాజేశ్ రిషి రాజీనామా చేసిన ఇతర ఎమ్మెల్యేలు. భవిష్యత్తు ప్రణాళికలను త్వరలోనే వెల్లడిస్తామని మదన్ లాల్ తెలిపారు. పార్టీపై, అరవింద్ కేజ్రీవాల్‌పై విశ్వాసం కోల్పోయినందువల్లే రాజీనామా చేస్తున్నట్లు భావనా గౌర్ పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో లేరని సర్వేలో తేలినందువల్లే ఈ ఏడుగురికి పార్టీ టికెట్లు నిరాకరించిందని ఆప్ జాతీయ ప్రతినిధి రీనా గుప్తా తెలిపారు.

జస్టిస్ హృషికేశ్ రాయ్‌కి ఘనమైన వీడ్కోలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హృషికేశ్ రాయ్‌కి శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పలువురు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాతోపాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. జస్టిస్ హృషికేశ్ రాయ్ చాలా విశిష్టమైన న్యాయమూర్తి అని జస్టిస్ ఖన్నా కొనియాడారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసించారు. క్విజ్ మాస్టర్‌గా, జర్నలిస్టుగా, స్టాండప్ కమేడియన్‌గానూ రాణించారని చెప్పారు. జస్టిస్ హృషికేశ్ రాయ్ 2019 సెప్టెంబర్ 23న సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన పదవీ కాలం ముగిసింది. ఆయన చివరి పని దినంగా సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రత్యేకంగా సమావేశమైంది. న్యాయ వ్యవస్థకు జస్టిస్ హృషికేశ్ రాయ్‌కి అందించిన సేవలను ధర్మాసనం సభ్యులు గుర్తుచేసుకున్నారు.

కెనడా, మెక్సికోలపై టారిఫ్‌లు నేటి నుంచే

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్: పొరుగుదేశాలైన కెనడా, మెక్సికోలపై ప్రకటించిన 25 శాతం టారిఫ్ పెంపు శనివారం నుంచే అమలవుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. టారిఫ్‌లు విధించే కెనడా, మెక్సికో వస్తువుల జాబితాలో చమురును చేర్చాలా వద్దా అనేది కూడా త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ రెండు దేశాల నుంచి దిగుమతయ్యే ఆయిల్ ధర సరిగ్గా ఉందని భావిస్తే టారిఫ్ ఉండదని చెప్పారు. కెనడా, మెక్సికోలపై టారిఫ్ విధింపునకు ఎన్నో కారణాలు ఉన్నాయన్నారు. ఈ రెండు దేశాల నుంచి అక్రమ వలసలు, డ్రగ్స్ స్మగ్లింగ్ ఎక్కువన్నారు. ఈ రెండు దేశాలతో అమెరికా వాణిజ్యం భారీ లోటు ఉందని చెప్పారు. వాణిజ్యం విషయంలో ఈ రెండూ అమెరికాతో చాలా అన్యాయంగా వ్యవహరించాయన్నారు. ఇవి ఎగుమతి చేసే వస్తువులు ఆయిల్, కలప వంటి వాటి అవసరం తమకు లేదన్నారు. ప్రస్తుతం ఏడాదికి కెనడాకు 175 బిలియన్ డాలర్లు, మెక్సికోకు 300 బిలియన్ డాలర్ల వరకు అమెరికా సబ్సిడీల రూపంలో అందిస్తోందని ట్రంప్ వివరించారు.



చైనా పైనా టారిఫ్

ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన డ్రగ్‌ను తమ దేశంలోకి దొంగచాటుగా పంపుతున్న చైనా వస్తువులపైనా టారిఫ్‌లు విధించే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. 'ఫెంటానిల్ కారణంగా వేలాదిగా అమెరికన్లు చనిపోతున్నారు. ఇందుకు బదులుగా చైనా టారిఫ్‌తో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంది. ఈ విషయంలో స్పష్టతతో ఉన్నాం'అని ఆయన అన్నారు.

బ్రిక్స్‌కు ట్రంప్ మళ్లీ వార్నింగ్

అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌కు బదులుగా ప్రత్యామ్నాయం తీసుకురావాలనుకుంటే తీవ్ర చర్యలు తప్పవని బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అలాంటి పరిస్థితే వస్తే సభ్యదేశాలపై వంద శాతం టారిఫ్ తప్పదన్నారు. అమెరికాకు బదులు మరో దేశాన్ని చూసుకోవాలని సలహా ఇచ్చారు. 'ఇప్పటి వరకు చూస్తూ ఊరుకున్నాం, ఇకపై సహించేది లేద'అంటూ సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. 'కొత్తగా బ్రిక్స్ కరెన్సీని తేవడం లేదా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీకి మద్దతివ్వడం వంటివి మానుకోవాలి. అలా చేస్తే 100 శాతం టారిఫ్‌లు తప్పవు. అమెరికాలో ఉత్పత్తుల విక్రయానికి గుడ్ బై చెప్పుకోవాల్సిందే'అన్నారు. గత డిసెంబర్‌లోనూ బ్రిక్స్‌కు ట్రంప్ ఇటువంటి హెచ్చరికే చేశారు. అయితే, డాలర్ రహిత బ్రిక్స్ దేశాల వాణిజ్యానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా లేదని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. బ్రిక్స్‌లో రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్ దేశాలకు సభ్యత్వముంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఖర్చు రూ.1,737 కోట్లు

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ చేసిన వ్యయం రూ. 1,737.68 కోట్లు. ఎన్నికల కమిషన్‌కు ఆ పార్టీ ఈ మేరకు నివేదిక సమర్పించింది. ఇందులో సాధారణ పార్టీ ప్రచారం కోసం పెట్టిన ఖర్చు రూ. 884.45 కాగా, అభ్యర్థులకు సంబంధించిన వ్యయం రూ.853.23 కోట్లు. సుమారుగా రూ.611.50 కోట్లను కేవలం మీడియాలో ప్రకటనల కోసమే వెచ్చించింది. ఇందులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, కేబుల్, వెబ్‌సైట్లు, టీవీ చానెళ్లలో ప్రచారం వంటివి ఉన్నాయి. మరో రూ.55.75 కోట్లను పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు ప్రచార సామాగ్రికి ప్రత్యేకించింది. బహిరంగ సభలు, ర్యాలీల ఏర్పాట్ల కోసం మరో రూ.19.84 కోట్లు ఖర్చు చేసింది. స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణ ఖర్చుల కోసం రూ. 168.92 కోట్లను, ఇతర పార్టీ నేతల ప్రయాణాలకు రూ.2.53 కోట్లు ఖర్చయింది. సార్వత్రిక ఎన్నికలతోపాటే మూడు రాష్ట్రాలు.. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలకు వరుసగా రూ.5,552.57 కోట్లు, రూ.5,552.41 కోట్లు, రూ.5,555.65 కోట్లు వెచ్చించినట్లు బీజేపీ తన నివేదికలో వెల్లడించింది.


కారుణ్య మరణానికి గ్రీన్‌సిగ్నల్

దేశంలోనే కర్ణాటక తొలి రాష్ట్రంగా రికార్డు

సాక్షి బెంగళూరు: తీవ్ర అనారోగ్యానికి గురై ఎలాంటి చికిత్సకు స్పందించక, వ్యాధి నయం కాని రోగులకు కారుణ్య మరణ హక్కును కల్పిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం కర్ణాటకలో ఈ చారిత్రక చట్టాన్ని అమలు చేస్తున్నట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో, కారుణ్య మరణాన్ని అమలు చేయనున్న తొలి రాష్ట్రంగా కర్ణాటక అవతరించింది. మొండి వ్యాధి బాధితులు, మరణాంతక రోగగ్రస్తులు లేదా కోమా స్థితిలో ఉన్న వారికి, ఎలాంటి చికిత్స అందించినా బతకడం అసాధ్యం అనే వారికి ఈ ఆదేశాల ద్వారా గౌరవప్రదమైన మరణానికి అవకాశం లభించింది. కారుణ్య మరణానికి అవకాశం కల్పించేందుకు వైద్యులతో కూడిన బోర్డును ఏర్పాటు చేయనున్నారు. ఈ వైద్యులు కారుణ్య మరణానికి ఆ రోగి అర్హుడా కాదా అనే విషయాన్ని ధ్రువీకరిస్తారు. అలాగే జిల్లా స్థాయిలో కూడా వైద్య నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ తొలుత సంబంధిత రోగి ఎలాంటి చికిత్స అందించినా ఫలితం ఉండబోదని ధ్రువీకరించిన తర్వాతే కారుణ్య మరణానికి అవకాశం కల్పిస్తారు. అయితే ఆ రోగి కుటుంబ సభ్యుల వినతి మేరకు మాత్రమే వైద్యుల బృందం ఈ పని చేయాల్సి ఉంటుంది. కోర్టు అనుమతించాక రోగి లైఫ్ సపోర్టు సిస్టమ్‌ను తొలగిస్తారని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు.

सत्यमेव जयते
GOVERNMENT OF GUJARAT





The Future Moves Faster in Gujarat with Infrastructure Built for Investor Success

Gujarat's infrastructure stands as the backbone of its thriving economy, seamlessly linking diverse industries to global markets. Leading India's growth trajectory, the state blends a rich legacy of business excellence with infrastructure that's ready for the future.

World-Class Connectivity

- 49 ports, 19 airports including 4 international
- India's largest airport coming up in Dholera
- 2700 km gas grid & Narmada Canal water grid
- India's first high-speed rail project connecting the mega cities of Ahmedabad and Mumbai

Plug-and-Play Parks for Growth

- PM MITRA Textile Park - Navsari
- Bulk Drug Park - Bharuch
- Medical Devices Park - Rajkot
- Ceramic Park - Morbi
- Vehicle Scrappage and Recycling Park - Bhavnagar
- Agro Food Parks - Banaskantha and Rajkot
- Sea Food Parks - Valsad and Porbandar
- Tribal Parks at 8 Locations

Industrial Hubs and Mega Projects

- **GIFT City:** India's first International Financial Services Centre (IFSC), a global financial hub
- **DREAM City:** Dedicated to diamond trading and allied industries
- **Dholera Special Investment Region (SIR):** A global manufacturing and trading hub with world-class facilities
- **Surat Economic Region:** Promoting the service economy by creating world-class trading hubs for readymade apparels and jewellery, and developing new growth avenues in tourism, real estate and agriculture sectors
- **Petroleum, Chemicals, and Petrochemicals Investment Region (PCPIR):** Focused on fostering growth in the chemical & petrochemical sectors
- **Semiconductor Ecosystem:** Sanand GIDC and Dholera are being developed as key hubs for semiconductor manufacturing
- **Mandal Becharaji SIR (MBSIR):** Poised to be the world's largest automobile hub
- **200+ GIDC estates** spread across the state

Invest in Gujarat, Where the World Comes to Prosper

నేను కొడితే.. వట్టిగ ఉండదు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. చిత్రంలో ఆ పార్టీ నేతలు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, జీవన్‌రెడ్డి, చింతా రామ్మోహన్‌రెడ్డి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

హక్కుల కోసం తెగించి కొట్లాడాల్సింది బీఆర్‌ఎస్ అనే విషయంలో రెండో మాటే లేదు. ప్రత్యక్ష ప్రజా పోరాటాలు లేవదీసైనా సరే ప్రాజెక్టులు, నీళ్లు సాధించుకోవాలి. అవసరమైన సందర్భంలో నేను, జిల్లా నాయకులు ఇచ్చే పిలుపునకు స్పందించి ప్రజలకు జరిగే అన్యాయాలపై ఎదురు తిరిగి కొట్లాడాలి. తెలంగాణ కోసమే బయలుదేరిన గులాబీ జెండా తెలంగాణను సాధించి దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టింది.

కాంగ్రెస్ మోసాలకు బలయ్యారు..

ఇన్నాళ్లు కోటి రూపాయలు పలికిన భూమిని ఇప్పుడు రూ.50లక్షలకు కొనే పరిస్థితి లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మార్చి వరకు రూ.15వేల కోట్ల ఆదాయం తగ్గుతోందని కాగ్ రిపోర్టు చెబుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా ఆదాయంలో రూ.15 వేల కోట్ల వృద్ధిని సాధించింది. ఇప్పుడు మరో నాలుగైదు నెలల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడమే కష్టమనే పరిస్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉంది. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వలేని విధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారు. మనం ప్రాజెక్టులు, చెరువుల కింద నీటి తీరువా రద్దు చేసి రైతులకు ఎన్నో సదుపాయాలు కల్పించాం. కానీ కొన్ని నియోజకవర్గాల్లో అత్యాశకు పోయి ఓట్లేసి బావిలో పడ్డారు. మంది మాటలు పట్టుకుని మార్వాణం పోతే మళ్లీ వచ్చేసరికి ఇల్లు ఆగమైందన్నట్టు పరిస్థితి తయారైంది. తులం బంగారం ఇస్తామంటే నమ్మి ఓటేస్తే ఏమవుతుందో తెలంగాణలో మంచి గుణపాఠం అయింది. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్టు కాంగ్రెస్ మోసాలకు బలయ్యారు.

ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతున్నరు..

రైతుబంధుతో వ్యవసాయం మెరుగై అప్పులు తీర్చుకుని, చిట్టీలు వేసుకునే పరిస్థితి వచ్చింది. ఇప్పుడా సంతోషం మంటగలిసింది. వాళ్లు ఎన్నికల సమయంలో ఇస్తరో ఎప్పుడు ఇస్తరో దేవుడికే ఎరుక. కరోనా సమయంలో మేం రైతుబంధు ఇచ్చి రైతులను కాపాడుకున్నాం. కాంగ్రెస్ పార్టీ ముస్లింల ఓట్లు వేయించుకుని వారి బాగోగులను పట్టించుకోవడం లేదు. మనం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు కాన్వెంట్ విద్య అందిస్తే.. ఇప్పుడు పిల్లలు విషాహారం, పురుగుల అన్నం, కడుపునొప్పితో ఇంటి బాట పడుతున్నరు. కాంగ్రెస్ పాలన లోపాలను ప్రశ్నిస్తే పోలీసు స్టేషన్లకు పట్టిస్తున్నారు. ఏడాది పాలనతోనే కాంగ్రెస్ వాళ్లు దొరికితే కొడతం అన్నట్లుగా జనం ఉన్నరు.

ఫామ్‌హౌజ్‌కు వస్తే పార పట్టొచ్చు

వాళ్ల పార్టీ నిన్న ఒక పోలింగ్ పెట్టింది. అందులో 70శాతం మనకు, 30శాతం వాళ్లకు వచ్చింది. ఫామ్ హౌజ్ అంటే ఇక్కడ వరి, మక్కలు, అల్లం తప్ప ఏముంటది. కాంగ్రెస్ వాళ్లు వస్తే తలాకొంత సేపు పారపట్టి పనిచేయచ్చు. ఫామ్‌హౌజ్ అని బదనాం చేసి అధికారంలోకి వచ్చారు. ఏడాదిలోనే కాంగ్రెస్ పాలనకు విసిగి మళ్లీ మనమే రావాలని ప్రజలు వందశాతం కోరుకుంటున్నరు. కచ్చితంగా రాబోయే ప్రభుత్వం మనదే..'' అని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

రైతులను సమీకరించి ఉద్యమం

జహీరాబాద్ నియోజకవర్గంలో సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసినా.. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులు నిలిపివేసి రైతులను ఇబ్బందులు పెడుతోందని కేసీఆర్ మండిపడ్డారు. రైతులకు నష్టం జరుగుతుంటే ఆ జిల్లా మంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. దీనిపై రైతులను భారీ స్థాయిలో సమీకరించి ఉద్యమం చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు కేసీఆర్ సూచించారు. పాదయాత్రగా ఎర్రవల్లికి వచ్చిన మాజీ సర్పంచులు పరమేశ్వర్ పాటిల్, బోయిని చంద్రయ్య, పార్టీ నేతలు సంగమేశ్వర్, ప్రశాంత్ తదితరులు కేసీఆర్‌ను సత్కరించి కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ ప్రసాదం అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు.. సభకు హాజరైన ప్రజలు

దమ్ముంటే అసెంబ్లీకి రా.. తేల్చుకుందాం

▶ మొదటి పేజీ తరువాయి

గొప్పలు చెప్పుకొంటున్నారు. సల్మాన్‌ఖాన్‌కు రాఖీ సావంత్‌కు మధ్య పోటీపెడితే ఎక్కువ లైకులు రాఖీ సావంత్‌కే వచ్చాయి. అంత మాత్రన సల్మాన్‌ఖాన్ గొప్పవాడు కాకుండా పోతాడా?

ఆయన ఆరోగ్య పరిస్థితి బాగులేదు

కేసీఆర్ మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఆయన కుటుంబ సభ్యులు యమకింకరులై తిరుగుతున్నారు. ఫామ్‌హౌస్‌లో పడుకుని సోది చెప్పుకోవడం కాదు. అసెంబ్లీకి రా.. అన్ని లెక్కలు వివరిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను అభినందించడానికి మనసు రాకపోతే ఫామ్‌హౌస్‌లోనే పడుకో. పాలమూరు, జూరాల ఎత్తిపోతల, కోయిల్‌సాగర్ కడతానని హామీ ఇచ్చి.. ప్రజలను మోసం చేశావు. నువ్వు ఎన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు నిన్ను నమ్మే పరిస్థితిలో లేరు.

ఏడాదిలో ఎన్నో చేశాం..

మా ఏడాది పాలనలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలు భర్తీ చేశాం. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు ఇస్తున్నాం. భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నగదు అందజేస్తున్నాం, రైతును రాజును చేస్తున్నాం.

ప్రభుత్వ విద్యకు బడ్జెట్ 15 శాతానికి పెంచుతాం

దివంగత వైఎస్సార్ పాలనలో జిల్లాకో యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. అనేక ప్రభుత్వ పాఠశాలలను నెలకొల్పాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైంది. ఉస్మానియా, కాకతీయ వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయి. అవి ప్రతిష్టను కోల్పోయే పరిస్థితికి దిగజార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం. బడ్జెట్‌లో ఏడు శాతం నిధులు కేటాయించాం. తండాలు, మారుమూల గ్రామాల్లో మూసివేసిన అనేక పాఠశాలలను పునఃప్రారంభించాం. 11 వేల కొత్త ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. భవిష్యత్తులో విద్యకు బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలని నిర్ణయించాం.

స్టాన్‌ఫర్డ్ వర్సిటీతో ఎంఓయూకు యత్నం

మహాత్మాగాంధీ నడిపిన యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు 'యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నాం. రూ.2,400 కోట్లతో 75 ఐటీఐలను ఆధునీకరించాం. టాటా కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. సింగపూర్ నుంచి నిపుణులను ఇక్కడికి రప్పించి, నిరుద్యోగులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ వర్సిటీతో ఎంఓయూ కోసం ప్రయతిస్తున్నాం. కేవలం చదువుకున్నవారికే కాదు ఆటల్లో రాణిస్తున్నవారికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగంతోపాటు రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించాం. పెద్దగా చదువు లేని సిరాజుద్దీన్ సహా దీప్తికి గ్రూప్–2 ఉద్యోగం, ఆర్థిక సాయం, ఇంటి స్థలం ఇచ్చి ప్రోత్సహించాం..'' అని సీఎం రేవంత్ తెలిపారు.

ప్రభుత్వ టీచర్లు ఆత్మ విమర్శ చేసుకోవాలి.

విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమై ఉంది. రాష్ట్రంలో 12వేల ప్రైవేటు పాఠశాలల్లో 31లక్షల విద్యార్థులు చదువుతుంటే.. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది చదువుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. ప్రభుత్వ విద్య ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది. మట్టిలో మాణిక్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు స్థానికంగా నివాసం ఉండాలి. విద్యార్థులను ప్రోత్సహించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో డిగ్రీలు, పట్టాలు ఉంటే సరిపోదు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే మార్కులు, డిగ్రీలేకాదు.. సాంకేతిక నైపుణ్యం కూడా తోడవాలి. అప్పుడే కోరిన ఉద్యోగం దొరుకుతుంది.

మొగిలిగిద్దకు రూ.16 కోట్లు

మొగిలిగిద్ద పాఠశాల తెలంగాణకే వన్నె తెచ్చిందని, ఇక్కడ చదువుకున్న వారిలో ఇద్దరు సీఎంలు, గవర్నర్, మాజీ మంత్రి, ప్రొఫెసర్ సహా అనేక మంది ఉన్నారని సీఎం గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రక స్కూలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. మొగిలిగిద్దలో పాఠశాల భవనం, గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల కోసం రూ.16 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడి విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్'ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ బహిరంగ సభలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్ నువ్వు కొట్టేదేంది.. మేమే దట్టి కొడతాం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ నువ్వు కొట్టేదేంది. మేమే నిన్ను దట్టి కొడతాం' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హెచ్చరించారు. తులం బంగారానికి ఆశపడి ఓటేశారని తెలంగాణ మహిళలను కించపరిచిన కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ 5 లక్షల మందితో సభ పెడితే.. తాము 5.1 లక్షల మందితో సభ పెడతామన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కౌశిక్‌తో కలిసి జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'నీకు ఓటేస్తే సరే.. లేదంటే జీర్ణించుకోలేక శాపనార్థాలు పెడతావా? 14 నెలల తర్వాత ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ బయట ప్రపంచానికి కనిపించే ప్రయత్నం చేసినట్లుంది. పదేళ్లలో కేసీఆర్ ఎన్ని రోజులు సెక్రటేరియట్‌లో కూర్చున్నారో చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఏడాది కాలంలో సెక్రటేరియట్‌లో 200 సమీక్షలు చేశారు. కేసీఆర్ ఎంత రుణమాఫీ చేశాడో.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఎంత చేశామో కేసీఆర్, రేవంత్‌రెడ్డిని ముఖాముఖి కూర్చోపెడతాం. దీనికి కేసీఆర్ సిద్ధమా?'అని జగ్గారెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ సీఎంగా ఉంటేనే అసెంబ్లీకి వస్తారా? ప్రతిపక్ష నాయకుడిగా ఉంటే అసెంబ్లీకి రారా అని ప్రశ్నించారు.

కేసీఆర్, హరీశ్‌కు మరోసారి ఊరట

భూపాలపల్లి కోర్టు విచారణపై హైకోర్టు స్టే పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో నమోదైన ప్రైవేట్ పిటిషన్‌లో మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో మరోసారి ఊరట దక్కింది. ప్రైవేట్ పిటిషన్‌కు నంబర్ చేయాలని జూలై 10న సెషన్స్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల నిలుపుదలను పొడిగించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో తమను ప్రతివాదులుగా చేరుస్తూ రామలింగమూర్తి దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్ విచారణార్హం కాదని, కొట్టివేయాలని కేసీఆర్, హరీశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రైవేట్ వ్యక్తి పిటిషన్ (ఫిర్యాదు)పై విచారణ జరిపే అధికార పరిధి సెషన్స్ జడ్జికి లేదన్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ మున్సిఫ్ మేజిస్ట్రేట్ తొలుత పిటిషన్‌ను కొట్టివేశారని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు, ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రైవేట్ పిటిషన్ విచారణపై స్టేను పొడిగిస్తూ, విచారణ వాయిదా వేశారు.

ప్రాజెక్టులకు మధ్యంతర నిధులు

- బడ్జెట్ నిధులతో నిమిత్తం లేకుండా, పనుల వేగాన్ని బేరీజు వేసుకుంటూ..
- కేటాయింపులో కొత్త విధానం అవలంబిస్తున్న కేంద్రం
- అలా ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు అదనంగా రూ.1,350 కోట్లు
- ఈసారీ అలాగే చేస్తుందని అంచనా



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులతో ప్రమేయం లేకుండా, పనుల వేగాన్ని బేరీజు వేసుకుంటూ కేంద్రం అప్పటికప్పుడు నిధులు కేటాయిస్తోంది. ఈసారి కూడా అదే పంథాను అవలంబించే అవకాశం కనిపిస్తోంది. బడ్జెట్‌లో కొత్త రైళ్ల ప్రకటనపై అంతగా దృష్టి సారించని కేంద్రం, కొత్త లైన్లను పూర్తి చేయడానికే ప్రాధాన్యమిస్తోంది. కొత్త రైళ్లను మాత్రం వీలు చిక్కినప్పుడు ప్రారంభిస్తోంది. గత బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను ఆ తర్వాత ఉన్న ఫళంగా పెంచింది. దీంతో ఆ ప్రాజెక్టుల్లో పనులు వేగంగా జరిగేందుకు అవకాశం చిక్కింది. గత బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.14,232.84 కోట్లు కేటాయించగా, ఆ తర్వాత కొన్ని ప్రాజెక్టుల నిధులను పెంచింది. అలా జోన్‌కు అదనంగా రూ.1350.26 కోట్ల మేర నిధులు అందాయి. ముఖ్యంగా, అతి కీలక మూడో లైన్ నిర్మాణ పనులకు కేటాయింపులు పెంచింది. కాజీపేట–బల్లార్షా పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. కాజీపేట–విజయవాడ మూడోలైన్ పనుల్లో దాదాపు 100 కి.మీ. పనులు చేయాల్సి ఉంది. వీటి వేగం పెంచటం ద్వారా, ఆ మార్గంలో రైళ్ల సంఖ్యను పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు దానికి రూ.190 కోట్లను అదనంగా కేటాయించింది. బడ్జెట్‌లో రూ.310 కోట్లు ప్రతిపాదించగా, ఆ తర్వాత దాన్ని రూ.500 కోట్లకు పెంచింది. ఫలితంగా ఈ ఏడాది కాలంలో ఏకంగా 60 కి.మీ. మేర మూడో లైన్ పనులు పూర్తయ్యాయి. ఇందులో 40 కి.మీ.కు సంబంధించి రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ పూర్తి చేసి పచ్చజెండా ఊపటంతో అంతమేర ట్రాక్‌పై రైళ్లను కూడా తిప్పుతున్నారు. మిగతా 20 కి.మీ. పనులకు సంబంధించి సేఫ్టీ కమిషనర్ తనిఖీ జరగాల్సి ఉంది.

ఈసారి కేటాయింపులు వేటికి?

డోన్–అకోలా డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా మన రాష్ట్రంలో నిజామాబాద్ నుంచి మహబూబ్‌నగర్ మీదుగా డోన్ వరకు రెండో లైన్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తికాగా, మిగతా ప్రాంతాల్లో జరుగుతున్నాయి. గత బడ్జెట్‌లో ఈ పనులకు రూ.220 కోట్లు ప్రతిపాదించగా, తర్వాత దాన్ని ఏకంగా రూ.550 కోట్లకు పెంచారు. దీంతో గత ఏడాది కాలంలో 45 కి.మీ. డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఇటీవల జరిగిన ఎంపీల సమావేశంలో వికారాబాద్–కృష్ణా లైన్‌పై విన్నపాలు వచ్చాయి. దీనికి ఈసారి కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. సికింద్రాబాద్–కాజీపేట మూడో లైన్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశముంది. రామగుండం–మణుగూరు, సికింద్రాబాద్–వాడీ మూడు, నాలుగు లైన్లకు నిధులు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు.

నీళ్లపై రేవంత్ సర్కారు నీచ రాజకీయం

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత
- కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదన గట్టిగా వినిపించాలి
- ఆదిత్యానాథ్ దాస్‌ను సలహాదారు పదవి నుంచి తొలగించాలి
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'నీళ్లు – నిజాలు'రౌండ్ టేబుల్ సమావేశం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: సాగు నీటి విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నీటి విషయంలో ప్రజలకు వాస్తవాలు వివరించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని అన్నారు. శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'నీళ్లు – నిజాలు' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. 'రేవంత్ పాలన దారితప్పిన మిసైల్‌ను తలపిస్తోంది. నదీ జలాలను అక్రమంగా తరలిస్తున్న ఆంధ్ర పాలకులే తెలంగాణకు నిజమైన శత్రువులని రేవంత్ గుర్తించాలి. కృష్ణా ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించడంతో పాటు, ఆంధ్రకేడర్‌లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్‌ను సలహాదారు బాధ్యతల నుంచి తొలగించాలి'అని కవిత డిమాండ్ చేశారు. 'బనకచర్ల ద్వారా గోదావరి జలాల తరలింపు, నాగార్జునసాగర్ వద్ద కేంద్ర బలగాల మోహరింపులో కాంగ్రెస్, టీడీపీకి బీజేపీ కూడా తోడవుతోంది. ఇతర రాష్ట్రాల్లో జల వనరుల విషయంలో పార్టీలన్నీ ఏకతాటిపైకి వస్తుండగా ఇక్కడ మాత్రం కాంగ్రెస్, బీజేపీ రాజకీయం చేస్తున్నాయి'అని కవిత మండిపడ్డారు. కాగా, కాళేశ్వరం మూడో టీఎంసీ తరలింపు పనులు చేపట్టకపోతే గోదావరి జలాల్లో మనం శాశ్వత వాటా కోల్పోతామని జల వనరుల నిపుణుడు వి.ప్రకాశ్ స్పష్టం చేశారు. 'తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు చేపడితే 63 టీఎంసీల మేర ఎగువ రాష్ట్రాలకు నీటి హక్కు ఉంటుందని సీడబ్ల్యూసీ చెప్పింది. అందుకే మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును నిర్మించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేవు'అని నీటిపారుదల రంగ నిపుణుడు శ్రీధర్ దేశ్‌పాండే అన్నారు. ఇదిలా ఉండగా గోదావరి – మూసీ ప్రాజెక్టును మల్లన్నసాగర్ నీటితో కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నీటితో చేపట్టాలని, నాగార్జునసాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావాలని, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ సమావేశం తీర్మానించింది.

10లోగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

లేదంటే కార్యాచరణ ప్రకటిస్తాం: టి.రాజయ్య

సాక్షి, హైదరాబాద్: ఈనెల 10వ తేదీలోగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే బీఆర్‌ఎస్ తరఫున కార్యాచరణ ప్రకటిస్తామని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గువ్వల బాలరాజు, చిరుమర్తి లింగయ్య, డాక్టర్ మెతుకు ఆనంద్, సుంకె రవిశంకర్, పార్టీ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తీర్పు వచ్చిన రోజే సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని, మాదిగల వల్లే తాను రాజకీయంగా ఎదిగానని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం కాంగ్రెస్‌కు అలవాటేనని, రేవంత్ మంత్రివర్గంలో మాదిగలకు చోటులేదని, నామినేటెడ్ పోస్టుల్లో కూడా మాదిగలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కొప్పుల రాజు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని, వారిని కాదని వర్గీకరణ చేస్తే తన పదవి ఊడుతుందని రేవంత్ రెడ్డి భయపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వర్గీకరణకు అనుకూలంగా ఉంటే వివేక్ వ్యతిరేక సభ ఎలా పెడతారని ప్రశ్నించారు.

కేసీఆర్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు

- ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో మార్పు రాలేదు
- ప్రజలు ఫామ్ హౌస్ పాలన కాదు.. ప్రజా పాలన కోరుకుంటున్నారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్నిసార్లు సవాలు విసిరినా స్పందించకుండా ఫామ్‌హౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో మార్పు రాలేదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మరోసారి భంగపాటు తప్పదని శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బీఆర్‌ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడటంతో, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైనందున ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూస్తే పట్టించుకోని కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో ఆయన దిక్కుతోచక మాట్లాడుతున్నారని, అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. ప్రజలు ఫామ్‌హౌస్ పాలన... గడీల పాలన కోరుకోవడం లేదని, ప్రజాపాలన.. ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపినా, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పగటి కలలు కంటున్నారని ఎద్దేవాచేశారు.

కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏడాది నుంచి అసెంబ్లీకే రాలేదు
- ప్రతిపక్ష నేత అంటే ప్రజల్లో తిరగాలి



సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరగాలి. ప్రజా సమస్యలు ప్రస్తావించాలి. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదు. ఫామ్‌హౌస్ దాటలేదు. అధికారంలో ఉన్ననాడు సచివాలయానికి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదు. ఇక కేసీఆర్ జీవితమంతా ఫామ్‌హౌసే'అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. తమ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయన్నారు. ప్రజా తీర్పును కేసీఆర్ అగౌరవ పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదివరకు నల్లగొండ, కరీంనగర్ బీఆర్‌ఎస్ సభల్లో కూడా ఆయన ఇదే తరహాలో గంభీరంగా ప్రకటనలు చేశారని.. ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందేనని ఎద్దేవా చేశారు. 'ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి, తన ఉనికిని చాటుకోవడానికి పిట్టల దొర మాదిరిగా మాట్లాడుతున్నారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌస్‌లో కూర్చొని మాట్లాడటం కాదు. ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నాం. అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే ఆహ్వానించారు. 80 వేల పుస్తకాలు చదివానన్నారు. మీ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదు?'అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

నేను కొడితే.. నీ పార్టీ ఉండదు, ఫామ్‌హౌస్ ఉండదు

కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శ



నల్లగొండ: 'పది సంవత్సరాలు మాటలతోనే పాలన సాగించావు. మొదటి నుంచి నీవన్నీ అబద్ధాలే. అసెంబ్లీకి రా చూసుకుందాం. పదేళ్లు మీరేం చేశారో.. సంవత్సరంలోనే మేం ఏం చేశామో చూపిస్తాం'అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. శుక్రవారం నల్లగొండలో కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. 41 కిలోలు ఉన్న నువ్వు కొడితేనే మామూలుగా ఉండదంటే...82 కిలోలు ఉన్న నేను కొడితే నీ పార్టీ ఉండదు. నీ ఫామ్‌హౌస్ కూడా ఉండదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హయాంలో నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులను పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసుకొని పనులు పూర్తి చేయించుకుంటున్నామని చెప్పారు. నల్లగొండను దత్తత తీసుకున్న కేసీఆర్ ఏ ఒక్క పనికూడా చేయలేదని విమర్శించారు. 'కేసీఆర్.. నీవు ఏం చేస్తావ్.. పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బకొడితే మూడో స్థానంలో పడిపోయావ్, ఏడింట్లో డిపాజిట్ కూడా రాలేదు అని కోమటిరెడ్డి అన్నారు.

తెలంగాణలో కేటీఆర్ పాత్ర లేదు....

'కేటీఆర్ మొన్న నల్లగొండకు వచ్చి.. వాడు వీడు అని మాట్లాడాడు. నేను గతంలోనే చెప్పా. కేటీఆర్ నువ్వు బచ్చా. మీ అయ్యను రమ్మని చెప్పా రాలేదు. పదేళ్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీకి నీవుగానీ, అప్పటి జిల్లా మంత్రి గానీ పోలేదు. ఇయ్యాల మాట్లాడే హక్కు నీకు లేదు. మీరు నా కాలిబొటన వేలుతో సమానమని గాంధీభవన్‌లో చెప్పాను'అని అన్నారు.

పంచాయతీ ఎన్నికలతో కేసీఆర్ బయటికొచ్చాడు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ఇన్ని రోజులు కుంభకర్ణుడిలా ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు వస్తుండటంతో బయటకొచ్చాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి దెబ్బకు కేసీఆర్ మైండ్ బ్లాక్ అయి ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యాడని, కొంగర మల్లయ్య సామెత లాగా కేసీఆర్ మాట్లాడుతున్నాడని ఎద్దేవాచేశారు. పదేళ్లు కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలన చేస్తే.. ఇందిరమ్మ రాష్ట్రంలో తాము ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మిగిల్చాడని శ్రీనివాస్ మండిపడ్డారు. కాంగ్రెస్ స్కిల్ ఇండియా, స్పోర్ట్స్ యూనివర్సిటీని నడిపిస్తుంటే.. బీఆర్‌ఎస్ దుబాయ్ వేదికగా విద్వేషపు వాట్సాప్ యూనివర్సిటీని నడిపిస్తోందని ఆరోపించారు.



సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్

సైబరాబాద్‌లో వాహనదారులకు సరికొత్త వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. 'సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్' సేవలను కమిషనర్ అవినాష్ మహంతి ప్రారంభించారు. -10లో



హైటెక్స్‌లో.. పెటెక్స్..

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కిడ్స్‌ఫెయిర్, కిడ్స్ బిజినెస్ కార్నివాల్ శుక్రవారం ప్రారంభమైంది. - సిటీప్లస్‌లో


వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/18.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పూట పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఉత్తమ పనితీరుకు గుర్తింపు

నగర కమిషనరేట్‌లో 706 మందికి రివార్డులు



మాట్లాడుతున్న కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ పనితీరును కనబర్చిన నగర పోలీసు అధికారులకు కొత్వాల్ సీవీ ఆనంద్ రివార్డులు అందించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ ఐసీసీసీ) జరిగిన కార్యక్రమంలో 706 మంది అధికారులు, సిబ్బందికి వీటిని అందించారు. వీరిలో ఆరుగురు అదనపు డీసీపీలు, 13 మంది ఏసీపీలు, 73 మంది ఇన్‌స్పెక్టర్లు, 83 మంది ఎస్సైలు, 12 మంది ఏఎస్సైలు, 86 మంది హెడ్-కానిస్టేబుళ్లు, 334 మంది కానిస్టేబుళ్లు, 29 మంది హోంగార్డులతో పాటు 64 మంది మినిస్టీరియల్ సిబ్బంది, ఆరుగురు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఉత్తమ దర్యాప్తు బృందంగా సీసీఎస్‌లో పని చేసే ఏసీపీ వై హరీష్ కుమార్, టీమ్-1 ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు, ఎస్సైలు ఎస్.రవి కుమార్, బి.జయంత్‌లు కమీషనర్ ట్రోఫీ గెల్చుకున్నారు. సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్ రావు, ఎస్సైలు కె.వెంకటేష్, సీహెచ్ మహిపాల్, ఎ.మాధవిలకు ఈ ట్రోఫీ లభించింది. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషిని సీపీ అభినందించారు.


కోడిలా వేలాడమన్నాడని స్నేహితుడినే చంపేశాడు!

- గత నెల 16 ఢిల్లీలోని తిమర్‌పూర్‌లో ఘటన
- ఫలక్‌నుమాలో తలదాచుకున్న ఇద్దరు నిందితుల పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: సెల్‌ఫోన్ విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన వివాదం చివరకు హత్యకు దారి తీసింది. గత నెల 16 ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా.. నగరంలోని ఫలక్‌నుమాలో తలదాచుకున్న ఈ కేసులోని ఇద్దరు నిందితులను శుక్రవారం ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి అక్కడికి తీసుకెళ్లారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని సోనియా విహార్ ప్రాంతానికి చెందిన సోహైల్, షంషుద్దీన్ స్నేహితులు. షంషుద్దీన్ చికెన్ షాపులో పని చేస్తుండగా.. సోహైల్ మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. షంషుద్దీన్ తన వద్ద ఉన్న పాత సెల్‌ఫోన్‌ను విక్రయించాలంటూ సోహైల్‌కు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా సెల్‌ఫోన్ గాని.. విక్రయించగా వచ్చిన సొమ్ము గాని షంషుద్దీన్‌కు చేరలేదు. దీంతో వీరి మధ్య వివాదం నెలకొంది. షంషుద్దీన్ గత నెల 14న సోహైల్‌తో గొడవపడి భయపెట్టాడు. తాను పని చేస్తున్న చికెన్ షాపులో కోళ్ల వేలాడుతున్న తరహాలో ఓ చెట్టుకు వేలాడాలని హెచ్చరించాడు. కోడిలా వేలాడిన సోహైల్‌ను వీడియో తీసిన షంషుద్దీన్.. 48 గంటల్లో తన ఫోన్ తిరిగి ఇవ్వకపోతే దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో అహం దెబ్బతిన్న సోహైల్.. షంషుద్దీన్ ఇచ్చిన 48 గంటల సమయంలోనే అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. తన స్నేహితుడైన మహ్మద్ అన్స్‌తో కలిసి గత నెల 16న షంషుద్దీన్‌ను మద్యం తాగుదామంటూ పిలిపించారు. తిమర్‌పూర్ శ్మశాన వాటిక ప్రాంతంలో షంషుద్దీన్‌తో పూటుగా మద్యం తాగించి బండరాళ్లతో కొట్టి చంపి ఇరువురూ కలిసి హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. 19న రాత్రి తిమర్‌పూర్ ఏరియాలో ఢిల్లీ పోలీసులు షంషుద్దీన్ మృతదేహం గుర్తించారు. ఏసీపీ నీవర్ పటేల్ నేతృత్వంలోని బృందం సాంకేతిక ఆధారాలను సేకరించింది. ఇద్దరు నిందితులు హైదరాబాద్ నగరంలోని ఫలక్‌నుమాలో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం మధ్యాహ్నం పట్టుకుంది. ఢిల్లీ కోర్టులో హాజరుపరచనుంది.

ఈ పొద్దు.. ఆశల పద్దు!

ఎంఎంటీఎస్ కొత్త రైళ్లకు కేటాయింపులుండేనా..



భాగ్య నగరాన్ని కేంద్రం కరుణించేనా?

- మూసీ పునరుజ్జీవానికి సాయంపై ఎదురుచూపులు
- ఐటీ రంగాన్ని ఆదుకునేలా చర్యలు ఉంటాయా..
- బల్దియా కోరిన రూ.10 వేల కోట్లు అందేనా..
- జలమండలికి దన్ను దక్కేనా..
- నిర్మలమ్మ బడ్జెట్‌లో నిధులెన్ని వచ్చేనో..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై మహా నగరం ఆశలు పెట్టుకుంది. మౌలిక వసతులు, ఇతర రంగాలకు ప్రాధాన్యం ఉంటుందని, నిధుల కేటాయింపులు ఉంటాయని నగర వాసులు ఎదురుచూస్తున్నారు. ఎంఎంటీఎస్ కొత్త రైళ్లతో పాటు చర్లపల్లి టెర్మినల్ నుంచి పూర్తి స్థాయిలో నగరంలోని అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ, పుణ్య క్షేత్రాలకు మరిన్ని రైళ్లను అందుబాటులోకి తెస్తారని ఆశిస్తున్నారు. మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు కేటాయించాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి అనుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నారు. విశ్వ నగరిగా విస్తరిస్తున్న భాగ్యనగరంలో ఐటీ రంగానికి మరింత బూస్ట్ ఇచ్చేలా కేంద్రం కరుణిస్తుందని, బల్దియా పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పెద్దపీట వేస్తారని అంతా ఆశాభావంతో ఉన్నారు. -సాక్షి, సిటీబ్యూరో

బల్దియాను ఆదుకునేనా?

కేంద్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి ఏ మేరకు కేటాయింపులుంటాయోనన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నగరంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్న జీహెచ్‌ఎంసీ పలు కార్యక్రమాలకు కేంద్రంపై ఆశలు పెంచుకుంది. గృహ నిర్మాణానికి పీఎంఏవై నిధులతోపాటు ఫ్లై ఓవర్లు, రహదారుల అభివృద్ధి, వరద సమస్యల పరిష్కారం, విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం తదితరాల కోసం రూ. 10 వేల కోట్లకు పైగా కేంద్రాన్ని కోరింది. వరద ముంపు సమస్యల పరిష్కారంతో పాటు చెత్త సమస్య పరిష్కారానికి నిధులు అడిగింది. హైదరాబాద్ వారసత్వాన్ని పరిరక్షించేందుకు పురాతన కట్టడాల పరిరక్షణ తదితరమైన వాటి కోసం కోరింది. రోజురోజుకూ పరిధి పెరుగుతూ, విస్తృతమవుతున్న జనాభాకనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులవసరముంది. బల్దియా కోరికల్లో ఎన్నింటికి నిధులిస్తారోనని జీహెచ్‌ఎంసీ వర్గాలు వేచి చూస్తున్నాయి.

కొత్త రైళ్లకు పచ్చజెండా ఊపేనా?

సాక్షి, సిటీబ్యూరో: రెండో దశలో భాగంగా అటు మేడ్చల్ నుంచి ఇటు ఉందానగర్ వరకు. ఘట్కేసర్ నుంచి తెల్లాపూర్ వరకు ఎంఎంటీఎస్ లైన్‌లు పూర్తయ్యాయి. నాంపల్లి, సికింద్రాబాద్ స్టేషన్‌ల నుంచి ప్రయాణికులు ఎక్కడికైనా అతి తక్కువ చార్జీలతో రాకపోకలు సాగించే సదుపాయం ఉంది. ప్రయాణికుల డిమాండ్ మేరకు రైళ్లు లేకుండాపోయాయి. కొత్త లైన్‌లతో పాటు 9 బోగీలతో కూడిన కొత్త ఎంఎంటీఎస్ రైళ్లను కూడా కొనుగోలు చేయాలనే ప్రతిపాదన ఉంది. కానీ ఇప్పటి వరకు ఒక్క రైలు కూడా కొనుగోలు చేయలేదు. దీంతో ఉన్న రైళ్లనే వివిధ ప్రాంతాల మధ్య నడుపుతున్నారు.

చర్లపల్లికి ఏదీ కనెక్టివిటీ..

మార్చి నుంచి పలు రెగ్యులర్ రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. చర్లపల్లి టెర్మినల్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా పునరభివృద్ధి చేసి ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి కనెక్టివిటీ లేదు. ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి చర్లపల్లికి చేరుకొనేలా ఎంఎంటీఎస్ సేవలను పెంచాలి. కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ స్టేషన్‌లతో పాటు నగరంలోని ఏ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచైనా బయలుదేరి చర్లపల్లికి వెళ్లేలా సర్వీసులను విస్తరించాల్సి ఉంది.

యాదాద్రి ఎంఎంటీఎస్ నత్తనడక...

గత ఏడాది బడ్జెట్‌లో యాదాద్రికి ఎంఎంటీఎస్ పొడిగింపునకు రూ.10 కోట్లు కేటాయించారు. కానీ రైల్వేశాఖ, రాష్ట్రప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, వనరులు, భూమి, తదితర మౌలిక సదుపాయాల కొరత వెంటాడుతోంది. ఘట్కేసర్ నుంచి రాయగిరి వరకు 33 కిలోమీటర్లు పొడిగించేందుకు 2015లో ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం రూ. 430 కోట్లతో అంచనాలు రూపొందించారు.కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ లభించలేదు. రైల్వేశాఖ ఇప్పటి వరకు రెండు దఫాలుగా రూ.60 కోట్లు మాత్రం కేటాయించింది. కానీ పనులు ప్రారంభించలేదు.

పుణ్యక్షేత్రాలకు వెళ్లేదెలా?

హైదరాబాద్ నుంచి అయోధ్య, షిరిడీ, శబరిమల తదితర పుణ్యక్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు రాకపోకలు సాగించే అనేక ప్రాంతాలకు డిమాండ్‌కు సరిపడా రైళ్లు లేకపోవడంతో ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలపై ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు ప్రత్యేక రైళ్లు ప్రకటిస్తే తప్ప రైలెక్కడం సాధ్యం కాదు. షిరిడీకి ప్రస్తుతం అజంతా ఎక్స్‌ప్రెస్ ఒక్కటే ఉంది. శబరిమలకు కూడా ఒక్క రైలే అందుబాటులో ఉంది. అయోధ్యకు వెళ్లేందుకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. పదేళ్లుగా రైళ్ల పెంపు లేకుండాపోయింది.



రైల్వే బ్రిడ్జిల అభివృద్ధికి రూ.500 కోట్లు కావాలి

కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఓవర్ బ్రిడ్జిలను అభివృద్ధి చేయటంతో పాటు రైల్వే క్రాసింగ్, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ తదితర పనులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని కోరుతూ స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. శనివారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈటల తన నియోజకవర్గ పరిధిలో రైల్వే అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలతో కూడిన నివేదికను అందజేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బోల్లారం నుంచి సికింద్రాబాద్ వరకు ఉన్న 12 అండర్, ఓవర్ సింగిల్ బ్రిడ్జిలను పెరుగుతున్న కాలనీలు,బస్తీలకు అనుగుణంగా.. మారుతున్న పట్టణీకరణకు తగ్గట్టుగా ట్రాఫిక్ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు డబుల్ బ్రిడ్జిలుగా అభివృద్ధి చేయాలని కేంద్రానికి సమర్పించిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. యాభై ఏళ్ల క్రితం నాటి రైల్వే క్రాసింగ్‌లు, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాని ఎంపీ ఈటల కోరారు. ఈ నేపథ్యంలోనే రైల్వే అభివృద్ధి పనులకు సుమారు రూ.500 కోట్ల నిధులు అవసరమవుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి సమాంతరంగా శివారు మేడ్చల్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు అమృత్ పథకంలో అత్యధిక నిధులు కేటాయిచాలని కోరారు.

ఆశల మూసీ



భాగ్యనగరానికి మణిహారమైన మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మూసీ శుద్ధి, వ్యర్థాలు, వరదల నియంత్రణ వ్యవస్థ, సుందరీకరణ, బృహత్ ప్రణాళిక రూపకల్పనలపై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) దృష్టి సారించింది. మూసీ పునరుజ్జీవానికి రూ.14,100 కోట్ల బడ్జెట్‌ను అవసరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు శనివారం కేంద్ర బడ్జెట్‌లో సహాయం అందుతుందని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూసీ నదికి పునరుజ్జీవం కల్పించడంతో పాటు పట్టణ నీటి నాణ్యతను మెరుగుపర్చడం, సుస్థిర ప్రగతిని సాధించేందుకు దశల వారీగా నిధులు కేటాయించాలని కోరారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా తొలిదశలో బాపూఘాట్, మీరాలం ట్యాంక్ వద్ద అభివృద్ధి పనులను చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. బాపూఘాట్ వద్ద రక్షణ శాఖకు చెందిన 220 ఎకరాల భూ సమీకరణతో పాటు రిజర్వాయర్, మురుగు నీటి అప్‌గ్రేడ్‌లు, మూసీ నదిపై హెరిటేజ్ వంతెనల నిర్మాణం తదితరాల వ్యయాలను బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరారు. మూసీని ఆదాయ వనరుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా పర్యాటకం, ఆతిథ్యం, స్థిరాస్తి రంగాల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) కింద నిధులను సమీకరించనున్నారు. మూసీ చుట్టూ ఉమ్మడి అభివృద్ధి ప్రాజెక్ట్‌లు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు స్పాన్సర్‌షిప్‌లు, పేర్ల హక్కులు, పర్యాటక కార్యకలాపాలతో ఆదాయ వనరులను సృష్టించనున్నారు.


ఐటీ బూస్ట్..

'సాఫ్ట్‌వేర్ ట్రయినింగ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పిలిచే హైదరాబాద్ ఐటీ రంగం బడ్జెట్‌పై కోటి ఆశలు పెట్టుకుంది. దేశీయ సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 31 శాతంఅ ఉంటుంది. ప్రధానంగా ఐటీ రంగం కేంద్రీకృతమైన హైదరాబాద్‌లో సుమారు 1,500లకు పైగా కంపెనీలలో 9 లక్షలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టాక గ్రేటర్‌లో నాల్గో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మించాలని సంకల్పించారు. ఇందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీతో పాటు ఐటీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తాజాగా కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఏఐ సిటీతో పాటు ఐటీ పార్క్‌లకు ప్రత్యేక కేటాయింపులు, పన్ను మినహాయింపులతో పాటు ఐటీ మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక కేటాయింపులు చేయాలని పరిశ్రమ నిపుణులు కోరుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ, ఐటీఈఎస్ ఎగుమతులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31తో ముగియనున్న సంవత్సరానికి తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.2.7 లక్షల కోట్లకు చేరుతాయని అంచనా వేశారు. మధ్య తరగతి జీతభత్యాలకు పన్ను మినహాయింపులతో కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్ కోసం పన్నులను హేతుబద్ధీకరించాలని, నైపుణాభివృద్ధికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఎంఎస్ఎంఈ రంగానికి దన్నుగా నిలిచేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి

జలమండలిపై దయ చూపేనా..

లక్డీకాపూల్: కేంద్ర బడ్జెట్‌పై జలమండలి ఆశలు పెట్టుకుంది. నలువైపులా విస్తరిస్తున్న మహా హైదరాబాద్ పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు కోసం సుమారు రూ.17,212.69 కోట్లు, మూసీ ప్రక్షాళనలో భాగంగా నదిలో మురుగు నీరు చేరకుండా ఇరువైపులా 55 కి.మీ (మొత్తం 110 కి.మీ) కాల్వల ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాల ప్రాజెక్టు నిర్మాణాల కోసం మరో రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించింది. ఈ రెండు పథకాలను అమృత్ పథకం- 2.0 కి చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది.





పెట్ డాగ్.. టిక్ ఫీవర్



- నగరంలో రోజూ పదుల సంఖ్యలో మరణాలు
- అస్వస్థతకు గురవుతున్న కుక్కలు, పిల్లులు ఇతర జీవాలు
- పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- నీరసంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచన

జ్వరం బారిన పడుతున్న పెంపుడు శునకాలు

నాంపల్లి: బంజారాహిల్స్‌కు చెందిన సంజయ్ దంపతులకు తమ పెంపుడు శునకాలంటే అమితమైన ప్రేమ. అవి కాసింత అస్వస్థతకు గురైనా వారు తల్లడిల్లిపోయే పరిస్థితి. తాము పెంచుకుంటున్న డాసియన్ బ్రీడ్ శునకాలు రెండు రోజులుగా అస్వస్థతకు గురయ్యాయి. అవి ఏ మాత్రం ముక్కను, ముద్దను ముట్టుకోవడం లేదు. దీంతో ఆ దంపతులు ఏమి చేయాలో దిక్కుతోని స్థితిలో సమీపంలోని విజయనగర్ కాలనీ శాంతినగర్ ప్రాథమిక పశు వైద్య కేంద్రానికి వాటిని తీసుకువచ్చారు. గచ్చిబౌలికి చెందిన రాకేష్ తాను అల్లారు ముద్దుగా పెంచుకునే హస్కీ బ్రీడ్ కుక్క పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇలా ప్రాథమిక పశు వైద్య కేంద్రానికి నగరం నలుమూలల నుంచి పెంపుడు శునకాలను అధిక సంఖ్యలో తీసుకువస్తున్నారు. సీతారామ్‌బాగ్‌లోని పాలీ క్లినిక్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ కేంద్రాలకు వచ్చే పెంపుడు కుక్కలు, పిల్లులను పరీక్షిస్తే వీటిలో అత్యధికంగా టిక్ ఫీవర్‌తో బాధపడుతున్నట్లుగా వైద్యులు నిర్ధారించారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు..

వాతారణంలో మార్పులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుదల వచ్చినప్పుడు, పాడైపోయిన మాంసం ముక్కలను స్వీకరించినప్పుడు, కుక్కలు ఒకదానికొకటి కరుచుకున్నప్పుడు బ్యాక్టీరియా సోకి టిక్ ఫీవర్‌కు గురవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇది రికెట్సియా రికెట్సీ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే ప్రాణాంతకమైన వ్యాధిగా చెబుతున్నారు. ఈ వ్యాధి బారినపడి నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు, పిల్లులు మృత్యువాత పడుతున్నాయి. కళ్లెదుటే పెంపుడు కుక్కలు చనిపోతుంటే జంతు ప్రేమికులు జీర్ణించుకోలేకపోతున్నారు. బాక్టీరియాతో పాటుగా చర్మ సంబంధ వ్యాధులు, కీళ్ల వాపులు కనిపిస్తే, కుక్క ఎక్కువగా దగ్గుతున్నా.. టిక్ ఫీవర్‌గా గుర్తించాలని వైద్యులు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యం చేస్తే వాటి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని శాంతినగర్‌లోని ఖైరతాబాద్ ప్రాథమిక పశు వైద్య కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. విజయ్‌కుమార్ పేర్కొన్నారు.



టిక్ ఫీవర్ లక్షణాలివీ..


టిక్ జ్వరం సోకిన పెంపుడు కుక్కల్లో సాధారణంగా వంద డిగ్రీలకు పైబడి ఫారన్‌హీట్ ఉండటం, వాంతులు, విరేచనాలు రావడం, నీరసించిపోవడం, ఆకలి బాగా తగ్గిపోవడం, నోటి నుంచి నీరు కారడం వంటివి కనిపిస్తాయి. ఈ లక్షణాలు కలిగిన కుక్కలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఈ జ్వరం కుక్కల్లో రెండు నుంచి మూడు వారాల పాటు ఉంటుంది. ఈ సమయంలో కుక్కలకు విశ్రాంతి చాలా అవసరం. ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పు పెంపుడు జంతువుల జీవక్రియపై ప్రభావాన్ని చూపుతాయి. వ్యాధి నిరోధక శక్తి జంతువుల్లో లేకుంటే జంతువులకు వచ్చే టిక్ ఫీవర్‌ను తట్టుకోవడం చాలా కష్టం. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యం చేయించినా ప్రయోజనం ఉండదు. వైద్యులు ఇచ్చే మందు ఆర్‌బీసీలోకి చేరే లోపే చనిపోతాయి. కాబట్టి పెంపుడు జంతువుల ఆరోగ్యంపై యజమానుల నిత్య పర్యవేక్షణ ఉండాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి.

శాంతినగర్ పశు వైద్య కేంద్రానికి శుక్రవారం మూగ ప్రాణులు ఇలా..	
కుక్కలు	130
పిల్లులు	120
మేకలు, గొర్రెలు	50
కోళ్లు	10
మృతి చెందిన కుక్కలు	10

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

కుక్కలు లేదా పిల్లుల షెల్టర్‌ను రోజూ శుభ్రం చేసుకోవాలి. చలికి తట్టుకునేలా షెల్టర్‌ను సరిచేసుకోవాలి. పాచిపోయిన మాంసం కుక్కలకు వేయొద్దు. ప్రతి రోజూ తాజా మాంసం ఇవ్వాలి. వాకింగ్ సమయంలో ఇతర కుక్కలు సంచరించిన ప్రదేశంలో తిరగకుండా చూసుకోవాలి. ఇంట్లో రెండుకు పైగా కుక్కలు ఉంటే వాటిని వేర్వేరుగా ఉంచాలి. రోజూ స్నానాలు చేయించకూడదు. నెలకు ఒకసారి, రెండుసార్లు స్నానాలు చేయిస్తే సరిపోతుంది. క్రమం తప్పకుండా నట్టల మందును ఇవ్వాలి. 60 రోజులకు ఒకసారి, 90 రోజులకు ఒకసారి వ్యాక్సినేషన్ ఇవ్వాలి. జ్వరం సోకిన కుక్కలను తాకిన మనుషులు శానిటేషన్ తప్పనిసరిగా ఉపయోగించాలి. ముక్కుకు మాస్క్‌ను ధరించి షెల్టర్ దగ్గరకు వెళ్లాలి. లేదంటే మనుషులకు ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ఊపిరితిత్తులపై ప్రభావం సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

మందులు బయటే కొనాల్సి వస్తోంది



శాంతినగర్‌లోని ఖైరతాబాద్ ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో చికిత్సలు బాగానే ఉన్నాయి. కానీ మందులు బయటే కొనాల్సి వస్తోంది. సూది కూడా బయటకే రాస్తున్నారు. ఇది పేరుకు ప్రభుత్వాస్పత్రే గాని ఎలాంటి మందులు ఇక్కడ ఇవ్వడం లేదు. చికిత్సలతో పాటు మందులను కూడా ఉచితంగా ఇస్తే బాగుంటుంది.

– సంజీవ్‌కుమార్, జూబ్లీహిల్స్

లాభాలు వస్తాయంటూ రూ.2 కోట్లు స్వాహా

రేషన్ బయో ప్రొడక్ట్స్ యజమానిపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: తన వ్యాపారంలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఎర వేసి, మోసం చేసిన ఆరోపణలపై రేషన్ బయో ప్రొడక్ట్స్ యజమాని కసవరాజుపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమాజిగూడకు చెందిన రిటైర్డ్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సుభాష్‌కు 2021లో కసవరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తన కంపెనీ రూ.100 కోట్ల టర్నోవర్‌తో ఉందని చెప్పిన కనకరాజు తన వద్ద పెట్టుబడి పెడితే భారీ లాభాలు ఇస్తానంటూ ఆశ చూపాడు. అతడి మాటలు నమ్మిన సుభాష్ దఫదఫాలుగా రూ.2 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించి సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. గతంలో కసవరాజు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయినట్లు ఫిర్యాదుదారుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతడు గతంలోనూ పలువురిని ఇలానే మోసం చేసినట్లు తెలిసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

11 మందికి రూ.1.37 కోట్లు రీఫండ్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన 11 మంది బాధితులకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రూ.1.37 కోట్లు రీఫండ్ చేయించారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసుకున్న అధికారులు నేరగాళ్ల బ్యాంకు ఖాతాలు గుర్తించారు. వాటిలో ఉన్న మొత్తాలను ఫ్రీజ్ చేసి, న్యాయస్థానం అనుమతితో రీ ఫండ్ చేయించారు. బాధితుల్లో ట్రేడింగ్, ఫెడెక్స్, జాబ్, కస్టమర్ కేర్ తదితర ఫ్రాడ్స్‌లో నష్టపోయిన వారు ఉన్నట్లు డీసీపీ దార కవిత శుక్రవారం పేర్కొన్నారు. మరోపక్క నగరానికి చెందిన ఓ గృహిణికి (50) వాట్సాప్ డీపీ ద్వారా టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు కాజేశారు. బాధితురాలి సోదరుడు అమెరికాలో ఉంటారు. ఈ విషయం గుర్తించిన సైబర్ నేరగాళ్లు ఓ వర్చువల్ నెంబర్ యాక్టివేట్ చేసుకున్నారు. దానికి వాట్సాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, బాధితురాలి సోదరుడి ఫొటోను డీపీగా పెట్టుకున్నారు. ఆ నెంబర్ నుంచి బాధితురాలికి ఆమె సోదరుడిగా సందేశం పంపారు. అత్యవసరం అంటూ పలు దఫాలుగా వివిధ బ్యాంకు ఖాతాల్లోకి రూ.2 లక్షలు బదిలీ చేయించుకున్నారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్

- వాహనదారులకు రియల్ టైం ట్రాఫిక్ సమాచారం
- మొబైల్‌కే ఎప్పటికప్పుడు ట్రాఫిక్ అప్‌డేట్స్
- రద్దీ, మళ్లింపులు, ప్రమాదాలు తదితర సేవలు
- ప్రారంభించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లో వాహనదారులకు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ అప్‌డేట్‌లను అందించేందుకు సరికొత్త వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ట్రాఫిక్ రద్దీ, మళ్లింపులు, ప్రమాదాలు, సూచనలు తదితర సేవలను నేరుగా వాహనదారులకు సందేశం రూపంలో అందించనున్నారు. ఈ మేరకు 'సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్' సాంకేతిక సేవలను కమిషనర్ అవినాష్ మహంతి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సంయుక్తంగా కలిసి టాన్లా ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ సహకారంతో ఈ సాంకేతిక వ్యవస్థను రూపొందించారు. దీంతో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, క్రమబద్ధీకరణ సులువవుతుందని కమిషనర్ మహంతి తెలిపారు. ప్రధాన రహదారుల ట్రాఫిక్ సమాచారం, మార్గదర్శకాలు, మళ్లింపులతో పాటు రద్దీ కారణాలు, సాధారణ పరిస్థితికి రావడానికి పట్టే సమయం తదితర వివరాలను ఖచ్చితంగా అందిస్తుందన్నారు. అంతేకాకుండా వాట్సాప్ ద్వారా ట్రాఫిక్ పోలీసులతో చాట్ చేసి మీ ప్రాంతంలోని ట్రాఫిక్ సమస్యలపై సూచనలు కూడా ఇవ్వొచ్చని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డెవిస్, ఎస్సీఎస్సీ జాయింట్ సెక్రెటరీ రాజేశ్, టాన్లా చీఫ్ కస్టమర్ ఆఫీసర్, సీఈఓ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ చేసుకునేది ఇలా..!

https://cyberabadtrafficpulse.telangana.gov.in వెబ్‌సైట్‌కి వెళ్లి మీ వివరాలు నమోదు చేసి, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చిన కోడ్‌ని ఎంటర్ చేసి నమోదు చేసుకోవాలి. దీంతో మీ మొబైల్‌కు నేరుగా వాట్సాప్, గూగుల్ ఆర్‌సీఎస్, సందేశం రూపంలో ట్రాఫిక్ అప్డేట్స్ వస్తాయి. మీకు అవసరమైన ప్రాంతాలను ఎంపిక చేసుకోవచ్చు. మీ వ్యక్తిగత సమాచారం సురక్షితంగా ఉంటుంది. ట్రాఫిక్ పల్స్ మీ డేటాను ఏ ఇతర సంస్థలతో పంచుకోదు. ఒకవేళ ఈ సేవలు వద్దనుకుంటే తిరిగి సేవను మళ్లీ అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'అన్‌సబ్‌స్క్రైబ్' ఆప్షన్‌ను ఎంచుకుంటే చాలు.



13 ఏళ్లకు పట్టుబడ్డాడు!

- మరో ఇద్దరితో కలిసి ఓ కంపెనీ నిధులకు స్కెచ్
- వారి చెక్కు చోరీ చేసి తన ఖాతాలోకి నగదు బదిలీ
- ఆఖరి నిమిషంలో విషయం వెలుగులోకి, కేసు నమోదు
- ముందస్తు బెయిల్ పొంది 2011 నుంచి పరారీలోనే
- సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్


భరద్వాజ్

సాక్షి, సిటీబ్యూరో: ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆచూకీ 13 ఏళ్లుగా చిక్కలేదు... కోర్టు నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేసినా జాడ దొరకలేదు... దీంతో పోలీసులు ఆ కేసు మూసేయాలని భావించారు... ఈ సమయంలో రంగంలోకి దిగిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ నిందితుడిని పట్టుకుంది. అతగాడిని తదుపరి చర్యల నిమిత్తం మహంకాళి పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర శుక్రవారం వెల్లడించారు. చైతన్యపురి ప్రాంతానికి చెందిన కె.భరద్వాజ్ రావు అలియాస్ గోపాల్‌రెడ్డి మరో ఇద్దరితో కలిసి 2011లో భారీ కుట్ర పన్నాడు. వీరిలో ఒకరి ద్వారా పుణే కేంద్రంగా కార్యకలాపాలు సాగించే రమెలెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చెక్కు చోరీ చేయించాడు. అదే ఏడాది ఆగస్టు 22న సికింద్రాబాద్, ఎస్డీ రోడ్‌లోని ఎస్బీఐ బ్రాంచ్‌లో తన వివరాలు, ఫొటో ఆధారంగా గోపాల్‌రెడ్డి పేరుతో ఓ సేవింగ్స్ ఖాతా తెరిచాడు. ఆపై పుణే సంస్థ చెక్కుపై గోపాల్‌రెడ్డి పేరు రాసి రూ.90 లక్షలకు సిద్ధం చేశాడు. దీన్ని బ్యాంక్‌కు తీసుకువెళ్లిన భరద్వాజ్ అధికారులకు అందించి తాను గోపాల్‌రెడ్డి పేరుతో తెరిచిన ఖాతాలోకి నగదు మళ్లించాడు. ఆపై ఆ ఖాతాకు సంబంధించిన సెల్ఫ్ చెక్ ఇచ్చి ఆ మొత్తం డ్రా చేసుకోవాలని ప్రయత్నించాడు. అయితే ఆ ఖాతా కొత్తగా తెరిచింది కావడంతో పాటు ఒకేసారి భారీ మొత్తం డ్రా చేసే ప్రయత్నం చేయడంతో బ్యాంకు సిబ్బందికి అనుమానం వచ్చింది. నగదు ఇవ్వడానికి కొంత సమయం కోరిన వారు అప్పటికి భరద్వాజ్‌ను పంపేశారు. ఈ విషయాన్ని ఫ్యాక్స్ ద్వారా పుణే సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సదరు సంస్థ తమ చెక్కు చోరీ అయిందని, ఆ మొత్తం డ్రా చేసుకోనీయవద్దని సమాధానం ఇచ్చారు. దీంతో బ్యాంకు అధికారులు గోపాల్‌రెడ్డిగా చెప్పుకున్న భరద్వాజ్‌పై మహంకాళి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు భరద్వాజ్‌తో సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో భరద్వాజ్ కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందారు. అప్పటి నుంచి కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు 2018లో ఆ కేసు నుంచి భరద్వాజ్‌ను వేరు చేసి, మిగిలిన ఇద్దరినీ విచారించింది. న్యాయస్థానం భరద్వాజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఇతడిపై ఉన్న కేసును లాంగ్ పెండింగ్ కేటగిరీలో మూసేయాలని అధికారులు భావించారు. ఆ సమయంలో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ దృష్టికి ఈ విషయం వచ్చింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు పి.గగన్‌దీప్, సి.రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాసులు దాసు రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలను బట్టి భరద్వాజ్ కొత్తపేటలో ఉన్నట్లు గుర్తించారు. అప్పటికే అనేక చోట్ల ఇళ్లు, ఫోన్ నెంబర్లు మార్చిన అతగాడిని చాకచక్యంగా పట్టుకున్నారు.

పాఠ్యాంశంగా రహదారి భద్రత


మాట్లాడుతున్న రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు రోడ్డు భద్రతా అవగాహన వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారి భద్రతను పాఠ్యాంశంగా తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను రక్షించాలన్నారు. జనవరి 1న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు దాదాపు 15లక్షల మంది విద్యార్థులను ప్రజలను భాగస్వాములను చేస్తూ 33 జిల్లాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించేవారికి భవిష్యత్తులో లైసెన్స్ ఇవ్వకుండా రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా 33 జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని, రోడ్డు భద్రతా మాసోత్సవం పండగలా జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రవాణా శాఖ జాయింట్ కమిషనర్లు, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భోజగుట్టలో కుంగిన పైప్‌లైన్



లక్డీకాపూల్: నగరంలోని భోజగుట్టలో 250 ఎంఎం డయా పైప్‌లైన్ 3 మీటర్ల మేర కుంగింది. భోజగుట్ట నుంచి ఖాదర్‌బాగ్, సాలార్‌గంజ్ కాలనీ, మిలిటరీ ఏరియా అవుట్‌లెట్ వరకు పైప్‌లైన్ ఉంటుంది. ఈ టన్నెలింగ్ పనులు చేసే సమయంలో పైప్‌లైన్‌కు లీకేజీని గుర్తించి అప్రమత్తమైన జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకుని మరమ్మతు పనులు పూర్తి చేసి, పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. పనులు జరిగే ప్రాంతంలో రక్షణ చర్యలు పాటించాలన్నారు.

ఫ్యాన్సీ నంబర్‌కు రూ. 10.46 లక్షలు!

ప్రత్యేక వేలంలో ఖైరతాబాద్ ఆర్టీఏకు ఒక్కరోజే రూ. 38.76 లక్షల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: ఫ్యాన్సీ నంబర్లపై వాహనదారులు మరోసారి క్రేజ్‌ను చాటుకున్నారు. శుక్రవారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ప్రత్యేక నంబర్లపై ఏకంగా రూ. 38.76 లక్షల ఆదాయం లభించినట్లు హైదరాబాద్ జేటీసీ సి. రమేశ్ తెలిపారు.

అధిక ధర పలికిన ప్రత్యేక నంబర్లు

నంబర్	యజమాని	ధర (రూ.లలో)
టీజీ09 ఈ 0009	వెంకటేశ్‌గౌడ్	10,46,999
టీజీ09 డి 9999	ఎటర్నల్ అవెన్యూస్ అండ్ ఇన్‌ఫ్రా	6,26,000
టీజీ09 ఈ 0001	పేరటి శ్రీనివాస్‌రెడ్డి	4,69,900
టీజీ09 ఈ 0005	కరా కన్సిల్ ప్రైవేట్ లిమిటెడ్	2,43,001
టీజీ09 ఈ 0006	గోయజ్ జ్యువెలరీ	2,25,117
టీజీ09 ఈ 0007	ఎస్‌కె కార్ లాంజ్	1,58,0003
టీజీ09 ఈ 0003	వర్ట్‌లైన్ మెరైన్ బంకర్స్	1,11,000
టీజీ09 ఈ 0027	న్యూలాండ్ లేబోరేటరీస్	1,09,000
టీజీ09 ఈ 0019	సీతార ఎంటర్‌టైన్‌మెంట్	1,00,019

మహా కుంభ మేళా యాత్రలో అపశ్రుతి

- ప్రయాగ్‌రాజ్ నుంచి అయోధ్యకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం
- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు


టిప్పర్‌ను ఢీ కొట్టిన బస్సు
రామాంజనేయులు మృతదేహం

కుషాయిగూడ: మహా కుంభమేళా యాత్రలో భాగంగా ప్రయాగ్‌రాజ్ నుంచి అయోధ్యకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన 21 మంది కురుమ సంఘం ప్రతినిధుల బృందం బస్సులో జనవరి -29న రాత్రి ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. అదే రోజు రాత్రి కుంభమేళాలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని గురువారం తెల్లవారుజామున అయోధ్యకు బయలుదేరారు. ఈ క్రమంలో అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలో వినాయక్‌నగర్ వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న టిప్పర్‌ను బస్సు ఢీకొట్టింది. దీంతో న్యూ నర్సింహ్మనగర్ కాలనీకి చెందిన కుర్వ రామాంజనేయులు (40) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన మోహన్, మల్లేష్, రంగన్న, రాములను అయోధ్యలోని ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ నేతల చొరవతో..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామాంజనేయులు మృతదేహాన్ని నగరానికి రప్పించడంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల చొరవ చూపారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించిన వారు సాయం చేయాలని కోరారు. వారి అభ్యర్థనతో యూపీ ముఖ్యమంత్రి ఆదేశాలతో శుక్రవారం ఉదయం లక్నో ఎయిర్‌పోర్ట్ నుంచి విమానంలో రామాంజనేయులు మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు.

నగరానికి చేరుకున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో గాయపడి అయోధ్యలోని ఆసుపత్రిలో చికిత్స పొందిన మోహన్, మల్లేష్, రంగన్న, రాము శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మెరుగైన వైద్యం కోసం వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించినట్లు సమాచారం.

నగరంలో నేడు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ రెహానా కవితా సంకలనం నదీ వాక్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ మేళా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- పెటెక్స్ ఇండియా ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 11 గంటలకు పెట్ ఎక్స్, హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ జరుగుతాయి.
- కేంద్ర సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్ జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివైవింగ్ ది రూట్స్ పేరిట కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

1,190 ఫోన్లు రికవరీ

బాధితులకు అప్పగింత



సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న రూ.3.55 కోట్ల విలువ చేసే 1,190 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆయా మొబైల్స్‌ను క్రైమ్స్ డీసీపీ కే నర్సింహ శుక్రవారం బాధితులకు అందజేశారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) సహాయంతో ఫోన్లను 50 రోజుల వ్యవధిలోనే రికవరీ చేసినట్లు తెలిపారు. అత్యధికంగా ఐదు జోన్లలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు 1,010, లా అండ్ ఆర్డర్ పోలీసులు 180 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వివరించారు.

బడ్జెట్‌పై చర్చకు అవకాశం ఇవ్వరా ?

- మేయర్ చాంబర్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- వాళ్లే ఇష్టానుసారం వ్యవహరించారు: కాంగ్రెస్

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తూ కార్పొరేటర్లకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, బడ్జెట్‌పై చర్చకు అవకాశమివ్వకుండా, పలు నిబంధనలు ఉల్లంఘించి కౌన్సిల్ నిర్వహించారంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం మేయర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బడ్జెట్ సమావేశంలో పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మన్నె కవితారెడ్డి, హేమ సామల, రాసూరి సునీత, సింధు రెడ్డి, శాంతిరెడ్డి, దేదీప్యారావు తదితర కార్పొరేటర్లు కమిషనర్‌కు రాసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో, అడిషనల్ కమిషనర్ శివకుమార్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. మేయర్‌తో సమావేశమైన కాంగ్రెస్ కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, బాబా ఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, మహాలక్ష్మిగౌడ్ తదితరులు అనంతరం మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ సభ్యులు సభను, మేయర్‌ను లెక్కచేయకుండా ప్రవర్తించారని, వారి అధిష్ఠానం మెప్పు కోసం వారిచ్చిన స్క్రిప్టు మేరకు వ్యవహరించారని ఆరోపించారు.

చిన్నారిపై వీధికుక్కల దాడి


చిన్నారిపై దాడి చేస్తున్న కుక్కలు

రాజేంద్రనగర్: అపార్ట్‌మెంట్ ఎదుట ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ రోడ్డు నంబర్–6లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాధ కుటుంబం నగరానికి వలస వచ్చి రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ రోడ్ నంబర్–6లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తోంది. వీరి కుమార్తె సుహాసిని (4) శుక్రవారం ఉదయం అపార్ట్‌మెంటు ముందు ఆడుకుంటుండగా రెండు వీధి కుక్కలు చిన్నారిపై దాడి చేశాయి. కిందపడిన బాలికను కుక్కలు కాలు పట్టుకుని 10 అడుగుల మేర లాక్కెళ్లాయి. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి అరుపులు విన్న ఆమె తల్లి కుక్కలను తరిమి కుమార్తెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం చిన్నారి సుహాసిని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

క్లుప్తంగా...

భూ ఆక్రమణలు అరికట్టాలని ప్రజాభవన్‌లో ఫిర్యాదు

రహమత్‌నగర్: తమ బస్తీలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని మహాత్మానగర్ బస్తీ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ శుక్రవారం ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బస్తీలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు ప్రహరీ గోడలు నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఫిర్యాదులో కోరారు. మహాత్మానగర్ బస్తీలో అక్రమ నిర్మాణాలను సంబంధిత అధికారులు కూల్చివేయడం, తిరిగి వాటి నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూ ఆక్రమణలు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కుర్మయ్య, మహేష్, పద్మ, సాయిలు, విజయ్ కుమార్, శంకర్ పాల్గొన్నారు.

విద్యా ఉపాధి అవకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న సౌత్ యూనివర్సిటీ ప్రతినిధులు

బంజారాహిల్స్: అమెరికాలోని సౌత్ యూనివర్సిటీలోని పలు విశ్వవిద్యాలయాల్లో అందుతున్న విద్యా, ఉపాధి అవకాశాలపై సౌత్ యూనివర్సిటీ ప్రతినిధులు క్యాస్ట్రో జోసెఫ్, డాక్టర్ అలిస క్రాజ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో నగరంలోని వందకుపైగా ఎడ్యుకేషన్ ఏజెన్సీలు పాల్గొన్నారు. ఎక్సెల్ల ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయా దేశాల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సెల్ల ఎడ్యుకేషన్ గ్రూప్ చైర్మన్ అరసవల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ తీరుపై బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసన

ఫిలింనగర్: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో జరిగిన దాడులకు మేయర్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలపై గళమెత్తే కార్పొరేటర్ల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన దుయ్యబట్టారు. అనంతరం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వెల్దండ వెంకటేష్ పరిస్థితిని వివరించారు.

ఆస్తిని విక్రయించి.. ఆ తర్వాత దౌర్జన్యం

వెంగళరావునగర్: ఆస్తిని విక్రయించి రిజిష్టర్ కూడా అయిపోయిన తర్వాత దౌర్జన్యం చేస్తున్నారంటూ ఓ వ్యక్తి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌కాలనీలో నివాసం ఉండే సయ్యద్ షబ్బీర్ ఎస్ఎస్ కోటింగ్ పేరుతో వ్యాపారం చేస్తుంటాడు. 2012 మార్చి నెలలో సనత్‌నగర్ నివాసులైన బి.భూలక్ష్మి, పర్వతాల రెడ్డికి సంబంధించిన స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో మల్కాజిగిరి జిల్లా దొమ్మర పోచంపల్లి గ్రామంలో ఉన్న 718 చదరపు గజాల స్థలానికిగాను రూ.కోటి 34 లక్షల 78 వేలు వారికి పూర్తిగా చెల్లించగా 2021 జనవరి నెలలో భూలక్ష్మి, పర్వతాలరెడ్డిలు వచ్చి రిజిష్టర్ చేశారు. అనంతరం షబ్బీర్‌ఆలీ అక్కడ వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే ఇటీవల దంపతులు ఇరువురు తమ ఆస్తిని విక్రయించలేదంటూ దౌర్జన్యంగా వారి మనుషులను వ్యాపార సంస్థ వద్దకు పంపించారు. దీంతో వారు షబ్బీర్ ఆలీని ఖాళీ చేయాలని బెదిరించారు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడు గద్దర్

కాచిగూడ: తన కలం, గళంతో గద్దర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదారని, సమాజంలో అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా ఎలుగెత్తిన గొంతుక అని పలువురు వక్తలు కొనియాడారు. గద్దర్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎల్ యాదగిరి అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధనౌక గద్దర్ (గుమ్మడి విఠల్) మరణించ లేదని, ప్రజల హృదయాలలో బతికే ఉన్నారని, చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పేద, దళిత, అణగారిన వర్గాల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, గంటా మల్లేష్, హరినాథ్, జి.శంకర్, రాజలింగం, చక్రాల రవి, వరంగల్ రవి, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం



త్యాగరాజ ఆరాధనోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు





ఫిలింనగర్: త్యాగరాజ జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా త్యాగరాజస్వామి సమాధి అయిన పుష్య బహుళ పంచమి రోజున ఈ కార్యక్రమాన్ని జరుపుతుంటారు. సంప్రదాయ వేషధారణలో విద్యార్థినీ విద్యార్థులు త్యాగరాజ కృతులను పాడుతూ మైమరిపించారు. రామా..కోదండరామ అనే త్యాగరాజ కృతిని పాడుతూ విద్యార్థులు వేదిక వద్దకు రాగా, ప్రిన్సిపాల్ పి.కాంచనవల్లి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరుగేలరా, సీతా..కల్యాణ వైభోగం తదితర త్యాగరాజ కృతులతో కార్యక్రమం ఆద్యంతం వీనులవిందుగా సాగింది. 'రామచంద్రాయ జనక' అనే మంగళహారతితో వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతీ సంప్రదాయాలను కొంతవరకైనా కాపాడగలమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు చక్కగా వారి పిల్లలను ప్రోత్సహిస్తూ సంగీతం నేర్పిస్తుండడం కారణంగా నేడు ఎంతో చక్కగా ఆలపించారన్నారు.

జాగ్రత్తలు పాటించి మనల్ని మనమే రక్షించుకోవాలి

ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే





హెల్మెట్స్ పంపిణీ చేస్తున్న పోలీసు అధికారులు

వెంగళరావునగర్: రోడ్డుమీద ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించి మనల్ని మనమే రక్షించుకోవాలని, నిరంతరం పరిసరాలను పరిశీలిస్తూ ఉండాలని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలియజేశారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు శుక్రవారం యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాహుల్ హెగ్డే మాట్లాడుతూ వాహనాలపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనేక మంది హెల్మెట్‌ను తలపై పెట్టుకోకుండా చేతిలో పట్టుకుని, వాహనానికి తగిలించి పోలీసులను చూడగానే తలకు పెట్టుకుని వెళుతుండటం జరుగుతుందని ఇలాంటి వారిపైన కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శిరస్త్రాణం అనేది మనలను కాపాడటానికి వాడే కవచమని దీనిని గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని, ఈ విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకుని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపించే సమయంలో మనం చేసే చిన్న తప్పిదం వల్ల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని దీనిని మరువవద్దని పేర్కొన్నారు. అందుకే తామే ముందుకువచ్చి కొంతమందికైనా హెల్మెట్లు అందించాలని అనుకున్నామన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే చిన్నారుల తల్లిదండ్రులకు ఉచితంగా హెల్మెట్లు అందజేసి, వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామంటూ వాహనదారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ, ఇన్‌చార్జి నరసింహ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్, టీచర్లు అనంతలక్ష్మి, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు

- యూఎస్ కాన్సులేట్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ ఫ్రాంక్ టెలుటో



మాట్లాడుతున్న ఫ్రాంక్ టెలుటో

బంజారాహిల్స్: అమెరికా యూనివర్సిటీలలో విద్యను అభ్యసిస్తున్న, విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరుగుతాయని యుఎస్ కాన్సులేట్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ ఫ్రాంక్ టెలుటో అన్నారు. బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్లో గ్లోబల్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో అమెరికా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఫ్రాంక్ మాట్లాడుతూ విద్యార్థులకు ట్రంప్ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత కొత్తగా వచ్చిన నిబంధనలు ఏమీ లేవని పాత నిబంధనలు అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు క్యాంపస్ లోపల వచ్చే పార్ట్ టైం ఉద్యోగాలు లీగల్ అని, క్యాంపస్ బయట చేసే ఉద్యోగాలు లీగల్ కాదని ఈ నిబంధనను మాత్రమే కఠినతరం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఎఫ్ఎస్, ఓపీటీ, సీపీటీ వంటి రూల్స్ ఏవీ మారలేదని తెలిపారు. గ్లోబల్ ట్రీ ఫౌండర్ శుభకర్ మాట్లాడుతూ అమెరికా యూనివర్సిటీలలో చదువుకోవాలని విద్యార్థులు తొలిసారి వీసా ఇంటర్వ్యూలకు హాజరవుతున్న విద్యార్థులు కొన్ని మెళకువలు, కొంత సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో వీసాలను సులభంగా పొందవచ్చునని అన్నారు. వీసా పొందేందుకు అవసరమైన మెళకువలను కూడా ఆయన వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకిన్ అమెరికా నినాదం వల్ల వేలాదిమంది మన విద్యార్థులకు సైతం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా వందకుపైగా ప్రఖ్యాత యూనివర్సిటీల ప్రతినిధులతో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నట్లు గ్లోబల్ ట్రీ సీఈవో శ్రీకర్ తెలిపారు. ఏ యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారో, వసతులు, అందిస్తున్న కోర్సుల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- 9,307 దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసమే 7100 అర్జీలు



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 9,307 దరఖాస్తులు సమర్పించారు. అందులో ఇందిరమ్మ ఇండ్ల కోసం 7,100, పౌర సరఫరాల శాఖకు 1736 అర్జీలు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 211, విద్యుత్ శాఖకు సంబంధించి 160, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి ఒక దరఖాస్తు అందింది. ఇతర శాఖలకు సంబంధించి 56 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులపై ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు.

తాజ్‌బంజారా చెరువు కాలుష్యంపై న్యాయస్థానం ఆగ్రహం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/13లో తాజ్‌బంజారా హోటల్‌ను ఆనుకుని విస్తరించి ఉన్న అంతగాని కుంట తాజ్‌బంజారా లేక్‌లో గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తా చెదారం, వ్యర్థాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుస్తున్న తీరును తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. కాలుష్య నియంత్రణ మండలి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాజా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ కుద్రాతులేస్ హసన్ అనే వ్యక్తి 2017లో తాజ్‌బంజారా లేక్‌లో చుట్టూ కాంక్రీట్‌తో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారని, రెండు చోట్ల చెత్త కుప్పలు, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయని, ఈ చెరువు కాలుష్యకాసారంగా మారుతుందంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2021 జులై 3వ తేదీన తాము ఈ చెరువు ప్రాంతాన్ని పరిశీలించామని, అక్కడ ఎలాంటి పనులు జరగడం లేదంటూ పీసీబీ న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది. పీసీబీ వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. చెరువులోనే సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించడం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, ఇదంతా చెరువుకు పూర్వ వైభవం ఎలా తీసుకువస్తుందని ప్రశ్నిస్తూ తాజాగా మరో అఫిడవిట్ సమర్పించాలని కూడా పీసీబీని ఆదేశించింది.

బసవతారకనగర్‌లో అధికారుల పర్యటన

సాక్షి ఎఫెక్ట్..



పర్యటిస్తున్న అధికారులు హరిశంకర్ తదితరులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో 'వీధుల్లో పారుతున్న మురుగు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన సమస్య పట్ల జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్, ఫిలింనగర్ వాటర్ సెక్షన్ ఇన్‌చార్జి మేనేజర్ రాంబాబు, బంజారాహిల్స్ డీజీఎం తదితరులు పర్యటించారు. మురుగు పొంగడానికి గల కారణాలపై విచారించారు. మ్యాన్‌హోళ్లలో మట్టి, బురద, వ్యర్థాలు కూరుకుపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందని తెలుసుకుని అప్పటికప్పుడే వాహనాలను తెప్పించి మట్టిని, వ్యర్థాలను తొలగించారు. సుమారుగా నాలుగు వీధుల్లో మురుగు పేరుకుపోగా మూడు గంటలపాటు సిబ్బంది శ్రమించి మ్యాన్‌హోల్స్, పైపుల్లో ఇరుక్కున్న వ్యర్థాలను తొలగించారు. దీంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది.

సీఅండ్‌డీ వ్యర్థాలు వేసిన వారికి భారీగా జరిమానా

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణ కూల్చివేతల (సీఅండ్‌డీ) వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ లేకుండా చూడాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ విభాగానిదేనని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మరోమారు స్పష్టం చేశారు. సదరు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్న నిర్మాణదారులను గుర్తించి జరిమానాలు వేసే బాధ్యత ఏసీపీలదేనని పేర్కొన్నారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రభుత్వ విభాగాల పనులకు సంబంధించిన వ్యర్థాలైతే సంబంధిత ఇంజినీర్ల సహకారంతో కాంట్రాక్టు సంస్థకు పెనాల్టీలు విధించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు తరలించే ట్రక్కులకు నిబంధనల మేరకు మొదటిసారి రూ.25వేలు, రెండోసారి రూ.50వేలు, మూడోసారి లక్ష రూపాయల పెనాల్టీతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఇతరులకు విధించాల్సిన పెనాల్టీల వివరాలు సైతం మరోమారు తెలిపారు. ఇటీవల ప్రారంభించిన చర్యలతో జనవరి ఒక్క నెలలోనే 28వ తేదీ వరకు రూ.14,24,728 పెనాల్టీలు విధించగా, చర్యలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1158 ప్రాంతాల్లో వ్యర్థాలు వేసినట్లు గుర్తించి, రూ.42,20,793 పెనాల్టీలు విధించినట్లు వెల్లడించారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్




మాట్లాడుతున్న బండా ప్రకాష్ ముదిరాజ్

శ్రీనగర్‌కాలనీ: ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజికవర్గాన్ని బీసీ డి నుంచి బీసీ-ఏ లోకి మారుస్తామన్న హామీతో పాటు ఇతర హామీలను తక్షణమే నెరవేర్చాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమీర్‌పేటలో తెలంగాణా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన బండ ప్రకాష్ మాట్లాడుతూ 2009లో అప్పటి సీఎం దివంగత రాజశేఖర్‌రెడ్డి తమ న్యాయమైన ఆకాంక్షను మార్చేందుకు జీఓ నెం 15ను తీసుకువచ్చారని, కానీ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా రాష్ట్ర పరిధిలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కారం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చినందుకే తమ సామాజికవర్గం కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిందని, కోకాపేటలో గత ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో మా సమస్యలకు పరిష్కారం దిశగా చర్చలు జరపాలని, సీఎంతో సహా అందరికీ తమ వినతులు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందనరాకపోతే ప్రత్యక్ష కార్యాచరణతో ముందుకు సాగుతామని, తమ గళాన్ని ఢిల్లీ దాకా వినిపిస్తామన్నారు. ఈ సమావేశంలో నేతలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిల్ల సత్తయ్య, తలారి మల్లేషం, విజయ్‌కుమార్, వరలక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

రేపటి నుంచి పెద్దమ్మ తల్లి రథోత్సవాలు

- ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ చైర్మన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పెద్దమ్మ గుడి చైర్మన్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఫిబ్రవరి 2 (ఆదివారం) నుంచి 5వ తేదీ వరకు శ్రీపెద్దమ్మ తల్లి 31వ వార్షిక రథోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించే దిశలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం రథోత్సవ ఏర్పాట్లను పెద్దమ్మ గుడి ఫౌండర్ చైర్మన్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆలయ ఈఓ, అర్చకులు, సిబ్బందితో పరిశీలించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, పూలదండలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడమే కాకుండా ఆలయ ప్రాంగణాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 3గంటలకు పెద్దమ్మ తల్లి అభిషేకంతో ఉత్సవాలు మొదలుకానున్నాయి. ఉదయం 6 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. 9.45 గంటలకు ఇందిరా జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలచే విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, కంకణ దీక్షాధారణము, యాగశాల ప్రవేశము, గజారోహణము, అఖండ దీపారాధన, క్షేత్రపాలక నవగ్రహ కలశస్థాపనలు, మంటపారాధనలు, వేద పారాయణాదులు, చండీ పారాయణాదులు, నవగ్రహ జపాలు, రుద్రాభిషేకాలు ఉంటాయి.

ఫిబ్రవరి 4న.. : రథోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నవగ్రహ రుద్ర చండీహోమాలు, మధ్యాహ్నం 12 గంటలకు రథపూజ, అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తిని రథంపై ఊరేగిస్తారు. విశేష బాణాసంచా విన్యాసాలు కూడా కన్నులపండువగా జరగనున్నాయి. 5వ తేదీన శ్రీపెద్దమ్మ ఉత్సవమూర్తికి పుష్కరిణిలో అవభృత స్నానం నిర్వహిస్తారు.

ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రోస్టేషన్ కింద ఉన్న చిన్న పార్కు స్థలంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఎగిసిపడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన స్థలం పక్కనే మెట్రోస్టేషన్ లిఫ్ట్ ఉండటంతో కొంత భయాందోళనకు లోనయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని ఫైర్ ఇంజన్ల సాయంతో మంటల్ని అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కారణాలు తెలియాల్సి ఉంది.

బాధగా ఉన్నా ఉద్యోగ విరమణ తప్పదు

- నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

లక్డీకాపూల్: ప్రభుత్వ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, బాధగా ఉన్నప్పటికీ విరమణ తప్పదని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. శుక్రవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో పదవీ విరమణ చెందిన పలువురు ఉద్యోగులను ఆయన ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్. పద్మాలత, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ వి. కుమారస్వామి, సయ్యద్ తాజుద్దీన్ హుస్సేన్ కద్రి ఈసీజీ టెక్నీషియన్లు ఉన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన తర్వాత శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ లిజా రాజశేఖర్, డా. నాగేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా. శాంతివీర్ , సత్య గౌడ్, మార్తా రమేష్, శ్రీనివాసులు, శ్రీనివాస్ రావు, వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసంగించారు.

క్రైం కార్నర్..

భూకబ్జాదారులపై కేసు నమోదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-46 మస్తాన్ నగర్ అంబేడ్కర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా బండరాళ్లను ధ్వంసం చేస్తున్న వ్యక్తిపై షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-46లోని మస్తాన్‌నగర్ వైపు కొంతకాలంగా ప్రభుత్వ స్థలంలో కబ్జా కార్యక్రమాలు జరుగుతున్నట్లుగా తహశీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించగా ప్రభాకర్ అనే బస్తీ నేత తన అనుచరులతో కలిసి ఇక్కడ ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లుగా గుర్తించారు. దీంతో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటూ తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



రవిసాగర్ (ఫైల్)

రహమత్‌నగర్: ఇంటినుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రవిసాగర్ (30) తన భార్య పిల్లలతో కలిసి సంజయ్‌నగర్‌లో నివాసమంటున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 25 నిజాంపేట్‌లో నివాసముంటున్న తన తల్లి ఇంటికి వెళ్లి భూ తగాదాలపై మాట్లాడి వస్తానని సంజయ్‌నగర్‌లోని ఇంటినుంచి వెళ్లాడు. అయితే మళ్లీ రవిసాగర్ తిరిగి రాకపోవడంతో భార్య శ్రీలక్ష్మి తన అత్తకు ఫోన్ చేసి అడగగా అక్కడికి రాలేదని ఆమె తెలిపింది. దీంతో శ్రీలక్ష్మి తన భర్త ఆచూకీ కోసం తెలిసిన వారి వద్ద విచారించిన ఫలితం లేకపోవడంతో శుక్రవారం బోరబండ పోలీసులు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.





సాగరతీరాన ఎటూ చూసినా విభిన్న మొక్కల సోయగం.. దేశీ వెరైటీలు మొదలు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన మొక్కలతో సందడిగా మారింది నెక్లెస్‌రోడ్ పీపుల్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన హార్టీకల్చర్ షో. సాధారణ చామంతులు మొదలు ఇంపోర్టెడ్ ఆర్కిడ్స్, హెల్కోనియా వరకూ అన్నిరకాల మొక్కలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ అంటూ వినూత్న జీవనశైలికి హంగులద్దుతున్న నగరంలోని మొక్కల ప్రియులు ఈ హార్టీ కల్చర్ షోకు పరుగులు పెడుతున్నారు. ఇక్కడ 50 రూపాయలు మొదలు లక్షకు పైగా ధరల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

సాగర తీరాన.. విరుల సరాగం

50 రూపాయలు మొదలు లక్షకు పైగా ధరల్లో..
అందుబాటులో అరుదైన, వినూత్నమైన రకాలు..

నగరంలో విభిన్న మొక్కలతో సందడి చేస్తున్న హార్టీకల్చర్ షో..



కాంక్రీట్ జంగిల్‌లా మారిపోతున్న నగర జీవనశైలిలో కాసింత సాంత్వన, విశ్రాంతి మొక్కలు ఎంతో అవసరం. అంతేకాకుండా పర్యావరణ సమతుల్యం, పరిరక్షణలో ఈ మొక్కలదే కీలక పాత్ర. వెరసి గత కొన్నేళ్లుగా నగర వాసులు గార్డెనింగ్, మిద్దెపంట, ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ అంటూ విభిన్న రకాలుగా మొక్కల పెంపకం పై ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రతి ఏటా నగరం వేదికగా నిర్వహించే హార్టీకల్చర్ ప్రదర్శనకు ప్లాంట్ లవర్స్ తాకిడి క్రమంగా పెరుగుతోంది. సాధారణ మొక్కలు మొదలు అరుదైన మొక్కలు, బోన్సాయ్ మొక్కలు, ఔషధ మొక్కలు, ఆర్నమెంటల్ తదితర మొక్కలు అమ్మకానికి వచ్చాయి. ఇందులో భోన్సాయ్, ఫైకస్ మొక్క లక్ష రూపాయలకు పైగా అమ్మకానికి రావడం విశేషం. అంతేకాదు థాయ్‌లాండ్ నుంచి దిగుమతి చేసిన కమేలియస్ మొక్క కూడా అక్షరాల లక్ష రూపాయలు పలకడం విశేషం.

అరుదైన మొక్కలు..

'అరుదైన మొక్క స్టాగన్ ఫ్లింగ్ రకం ఈ సారి తీసుకొచ్చాం. ఇవి వాటి సైజుల ఆధారంగా 4 వందల నుంచి 8 వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. డ్రిఫ్ట్ వుడ్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన ఈ ఇంటీరియర్ మొక్కలకు పూసిన పూలు 6 నెలల వరకూ వాడిపోవు. ఇవన్నీ ఆర్కిడ్ జాతికి చెందినవి. పూణే నుంచి తీసుకొచ్చిన ఈ వెరైటీ ఖరీదు 35 వేలు అని స్టాల్స్ నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రత్యేకంగా గ్రూమింగ్ చేస్తాం..



మా దగ్గర సీజనల్ చామంతి ప్రత్యేకం. వీటిని కాకినాడలోని గణపతి గార్డెన్స్‌లో ప్రత్యేకంగా గ్రూమింగ్ చేస్తాం. దాదాపు 6 నెలలు కష్టపడితే వందల పూలతో ఒక బంతిలా తయారవుతాయి. ఇందులో 25 రకాల రంగులు అందుబాటులో ఉన్నాయి. 3 వందల నుంచి 3 వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పూలతో అలరిస్తాయి. రెండు మొక్కలు తీసుకుంటే 500 వందల ఆఫర్‌తో అందిస్తున్నాం.
- గణపతి గార్డెన్స్ నిర్వాహకులు

గత మూడున్నరేళ్లుగా..



దేశవ్యాప్తంగా సేకరించిన విభిన్న మొక్కలు ఈ నర్సరీ మేళాలో అందుబాటులో ఉంచాను. ముఖ్యంగా కలకత్తా నుంచి తీసుకువచ్చిన కమేలియాస్ ఈ సారి ప్రత్యేకం. అజేలియాస్ హైడ్రేంజియాస్, డేలియాస్ వంటి విభిన్న మొక్కలకు మంచి ఆదరణ పెరిగింది. డేలియాస్ పూల మొక్కల్లో అతిపెద్ద సైజు వెరైటీ మొక్కలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇవి ఏప్రిల్ వరకూ పూలతో అలరిస్తాయి. నాటు కమేలియాస్ మా ప్రత్యేకం.. పెద్దవి రూ.2900 చిన్నవి రూ.1200 వరకూ అమ్ముతున్నాను. నగరంలోని కొకూర్ వేదికగా గత మూడున్నరేళ్లుగా మొక్కలతో పాటు కాంప్రహెన్సివ్ స్టోర్‌గా మార్బుల్, సిరామిక్, హుండ్, ప్లాస్టిక్ తొట్లతో సేవలందిస్తున్నాం.
- పాల్ చంద్రకాంత్, స్టాల్- టీ24, 25

450కు పైగా వెరైటీలు..

తెలంగాణలో అడీనియం బోన్సాయ్ మొక్కల్లో అన్ని వెరైటీలనూ అందిస్తున్నది 'హైదరాబాద్ అడీనియం' మాత్రమే. 450కు పైగా వెరైటీలు అందుబాటులో ఉంటాయి. బేబీ ప్లాంట్ నుంచి 30 ఏళ్ల అడీనియం మొక్కలు 250 నుంచి 50 వేల వరకూ అందుబాటులో ఉంటాయి. కేరళ నుంచి వాటర్ ప్లాంట్స్ తీసుకొచ్చాం. ముఖ్యంగా వాటర్ లిల్లీ, తామర పూలు మా ప్రత్యేకం. అంతేకాకుండా అలోకేషియా, హెల్కోనియా, కొలకేషియా తదితర రకాలు ఉన్నాయి. తామరలోనే ఎనిమిది రకాలకు పైగా ఉన్నాయి. మా వద్ద 6 వందల నుంచి 7 వేల వరకూ ధరలు ఉన్నాయి.



30 రకాల ఆర్కిడ్స్..



ఇందులో 30 రకాల వరకూ అందుబాటులో ఉన్నాయి. కటేలియా, ఫాక్స్‌టైల్, బ్యాండ్రియం, క్రీపర్స్, ఎయిర్ ప్లాంట్స్ తదితర వెరైటీలు బాగా అమ్ముడుపోతున్నాయి. వీటిని థాయ్‌లాండ్ నుంచి దిగుమతి చేసుకుని, వెస్ట్ గోదావరి తణుకు వేదికగా 7 ఎకరాల నర్సరీలో పెంచుతున్నాం. 7 వందల నుంచి 2500 వరకూ ధరల్లో అందుబాటులో ఉన్నాయి. - సంతోష్.

జనప నారతో బ్యాగ్స్..



ఆంగ్రో పెగ్రో సైన్సెస్ అనేది మా సంస్థ. మా వద్ద హెర్బల్, ఈకో ఫ్రెండ్లీ, ఆర్గానిక్ గ్రో బ్యాగ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎండాకాలంలో ఇవి మొక్కలకు అధిక రక్షణ ఇస్తాయి. బ్రీతింగ్ ప్రాబ్లమ్స్ ఉండకుండా ఈ బ్యాగులు చూసుకుంటాయి. ఈ బ్యాగుల్లో రెండు రోజులకు ఒకసారి నీరు పోసినా సరిపోతుంది. వీటిని జనప నారతో తయారు చేస్తాం.
- ప్రదీప్



అధికారిక కార్యక్రమాలన్నింటికీ... ఆమెకు ఆహ్వానం..

- రాజ్‌భవన్ సిబ్బందికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదేశం
- మర్యాదపూర్వకంగా గవర్నర్‌ని కలిసిన మిసెస్ ఇండియా సుష్మా ముప్పిడి

లక్డీకాపూల్: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలన్నింటికీ మిసెస్ ఇండియా 2024 ముప్పిడి సుష్మాను ఆహ్వానించాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. తెలంగాణకు చెందిన మహిళ మిసెస్ ఇండియాగా ఎన్నిక కావడం రాష్ట్రం గర్వపడే విషయమన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాజ్‌భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ.. ఇద్దరు పిల్లల తల్లి అయిన సుష్మా మిసెస్ ఇండియా టైటిల్ సాధించి మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రశంసించారు.

భావోద్వేగానికి లోనైనా..

తెలంగాణ రాష్ట్రానికి చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న తనను ప్రభుత్వ కార్యక్రమాలకు గవర్నర్ ఆహ్వానించినప్పుడు ఎంతో భావోద్వేగానికి లోనైనట్లు మిసెస్ ఇండియా సుష్మా తెలిపారు. గవర్నర్‌ను కలిసిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మిసెస్ ఇండియా అవార్డును తాను ఉత్తమ సాంస్కృతిక దుస్తులతో పొందిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఫిబ్రవరిలో పారిస్‌లో జరిగే అంతర్జాతీయ మిసెస్ వరల్డ్ పోటీల్లో తాను పాల్గొంటున్నానని, తనకు సినీ స్టార్స్ సుమంత, ప్రియాంక చోప్రాలు రోల్ మోడల్ అని సుష్మా పేర్కొన్నారు.

నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన సుష్మా చదువు పూర్తైన తర్వాత గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా కొంత కాలం పనిచేశారు. తెలంగాణకు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ముప్పిడి వెంకట్ రెడ్డికి కోడలైన తర్వాత సుష్మా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కొంత కాలంగా సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసిన ఆమె, ఆ రంగాన్ని వదిలి ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించారు. ఆ రంగంలో రాణిస్తూనే మిసెస్ వరల్డ్ టైటిల్ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుసాగుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆంధ్రప్రదేశ్‌లో కలంకారి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.



మాదాపూర్ సీసీఆర్టీలో.. రామాయణ కల్పవృక్షం

మాదాపూర్ : రాముడి పాత్రను నృత్యం, సంగీతం, హరికథ తదితర ప్రదర్శనల ద్వారా సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ ట్రెనింగ్ సెంటర్)లో శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న రామయణ కల్పివృక్షం కార్యక్రమాన్ని లోక్‌సభ సభ్యులు తేజస్వీ సూర్య ప్రారంభించారు. శంకరానంద కళాక్షేత్రం, నాట్యారంభ సంస్థల అధ్వర్యంలో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ మద్దతుతో నిర్వహిస్తున్నారు. సంగీత ప్రముఖులు రంజని, గాయత్రి నిరీక్షిత సంగీతకృతి రామాబైరాగ ప్రదర్శన, హరికథ కళానిపుణులు విశాఖహరి రామాయణ దిలైప్ గివింగ్ ట్రీ, రుక్మిణీదేవి అరుండలే రూపొందించిన ప్రముఖ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. శబరిమోక్షం కళాక్షేత్ర ఫౌండేషన్ ద్వారా, జేఎన్ మణిపురి డ్యాన్స్ అకాడమీ ద్వారా మణిపురి రాస్, ఫుంగ్ డోల్ చోలామ్ నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నర్తకి డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ పాల్గొన్నారు.



హెచ్ఐసీసీలో హైలైఫ్ ప్రదర్శన

మాదాపూర్ : ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి సచీరాయ్, నిర్వాహకుడు డొమినిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరయువతను సైతం తమ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. మహిళలకు కావాల్సిన ప్రత్యేక డిజైన్ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు డొమినిక్ తెలిపారు. వివాహాధి శుభకార్యాలకు, పండుగలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నటీమణులు అంగనారాయ్, భ్రమరాంబిక, ఊర్మిళా చౌహాన్ పలువురు డిజైనర్లు, మోడల్స్ పాల్గొన్నారు.



హైటెక్స్‌లో.. పెటెక్స్..

ఒకే వేదికగా మూడు ప్రదర్శనలు ప్రారంభం

- పెటెక్స్, కిడ్స్ ఎక్స్‌పో, కిడ్స్ బిజినెస్ ఫెయిర్
- మూడు రోజుల పాటు కొనసాగింపు
- 200 రకాల పిల్లులు, 100 రకాల చేపలు, 60కిపైగా ఎగ్జిబిటర్లు
- ప్రారంభించిన కజకిస్తాన్ రిపబ్లిక్ కౌన్సిల్ జనరల్ డాక్టర్ నవాబ్‌మీర్ నాసీర్ అలీఖాన్



మాదాపూర్ : పెటెక్స్ భారతదేశంలో అతిపెద్ద ఎక్స్‌పో. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న కిడ్స్‌ఫెయిర్, కిడ్స్ బిజినెస్ కార్నివాల్‌ను కజకిస్తాన్ రిపబ్లిక్ కౌన్సిల్ జనరల్ డాక్టర్ నవాబ్‌మీర్ నాసీర్ అలీఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపుడు జంతువులు మంచి స్నేహితులని, అవి ఒత్తిడిని తగ్గించే స్నేహితులని తెలిపారు. పెంపుడు జంతువులు ఉన్నచోట మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. కోవిడ్ తర్వాత పెంపుడు జంతువులను దత్తత తీసుకోవడం చాలా పెరిగిందన్నారు. ప్రపంచంలో మొదటి సారిగా గుర్రాన్ని కజకిస్తాన్‌లో పెంపకం చేశారన్నారు. ఎక్స్‌పోలో దాదాపు 200లకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ మూడూ ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. 200లకు పైగా పిల్లులు ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. 100 రకాల అలంకారమైన చేపలను ప్రదర్శిస్తున్నారు. పెటెక్స్‌లో 60కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. టర్కీ, చెక్ రిపబ్లిక్, జపాన్, సింగపూర్, జర్మనీ వంటి వివిధ దేశాల నుంచి పాల్గొన్నారు. ప్రదర్శనలో 100 రకాల అలంకారమైన చేపలు, గుర్రాలు, పక్షులు, అంతర్జాతీయ పిల్లుల ఛాంపియన్‌షిప్, కుక్కల ఫ్యాషన్ షోలను నిర్వహిస్తున్నారు. క్యాట్ ఛాంపియన్‌షిప్‌ను ఇండియన్ క్యాట్‌క్లబ్ నిర్వహిస్తుంది. ఇందులో 200 రకాల పిల్లులు పాల్గొంటున్నాయి.

కిడ్స్ బిజినెస్ కార్నివాల్..

మొదటిసారిగా కిడ్స్ బిజినెస్ కార్నివాల్ నిర్వహిస్తున్నారు. వ్యాపార ఉత్పత్తుల ప్రదర్శనలో భాగంగా పెట్స్ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఎలక్ట్రానిక్స్‌లో కార్డ్‌గేమ్ వంటి పిల్లల ఉత్పత్తులు, ఆసక్తికరమైన క్రియేషన్, అయస్కాంత బుక్‌మార్కులు, విద్యార్థులు రచించిన పుస్తకాలు, చేతితో తయారు చేసిన కొబ్బరిచిప్పల ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 12 రాష్ట్రాలు, ఐదుదేశాల నుంచి ప్రదర్శన కారులు మూడురోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.





బ్రీడ్‌లు.. వాటి ఖర్చు...

బ్రీడ్ మినీపోడల్ : నెలకు 3వేల వరకూ ఖర్చు అవుతుంది. ఇది ఫ్రెండ్లీ డాగ్, దీనిని చిన్నపిల్లలు బాగా ఇష్టపడతారు.


బ్రీడ్ సీజు : నెలకు రూ.2500 వరకూ ఖర్చు అవుతుంది. ఇది కూడా ఫ్రెండ్లీ డాగ్, ఇంట్లో చాలా మంది పెంచుకుంటారు.



శునకాలకు ప్రత్యేక బెడ్‌లు..

శునకాలకు ప్రత్యేక బెడ్‌లను డిజైన్ చేసి ప్రదర్శనలో ఉంచారు. శునకం స్థితిని, ఆకారాన్ని భట్టి వివిధ డిజైన్, ఆకృతులతో రూపొందించి అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు ప్రవేశ రుసుము రూ.449గా నిర్ణయించారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ సందర్శకులకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.





వెస్టిన్ హోటల్‌లో.. వాచో స్టోరీ టెల్లర్స్ కాన్‌క్లేవ్

మాదాపూర్ : స్థానిక వెస్టిన్ హోటల్‌లో శుక్రవారం డిష్‌టీవీ వాచో స్టోరీ టెల్లర్స్ కాన్‌క్లేవ్ నిర్వహించారు. సినిమా రంగంపై అవగాహన కల్పిస్తూ నూతన చిత్ర నిర్మాతలకు, రచయిలకు, కంటెంట్ కలిగిన వారికీ అవకాశాలను కల్పిస్తుంది. చిత్ర నిర్మాతలను, ప్రాంతీయ సృష్టికర్తలను, వర్ధమాన కథకులను ఒకే వేదికపై తీసుకొస్తున్నారు. డిష్ టీవీ ఇండియా లిమిటెడ్ సీఈఓ మనోజ్‌ధోబాల్ మాట్లాడుతూ వాచో స్టోరి టెల్లర్స్ మొదట కోల్‌కతాలో ప్రారంభించామని, దీనికి విశేష స్పందన రావడంతో హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేశామని తెలిపారు. విభిన్న నేపథ్యాల నుంచి క్రియేటర్లను ఒకేచోట చేర్చడం తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సినీదర్శకుడు అనిల్‌రావిపూడి, నటుడు సందీప్ కిషన్, చలనచిత్ర నిర్మాత సునీత తాటి, గురు ఫిలిం వ్యవస్థాపకురాలు సాయిరాజేష్, రచయిత భరద్వాజ రంగన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
01-02-2025

కూలీ నంబర్ 1

హైదరాబాద్‌లో నిర్మాణ కార్మికులకు అత్యధిక కూలీ



- ఇతర నగరాల్లో రోజుకు రూ.1,000 కంటే తక్కువే..
- మన నగరంలో పనిని బట్టి రూ.584 నుంచి రూ.1,035
- అత్యల్ప లేబర్ చార్జీ చెల్లిస్తోంది దేశ రాజధాని ఢిల్లీలోనే..

ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం కంటే ఇవి తక్కువే.. | వాణిజ్య, ఆకాశహర్మ్యాల నిర్మాణాలే అధిక కూలీకి కారణం



కరోనా తొలి దశలో నిర్మాణ రంగ కార్మికుల వెతలు, వలసలు ఇంకా కళ్లముందే కదలాడుతున్నాయి. క్రమంగా నిర్మాణ రంగం పుంజుకోవడంతో కూలీలు బతుకులు గాడినపడుతున్నాయి. ఈ విషయంలో దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ఎంతో నయం అనే చెప్పాలి. ఎందుకంటే కూలీలకు దినసరి వేతనాలు అందుతుంది ఇక్కడే కాబట్టి! నగరంలో భవన నిర్మాణ కార్మికులకు రోజుకు సగటున రూ.584 నుంచి రూ.1,035 మధ్య కూలీ అందుతోంది. చిట్ట చివరి స్థానంలో నిలిచిన ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో రూ.515 నుంచి రూ.925 మధ్య మాత్రమేనని కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ యాప్ ప్రాజెక్ట్ హీరో అధ్యయనంలో వెల్లడైంది.

– సాక్షి, సిటీబ్యూరో

ప్రస్తుతం ప్రాజెక్ట్ హీరో యాప్‌లో 5 లక్షల మంది వర్కర్లు నమోదై ఉండగా.. ఇందులో హైదరాబాద్ నుంచి 12,285 మంది ఉన్నారు. యాప్‌లో రిజిస్టరైన 1.4 లక్షల ఉద్యోగ పోస్టింగ్‌లు, వాటి వినియోగ డేటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నిర్మాణ కూలీ 5 నుంచి 8 శాతం పెరిగితే.. హైదరాబాద్‌లో ఏకంగా 20 శాతం మేర వృద్ధి చెందింది. నగరంలో పెద్ద ఎత్తున వాణిజ్య, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జరుగుతుండటం అత్యధిక కూలీ చెల్లింపులకు ప్రధాన కారణం.



నగరాల వారీగా రోజువారీ వేతనం: (రూపాయల్లో)
ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం

	హెల్పర్లు	టెక్నీషియన్లు	సూపర్‌వైజర్లు
	711	788	866
నగరం	హెల్పర్లు	టెక్నీషియన్లు	సూపర్‌వైజర్లు
హైదరాబాద్	584	862	1,035
ముంబై	536	784	1027
చెన్నై	565	782	1006
బెంగళూరు	552	794	999
పుణె	543	749	885
ఢిల్లీ–ఎన్‌సీఆర్	515	718	925

పీఎఫ్, ఈఎస్ఐలు దక్కడం లేదు

దేశంలోని ప్రధాన నగరాలలో ప్రభుత్వం నిర్దేశించిన దినసరి కూలీ దక్కడం లేదని ప్రాజెక్ట్ హీరో ఫౌండర్ అండ్ సీఈఓ సత్య వ్యాస్ తెలిపారు. కేవలం 8.6 శాతం మంది కూలీలకు మాత్రమే ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), 7.1 శాతం మందికి ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) కవరేజ్‌లు అందుతున్నాయని పేర్కొన్నారు.

యూపీ నుంచే వలసలెక్కువ..

ప్రస్తుతం దేశంలో 5.1 కోట్ల మంది నిర్మాణ కూలీలు ఉన్నారు. అత్యధికంగా కూలీలు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస వస్తున్నారు. ఇక్కడి నుంచి 42 శాతం మంది దేశంలోని వివిధ నగరాల్లోని నిర్మాణ రంగంలో పని చేసేందుకు వస్తున్నారు. బీహార్ నుంచి 16 శాతం, పశ్చిమ బెంగాల్ నుంచి 10 శాతం, ఒరిస్సా నుంచి 9 శాతం, మహారాష్ట్ర నుంచి 6 శాతం కూలీలు వలస వస్తున్నారు.

నగరంలో నైపుణ్యతను బట్టి విభాగాల వారీగా దినసరి కూలీ(రూపాయల్లో)

- ఎలక్ట్రికల్ వర్క్: 466–1,050
- తాపీ మేస్త్రీ: 489–871
- పెయింటింగ్: 685–1,450
- అల్యూమినియం ఫ్యాబ్రికేటర్: 265–1,015
- బార్ బెండింగ్: 500–850
- కార్పెంటర్: 625–1,232
- జిప్సం: 766–1,050
- హీటింగ్, వెంటిలేషన్, ఏసీ వర్కర్లు(హెచ్‌వీఏసీ): 1,400
- ప్లంబర్లు: 450–887
- షట్టరింగ్: 417–875
- ఫ్లోరింగ్, టైల్స్: 480–683
- వెల్డింగ్: 628–883

బడ్జెట్‌పై రియల్ ఆశలు

కేంద్ర బడ్జెట్‌పై స్థిరాస్తి రంగం గంపెడాశలు పెట్టుకుంది. అందుబాటు గృహాల రాయితీలు, రుణ, వడ్డీ మినహాయింపులు తదితరాలతో 2025–26 బడ్జెట్‌లో వరాల జల్లు కురిపిస్తుందని రియల్టీ నిపుణులు ఆశలు పెట్టుకున్నారు. కేంద్రం ఆశించిన 'హౌసింగ్ ఫర్ ఆల్' అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే అందుబాటు గృహాల సరఫరా పెరగాలి. డెవలపర్లు ఈ తరహా ప్రాజెక్ట్‌లను చేపట్టాలంటే ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. కొనుగోలుదారులకు సులభ రుణాలు, వడ్డీ రాయితీలు అందిస్తే అఫర్డబుల్ హౌసింగ్‌కు డిమాండ్ ఏర్పడుతుంది.

–సాక్షి, సిటీబ్యూరో

53 శాతం వాటా స్థిరాస్తి రంగానిదే..

- స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో దేశీయ నిర్మాణ రంగం వాటా 53 శాతం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 256 అనుబంధ రంగాలు ఈ రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడి ఉన్నాయి. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం స్థిరాస్తి రంగమే. సుమారు 8 కోట్ల మంది ఈ విభాగంలో పనిచేస్తున్నారు.



- ప్రస్తుతం దేశంలో 1.01 కోట్ల అందుబాటు గృహాల కొరత ఉంది. 2030 నాటికి ఇది 3.12 కోట్లకు పెరుగుతుందని అంచనా.
- అందుబాటు గృహాల సరఫరా 2021లో 26 శాతంగా ఉండగా.. 2024 నాటికి 17 శాతానికి తగ్గింది.

పరిశ్రమ ఏం కోరుతోందంటే?



- ఏటేటా భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో అఫర్డబుల్ హౌసింగ్ రాయితీలు అందుకోవాలంటే ఆ మేరకు ఇళ్ల ధర పరిమితిని కూడా పెంచాలి. 2017 నుంచి స్థలాల ధరలు సుమారు 50 శాతం మేర పెరిగాయి. కాబట్టి రూ.45 లక్షలుగా ఉన్న అందుబాటు గృహాల ధరలను కూడా పెంచాలి.
- మెట్రో నగరాల్లో అఫర్డబుల్ హౌసింగ్ కార్పెట్ ఏరియాను 60 చ.మీ. నుంచి 70 చ.మీ.లకు పెంచాలి. టైర్–1 నగరాల్లో 90 చ.మీ. కార్పెట్ ఏరియాను అలాగే కొనసాగించాలి.
- అఫర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లకు 15 శాతం కార్పొరేట్ ట్యాక్ రేటును అందించాలి. దీంతో డెవలపర్లు ఈ తరహా ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు ముందుకు వస్తారు. దీంతో అఫర్డబుల్ హౌసింగ్‌లో డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసం తగ్గుతుంది.
- గృహ కొనుగోలుదారులకు వడ్డీ మినహాయింపు ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉండగా.. దీన్ని రూ.5 లక్షలకు పెంచాలి.
- రుణదాతల నష్టాలను తగ్గించేందుకు రూ.70 లక్షల వరకు గృహ రుణానికి, రూ.30 లక్షల వరకు గృహ రిపేర్ల రుణాలకు కూడా క్రెడిట్ గ్యారంటీ స్కీమ్‌ను వర్తింపజేయాలి.
- తొలిసారి గృహ కొనుగోలుదారులకు సెక్షన్ 80సీ కింద ప్రిన్సిపల్ రీపేమెంట్‌లో రూ.5 లక్షల తగ్గింపును అందజేయాలి.
- తయారీ, ఫార్మా, ఐటీ తదితర రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి. దీంతో కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న 'హౌసింగ్ ఫర్ ఆల్'ను చేరుకోవడం సులభమవుతుంది.



ఇల్లు కొంటున్నారా..? పంచ సూత్రాలివే..

సొంతిల్లు ప్రతి ఒక్కరి జీవిత కల. పైసా పైసా కూడబెట్టి, గృహ రుణంతో సొంతింటి కలను నెరవేర్చుకుంటారు. గృహ కొనుగోలు నిర్ణయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, నిర్లక్ష్యం వహించినా కష్టార్జితమంతా వృథా అవుతుంది. మరీ ముఖ్యంగా తొలిసారి గృహ కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రాపర్టీని కొనుగోలు చేయడం అంటే కేవలం ఆర్థికపరమైన నిర్ణయం మాత్రమే కాదు.. జీవనశైలి ఎంపిక. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే అందుబాటు ధరలు, అభివృద్ధి అవకాశాలు, దీర్ఘకాలిక పెట్టుబడికి సరైనది హైదరాబాద్. నగరంలో గృహ కొనుగోలుదారులు ఈ పంచ సూత్రాలు పాటిస్తే సొంతింటిని దక్కించుకోవచ్చు. – సాక్షి, సిటీబ్యూరో



- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కోకాపేట ప్రాంతాలు విలాసవంతమైన జీవనం, పెట్టుబడుల వృద్ధిలో అగ్రస్థానంలో ఉన్నాయి. వృద్ధి సమతుల్యత, అందుబాటు ధరల కోసమైతే నార్సింగి, కొల్లూరు, రాజేంద్రనగర్, తెల్లాపూర్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను ఎంపిక చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలు ఆధునిక మౌలిక సదుపాయాలు, ఐటీ కారిడార్లకు సమీపంలో ఉండటంతో నివాసం ఉండేందుకు, పెట్టుబడులకు రెండింటికీ అనువైన ప్రాంతాలు.
- లగ్జరీ ప్రాపర్టీల కొనుగోలుదారులు ఇంటి ధరను మాత్రమే కాదు రిజిస్ట్రేషన్ ఫీజులు, ప్రీమియం వసతులు, హైఎండ్ ఇంటీరియర్ కూడా పరిగణలోకి తీసుకోవాలి. విలాసవంతమైన జీవితాన్ని విలువైనదిగా చేసే నిర్వహణ చార్జీలు కూడా ఉంటాయని గమనించాలి.
- విలాసవంతమైన ఇల్లు, దాని నిర్మాణ శైలి గురించి తెలుసుకోవాలి. లగ్జరీ ప్రాపర్టీల అనుభూతిని పొందాలంటే డెవలపర్ కీలక పాత్ర పోషిస్తారు. వారి ఉన్నత నైపుణ్యం, సకాలంలో డెలివరీ, వినూత్నమైన డిజైన్లు, ఎలివేషన్లకు ప్రసిద్ధి చెందిన బిల్డర్ ప్రాజెక్ట్‌లను ఎంచుకోవడం ఉత్తమం. నిర్మాణంలో నాణ్యత, ప్రత్యేకతలు అందించే రెరా ఆమోదిత ప్రాజెక్ట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో స్టేషన్లు, రాబోయే మౌలిక సదుపాయాల ప్రాంతాలలో స్థలాలు, గృహాలను కొనుగోలు చేస్తే తక్కువ కాలంలో విలువ రెట్టింపు అవుతుంది. ప్రైవసీ, ప్రశాంతతను కోరుకునే వారికీ ఈ ప్రాంతాలే బెటర్. రవాణా సదుపాయాలు, కనెక్టివిటీ ఉన్న ప్రాంతాలైతే రాకపోకలు సౌలభ్యంగా ఉంటుంది.



- ఎంపిక చేసిన ప్రాపర్టీకి సంబంధించి న్యాయ నిపుణులు, ప్రొఫెషనల్స్ సలహాలు తీసుకోవాలి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వంటి ప్రభుత్వ విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు గురించి ఆరా తీయాలి.



హ్యాపీ ఫీలింగ్.. హోమ్ గార్డెన్



కాలక్షేపం కోసమో.. ఇష్టమో.. వృత్తి రీత్యానో.. కారణమేదైనా హోమ్ గార్డెనింగ్‌కు డిమాండ్ పెరిగింది. కరోనా కాలంలో ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత కష్టాలను చూసి ఇంట్లోనే ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే మొక్కలను పెంచుకోవడం మేలనే అభిప్రాయం పెరిగింది. మానవ శరీరంలో ఆక్సిజన్ స్థాయిని అధిక మోతాదులో ఉంచడంతో పాటు హానికారక రసాయనాలను పీల్చి పిప్పి చేసే ఇంటి మొక్కలను పెంచుకోవడం అత్యంత అవసరంగా మారిందని పలువురు గార్డెనింగ్ నిపుణులు సూచిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో





హోమ్ గార్డెనింగ్ మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి.. ఆక్సిజన్‌ను విడుదల చేయడంతో పాటు బెంజీన్, ఫార్మాల్డిహైడ్, ట్రైక్లోరెథైలీన్ వంటి అస్థిరమైన సేంద్రీయ కాలుష్య కారకాలను కూడా తొలగిస్తాయని నాసా క్లీన్ ఎయిర్ స్టడీ తెలిపింది. స్వచ్ఛమైన ఆక్సిజన్ మెదడును ప్రేరేపిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. హోమ్ గార్డెనింగ్ మొక్కల ప్రత్యేకత ఏమిటంటే.. వీటికయ్యే వ్యయం చాలా తక్కువ. నిర్వహణ కూడా తేలికే.. పైగా అందంగా, అద్భుతమైన డిజైన్లతో అలంకారప్రాయంగానూ ఉంటాయి. నాసా క్లీన్ ఎయిర్ స్టడీ సూచించిన హోమ్ గార్డెనింగ్ మొక్కలలో కొన్ని..

మనీ ప్లాంట్..

గార్డెనింగ్ ఔత్సాహికులు, అనుభవజ్ఞులకు మనీ ప్లాంట్ సరైన మొక్క. నిర్వహణ కోసం పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అంత త్వరగా ఎండిపోదు. ఇంటి గాలిలోని బెంజీన్లు, ఫార్మాల్డిహైడ్ వంటి విషరసాయనాలను మనీ ప్లాంట్ గ్రహిస్తుంది. వీటిని కుండీల్లో, బుట్టల్లో ఎక్కడైనా వేలాడదీయవచ్చు లేదా నీటి గిన్నెలలో కూడా పెంచుకోవచ్చు. ఇవి నిలువుగా పెరుగుతుంటాయి. ఇంటి లోపల, ఆరుబయట, ప్రవేశ ద్వారం వద్ద వీటిని ఉంచుకోవచ్చు. ఏ మొక్కకైనా సరే అతిగా నీళ్లు పోయకూడదు. ఎంత పరిమాణంలో నీటిని పోయాలో తెలుసుకోవాలంటే అది ఉండే మట్టిని పరిశీలించాలి

స్నేక్ ప్లాంట్..

పాములాంటి ఆకారంలో ఉండటం వల్ల దీనికీ పేరు వచ్చింది. దీన్ని 'మదర్–ఇన్–లా–టంగ్' అని కూడా పిలుస్తుంటారు. ఇండోర్ గార్డెనింగ్ మీద ఆసక్తి ఉన్న వాళ్ల తొలి ప్రాధాన్యం ఈ మొక్కే. తక్కువ కాంతి పరిస్థితుల్లో కూడా ఇది బాగా పెరుగుతుంది. గార్డెనింగ్ మీద అనుభవం లేకపోతే మీరు మొదటగా ప్రయత్నించాల్సిన మొక్క ఇదే.. అంటే ఆశ్చర్యం లేదు. ఎందుకంటే దీని నిర్వహణ అత్యంత సులువు. చాలా తక్కువ నీటి అవసరం ఉంటుంది. చీకటి ప్రదేశంలో, గది మూలల్లోనూ ఇది పెరుగుతుంది. తక్కువ కాంతిలో ఈ మొక్కను ఉంచినప్పటికీ.. స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఇది నిలువుగా పెరుగుతుంది.

రబ్బర్ ప్లాంట్..

మధ్యస్థ స్థాయిలో సూర్యరశ్మి లేదా పరోక్ష పద్ధతిలో సూర్యకాంతిలోనూ పెరగడం రబ్బర్ ప్లాంట్ ప్రత్యేకత. దీనికి ఆకులు పెద్ద సైజ్‌లో ఉంటాయి. అందువల్ల గాలి నుంచి వచ్చే వ్యర్థాలు, దుమ్ము, ధూళి కణాలను చాలా సులువుగా గ్రహిస్తాయి. ఈ మొక్క ఆకులను తరుచూ శుభ్రం చేస్తుండాలి. ప్రతిరోజూ ఒకే సమయంలో ఒకే పరిమాణంలో నీటిని పోయాలి లేకపోతే ఆకులు రాలిపోయే ప్రమాదం ఉంది.

పీస్ లిల్లీ..

కాలుష్య కారకాలను తొలగించడం, కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా ఫార్మాల్డిహైడ్, ట్రైక్లోరెథైలీన్‌లను పీల్చుకోవడంలో, ఇండోర్‌లోని గాలిని శుభ్రం చేయడంలో పీస్ లిల్లీలు అద్భుతంగా పని చేస్తాయన్న విషయం చాలా మందికి తెలియదు. ఇది పుష్పించే మొక్క కాదు. ఇది ఉష్ణ మండల ప్రాంతాల నుంచి వస్తుంది. ఇది పెరగాలంటే నేల, తేమ అవసరం. దీనికి తరచూ నీళ్లు పోస్తుండాలి. ఆకులు పడిపోతున్నాయంటే దీనికి నీటి అవసరం ఉందన్న విషయం మీరు గ్రహించాలి.

చైనీస్ ఎవర్‌గ్రీన్..

ఈ మొక్కలు ఆకుపచ్చ, ఎరుపు రంగులతో పాటు అనేక రకాలుగా వస్తాయి. చైనీస్ ఎవర్‌గ్రీన్ లేదా ఆగ్లోనెమాస్ బహుముఖ ప్రయోజనాలు ఉండే మొక్కలు. వీటి నిర్వహణ సులువు. అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. వీటిని ఇంటీరియర్ డిజైనింగ్‌లో అలంకారప్రాయంగా వినియోగించుకోవచ్చు. అధిక స్థాయిలో ఆక్సిజన్ విడుదల చేయడంతో పాటు హానికారక రసాయనాలను పీల్చుకుంటాయి. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా, ఇంట్లో ఈ మొక్కలు పెరుగుతాయి.

● సుందర ప్రకృతి



పొగమంచు.. పరవశించు

పొద్దెక్కినా పొగమంచు వీడటం లేదు. వాహనాల రాకపోకలు సాగడం లేదు. వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఎటుచూసినా పొగమంచు.. మరోవైపు.. దాగుడుమూతలాడుతున్న సూరీడు.. సుల్తానాబాద్ శివారులో కనువిందు చేసిన దృశ్యాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

● జల భారతి



గోదావరి.. జలసిరి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మించిన మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని పలు చెరువుల్లోకి చేరుతున్నాయి. కరువు ప్రాంతమైన ఆలేరు నియోజకవర్గం ఇప్పుడు గోదారమ్మ స్పర్శతో జలసిరి సంతరించుకుంది. బస్వాపూర్, గంధమల్ల చెరువులు పూర్తిగా నిండి అలుగు పోస్తుండటంతో.. కింది భాగంలోని చెరువులు, వాగులు, కాల్వలు, చెక్‌డ్యామ్‌లు నిండాయి. – యాదగిరిగుట్ట

● సంధ్యా హారతి



భానుడి తోడు.. చేరాయి గూడు

గడ్డి మోపులు.. కాల్వ గట్టులు.. సెమట సుక్కల్లో తడిసిన ఈ మట్టి గంధాల ఊరు పల్లెటూరు.. దీని తీరే అమ్మ తీరు.. అన్నాడొక సినీ కవి. పల్లె అంటేనే పరవశం. అలాంటి అందమైన.. ఆహ్లాదకరమైన వాతావరణం సిద్దిపేట జిల్లా ఎన్సాన్‌పల్లి శివారులో శుక్రవారం సాయంత్రం సాక్షాత్కరించింది. భానుడితో పోటీ పడినట్టు.. గుంపులు గుంపులుగా పక్షులు గూళ్లకు చేరుతున్న మనోహర దృశ్యమిది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సాక్షి, సిద్దిపేట


రామోజీపై 'రాజ' భక్తి!

- మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వసూలుపై బాబు సర్కారు దాటవేత..
- వసూలు చేసిన డిపాజిట్లు చెల్లించేశారని హైకోర్టుకు వెల్లడి
- సెక్షన్ 45 ఎస్ గురించి నామమాత్రంగా కూడా ప్రస్తావించని వైనం

సాక్షి, అమరావతి: తన రాజగురువు రామోజీరావు పట్ల టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి భక్తిని చాటుకున్నారు. సాక్షాత్తూ సుప్రీం కోర్టు స్వయంగా జోక్యం చేసుకుని.. మార్గదర్శి, రామోజీ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారా? లేదా? అనే అంశాన్ని తేల్చాలని హైకోర్టును ఆదేశించగా.. చంద్రబాబు సర్కార్ దాన్ని పూర్తిగా విస్మరిస్తూ అక్రమాలకు పాల్పడ్డ రామోజీ కుటుంబాన్ని రక్షించడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరించింది. తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావు ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా వసూలు చేసిన రూ.2,610 కోట్ల డిపాజిట్లు గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడలేదు. ఆ అక్రమ డిపాజిట్ల గురించి వాస్తవాలను కోర్టుకు వెల్లడిస్తే మార్గదర్శి, రామోజీ కుటుంబానికి ఇబ్బందులు తప్పవని గుర్తించడంతో చంద్రబాబు ప్రభుత్వం ఆ విషయం జోలికే వెళ్లలేదు. పైగా ప్రజల నుంచి డిపాజిట్ల రూపంలో అక్రమంగా వసూలు చేసిన రూ.వేల కోట్లను తిరిగి వారికి చెల్లించేశామని, అందువల్ల తమను వదిలేయాలంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావు ఇన్నేళ్లుగా కోర్టుల్లో చేస్తూ వస్తున్న వాదననే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం సైతం అందుకుంది. ప్రజల నుంచి వసూలు చేసిన డిపాజిట్ల మొత్తంలో రూ.5.15 కోట్లు మినహా అత్యధిక భాగాన్ని తిరిగి చెల్లించేసిందని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. రూ.5.15 కోట్ల డబ్బు 1,270 మంది డిపాజిటర్లకు సంబంధించిందని, అయితే వారెవరూ ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేయడం లేదని ఏపీ ప్రభుత్వం తన కౌంటర్ ద్వారా హైకోర్టుకు తెలిపింది. ఎస్క్రో ఖాతాలో ఉన్న ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు గానీ ఆర్‌బీఐకి గానీ బదలాయించాలంటూ వింత అభ్యర్థనను హైకోర్టు ముందుంచింది. ఎవరైనా డిపాజిటర్లు వస్తే వారికి ఆ మొత్తాలను తామే చెల్లిస్తామని ప్రతిపాదించింది. తద్వారా అక్రమ డిపాజిట్ల వ్యవహారం నుంచి రామోజీ కుటుంబాన్ని బయటపడేసేందుకు మార్గాన్ని సుగమం చేసేందుకు యత్నించింది. రామోజీరావు గత ఏడాది జూన్ 8న చనిపోయారంటూ ఆయన మరణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. అసలు మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందా? అన్న దానిపై కూడా విచారణ జరపాలని కౌంటర్‌లో హైకోర్టుని కోరింది.

దాటవేత ధోరణే...

రామోజీరావు భారీ ఆర్థిక అవకతవకలపై చంద్రబాబు ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో పూర్తి దాటవేత ధోరణిని ప్రదర్శించింది. ఈ కౌంటర్‌లో ఎక్కడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టంలోని సెక్షన్ 45ఎస్‌ను మార్గదర్శి, రామోజీరావు ఉల్లంఘించిన విషయం గురించి ప్రస్తావించనే లేదు. చట్ట విరుద్ధంగా రూ.వేల కోట్లను ప్రజల నుంచి డిపాజిట్ల రూపంలో మార్గదర్శి వసూలు చేసిందని స్వయంగా రిజర్వ్ బ్యాంకే చెప్పినా చంద్రబాబు సర్కారు ఆ అంశం జోలికి వెళ్లలేదు. డిపాజిట్లను వెనక్కి ఇచ్చేసిందని మాత్రమే చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. రామోజీరావు చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారన్న విషయాన్ని మాత్రం చెప్పడం లేదు. మార్గదర్శిపై నాంపల్లి కోర్టులో ఎవరు ఫిర్యాదు చేశారు? ఆ తరువాత కోర్టుల్లో ఏమైంది? తిరిగి తెలంగాణ హైకోర్టు ఎందుకు విచారణ జరుపుతోంది? లాంటి అందరికీ తెలిసిన విషయాలనే కౌంటర్‌లో పొందుపరిచింది. అంతే కాక రామోజీ, మార్గదర్శి ఆర్థిక అవకతవకలపై అధీకృత అధికారిగా వ్యవహరిస్తున్న కృష్ణరాజు విచారణ జరపవచ్చో లేదో తేల్చాలని హైకోర్టును కోరింది. మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిన అవసరంపై కూడా విచారణ జరపాలని కౌంటర్‌లో కోరింది.



పర్యవేక్షణ విభాగ
RESERVE BANK OF INDIA
DEPARTMENT OF SUPERVISION
Secretariat Road, Saifabad,
HYDERABAD - 500 004.

DoS (FCW) H.No./ 554 /AP/MNBC/M-1/97-98 24.12.1997

M/s. Margadarsi Financiers,
Margadarsi House,
4-1-833/2, Abid Centre,
HYDERABAD - 500 001.

Dear Sir

Prohibition of acceptance of deposits by unincorporated bodies - RBI (Amendment) Act, 1997

It has been brought to our notice that your firm is accepting deposits from public which is in violation of the provisions of Section 45 S of the RBI (Amendment) Act, 1997. In this connection we invite your attention to the penal provisions contained in Section 58 B of the said Act for contravention of the provisions of Section 45 S. We advise you to comply with the relevant provisions of the RBI Act.

ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేస్తున్నారంటూ మార్గదర్శికి స్పష్టం చేసిన రిజర్వ్ బ్యాంక్

చనిపోయారు కాబట్టి కేసు కొట్టేయండి...

ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్‌కి విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేసినట్లు రుజువులు కూడా ఉండటం, విచారణ జరిగితే శిక్ష, భారీ జరిమానా ఖాయం కావడంతో రామోజీ మరణాన్ని అడ్డం పెట్టుకుని ఈ గండం నుంచి బయటపడాలని మార్గదర్శి ప్రస్తుత యాజమాన్యం భావిస్తోంది. అందులో భాగంగానే చంద్రబాబు ప్రభుత్వం చేత తమకు కావాల్సిన విధంగా కౌంటర్ దాఖలు చేయించింది. రామోజీ మరణించారని ఏపీ ప్రభుత్వం చేత ప్రత్యేకంగా చెప్పించడమే కాకుండా ఇక ఈ కేసు విచారణను కొనసాగించాల్సిన అవసరం లేదన్న రీతిలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పెద్దలు కౌంటర్‌లో రాయించారు. మరోవైపు మార్గదర్శి ఫైనాన్షియర్స్ యాజమాన్యం కూడా ఇదే వాదనతో హైకోర్టులో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. రామోజీ మరణంతో ఇక ఈ కేసులో విచారించడానికి ఏమీ లేదని అందులో పేర్కొంది. ఈ కేసుపై విచారణ జరపడం నిష్ప్రయోజనమని పేర్కొంది. పూర్తిస్థాయి వాదనలకు ముందే ఈ విషయాన్ని తేల్చాలని తెలంగాణ హైకోర్టును కోరింది. హెచ్‌యూఎఫ్ కర్తగా ఉన్న రామోజీ మరణించడంతో ఆ హెచ్‌యూఎఫ్‌లో సభ్యులుగా ఉన్న వారికి నేరాన్ని ఆపాదించడాన్ని వీల్లేదని నివేదించింది.

వసూలు చేశాం... వెనక్కి ఇచ్చేశాం

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా తాము ప్రజల నుంచి రూ.2,596.98 కోట్లు అక్రమంగా వసూలు చేసిన మాట వాస్తవమేనని మార్గదర్శి ఫైనాన్షియర్స్ హైకోర్టు ముందు అంగీకరించింది. వసూలు చేసిన డిపాజిట్లలో అత్యధిక మొత్తాన్ని తిరిగి చెల్లించేశామని, మిగిలి ఉన్న మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో ఉంచామంది. ఈమేరకు ఆర్‌బీఐ కౌంటర్‌కు మార్గదర్శి ఫైనాన్షియర్స్ తిరుగు సమాధానం ఇచ్చింది.

విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ నర్సింగ్‌రావు

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక అవకతవకలకు సంబంధించి జరుగుతున్న విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు తప్పుకున్నారు. గతంలో తాను మార్గదర్శి తరఫున దాఖలైన కేసుల్లో న్యాయవాదిగా ఉన్నానని, అందువల్ల ఈ వ్యాజ్యంపై విచారణ జరపలేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యాజ్యాలను తగిన ధర్మాసనం ముందుంచేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందుంచాలని జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ నర్సింగరావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ తేదీని, విచారణ ధర్మాసనాన్ని ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి అక్రమ డిపాజిట్ల సేకరణపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు శుక్రవారం జస్టిస్ శ్యామ్ కోషి నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. మార్గదర్శి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకుడిగా మాజీ ఎంపీ అరుణ్ కుమార్, ఏపీ స్పెషల్ జీపీ రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ పీపీ పల్లె నాగేశ్వర్‌రావు విచారణకు హాజరయ్యారు. రామోజీ మరణించిన నేపథ్యంలో ఈ కేసును కొట్టేయాలని, దీనిపై అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ముకుల్ రోహత్గీ చేసిన ఈ అభ్యర్థన పెద్ద చర్చనీయాంశంగా మారింది. భారీ ఆర్థిక నేరానికి పాల్పడిన వ్యక్తి చనిపోయినంత మాత్రాన అతను నేరం చేయనట్లుగా భావించాల్సిన అవసరం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ కౌంటర్ దాఖలు చేయగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సీఐడీ, ఆర్థిక నేరాల విభాగం ఎస్పీ కొల్లి వెంకట లక్ష్మీ కౌంటర్ దాఖలు చేశారు.

"45 ఎస్"ఏం చెబుతోందంటే..?

రామోజీరావు హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు. 1997లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ప్రకారం హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్ కార్పొరేటెడ్ (చట్టపరంగా ఓ కంపెనీగా రిజిష్టర్ కాకుండా వ్యాపారం చేసేవి) సంస్థలు వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. డిపాజిట్లు వసూలు చేసేందుకు హెచ్‌యూఎఫ్‌లకు ఆర్‌బీఐ ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదు. దీన్ని ఖాతరు చేయకుండా రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి 2006 మార్చి నాటికి దాదాపు రూ.2,610.38 కోట్లు అక్రమంగా వసూలు చేసింది.

బాబు బాటలోనే రేవంత్..

ప్రజల నుంచి మార్గదర్శి చట్టవిరుద్ధంగా రూ.2,610 కోట్లు వసూలు చేసిన వ్యవహారంలో రేవంత్‌రెడ్డి సర్కార్ సైతం చంద్రబాబు బాటనే ఎంచుకుంది. రామోజీరావు, మార్గదర్శి అక్రమ డిపాజిట్ల గురించి తెలంగాణ ప్రభుత్వం కూడా నోరు మెదప లేదు. రూ.2610 కోట్లను మార్గదర్శి వసూలు చేయడం చట్ట విరుద్ధమా? కాదా? అన్న విషయం గురించి కనీస స్థాయిలో కూడా మాట్లాడలేదు. చట్టవిరుద్ధ డిపాజిట్ల గురించి మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమానికి ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు కలగకుండా అటు చంద్రబాబు ప్రభుత్వం, ఇటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చాలా లౌక్యంగా, వాస్తవాల జోలికి వెళ్లకుండా కౌంటర్లు దాఖలు చేశాయి. అందరికీ తెలిసిన, కోర్టుల్లో ఇప్పటి వరకు జరిగిన విషయాలనే తెలంగాణ ప్రభుత్వం తన కౌంటర్‌లో వివరించింది. వాస్తవానికి మార్గదర్శిపై నాంపల్లి కోర్టులో అధీకృత అధికారి కృష్ణరాజు ఫిర్యాదు ఎందుకు దాఖలు చేశారు? మార్గదర్శి, రామోజీపై ఉన్న ఆరోపణలు ఏంటి? ఆర్‌బీఐ ఏం చెప్పింది? సుప్రీంకోర్టు ఏం చెప్పింది? తెలంగాణ హైకోర్టు ఏం చెప్పింది? తదితర వివరాలను తమ కౌంటర్‌లలో పూర్తిస్థాయిలో పొందుపరిచే అవకాశం ఉన్నప్పటికీ గురుశిష్యుల ప్రభుత్వాలు రామోజీపై తమ భక్తిని చాటుకుంటూ కౌంటర్లు దాఖలు చేశాయి.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, జూపల్లి, వెన్నెల, సూర్య

గద్దర్ 'కోహినూర్' లాంటివారు

- వ్యక్తులు అగౌరవపరిస్తేనో లేదా గుర్తించనంటేనో ఆయన విలువ తగ్గదు
- ప్రజాసమస్యలపై పోరాడిన సిద్ధాంతకర్తగానే ఆయన్ను చూడాలి
- గద్దర్ గురించి కేంద్ర మంత్రి ఇంకోసారి తప్పుగా మాట్లాడితే వారి పార్టీ గల్లీకి గద్దర్ పేరు పెడతా
- గద్దర్ 77వ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీనే గౌరవించనోళ్లు ప్రజాగాయకుడు, దివంగత గద్దర్‌ను గౌరవిస్తారని ఎలా ఆశించగలమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరోక్షంగా బీజేపీ నేతలను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. సామాజిక సమస్యలపై పోరాడిన సిద్ధాంతకర్తగానే గద్దర్‌ను చూడాలని ఆయన సూచించారు. చివరిశ్వాస వరకు సిద్ధాంతం కోసమే గద్దర్ పనిచేశారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన గద్దర్ 77వ జయంతి వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

ఓ కేంద్ర మంత్రి గద్దర్‌కు అవార్డు కుదరదన్నారు..

తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చిన గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న వంటి పేర్లను పద్మ పురస్కారాలకు ప్రతిపాదిస్తే కేంద్రం ఒక్కరికీ ఇవ్వలేదు. దురదృష్టవశాత్తూ ఓ కేంద్ర మంత్రి గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వబోమని, గౌరవించబోమని మాట్లాడారు. ఆయనకు ఓ మాట చెప్పదలుచుకున్నా. మరోసారి మీరు, మీ పార్టీ వారు గద్దర్‌ను ఏమన్నా అంటే మీ పార్టీ ఉన్న ప్రాంతానికి గద్దర్ పేరు పెడతా. మీరు అడ్రస్ రాసుకొనేటప్పుడు గద్దర్ గల్లీ అని రాసుకోవాల్సి ఉంటుంది. ప్రతి దానికీ మా దగ్గర మందుంది' అని రేవంత్ పరోక్షంగా బీజేపీని హెచ్చరించారు.

గద్దర్‌ను గేటు బయట కూర్చోబెట్టిన ఆయన ఇప్పుడు గేటు వద్ద నిల్చున్నాడు

'ఇంతకు ముందున్న వ్యక్తి ఇలాగే గద్దర్‌ను గేటు బయట కూర్చో బెట్టాడు. ఆయనే గొప్ప అనుకున్నాడు. ఆయన గద్దె దిగిపోయాడు. గేట్లు కూలాయి. గద్దర్ వారసులు ఇప్పుడు లోపల ఉన్నారు. ఆయన్ను గేటు దగ్గర కూర్చోబెట్టిన వ్యక్తి ఇప్పుడు గేటు బయటకూర్చొని ఎవరన్నా నా దగ్గరకు వస్తారా? అని ఎదురు చూస్తున్నారు' అంటూ సీఎం రేవంత్ పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గద్దర్ మరణించినప్పుడు ఆయన పార్థివదేహానికి ప్రజలు నివాళులర్పించేందుకు వీలుగా ఎల్బీ స్టేడియానికి తరలిద్దామనుకుంటే నాటి ప్రభుత్వం స్టేడియం గేట్లకు తాళాలు వేయించిందని రేవంత్ ఆరోపించారు. గేట్లు బద్దలుకొడతామని తాము హెచ్చరించడంతో స్టేడియం లోపలకు అనుమతించిందన్నారు.

ఒంటరిగా భావించినప్పుడు గద్దర్‌ను కలిసేవాడిని..

'నాకు గద్దరన్నతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎప్పుడైనా నిరాశకు గురైనప్పుడు, రాజకీయంగా, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు, ఒంటరిగా భావించినప్పుడు ఆయనతో కూర్చొని మాట్లాడేవాడిని. నీ బాధ్యత నువ్వు నెరవేర్చు. ప్రజలే నిన్ను గుర్తించి అండగా నిలస్తారని ఆయన చెప్పేవారు. ఆ మాటే నిజమైంది' అని సీఎం రేవంత్ చెప్పారు.

కోహినూర్ విలువ ఎక్కడైనా ఒక్కటే

'గద్దర్‌కు మేమే అవార్డు ఇస్తాం. రాహుల్‌తో మాట్లాడి మేమే సంతకం పెడతాం. వ్యక్తులు అగౌరవపరిస్తేనో, గుర్తించనంటేనో విలువ తగ్గదు. కోహినూర్ డైమండ్ విలువ ఎక్కడైనా ఒక్కటే. గద్దరన్న కోహినూర్ లాంటి వాడే. గద్దర్ బిడ్డ వెన్నెలను సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమిస్తున్నాం. గద్దర్ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం' అని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కోదండరాం, గంటా చక్రపాణి, అల్లం నారాయణ, పాశం యాదగిరి, జె. శ్రీనివాస్, విమలక్క తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా గద్దర్ సినీ అవార్డులు: భట్టి

సమాజంలో ప్రతిఒక్కరూ చదువుకోవాలన్న గద్దర్ ఆలోచన ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గద్దర్ 77వ జయంతి కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం గద్దర్ రచించిన మా పల్లె పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాబోయే ఉగాది రోజున గద్దర్ పేరిట ప్రదానం చేయనున్న సినిమా అవార్డులు చరిత్రలో నిలిచిపోతాయన్నారు.

174 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట

- క్రమబద్ధీకరణపై హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు విషయంలో తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఫాస్ట్ ట్రాక్ (జిల్లా కోర్టులు, ట్రిబ్యునల్స్) కోర్టుల్లో 174 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ 2021 ఏప్రిల్ 1న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీనిని పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు హైకోర్టులో సవాల్ చేస్తూ, విడివిడిగా 8 పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. 2023, జూన్ 12న ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. పది సంవత్సరాలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగులుగా చేస్తున్న వారిని క్రమబద్ధీకరణ చేయాల్సిన అవసరం ఉందంటూ న్యాయమూర్తులు జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం తీర్పు చెప్పింది. వీరందరినీ కాంట్రాక్టు ఉద్యోగాల్లో నియమించేప్పుడు ఒక విధానాన్ని అమలు చేసి ఉండకపోవచ్చునని, అయితే చట్ట వ్యతిరేకంగా జరగలేదని స్పష్టం చేసింది. అన్ని అర్హతలు ఉన్న టైపిస్ట్, క్లర్క్, ఆఫీస్ సబార్డినేట్ వంటి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీ, ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ జూలై 27, 2023న తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) సుప్రీంకోర్టు లో రెండు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ రిజిస్ట్రార్ పిటిషన్లు కొట్టివేసింది.

సమస్య సశేషం.. నిరుద్యోగికి నిరాశ

- అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయసు పెంపుపై పెదవి విరుపులు
- దీనివల్ల వర్సిటీల్లో సమస్యలు తీరే అవకాశం లేదని విమర్శలు
- కొత్త నియామకాలు మరింత జాప్యమవుతాయని ఆందోళన
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరాశే



సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పదవీ విరమణ వయో పరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచటం కొత్త నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం వల్ల యూనివర్సిటీల్లో ఇప్పట్లో నియామకాలు చేపట్టే అవకాశం ఉండదని చెబుతున్నారు. దీంతో అధ్యాపక పోస్టుల భర్తీ కోసం వేచి చూస్తున్న నిరుద్యోగ యువతకు నిరాశే మిగలనుంది. 2013 నుంచి యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టలేదు. దీంతో బోధన సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఇటీవల వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు ప్రభుత్వానికి తెలిపారు. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వర్సిటీల్లో దాదాపు 74 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంజూరైన మొత్తం పోస్టులు 2,825 కాగా, ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ సిబ్బంది 873 మంది మాత్రమే ఉన్నారు.

కామన్ బోర్డు ఎత్తేసినట్టే..

అన్ని యూనివర్సిటీలకు కలిపి ఒకేసారి నియామకాలు చేపట్టాలని 2023లో అప్పటి ప్రభుత్వం భావించి, కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసింది. గతంలో ఆయా యూనివర్సిటీలే సొంతంగా నియామకాలు చేపట్టేవి. ఈ విధానం వల్ల అవినీతికి ఆస్కారం ఉందని నిపుణులు ప్రభుత్వానికి విన్నవించటంతో కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును తెరపైకి తెచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం దానిని పక్కనబెట్టింది. కొత్తగా కాలేజీ సర్వీస్ కమిషన్ తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వర్సిటీల్లో ఖాళీలను ఈ కమిషన్ గుర్తిస్తుంది. నియామకాలు మాత్రం వర్సిటీల వారీగానే చేపట్టే వీలుందని అధికారులు తెలిపారు. దీనివల్ల న్యాయపరమైన సమస్యలు వస్తాయని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. దీంతో చట్టం తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ కారణంగా నియామకాలను వాయిదా వేసింది.

సమస్య మామూలే..

అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితి పెంచడం వల్ల దాదాపు 500 మంది మరికొంతకాలం కొనసాగుతారు. అయితే, వర్సిటీల్లో ప్రస్తుతం 873 మంది మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉండటంతో వెంటనే నియామకాలు చేపట్టకపోతే సమస్య తీరే అవకాశమే లేదని ఉన్నత విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. అధ్యాపకుల కొరత కారణంగా ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలతో ఇవి పోటీ పడలేకపోతున్నాయి. ఉస్మానియా వర్సిటీలో పరిశోధన ప్రాజెక్టులు తగ్గిపోయాయి. 2020-21లో రూ.52.45 కోట్ల ప్రాజెక్టు లొస్తే.. 2022-23 నాటికి రూ.24.75 కోట్లకు తగ్గాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి కోర్సులను నిర్వహించలేకపోతున్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో 410 మంది అధ్యాపకులు అవసరం ఉండగా, 169 మందే ఉన్నారు. 241 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బాసర ట్రిపుల్ ఐటీలో చాలాకాలంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లేదు. ఇక్కడ 90 మంది బోధన, 100 మంది బోధనేతర సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు.

యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పరిస్థితి ఇదీ..

వర్సిటీ	మంజూరైన పోస్టులు	ఉన్న సిబ్బంది	ఖాళీలు
ఉస్మానియా	1,257	376	891
కాకతీయ	409	86	323
జేఎన్‌టీయూహెచ్	410	169	241
అంబేద్కర్	86	34	52
తెలంగాణ	152	61	91
మహాత్మాగాంధీ	70	35	35
పాలమూరు	95	21	74
శాతవాహన	63	16	47
జేఎన్ఏఫైన్ ఆర్ట్స్	55	17	58
పీఎస్‌టీయూ	72	14	58
ఆర్‌జీయూకేటీ	146	19	127



సీఎంతో దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధుల భేటీ

కస్తుర్బా విద్యాలయాల్లో సేవలు అందించాలని సీఎం సూచన

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీసుకొచ్చేందుకు పనిచేస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు.. ఆంగ్ల శిక్షణ ఇవ్వడంతో పాటు వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు దేశ్‌పాండే ఫౌండేషన్ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఫౌండేషన్ కార్యకలాపాలను రాష్ట్రంలోనూ విస్తరింపజేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిను దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ రాష్ట్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సేవలు అందించాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని కోరారు. సీఎం సూచనలకు దేశ్‌పాండే ఫౌండేషన్ అంగీకరించింది. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురురాజ్ దేశ్ పాండే, జయశ్రీదేశ్ పాండే, రాజు రెడ్డి, జి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్ థింగ్ స్పెషల్



వరుడే పెళ్లి మంత్రాలు చదివాడు!

వివాహక్రతువులో పురోహితులు వేదమంత్రాలు చదవడం సాధారణమే. అయితే ఈ వరుడు మాత్రం తన పెళ్లికి తానే స్వయంగా మంత్రాలు చదువుకున్నాడు!

హరిద్వార్‌లోని కుంజా బహదూర్‌పూర్‌లో జరిగిన పెళ్లిలో వరుడు వివేక్ పురోహితుడుగా మారిపోయాడు. వేదమంత్రాలు చదివి అందరి దృష్టిని ఆకర్షించాడు. అప్పుడెప్పుడో ఆసక్తితో వేదమంత్రాలను నేర్చుకున్నాడు వివేక్. తన వివాహంలో వేదమంత్రాలను చదవడంతో పాటు, వివాహ ఆచారాలను స్వయంగా చేయాలని నిర్ణయించుకున్నాడు.

ప్రస్తుతం ఈ వీడియో నెట్‌లోకంలో చక్కర్లు కొడుతోంది.

'లక్కీ పెళ్లి కూతురు'

'ఈ తరానికి వైదిక జ్ఞానం తప్పనిసరిగా ఉండాలి'

'గుడ్ జాబ్'... ఇలా రకరకాలుగా నెటిజనులు స్పందించారు.

గురుకుల్ కాంగ్రీ యూనివర్శిటీలో బీఫార్మసీ చదువుతున్న వివేక్ చిన్నప్పటి నుంచి ఆర్య సమాజ్‌కు చెందిన పాఠశాలల్లో చదువుకున్నాడు.

ఎవరికి 'చెప్పు'కోవాలి?



చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహాకుంభమేళకు సంబంధించిన ఎన్నో వీడియోలు వైరల్ అవుతున్నాయి. తాజా వీడియో విషయానికి వస్తే...

కుంభమేళాకు వచ్చిన భక్తులు ఆలయం బయట విడిచిన చెప్పులను కనుక్కోవడం మహా కష్టంగా మారింది. భక్తులు తమ పాదరక్షలను కనిపెట్టడం కోసం పడుతున్న పాట్లకు ఈ వీడియో అద్దం పట్టింది.

'మీ బాధ నాకు బాగా అర్థమైంది. ఎందుకంటే నేను కూడా చెప్పులు పోగొట్టుకున్నాను' అని స్పందించాడు ఒక భక్తుడు.

'చెప్పులు వేసుకోకుండా వెళితే అనవసరమైన టెన్షన్‌లు ఉండవు కదా' అని మరో భక్తుడు సలహా ఇచ్చాడు.

కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చెప్పులను చూసి 'చెప్పుల సముద్రాన్ని చూసినట్లుగా ఉంది!' అని ఒక యూజర్ చమత్కరించాడు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం గురించి పత్రికలు, టీవీలు మాట్లాడుతూనే ఉన్నాయి. రాబోతున్న ప్రమాదాలను హెచ్చరిస్తూనే ఉన్నాయి. ఏటా చేయించుకోవాల్సిన పరీక్షల గురించి గుర్తు చేస్తూనే ఉన్నాయి. కానీ రావలసినంత చైతన్యం వచ్చిందా అంటే సమాధానం ప్రశ్నార్థకమే. మనదేశంలో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్ కేసులే అందుకు ఉదాహరణ. ఏడాదిలో ఒక నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా పాటిస్తే సరిపోయే పరిస్థితి కాదు. ఏడాది పొడవునా నిరంతరాయంగా నిర్వహించాల్సిన కార్యక్రమం అంటున్నారు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ప్రజ్ఞ ఉన్నతచదువుల కోసం యూకే వెళ్లారు. చదువు పూర్తిచేసుకుని వైద్యసేవలందించడానికి తిరిగి ఇండియాకి వచ్చిన తర్వాత మనదేశంలో మహిళల ఆరోగ్య పరిస్థితి ఆమెకు అవగతమైంది. మహిళలను చైతన్యవంతం చేయడానికి గ్రామాల బాట పట్టారామె.

ఉమన్ క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ యూనిట్



• క్యాన్సర్ అవేర్‌నెస్

చిగురిస్తున్న చైతన్యం

ప్రస్తుత కాలంలో చాపకింద నీరులాగ బ్రెస్ట్ క్యాన్సర్ పేట్రేగిపోతోంది. నలభై దాటిన వారికే కాదు కొత్త జనరేషన్‌లో ముప్పైలోపే చూస్తున్నాం. సాధారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి చిన్నవయసులోనే మెచ్యూర్ కావడం, మెనోపాజ్ ఆలస్యం కావడం, మానసిక శూన్యత, తొలి గర్భం ఆలస్యం కావడం, బ్రెస్ట్ ఫీడింగ్ ఇవ్వకపోవడం వంటి కారణాలను గుర్తిస్తాం. అలాగే క్యాన్సర్‌కు ఫ్యామిలీ హిస్టరీని ప్రధాన కారణంగా చూసేవాళ్లం. ఇప్పుడు లైఫ్‌స్టైల్ కారణం కూడా తీవ్రంగా కనిపిస్తోంది. యువతులు ఉద్యోగం కారణంగా బిడ్డలకు పాలివ్వలేకపోవడం మనసును బాధించే కారణం. నగరాల్లో ఉండేవారికి పొల్యూషన్ ఒక సామాజిక కారణం. వీటికితోడు ఈ జనరేషన్ అమ్మాయిలు ఆల్కహాల్, స్మోకింగ్ దురలవాట్లకు బానిసలవుతున్నారు. ఆలస్యంగా గుర్తించడం వల్ల డాక్టర్‌ల దగ్గరకు వెళ్లేటప్పటికే వ్యాధి అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉంటోంది. ట్రీట్‌మెంట్ అందించినప్పటికీ జీవితకాలాన్ని పొడిగించడం వరకే పరిమితమవుతోంది తప్ప మరణాలను నివారించపోతున్నాం. అందుకే చైతన్యవంతం చేయడం, స్క్రీనింగ్ చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని చెబుతున్నారు డాక్టర్ ప్రజ్ఞ.



డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి

సోషల్‌మీడియాలో వస్తేనే చూస్తున్నారు!

నేటి యువతరం ప్రధాన స్రవంతి మీడియాని పట్టించుకోవడం లేదు. ఆరోగ్య హెచ్చరికలు కాదు కదా ప్రమాద హెచ్చరికలను కూడా ఖాతరు చేయడం లేదు. సోషల్ మీడియాలో ఎవరైనా సెలబ్రిటీ తాను ఫలానా వ్యాధి బారిన పడ్డానని పోస్ట్ పెట్టి, 'మీ ఆరోగ్యం జాగ్రత్త, పరీక్షలు చేయించుకోండి' అని చెబితేనే ఫాలో అవుతున్నారు. అలాంటి ఒక పోస్టు వచ్చిన తర్వాత హాస్పిటల్‌లో సదరు హెల్త్ చెకప్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆరోగ్యవంతమైన సమాజం కోసం వ్యాధులను నివారించగలిగిన ముందస్తు సూచనలను పాటించాలి. అందుకే మేము గ్రామాల బాట పట్టాం. మేము పర్యటించిన గ్రామాల మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ గురించిన చర్చ మొదలైంది. రుతుక్రమం తర్వాత ఐదవ రోజున సెల్ఫ్ ఎగ్జామిన్ చేసుకోవడం మొదలు పెట్టారు. ఈ చైతన్యం చదువుకున్న వారిలోనూ రావాలి.

– డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి,
ఆంకాలజిస్ట్, ఆంకోప్లాస్టిక్ సర్జన్

ఊరూరా పరీక్షలు!

యూసీ బ్రెస్ట్ ఎక్స్‌ప్రెస్ పేరుతో ఫౌండేషన్ స్థాపించి గ్రామాల్లో మహిళలకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేయిస్తున్నారు ప్రజ్ఞ. ఇందుకోసం దాదాపుగా రెండు కోట్ల విలువ చేసే అధునాతనమైన ఎక్విప్‌మెంట్‌తో బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ బస్‌ను రూపొందించారు. ఇందులో ఇద్దరు డాక్టర్లతోపాటు సుశిక్షితులైన బృందం కూడా గ్రామాలకు వెళ్తుంది. మేడ్చల్ జిల్లాలో ఆశావర్కర్‌లు, ఏఎన్ఎమ్‌లతో ప్రారంభించిన సేవలను ఇకపై అన్ని జిల్లాలకూ విస్తరించనుంది. ఆరువందల మందికి స్క్రీనింగ్ చేశారు. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు వర్తించని వారికి యూసీ బ్రెస్ట్ ఎక్స్‌ప్రెస్, గ్రాన్యూల్స్ ఇండియా ట్రస్ట్, ఏఐజీలు సంయుక్తంగా ఉచిత చికిత్స అందిస్తున్నాయి. బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను తెలంగాణ జిల్లాలన్నింటికీ విస్తరించాలని, ఆ తర్వాత ఏపీలో విస్తరణ గురించి ఆలోచిస్తామని చెప్పారు డాక్టర్ ప్రజ్ఞ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, వాళ్లు ఎలాంటి వ్యాపారాలు చెయ్యొచ్చు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, ఆ వ్యాపారాలకు అందుతున్న రుణాలు, వాటిని ఇస్తున్న బ్యాంకులు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్'షి'ప్" పేరుతో ప్రతి శనివారం అందించనున్నాం! ఇందులోని సమాచారం మీద సందేహాలకు ఈ శీర్షికలోనే మెయిల్ అడ్రస్‌నూ ఇస్తున్నాం. ఈ వారం స్కీమ్ 'స్టాండప్ ఇండియా'.



స్టాండప్ ఇండియా

STARTUP INDIA STAND UP India



- ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళల కోసం 2016లో ప్రారంభమైంది. దీనికి 18–60 ఏళ్ల వయసు వాళ్లందరూ అర్హులే!
- రూ. 10 లక్షల నుంచి రూ. కోటి వరకు పూచీకత్తు లేని రుణసహాయం అందుతుంది. 25 శాతం సొంత (రూ. లక్షకు 25 వేలు) పెట్టుబడి, సంబంధిత వ్యాపారంలో కొంత అనుభవం, మార్కెటింగ్ మెలకువలు ఉంటే చాలు.. ఏ బ్యాంక్ నుంచైనా రుణసాయం పొందవచ్చు. ఇవి వ్యాపార సంబంధ యంత్రాలు, వస్తువుల కొనుగోలుకు 75 శాతం లోన్‌ను మంజూరు చేస్తాయి. 11 నుంచి 13 శాతం వడ్డీరేటు ఉంటుంది. యూనిట్ ఏర్పాటు, మార్కెటింగ్‌కి కాకుండా అదనంగా కొంతమేరా వర్కింగ్ క్యాపిటల్‌కూ ధనసహాయం చేస్తాయి.
- వ్యాపారం మొదలుపెట్టిన మూడునెలల కాలపరిమితిలోపు గనుక సక్సెస్ అయితే గవర్నమెంట్ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ నుంచి సబ్సిడీ సదుపాయం కూడా ఉంటుంది.
- మొత్తం పెట్టుబడిలో 45 శాతం ఎస్సీ, ఎస్టీ మహిళలకు, 35 శాతం జనరల్ మహిళలకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ, ప్రోత్సాహకాలు ఉంటాయి.
- ఆధార్, పాన్, రెసిడెన్షియల్ అడ్రెస్ ప్రూఫ్, బ్యాంక్ స్టేట్‌మెంట్ సహా ప్రాజెక్ట్ రిపోర్ట్‌తో ఏ బ్యాంక్‌లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కోసారి అర్హత, అనుభవానికి సంబంధించి బ్యాంక్ సిబ్బంది సర్టిఫికెట్లు అడిగే అవకాశం ఉంది. సంబంధిత వ్యాపారానికి సంబంధించి మార్కెట్, ప్రాంతం వంటివాటిని పరిగణనలోకి తీసుకుని.. దరఖాస్తు అందిన 15 నుంచి 40 రోజుల్లోపు లోన్‌ను మంజూరు చేస్తారు. లోన్ మొత్తాన్ని ఏడేళ్లలోపు చెల్లించాలి.
- ఈ రుణాల కోసం Udyam Aadhaar పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో చేసుకోలేని వారు బిజినెస్ అడ్వయిజర్స్ సాయం పొందవచ్చు.
- మాన్యుఫాక్చర్, సర్వీస్ రంగాలకు చెందిన వ్యాపారాలకు లేబర్ లైసెన్స్, జీఎస్టీలను పొందాలి. వ్యాపారస్థలాన్ని ఎనిమిదేళ్లకు లీజ్ అగ్రిమెంట్ తీసుకోవాలి. లోన్ ద్వారా పొందిన యంత్ర పరికరాలు, ఇతర వస్తువులకు బీమా చేయించాలి.



దీనిద్వారా ఏటా 45 శాతం మంది మహిళలు లబ్ధి పొందుతున్నట్లు అంచనా!

– బి.ఎస్. రత్న, ప్రెసిడెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ

ఫ్యాషన్‌తో కల సాకారం



తాన్యా నాయల్ (కుడి చివర)

అప్పటి వరకు అమ్మనాన్న, కుటుంబ సంరక్షణలో సాఫీగా సాగిపోయే జీవితం ఒక్కసారిగా తలకిందులైతే..! 16 ఏళ్ళ వయసులో తాన్యా జీవితం అలాగే అయ్యింది. తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడం, తండ్రి వదిలేసి వెళ్లటంతో తల్లి దేవేశ్వరి నాయల్ తాన్యాను, ఆమె తమ్ముడిని పెంచటానికి అనేక ఆర్థికపరమైన సవాళ్ళను ఎదుర్కొంది. ఆ సమయంలో కూలిపోతున్న కలల ప్రపంచాన్ని నిర్మించుకోవడానికి తాన్యా తల్లికి చేదోడుగా ఉండి, తను కూడా సొంతకాళ్లపై నిలబడింది. ఫ్యాషన్ డిజైనర్‌గా, విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగింది.

జీవితంలోని ఏదో ఒక దశలో చీకటి క్షణాలు కమ్ముకుంటాయి. ఇలాంటప్పుడు కూడగట్టుకున్న ధైర్యం నిలిచిన విధానం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది. తనను తాను నిలదొక్కుకోవడమే కాకుండా తల్లికి చేదోడుగా ఉంటూ ఎదిగిన తాన్యా యువతకు స్ఫూర్తిగా నిలిచే ఓ పాఠం.

ముంచెత్తే సవాళ్లు

పదహారేళ్ల వయసు అంటే ఎన్నో కలలతో కూడుకున్నది. కుటుంబం నుంచి భద్రతను కోరుకునే కాలం. అలాంటి సమయంలో ఇల్లు అభద్రతలో కూరుకుపోయింది. వయసులో ఉండటం కారణంగా చుట్టూ నిండా ముంచెత్తే సవాళ్లను ఎదుర్కొంది. అయినప్పటికీ జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవడం, అచంచలమైన స్ఫూర్తితో, ఆమె తన పరిస్థితుల సంక్లిష్టతలను బ్యాలెన్స్ చేసుకోగలిగింది. సరైన చదువు లేకపోవడంతో తగిన ఉపాధి దొరకక దేవేశ్వరినాయల్ చాలా కష్టపడేది. దీంతో కుటుంబ ఆర్థిక ఒత్తిడి ఆమె తట్టుకోలేకపోయేది. ఈ క్లిష్ట సమయంలో తాన్య ఒక ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును అభ్యసిస్తూనే చిన్న పిల్లలకు ట్యూషన్ చెప్పే బాధ్యతను తీసుకుంది. ఇంతలో, కొత్త అవకాశాల కోసం తమ ఇంటిని వదిలిపెట్టారు. తాన్య నాటి రోజులను గుర్తుచేసుకుంటూ–'పరిచయస్తుల ద్వారా మా అమ్మతో కలిసి రాష్ట్ర దూరదర్శన్ కేంద్రానికి చేరుకున్నాను. అక్కడ, గిరిజనుల దుస్తులను డిజైన్ చేయడానికి నాకు ఆఫర్ వచ్చింది. అప్పటి సెంటర్ డైరెక్టర్ అనుపమ్ జైన్, ఆమె తల్లి మధ్య జరిగిన సంభాషణలో నాకో మార్గం కనిపించింది. దూరదర్శన్ సిబ్బందికి ఒక సాధారణ టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని జైన్ మాతో చెప్పింది. ఇది మా జీవితాలకు ఒక మలుపుగా మారింది' అంటుంది తాన్యా.

అంకిత భావం

దేవేశ్వరి గర్వాలీ, హిందీ భాష రెండింటిలోనూ నిష్ణాతులు. ఆమె భాషా ప్రావీణ్యం దూరదర్శన్‌లోని ఒక అధికారి దృష్టిని ఆకర్షించింది. మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అనేక మంది స్థానిక కళాకారులు హిందీ రాకపోవడంతో ఇబ్బంది పడుతుండేవారు. వారి ఆలోచనలను హిందీలోకి అనువదించడం ద్వారా దేవేశ్వరి భాషా అంతరాన్ని తగ్గించేవారు. అలా దేవేశ్వరి, తాన్య స్థిరమైన ఆదాయం పొందడం అక్కడ నుంచే మొదలైంది. తాన్య అంకితభావం, నైపుణ్యం దూరదర్శన్ కేంద్రంలో కళాకారుల కోసం దుస్తులను రూపొందించే అవకాశాన్ని కూడా సంపాదించిపెట్టింది. కుటుంబం ప్రధాన జీవనోపాధిగా ఆమె పాత్రను మరింత పటిష్ఠం చేసింది. ఎంతోమందికి ఇబ్బంది అనిపించే బాధ్యతను తాన్యా అతి చిన్న వయసులోనే అలా తీసుకుంది.



తాన్యా నాయల్

సామాజికంగా ఉన్నతంగా!

చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నప్పుడు, దేవేశ్వరి గుండెలో ఆమె మాజీ భర్త పట్ల ద్వేషం ఉండేది. ఆమె తన గౌరవాన్ని తిరిగి పొందాలని చదువుతో తన పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకురావాలనుకుంది. నిశ్శబ్ద ప్రతీకారంతోనే సామాజికంగా ఉన్నతంగా నిలబడాలని ఆశించింది. వివిధ మార్గాల్లో ఆదాయ వనరులతో ఆమె తాన్య, తరుణ్‌ను మర్చంట్ నేవీలోకి పంపగలిగింది. పోరాటం నుండి విజయం వరకు తాన్య ప్రయాణం అనేక మైలురాళ్లతో సాగింది. వాటిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆమె పేరు పొందుపరచడం.

నేడు, తాన్య తన స్వంత సంస్థ అయిన 'తంతి' వ్యవస్థాపకురాలు. ఈ పదం సంస్కృతం నుండి తీసుకున్నది. ఒక చిన్న వెంచర్‌గా ప్రారంభమైన 'తంతి' ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న వ్యాపారం. డిజైనర్లు, టైలర్లు, మహిళలతో సహా 53 మందికి వ్యాపారం ద్వారా ఉపాధి కల్పిస్తోంది. ఉత్తరాఖండ్‌లో తాన్యా నాయల్ పేరు ఇప్పుడు పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. ఆ పేరు ఒక్కటి చాలు, ఆమె స్థాయి ఏంటో ఇట్టే చెప్పేస్తారు.

స్ఫూర్తి

అన్‌వాంటెడ్ గర్ల్ టు ఐఏఎస్ ఆఫీసర్!



సంజిత మహాపాత్రో

మగపిల్లాడు పుట్టాలని బలంగా కోరుకుంది ఆ కుటుంబం. అయితే ఆడపిల్లే పుట్టింది. తల్లిదండ్రులు ఆ అమ్మాయిని పెద్దగా పట్టించుకునేవారు కాదు. నిర్లక్ష్యంగా చూసేవారు.

రూర్కెలాలోని పేద కుటుంబంలో పుట్టిన ఆ అమ్మాయికి బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, ప్రతికూల పరిస్థితులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం పెద్దగా లేకపోవడం వల్ల చదువు కొనసాగించడం అనేది అసాధ్యంగా మారినప్పటికీ వెనకడుగు వేయలేదు. ఒడిషాకు చెందిన సంజిత మహాపాత్రో ఎన్నో సమస్యల మధ్య చదువును పూర్తి చేసి ఐఏఎస్ ఆఫీసర్ అయింది.

'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి!' అనిపించుకుంటుంది మహారాష్ట్రలోని అమరావతి జిల్లా పరిషత్ సీయీవో సంజిత మహాపాత్రో. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

ముఖ్యంగా పేదింటి బిడ్డల చదువు విషయంలో చొరవ తీసుకుంటుంది.

'చదువుకోవాలనే కోరిక మీలో బలంగా ఉంటే ఏ శక్తీ అడ్డుకోలేదు' అంటున్న సంజిత..

'చదివింది చాలు. ఇక ఆపేయ్' అనే పరిస్థితులు ఎన్నోసార్లు ఎదుర్కొంది.

అయితే స్వచ్ఛంద సంస్థల సహకారంతో, ఉపకార వేతనాలతో చదువు కొనసాగించింది. మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన సంజిత స్టీల్ అథారిటీ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసింది. వారి కుటుంబం సొంత ఊళ్లో ఇల్లు కట్టుకుంది.

ఒక్కో మెట్టు ఎక్కుతూ...

పేద కుటుంబంలో పుట్టిన నాకు ఐఏఎస్ ఆఫీసర్ కావాలనేది చిన్నప్పటి కోరిక. చిన్నప్పుడు ఎన్నో అనుకుంటాం. అనుకున్నవన్నీ నిజం కాకపోవచ్చు. అయితే సాధించాలనే పట్టుదల మనలో గట్టిగా ఉంటే అదేమీ అసాధ్యం కాదు అని చెప్పడానికి నేనే ఉదాహరణ. ఒక్కోమెట్టు ఎక్కుతూ నా కలను నిజం చేసుకున్నాను.

– సంజిత మహాపాత్రో

'ఐఏఎస్ చేయాలి' అనేది సంజిత చిన్నప్పటి కల.

భర్త కూడా ప్రోత్సహించాడు.

యూపీఎస్‌సీకి ముందు ఒడిషా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (వోఎఎస్)లో రెండో ర్యాంకు సాధించింది. ఉద్యోగంలో చేరకుండా యూపీఎస్‌సీ ఎగ్జామ్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టింది. అయితే విజయం ఆమెకు అంత తేలికగా దక్కలేదు. మొదటిసారి, రెండోసారి, మూడోసారీ ప్రిలిమినరి పరీక్షలలోనే ఫెయిల్ అయింది. చదువులో 'సక్సెస్' తప్ప ఫెయిల్యూర్ గురించి పెద్దగా పరిచయం లేని సంజిత వరుస ఫెయిల్యూర్‌లతో నిరాశపడి ఉండాలి.

అయితే ఆమె ఎప్పుడూ నిరాశ పడలేదు.

అలా అని అతి ఆత్మవిశ్వాసానికి పోలేదు.

'ఎక్కడ పొరపాటు జరుగుతుంది' అనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. విజయం సాధించింది.

తాము నడిచొచ్చిన దారిని మరవని వారు మరిన్ని విజయాలు సాధిస్తారు. ఐఏఎస్ ఆఫీసర్ సంజిత మహాపాత్రో ఈ కోవకు చెందిన స్ఫూర్తిదాయకమైన విజేత.

వంటిల్లు

పేరులోనే 'కూర'ను జత చేసుకున్న పాలకూర అన్నంలోకే కాదు, స్నాక్స్‌గానూ మారిపోతుంది.



బ్రెడ్ పాలక్ వడ

కావలసినవి: పాలకూర తరుగు – ఒకటిన్నర కప్పు, బ్రెడ్ స్లైసులు – 3, అల్లం తరుగు – టీ స్పూన్, పచ్చిమిర్చి – 2 (సన్నగా తరిగాలి), పుదీనా తరుగు – టేబుల్ స్పూన్, జీలకర్ర – టీ స్పూన్, చాట్ మసాలా – టీ స్పూన్, బియ్యప్పిండి – అర కప్పు, ఉల్లిపాయ తరుగు – పావు కప్పు, జీడిపప్పుల తరుగు – టేబుల్ స్పూన్, నిమ్మరసం – టీ స్పూన్. ఉప్పు – రుచికి తగినంత, నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● బ్రెడ్ స్లైసులను మిక్సీలో గ్రైండ్ చేయాలి. పాలకూర, పుదీనా, ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి సన్నగా తరగాలి. ● ఒక పెద్ద గిన్నెలో బ్రెడ్ మిశ్రమంతో సహా అన్ని పదార్థాలు వేసి, మెత్తని పిండిలా కలపాలి. ● చిన్ని చిన్న ఉండలు చేసి, కొద్దిగా అరచేతితో అదిమి, కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా వేయించి, తీయాలి. ● వీటిని కెచప్‌తో సర్వ్ చేయాలి.

● యోగా

యోగ మర్యాదలు పాటించండి...



యోగా చేసేవారు.. యోగా తరగతులకు హాజరయే వారు ఎవరైనా సరే, కొన్ని ప్రవర్తనా పద్ధతులను తప్పక పాటించాలి. దానివల్ల యోగ పట్ల గౌరవం, అంకితభావం ఏర్పడి సాధన మరింత బలపడుతుంది. ఫలితంగా శరీరానికి, మైండ్‌కు మంచి ప్రయోజనాలు చేకూరతాయి.

● **సమయ పాలన**

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా ఒంటరిగా యోగా చేసేవారైనా రోజూ ఒకే సమయానికి అభ్యాసం సాధన చేయడం అలవాటుగా మారాలి. దీనివల్ల యోగా చేసే సమయానికి శరీరం అనుకూలంగా మారుతుంది. ఇక క్లాసులకు సమయానికి హాజరు కావడం ద్వారా తరగతి ప్రారంభాన్ని గౌరవించిన వారవుతారు. 10 – 15 నిమిషాలు ఆలస్యంగా క్లాసుకు హాజరయితే వార్మప్‌లో ఎక్కువ భాగాన్ని మిస్ అవుతారు. వెంటనే యోగా ప్రారంభిస్తే మీ ఆరోగ్యం దెబ్బతినవచ్చు.

● **మైండ్‌ఫుల్‌గా కదలండి**

క్లాసులో లేదా ఇతరులతో కలిసి ధ్యానంలో కూర్చున్న లేదా కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుంటున్న తోటివారికి మీ విన్యాసాలతో భంగం కలిగించకూడదు.

● **అంతరాయం కలిగించరాదు**

యోగాకు, నిశ్శబ్దానికి ఓ కనెక్షన్ ఉంటుంది. యోగ సాధనలో గురువు చెప్పే సూచనలు పాటించడం తప్ప ఇతరులతో మాట్లాడం సరికాదు. ఇది మీకే కాదు, ఇతర యోగా సాధకులకు కూడా అంతరాయం కలిగిస్తుంది.

● **ఫోన్ స్విచాఫ్**

ఫోన్లు తప్పనిసరి అయిన పరిస్థితులలో ఉన్నాం. యోగసాధనలో ఉన్నప్పుడు మీ ఫోన్‌ని కుటుంబ సభ్యుల వద్ద లేదా ట్రైనర్ వద్ద ఉంచటం సముచితం. అర్జెంట్ కాల్స్ సమాచారం తెలిస్తే చాలు. అంతే తప్ప, మెసేజీలు చూడటం, సెల్ఫీలు దిగడం.. వంటివి కూడదు.

● **చివరివరకు ఉండాలి**

మీరు త్వరగా బయలుదేరాల్సిన అవసరం ఉంటే, తరగతి ప్రారంభమయ్యే ముందు ట్రైనర్‌కి తెలియజేయండి.

● జపాన్ టెక్నిక్స్

ఓవర్ ఎందుకు..? తగ్గిద్దాం...



కొంతమందికి ప్రతి చిన్న విషయానికీ అతిగా ఆలోచించడం అలవాటు. దానివల్ల మానసిక ఆందోళన, శారీరక ఆరోగ్యం చెడిపోవడం తప్ప ఒరిగేదేం ఉండదు. అయితే ట్యాప్ సరిగా కట్టేయకుంటే టపాటపామని నీళ్ల చుక్కలు ఎలా పడతాయో... లేనిపోని ఆలోచనలు కూడా అలా ఎడతెగకుండా వస్తుంటే ఎవరు మాత్రం ఏం చేయగలరు... జపాన్ వాళ్లు అతి ఆలోచనలకు అడ్డుకట్ట వేయడానికి 8 చక్కటి టెక్నిక్స్ చెప్పారు. అవేంటో చూద్దాం..

జాజెన్ టెక్నిక్.. ధ్యానం చేయడం

బౌద్ధమతంలో ఒక సాధారణ ధ్యాన సాంకేతికతను జాజెన్ అని పిలుస్తారు. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తీర్పు ఇవ్వకుండా సాధన సమయంలో ఒకరి ఆలోచనలను తిరిగి ఆలోచించడం సాధ్యమవుతుంది. ఇది అతిగా ఆలోచించే అలవాటును దూరం చేయడానికి నిజంగా శక్తివంతమైన మార్గం.



గమన్ నెగెటివ్ వైబ్రేషన్స్ దూరం చేయడం

గమన్‌లోని టెక్నిక్.. మన ఆలోచనల్లో వచ్చే ప్రతికూల భావనలు అంటే నెగెటివ్ వైబ్రేషన్స్ మనల్ని బాధించనివ్వకుండా ఉండటానికి ఎవరికి వారే సెల్ఫ్ టీచింగ్ చేసుకోవడం. జీవితంలోని అనూహ్య మలుపులను ఎదుర్కొంటూ ముందుకు సాగడం అందరూ చేయాల్సిన పని. దీనికి అనుగుణంగా మీ బలాన్ని, స్థితిస్థాపకతను కాపాడుకోవడం ముఖ్యం. ఒక సమయంలో ఒక అడుగు వేయడంపై దృష్టి పెట్టడం ఆదర్శవంతమైన విధానం అని చెబుతుంది గమన్ టెక్నిక్.



నెన్బుట్సు ధ్యానం ద్వారా ప్రశాంతత పొందడం

జపాన్ వారు చెప్పిన ఈ టెక్నిక్స్ పాటిస్తే మైండ్‌ఫుల్‌నెస్, సింప్లిసిటీలతోపాటు పరిస్థితులను సమన్వయం చేసుకోవడం కూడా అలవడుతుంది.

మిమ్మల్ని అతిగా ఆలోచింపజేసే విషయాల నుంచి నెన్బుట్సు టెక్నిక్ ద్వారా మీ మనసును, దృష్టిని మళ్లించవచ్చు. ఇందులో మనం చేయాల్సింది ఏంటంటే బుద్ధుని నామాన్ని లేదా మీకు ఇష్టమైన దైవం యొక్క నామాన్ని జపించడం. అలా జపిస్తూ ఉంటే క్రమంగా అది మనస్సుకు ప్రశాంతతను కలిగిస్తుంది. అంతే కాకుండా మన చర్యలు, భావోద్వేగాల గురించి తెలుసుకోవడానికి ఇది ఒక గొప్ప మార్గంగా ఉపయోగపడుతుంది.

ఇకెబానా.. పువ్వులను ఒక క్రమంలో అమర్చడం

మానసిక ఒత్తిడితో సహా అనేక రకాల రుగ్మతలను నివారించేందుకు జపాన్‌లోని సంప్రదాయ వైద్యులు ఉపయోగించే అతి ప్రాచీనమైన కళ ఇకెబెనా. ఈ పద్ధతి చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ టెక్నిక్ లో మీరు శ్రద్ధ, చిత్తశుద్ధితో పువ్వులను పేర్చాలి. అలా చేస్తూ ఉండగానే మీ మనస్సు ఆ పనిలో లీనం అయిపోతుంది. అందమైన వాటిని సృష్టించడంలో మీ మనస్సు మునిగిపోయినప్పుడు, మీ మనస్సు ఎంత త్వరగా బాధించే ఆలోచనలపై దృష్టి పెట్టడం మానేస్తుందో మీరు ప్రాక్టికల్ గా చూస్తారు.

కైజెన్ టెక్నిక్ పనిని విడగొట్టుకోవడం లేదా పని విభజన



ఇందుకోసం ముందుగా మనం చేయాల్సిన పనిని చిన్నగా విడగొట్టుకోవాలి. పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకోవడం లేదా కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలని ప్రతిజ్ఞ చేయడానికి బదులు మనం దేనినైతే చేరుకోవాలనుకుంటున్నామో దానిని చిన్నచిన్నగా విభజించుకోవాలి. అప్పుడు మనం ఆ పనిని సులువుగా పూర్తి చేయగలం. దాంతో మనకు పనిని పూర్తి చేయలేమనే ఆందోళన తొలగి ఒక నిశ్చింత ఏర్పడుతుంది.

షిరిన్-యోకు ప్రకృతితో ఫ్రెండ్ షిప్

ఈ ఉరకల పరుగుల జీవితంలో బాగా అలసిపోయినట్లు మీకనిపిస్తోందా.. అయితే మీరు చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టేయడమే తక్షణ కర్తవ్యం. ఎందుకంటే ఉద్యోగం సరిగా చేయాలంటే ఏకాగ్రత చాలా అవసరం. అది లేనప్పుడు ముందు మనం ఏకాగ్రతను కేంద్రీకరించుకోవాలి. ఇందుకోసం మనకు ఇష్టమైన ప్రాంతాలకు వెళ్లాలి. అంటే ఏ హిమాలయాలకో, ఊటీ, కొడైకెనాల్ లాంటి దూర ప్రాంతాలకో వెళ్లడం ఉత్తమం. అలా కుదరనప్పుడు స్థానికంగా ఉన్న ప్రదేశాలలో అయినా సేదతీరడం ముఖ్యం. దీన్నే షిరిన్-యోకు టెక్నిక్ అంటారు. మరింత ప్రశాంతంగా ఉండటానికి, అతిగా ఆలోచించకుండా ఉండటానికి ఈ టెక్నిక్ దోహదపడుతుంది. ఇది మానసిక ప్రశాంతతకు ఉపకరిస్తుంది.



వాబీ-సబీ.. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని గుర్తించడం

మన జీవితంలో ఏదీ శాశ్వతం కాదని, విషయాలు ఎల్లప్పుడూ ఆదర్శంగా ఉండవని ఈ జపనీస్ పద్ధతి మనకు అర్థం అయ్యేలా చేస్తుంది. ముందు మనం దానిని అర్థం చేసుకోవాలి. ఈ రెండు వాస్తవాలను మనం అంగీకరించగలిగిన వెంటనే పరిపూర్ణతను సాధించాలనే కోరిక తగ్గడం ప్రారంభమవుతుంది. ఇది మన ఆందోళనను బాగా తగ్గించి, మరింత ప్రశాంతంగా అనుభూతి చెందేలా చేస్తుంది.

వెయిట్ లాస్ జ్యూస్

పెరిగిన బరువును తగ్గించుకోవడం కోసం నానా పాట్లు పడుతుంటారు. అయితే ఇప్పుడు చెప్పబోయే సూపర్ జ్యూస్‌ను తీసుకుంటే బరువు తగ్గడమే కాదు బాడీ మొత్తం డిటాక్స్ కూడా అవుతుంది. మరి ఇంకెందుకు ఆలస్యం... ఆ జ్యూస్ ఏంటీ..? దాన్ని ఎలా ప్రిపేర్ చేసుకోవాలి..? వంటి విషయాలపై ఓ లుక్కేసేద్దామా..

ముందుగా ఒక క్యారెట్, ఒక కీరదోసలను తీసుకోవాలి. వాటికి చెక్కు తీసి శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అలాగే ఒక పియర్ పండును కూడా తీసుకుని ముక్కలుగా తరుక్కోవాలి. ఇప్పుడు బ్లెండర్ తీసుకుని అందులో కట్ చేసి పెట్టుకున్న క్యారెట్ ముక్కలు, కీరదోస ముక్కలు, పియర్ పండు ముక్కలు, గింజ తొలగించిన మూడు ఖర్జూరాలు, చిటికెడు పింక్ సాల్ట్, చిటికెడు దాల్చిన చెక్క పొడి, ఒకటిన్నర గ్లాసుల నీళ్ళు పోసుకుని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అంతే! రుచికరమైన, ఆరోగ్యకరమైన క్యారెట్-కీర-పియర్ జ్యూస్ సిద్ధమైనట్లే. ఈ జ్యూస్‌ను రోజూ ఉదయాన్నే తీసుకోవడం వల్ల అందులో ఉండే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్స్, ఇతర పోషకాలు శరీరంలోని వ్యర్థాలను తొలగించి బాడీని డిటాక్స్ చేస్తాయి. అలాగే అధిక కొవ్వును కరిగించి బరువు తగ్గేలా చేస్తాయి. అతి ఆకలి సమస్యను దూరం చేస్తాయి. కాబట్టి, ఎవరైతే బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నారో.. వారు తప్పకుండా ఈ జ్యూస్‌ను తీసుకునేందుకు ప్రయత్నించండి.



సాక్షి సినిమా

శివాజీ పాత్ర సవాల్‌గా అనిపించింది

\- విక్కీ కౌశల్



● విక్కీ కౌశల్, రష్మిక

''ఛత్రపతి శివాజీ మహారాజ్ శ్రీరాముని వంటివారు. 'ఛావా'లో ఆయన పాత్ర కోసం నా మనసుని సన్నద్ధం చేసుకోవడం, ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం సవాల్ అనిపించింది'' అని హీరో విక్కీ కౌశల్ తెలిపారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో విక్కీ కౌశల్, రష్మికా మందన్న ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'ఛావా'. దినేష్ విజన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో విక్కీ కౌశల్ మాట్లాడుతూ– ''ఛావా' కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో ప్రిపేర్ అయ్యాను. యుద్ధాలు, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నాను. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించిన దినేష్‌గారికి, తెరకెక్కించిన లక్ష్మణ్‌గారికి ధన్యవాదాలు. రెహమాన్‌గారి సంగీతం సినిమా స్థాయిని పెంచింది. ఇలాంటి పాత్ర దొరకడం నా అదృష్టం. లైఫ్‌లో ఒక్కసారే ఇలాంటి అవకాశం వస్తుంది. ఈ మూవీ చాలా గొప్పగా వచ్చింది... అందరికీ నచ్చుతుంది'' అని పేర్కొన్నారు. రష్మికా మందన్న మాట్లాడుతూ–''ఛావా'లో మాటలకు అందని భావం, ఓ దైవత్వం, అంతులేని ప్రేమ ఉంటాయి. అందుకే ఈ మూవీ చూసిన ప్రతిసారీ ఏడ్చేస్తాను. అంత అద్భుతంగా ఉంటుంది'' అని చెప్పారు. ఇదిలా ఉంటే... కొన్ని రోజుల క్రితం జిమ్‌లో కాలికి గాయం కావడంతో బెడ్ రెస్ట్‌లో ఉన్న రష్మిక... ముంబైలో జరిగిన ఈ చిత్రం ఈవెంట్‌కి వెళుతున్నప్పుడు ఎయిర్‌పోర్టులో వీల్ చైర్‌లో కనిపించారు. హైదరాబాద్ ఈవెంట్ వేదికపై కూడా వీల్ చైర్‌లోనే కనిపించారు రష్మిక. ఆమె వేదిక పైకి రావడానికి విక్కీ కౌశల్ హెల్ప్ చేశారు.

యమ్మీ... యమ్మీ...



● ఇమాన్వీ, ప్రభాస్

జనరల్‌గా డిన్నర్ లైట్‌గా తీసుకునే అలవాటు చాలామందికి ఉంటుంది. హీరోయిన్ ఇమాన్వీ కూడా ఇంచు మించు ఇదే టైప్. అయితే గురువారం డిన్నర్‌ని మాత్రం లైట్‌గా కాకుండా ఓ పట్టు పట్టారు. మరి... కళ్ల ముందు పదికి పైగా నోరూరించే వంటకాలు కనిపిస్తే లాగించకుండా ఉంటారా! అది కూడా హీరో ప్రభాస్ ఇంటి నుంచి వచ్చిన వంటకాలాయె. ఆ విషయంలోకి వస్తే... ప్రభాస్ సరసన ఓ కథానాయికగా ఇమాన్వీ నటిస్తున్న 'ఫౌజీ' (పరిశీలనలో ఉన్న టైటిల్ అని సమాచారం) చిత్రం తాజా షెడ్యూల్ రెండు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ముందు ఇమాన్వీ పాల్గొన్నారు. గురువారం నుంచి ప్రభాస్ కూడా పాల్గొంటున్నారు. ఈ చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్న ఢిల్లీ బ్యూటీ ఇమాన్వీకి గురువారం డిన్నర్‌కి తన ఇంటి నుంచి భోజనం తెప్పించారు. అవి ఆరగించి, ఆ వంటకాల వీడియో షేర్ చేసి, ''ఈ యమ్మీ యమ్మీ... మంచితనానికి థ్యాంక్యూ ప్రభాస్'' అని పేర్కొన్నారు ఇమాన్వీ. ఇక హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథగా రూపొందుతోందని సమాచారం.

ఓహో రత్తమ్మా...



● విశ్వక్ సేన్

'ఓహో రత్తమ్మా...' అంటూ పాట అందుకున్నారు విశ్వక్ సేన్. సోను మోడల్, లైలాగా విశ్వక్ రెండు పాత్రల్లో కనిపించనున్న చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'ఓహో రత్తమ్మా...' అంటూ సాగే మూడో పాటను శుక్రవారం విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు లియోన్ జేమ్స్ స్వరపరచిన ఈ మాస్ సాంగ్‌కు పెంచల్ దాస్ సాహిత్యం అందించి, మధుప్రియతో కలిసి పాడారు. ''ఈ హై ఎనర్జిటిక్ మాస్ సాంగ్ ఓ ఫీస్ట్‌లా ఉంటుంది. విశ్వక్ సేన్ స్టైలిష్ లుక్స్, ఆకాంక్షా శర్మ గ్లామర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అలాగే సోషల్ మీడియా సెన్సేషనల్ ట్రాక్ 'కోయారే కోయ్ కోయ్...' చేర్చడం అదనపు ఆకర్షణ'' అని యూనిట్ పేర్కొంది.



● దేవిశ్రీ ప్రసాద్, నాగచైతన్య, ఆమిర్ ఖాన్, అల్లు అరవింద్, చందు మొండేటి

తండేల్ ట్రైలర్ చాలా నచ్చింది

\- ఆమిర్ ఖాన్

''తండేల్' మూవీ ట్రైలర్ నాకు చాలా నచ్చింది. హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఉన్నాయి. డైరెక్టర్ చందు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశారు. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలి'' అని బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ ఆకాంక్షించారు. నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన తాజా చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 7న విడుదలవుతోంది. శుక్రవారం ముంబైలో నిర్వహించిన 'తండేల్' హిందీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ఆమిర్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''చైతన్య ఫెంటాస్టిక్ యాక్టర్, మంచి సహ నటుడు. తనతో పని చేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. సాయి పల్లవి కూడా మంచి పెర్ఫార్మర్. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ ఫెంటాస్టిక్‌గా ఉంది. నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం ఉండదు. కానీ, ఇక డ్యాన్స్ చేయడం ప్రారంభిస్తాను'' అని చెప్పారు. నాగచైతన్య మాట్లాడుతూ– ''ఆమిర్ ఖాన్‌గారితో కలిసి 'లాల్ సింగ్ చద్దా' సినిమా చేయడం నాకు గొప్ప అనుభూతి. 'తండేల్' అందమైన ప్రేమకథ. ఇలాంటి కథలు యాక్టర్స్‌కి చాలా అరుదుగా వస్తాయి. ఈ మూవీలో భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''నాగచైతన్య కెరీర్ 'తండేల్'కి ముందు 'తండేల్'కి తర్వాత అన్నట్టుగా ఉంటుంది. చందు ఈ కథని అద్భుతంగా తీర్చిదిద్దాడు'' అని తెలిపారు. చందు మొండేటి మాట్లాడుతూ– ''ఆమిర్ గారి సినిమాల్లో ఆరు నెలలపాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసి, ఆ తర్వాత ఆయనకి ఒక కథ చెప్పాలని ఉంది'' అని పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ– ''ముంబై ఆడియన్స్ నా పాటలకు ఎప్పుడు కూడా చాలా గ్రేట్ రెస్పాన్స్ ఇచ్చారు. 'తండేల్' తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది'' అన్నారు.

నిన్నే చూస్తుండిపోయా...



● సంతోష్, క్రిషీకా

సంతోష్ కల్వచెర్ల, క్రిషీకా పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్టిస్ట్'. జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'చూస్తూ.. చూస్తూ...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. రాంబాబు గోసాల సాహిత్యం అందించిన ఈ పాటని కపిల్ కపిలన్ పాడారు. ''చూస్తూ చూస్తూ చూస్తూ నిన్నే చూస్తుండిపోయా, చూస్తూ చూస్తూ నేనే నీవైపోయా...' అంటూ ఈ పాట సాగుతుంది. హీరో హీరోయిన్స్ మధ్య సాగే అందమైన ఈ పాటను హోలీ పండగ నేపథ్యంలో తెరకెక్కించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఆ మాటలతో డిప్రెషన్‌లోకి వెళ్లాను



● ప్రియాంకా చోప్రా

''నేను 19 ఏళ్లకే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను. అయితే సినిమా రంగంలోని వారు ఎలా ఉంటారనే విషయం అప్పటికి నాకు తెలియదు. ఓ దర్శకుడు నా కాస్ట్యూమ్స్ గురించి అభ్యంతరకరంగా మాట్లాడిన మాటలకి బాధపడి, డిప్రెషన్‌లోకి వెళ్లాను'' అని హీరోయిన్ ప్రియాంకా చోప్రా అన్నారు. ఇటీవల జరిగిన ఓ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రియాంకా చోప్రా కెరీర్ తొలినాళ్లలో తనకు ఎదురైన ఘటనల గురించి మాట్లాడారు. ''ఓ సినిమా షూటింగ్ కోసం సెట్‌కి వెళ్లాను. నాకు ఎలాంటి దుస్తులు కావాలో నా కాస్ట్యూమ్ డిజైనర్‌కు చెప్పండి అని డైరెక్టర్‌తో అన్నాను. నా ముందే నా కాస్ట్యూమ్ డిజైనర్‌కి ఫోన్ చేసిన ఆయన... 'కథానాయిక లోదుస్తులు చూపిస్తేనే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. అందుకే ప్రియాంక దుస్తులు చాలా చిన్నవిగా ఉండాలి.. తన లోదుస్తులు కనిపించాలి' అంటూ పలుమార్లు ఆ పదాన్ని ఉపయోగించాడు. ఆ మాటలు విన్నప్పుడు చాలా నీచంగా, బాధగా అనిపించింది. దీంతో నేను డిప్రెషన్‌లోకి వెళ్లాను. మా అమ్మ దగ్గరకు వెళ్లి ఆ డైరెక్టర్ నన్ను చిన్నచూపు చూస్తే ఆ సినిమా చేయనని చెప్పేశాను. ఆ తర్వాత ఆ మూవీ చేయలేదు. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఇప్పటివరకు కూడా ఆ దర్శకుడితో పని చేయలేదు'' అని పేర్కొన్నారు ప్రియాంకా చోప్రా.

కథే హీరో



● ఆర్పీ పట్నాయక్, సతీష్

''హీరో, హీరోయిన్ లేకుండా సినిమా తీయాలంటే ఎలా? అనే ఆలోచనతో 'కాఫీ విత్ ఏ కిల్లర్' కథ మొదలైంది. కథే హీరో అయితే సినిమా ఎలా ఉంటుందని ఈ కథ రాశాం'' అని ఆర్పీ పట్నాయక్ తెలిపారు. టెంపర్ వంశీ, శ్రీనివాస రెడ్డి, సత్యం రాజేశ్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కాఫీ విత్ ఏ కిల్లర్'. ఆర్పీ పట్నాయక్ కథ, రచన, దర్శకత్వంలో సెవెన్‌హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సతీష్ నిర్మించారు. ఈ సినిమాని ఆహా ఓటీటీలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ– ''ఈ సినిమా పూర్తయ్యే వరకు మా అన్నయ్య గౌతమ్ పట్నాయక్‌గారు చూసుకున్నారు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్ ఉండరు. కానీ, విలన్ ఉంటాడు'' అన్నారు. ''పాటలు, యాక్షన్ వంటివి లేకుండా కథని నమ్ముకుని తీసిన ఈ మూవీ ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది'' అన్నారు సెవెన్ హిల్స్ సతీష్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	741	77,501
నిఫ్టీ ▲	259	23,547

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,919	▲	238
డోజోన్స్	44,913	▲	31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,674	▲	27
డాక్స్	21,732	▼	5
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,251	▼	2
నికాయ్	39,572	▲	59

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	82,086	▲	783
బంగారం (99.5 స్వచ్ఛత)	81,757	▲	780
వెండి (కిలో)	93,533	▲	1,349

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయత	84.77	88.44
£	బ్రిటన్ పౌండ్	భారతీయత	104.90	109.83
€	యూరో	భారతీయత	87.55	92.07
¥	జపాన్ ఎన్ (100)	భారతీయత	44.00	67.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయత	51.47	56.30
S$	సింగపూర్ డాలర్	భారతీయత	61.50	66.20
SAR	సౌదీ రియాల్	భారతీయత	22.19	23.75
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయత	22.69	24.47
¥	చైనా యువాన్	భారతీయత	11.07	12.89


సంస్కరణల మోత.. వృద్ధికి చేయూత!

భారత ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని ఎదుర్కొంటోందని ఆర్థిక సర్వే కుండబద్దలు కొట్టింది. మన ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగానే ఉన్న నేపథ్యంలో తక్షణం ఆర్థిక వ్యవస్థకు చికిత్స చేసి, వృద్ధికి చేయూతనివ్వాలంటే... పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న పలు నియంత్రణలను తొలగించడంతో పాటు భూ, కార్మిక తదితర కీలక సంస్కరణలు అమలు చేయాలని తేల్చిచెప్పింది. మరోపక్క, ప్రజల కొనుగోలు శక్తిని పెంచి, వినిమయం భారీగా పుంజుకునేలా చర్యలు చేపట్టాలని సూచించింది. మరికొద్ది గంటల్లో మోదీ 3.0 సర్కారు కీలక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తరుణంలో 2024–25 ఏడాదికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించారు.

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.3–6.8 శాతానికి పరిమితం కావచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఈ ఏడాది వృద్ధి 6.4 శాతానికి పడిపోవచ్చని ఇప్పటికే కేంద్రం ముందస్తు అంచనాల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. కరోనా తర్వాత జీడీపీ వృద్ధి రేటు మళ్లీ ఇంతలా బలహీనపడటం ఇదే తొలిసారి. 2023–24 ఏడాదికి వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. కాగా, 2024 నాటికి వికసిత భారత్ (అభివృద్ధి చెందిన దేశం)గా అవతరించాలంటే వచ్చే ఒకట్రెండు దశాబ్దాల పాటు జీడీపీ ఏటా 8 శాతం చొప్పున వృద్ధి చెందాల్సిన అవసరం ఉందని సర్వే నొక్కి చెప్పింది. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించాలంటే పలు రంగాల్లో, ముఖ్యంగా భూ, కార్మిక సంస్కరణలు చేపట్టాలని తెలిపింది. అంతేకాకుండా, జీడీపీలో పెట్టుబడుల శాతాన్ని ఇప్పుడున్న 31 శాతం నుంచి 35 శాతానికి పెంచాల్సిందేనని కూడా పేర్కొంది. తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, బయో టెక్నాలజీ వంటి వర్ధమాన టెక్నాలజీల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 2027–28లో 5 ట్రిలియన్ డాలర్లను, 2029–30లో 6.3 ట్రిలియన్ డాలర్లను తాకే అవకాశం ఉంది.

ఆర్థిక సర్వే 2024-25 చెబుతోంది ఇదే...

- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఆర్థిక మందగమనానికి తక్షణ చికిత్స అవసరం
- వచ్చే ఏడాది జీడీపీ వృద్ధి 6.3–6.8 శాతంగా అంచనా
- ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగానే ఉన్నాయి...
- 2047కల్లా వికసిత దేశంగా అవతరించడమే లక్ష్యం
- వచ్చే రెండు దశాబ్దాల పాటు 8% వృద్ధితోనే ఇది సాధ్యం
- జీడీపీలో పెట్టుబడులు 35 శాతానికి పెరగాలి...
- ఇందుకు నియంత్రణల తొలగింపు, సంస్కరణలు కీలకం..




బడ్జెట్ టీమ్‌తో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్


'వ్యవసాయోత్పత్తి పుంజుకోవడం గ్రామీణ డిమాండ్‌కు దన్నుగా నిలుస్తోంది. ఆహార ధరలు శాంతించే అవకాశం ఉండటం, స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో వృద్ధి మళ్లీ పట్టాలెక్కనుంది. భౌగోళిక రాజకీయ, వాణిజ్య అనిశ్చితులతో పాటు కమోడిటీ ధరల షాక్‌లు మన ఆర్థిక వ్యవస్థకు ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ మనదే ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఎకానమీ. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వృద్ధిని పరుగులు పెట్టించాల్సిందే'.
– వి. అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు


'పటిష్టమైన దేశీ డిమాండ్, పెట్టుబడులు పుంజుకుంటున్న నేపథ్యంలో వృద్ధి కాస్త మెరుగ్గానే (6.5–6.8%) ఉండొచ్చు. వ్యవసాయ దిగుబడుల జోరు, బలమైన సేవల రంగం వృద్ధికి కీలక చోదకాలు. పాశ్చాత్య దేశాల పాలసీలు, భౌగోళిక-ఆర్థిక అడ్డంకులు సరఫరా వ్యవస్థల రూపురేఖలను మార్చేస్తున్నాయి'.
– రుమ్కి మజుందార్, డెలాయిట్ ఇండియా ఎకనమిస్ట్


'భారత్ వృద్ధి రేటు జోరును కొనసాగించాలంటే ప్రపంచ దేశాలతో పోటీతత్వాన్ని పెంచుకోవాల్సిందే. నిర్మాణాత్మక సంస్కరణలు, నియంత్రణల తొలగింపు ద్వారానే ఇది సాధ్యం'
– అదితి నాయర్, ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్

ధరలు దిగొస్తాయి...

కొత్త పంట చేతికి రావడం, సీజనల్‌గా కొన్ని కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో ఇక ఆహార ద్రవ్యోల్బణం శాంతించే అవకాశం ఉందని సర్వే అంచనా వేసింది. ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ లక్ష్యం 4%కి అటుఇటుగానే రిటైల్ ద్రవ్యోల్బణం ఉండొచ్చని పేర్కొంది. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయంగా కమోడిటీ ధరల సెగ వంటి రిస్కులు పొంచిఉన్నాయని తెలిపింది. 2024 డిసెంబర్లో రిటైల్ ద్రవ్యోల్బణం 4 నెలల కనిష్టమైన 5.2%కి దిగొచ్చింది. అయితే, కూరగాయల ధరల మంటతో ఆహార ద్రవ్యోల్బణం ఇంకా భారీగానే 8.4%గా నమోదైంది. ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు తగ్గుతున్నప్పటికీ, భౌగోళిక రాజకీయ రిస్కులు ఆందోళనకరంగానే ఉన్నాయని కూడా సర్వే పేర్కొంది.

నియంత్రణల సంకెళ్లు తెంచాలి...

'మౌలిక రంగంలో పెట్టుబడులను పెంచాలంటే వ్యవస్థలో పాతుకుపోయిన నియంత్రణ సంకెళ్లను తెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాలు కూడా వ్యాపారాలకు అడ్డంకులుగా నిలుస్తున్న పలు నిబంధనలను సరళీకరించడంతో పాటు పలు రకాల టారిఫ్‌లలో కోత విధించాలి. దేశంలో నవకల్పనలను ప్రోత్సహించి, చిన్న మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) రంగానికి దన్నుగా నిలిచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. జర్మనీ, స్విట్జర్లాండ్, జపాన్, సింగపూర్ తదితర దేశాల ఆర్థిక విజయంలో ఎస్ఎంఈలు కీలక పాత్ర పోషించాయి. అధిక నియంత్రణ వల్ల ఇన్నోవేషన్, ఆర్థికవ్యవస్థ చురుకుదనానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. ఈ దిశగా భూ, కార్మిక, తదితర సంస్కరణలు అత్యవసరం' అని సర్వే పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆర్థిక సర్వేలో మరిన్ని సంగతులు | బంగారం పైపైకే.. ఒక్కరోజే రూ.1,100 జంప్

సర్వేలో ఇతర ముఖ్యాంశాలు...

- దేశంలో సేవల రంగం మంచి పనితీరును కనబరుస్తోంది. తయారీ రంగం మాత్రం కొన్ని ప్రాంతాల్లో సమస్యలు ఎదుర్కొంటోంది.
- ప్రపంచ ఆర్థిక అనిశ్చితిని సైతం తట్టుకుని మన ఫైనాన్షియల్ రంగం పురోగమిస్తోంది. బ్యాంకులు లాభాలు మెరుగుపడ్డాయి. రుణాలు, డిపాజిట్ల మధ్య వ్యత్యాసం తగ్గుతోంది.
- పెట్టుబడులకు దన్నుగా, పొదుపులను మదుపుగా మార్చడంలో, సంపద సృష్టిలో మన క్యాపిటల్ మార్కెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2013–14 నుంచి 2023–24 మధ్య ఐపీఓ ద్వారా కంపెనీల లిస్టింగ్‌లు ఆరు రెట్లు పెరిగాయి. ఇప్పుడు స్టాక్ మార్కెట్లకు యువ ఇన్వెస్టర్లే చోదక శక్తిగా నిలుస్తున్నారు.
- విదేశాల్లో డిమాండ్ తగ్గడంతో ఎగుమతుల వృద్ధి మందగించింది. మరోపక్క, దేశీయంగా పటిష్ట డిమాండ్‌తో దిగుమతులు పెరిగాయి. రక్షణాత్మక ధోరణులు పెరిగిపోవడంతో ప్రపంచ వాణిజ్య ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. మన ఎగుమతులకు పోటీతత్వం పెంచాలంటే వ్యూహాత్మక వాణిజ్య రోడ్ మ్యాప్ అత్యవసరం.
- అధిక ప్రభుత్వ వ్యయం, మెరుగుపడుతున్న వ్యాపార విశ్వాసంతో పెట్టుబడులు మళ్లీ పుంజుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి.
- సమృద్ధిగా 640 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. ఇది 90 శాతం విదేశీ రుణానికి సమానం, అలాగే దాదాపు 11 నెలల దిగుమతులకు సరిపోతాయి.
- వ్యాపారాలకు సానుకూల వాతావరణం కల్పించేలా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0లో రాష్ట్రాలు మరింత చొరవ తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై ఫోకస్ చేయాలి.
- అధిక వృద్ధి పథంలో సాగాలంటే వచ్చే రెండు దశాబ్దాల పాటు మౌలిక రంగంలో పెట్టుబడులను దశలవారీగా పెంచాలి.
- కార్పొరేట్ రంగం సామాజిక బాధ్యత విషయంలో మరింతగా దృష్టి సారించాలి.
- పప్పు ధాన్యాలు, నూనెగింజలు, టమాటా, ఉల్లి ఉత్పత్తిని పెంచేలా పరిశోధనలు జరగాలి. అన్నిరకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంట రకాలను రూపొందించడంతో పాటు పంట దిగుబడి పెంచి, పంట నష్టాలను తగ్గించడంపై దృష్టి పెట్టాలి.

బడ్జెట్‌పై ఆశలతో బుల్ పరుగు

- సెన్సెక్స్ లాభం 741 పాయింట్లు; 23,500 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: ఆర్థిక సర్వే 'వృద్ధికి ఊతమిచ్చే బడ్జెట్'పై ఆశలు రేకెత్తించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం మేర లాభపడ్డాయి. కేంద్రం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్లో వ్యక్తిగత ఆదాయ పన్ను తగ్గింపు, మూలధన వ్యయం పెంపుతో పాటు రక్షణ, రైల్వే, తయారీ రంగాలకు భారీ నిధులు కేటాయింపు ప్రకటనలు ఉండొచ్చనే అంచనాలు ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న ఊహాగానాలు నెలకొన్నాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 741 పాయింట్లు పెరిగి 77,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 259 పాయింట్లు బలపడి 23,547 వద్ద నిలిచింది. ముఖ్యంగా డీప్‌సీక్ ఆందోళనలతో ఇటీవల పతనమైన ఐటీ షేర్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 846 పాయింట్లు ఎగసి 77,606 వద్ద, నిఫ్టీ 297 పాయింట్లు బలపడి 23,547 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ కొనసాగడంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.83%, మిడ్ క్యాప్ సూచీ 1.76% చొప్పున లాభపడ్డాయి.



ఓలా జెన్-3 స్కూటర్స్

ధరల శ్రేణి రూ.79,999–1,69,999
ప్రయాణ దూరం 108–320 కిలోమీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తాజాగా ఎస్1 జెన్-3 పోర్ట్‌ఫోలియో కింద ఎనిమిది కొత్త వేరియంట్లను ఆవిష్కరించింది. ధర రూ.79,999 మొదలుకుని రూ.1,69,999 వరకు ఉంది. 2–5.3 కిలోవాట్ అవర్ వరకు సామర్థ్యం గల బ్యాటరీలను వేరియంట్‌నుబట్టి పొందుపరిచింది. ఒకసారి చార్జింగ్‌తో బ్యాటరీనిబట్టి 108 నుంచి 320 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. జెన్-2తో పోలిస్తే జెన్-3 శ్రేణి 20 శాతం అధిక గరిష్ఠ పవర్, 11 శాతం తక్కువ ధర, 20 శాతం ఎక్కువ ప్రయాణ దూరం ఆఫర్ చేస్తుందని కంపెనీ శుక్రవారం తెలిపింది. డెలివరీలు ఫిబ్రవరి మధ్యకాలం నుంచి ప్రారంభం అవుతాయని వివరించింది.





జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ కు తొలి పసిడి పతకం

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పతకాల బోణీ కొట్టాయి. శుక్రవారం పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కొమెర నీలం రాజు పసిడి పతకాన్ని సాధించాడు. నీలం రాజు మొత్తం 289 కేజీలు (స్నాచ్ లో 128+క్లీన్ అండ్ జర్క్ లో 161) బరువెత్తి అగ్ర స్థానంలో నిలిచాడు. పురుషుల సైక్లింగ్ రోడ్ రేసు మాస్ స్టార్ట్ ఈవెంట్ లో తెలంగాణ ప్లేయర్ ఆశీర్వాద్ సక్సేనా (2గం:48ని:39.029 సెకన్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. మరోవైపు భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ బింద్యారాణి దేవి జాతీయ క్రీడల్లో పసిడి పతకంతో సత్తాచాటింది. మహిళల 55 కేజీల విభాగంలో బింద్యారాణి 201 కేజీల (88+113) బరువెత్తి స్వర్ణం కైవసం చేసుకుంది. బింద్యారాణి స్నాచ్‌లో 88 కేజీల బరువెత్తి జాతీయ రికార్డు నెలకొల్పింది. గతంలో మీరాబాయి చాను ఈ విభాగంలో 86 కేజీల బరువెత్తగా... ఇప్పుడు బింద్యారాణి దాన్ని బద్దలు కొట్టింది.

అజేయంగా ఫైనల్‌కు భారత్

సెమీస్‌లో 9 వికెట్లతో ఇంగ్లండ్‌పై జయభేరి

- స్పిన్నేసిన పారుణిక, వైష్ణవి, ఆయుషి
- రాణించిన కమలిని, త్రిష
- రేపు సఫారీలతో టైటిల్ సమరం

భారత యువతుల జట్టు వరుసగా రెండో ప్రపంచకప్ సాధించేందుకు అడుగుదూరంలోనే ఉంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్లో మొదట ప్రత్యర్థిని స్పిన్‌తో కూల్చేసి... అనంతరం సులువైన లక్ష్యాన్ని చకచకా పేర్చేసింది. దీంతో క్రితం వరల్డ్‌కప్ (2023) ఫైనల్లో మట్టికరిచిన ఇంగ్లండ్ ఈ సారి ఇంకాస్త ముందే సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. అప్పుడు టైటిల్ రాకుండా... ఇప్పుడు టైటిల్ వేటకు అర్హత సాధించకుండా భారత అమ్మాయిల జట్టే అడ్డుకుంది.


కమలిని


పారుణిక

కౌలాలంపూర్: ఔరా... భారత అమ్మాయిల జట్టు! ప్రపంచకప్ లక్ష్యంగా ఓటమెరుగని పోరాటాన్ని అద్వితీయంగా కొనసాగిస్తోంది. లీగ్ దశ, సూపర్ సిక్స్ దశ... ఇప్పుడు సెమీస్‌తో నాకౌట్ దశల్ని దాటి మళ్లీ మెగా ఈవెంట్ గెలిచేందుకు సెమీస్‌లో అలవోకగా... టోర్నీ చరిత్రలోనే అజేయంగా అర్హత సాధించింది. రెండేళ్ల క్రితం సఫారీ గడ్డపై మొదలైన తొలి అండర్-19 ప్రపంచకప్‌ను గెలిచిన భారత మహిళలు... ఇప్పుడు మలేసియాలో సఫారీతో అమీతుమీ సమరానికి సిద్ధమైంది. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆదివారం తుదిపోరు జరుగనుంది. తొలి సెమీస్‌లో సఫారీ టీమ్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా యువతుల జట్టుపై గెలుపొందగా, రెండో సెమీఫైనల్లో నికీ ప్రసాద్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఏకపక్ష విజయం సాధించింది. మొదట ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 113 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత్ 15 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 117 పరుగులు చేసి గెలిచింది.

తిప్పేసిన స్పిన్ త్రయం

మొదట్లో పారుణిక సిసోడియా (3/21), పది ఓవర్లయ్యాక ఆయుషి శుక్లా (2/21), కాసేపటి తర్వాత వైష్ణవి శర్మ (3/23) తమ స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్‌ను ఎక్కడికక్కడ కోలుకోకుండా చావుదెబ్బ తీశారు. దీంతో ఓపెనర్ డేవినా పెరిన్ (40 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ అబి నార్‌గ్రోవ్ (25 బంతుల్లో 30; 3ఫోర్లు, 1 సిక్స్) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. వైష్ణవి ఒకే ఒక్క ఓవర్‌తో ప్రత్యర్థి జట్టును డెత్ ఓవర్లలో దంచేయకుండా కట్టడి చేసింది. ఇన్నింగ్స్ 16వ ఓవర్లో ఆమె... చార్లొట్ స్టబ్స్ (4), ప్రిశా థానావాలా (2), లంబర్ట్ (0)లను అవుట్ చేసింది. దీంతో 15 ఓవర్లలో 89/5 స్కోరుతో ఉన్న ఇంగ్లండ్ ఓవర్ వ్యవధిలో 92/8 వద్ద కుదేలైంది.

దంచేసిన కమలిని, త్రిష

ఈ టోర్నీలోనే సూపర్ ఫామ్‌లో ఉన్న తెలంగాణ బ్యాటర్ గొంగడి త్రిష (29 బంతుల్లో 35; 5 ఫోర్లు) తన జోరు కొనసాగించింది. ఓపెనర్ కమలిని (50 బంతుల్లో 56 నాటౌట్; 8 ఫోర్లు)తో తొలివికెట్‌కు 9 ఓవర్లలో 60 పరుగులు జోడించాక చేయాల్సిన లక్ష్యాన్ని సగానికి కరిగించి త్రిష వెనుదిరిగింది. ఆ తర్వాత కమలిని, వన్‌డౌన్ బ్యాటర్ సానిక చల్కే (11 నాటౌట్; 1 ఫోర్)తో మరో వికెట్ పడిపోకుండా లక్ష్యాన్ని పూర్తిగా ఛేదించింది. 15వ ఓవర్లో మూడు బౌండరీలు బాదిన కమలిని 47 బంతుల్లో అర్ధసెంచరీ సాధించింది.

పాండ్యా, దూబే మెరుపులు

టాప్-ఫోర్ పరుగుల్లో వెనుకబడినా... ఓ దశలో జట్టు స్కోరు(12/3) గుబులు రేపినా... మిడిలార్డర్‌లో హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేల మెరుపులతో భారత్ మ్యాచ్ గెలిచి టి20 సిరీస్ కైవసం చేసుకుంది. వరుణ్ మాయాజాలం మలుపుతిప్పగా... రవి బిష్ణోయ్, హర్షిత్ రాణాల బౌలింగ్ భారత్ నాలుగో టి20లో గెలిచేలా చేసింది.

సిరీస్‌తో మురిసిన భారత్

- నాలుగో టి20లో 15 పరుగులతో ఇంగ్లండ్ ఓటమి
- 3–1తో సిరీస్ టీమిండియా వశం
- తిప్పేసిన వరుణ్, బిష్ణోయ్
- రేపు ముంబైలో ఆఖరి పోరు


పాండ్యా


దూబే

పుణే: సమం కాదు... సొంతమే! సిరీస్‌ను ఆఖరి సమరం దాకా లాక్కెళ్లకుండా భారత్ నాలుగో టి20లోనే తేల్చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన 15 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలిచి ఇంకో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ కైవసం చేసుకుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 53; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శివమ్ దూబే (34 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. ఇంగ్లండ్ బౌలర్ సకిబ్ మహమూద్ 3, జేమీ ఓవర్టన్ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగుల వద్ద ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (26 బంతుల్లో 51; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), డకెట్ (19 బంతుల్లో 39; 7 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంతసేపూ దంచేశారు. అయితే గత మ్యాచ్ మాదిరి వరుణ్ చక్రవర్తి (2/28) స్పిన్ మలుపు మరుగున పడకుండా... దూబే స్థానంలో 'కన్‌కషన్'గా వచ్చిన హర్షిత్ రాణా (3/33), రవి బిష్ణోయ్ (3/28) పేస్-స్పిన్‌ల వైవిధ్యం ఇంగ్లండ్‌ను లక్ష్యానికి దూరం చేసింది.

దూబే, పాండ్యా ఫిఫ్టీ-ఫిఫ్టీ

సంజూ సామ్సన్ (1), తిలక్‌వర్మ (0), కెప్టెన్ సూర్యకుమార్ (0)ల వైఫల్యంతో భారత్ 12/3 స్కోరు వద్ద కష్టాల్లోపడింది. అభిషేక్ (19 బంతుల్లో 29; 4 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (26 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్)ల జోరు ఎంతోసేపు సాగలేదు. ఈ దశలో దూబే, పాండ్యా ఆరో వికెట్‌కు వేగంగా 87 పరుగులు జోడించారు. 27 బంతుల్లో హార్దిక్, 31 బంతుల్లో దూబే అర్ధసెంచరీలు సాధించారు. దీంతో భారత్ పోరాడే లక్ష్యం నిర్దేశించగలిగింది. మరోవైపు డకెట్, సాల్ట్ (23; 4 ఫోర్లు)లు ధాటిగా ఛేదన ఆరంభించారు. ఇంగ్లండ్ స్కోరు 62కు చేరగానే డకెట్, కాసేపటికే సాల్ట్, బట్లర్ (2)... వందకు చేరే క్రమంలో లివింగ్‌స్టోన్ (9) అవుటయ్యారు. అయినా 14 ఓవర్లలో 124/4 స్కోరు వద్ద ఇంగ్లండ్ పటిష్ఠంగానే కనిపించింది. ఈ దశలో 15వ ఓవర్ వేసిన వరుణ్ క్రీజులో పాతుకుపోయిన బ్రూక్‌తో పాటు బ్రైడన్ కార్స్ (0)లను అవుట్ చేయడంతో 30 బంతుల్లో 49 పరుగుల సమీకరణం విజయానికి ఊపిరిపోసింది. బిష్ణోయ్, రాణాలు వరుస విరామాల్లో వికెట్లు తీయడంతో ఇంగ్లండ్‌కు ఓటమి తప్పలేదు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) కార్స్ (బి) సకిబ్ 1; అభిషేక్ (సి) జాకబ్ (బి) రషీద్ 29; తిలక్ (సి) ఆర్చర్ (బి) సకిబ్ 0; సూర్యకుమార్ (సి) కార్స్ (బి) సకిబ్ 0; రింకూసింగ్ (సి) రషీద్ (బి) కార్స్ 30; దూబే రనౌట్ 53; పాండ్యా (సి) బట్లర్ (బి) ఓవర్టన్ 53; అక్షర్ (సి) జాకబ్ (బి) ఓవర్టన్ 5; అర్ష్‌దీప్ రనౌట్ 0; రవిబిష్ణోయ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 181.** **వికెట్ల పతనం:** 1–12, 2–12, 3–12, 4–57, 5–79, 6–166, 7–180, 8–180, 9–181.
బౌలింగ్: ఆర్చర్ 4–0–37–0, సకిబ్ 4–1–35–3, బ్రైడన్ కార్స్ 4–0–39–1, ఓవర్టన్ 4–0–32–2, అదిల్ రషీద్ 4–0–35–1.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (బి) అక్షర్ 23; డకెట్ (సి) సూర్యకుమార్ (బి) బిష్ణోయ్ 39; బట్లర్ (సి) రాణా (బి) బిష్ణోయ్ 2; బ్రూక్ (సి) అర్ష్‌దీప్ (బి) వరుణ్ 51; లివింగ్‌స్టోన్ (సి) సామ్సన్ (బి) రాణా 9; జాకబ్ (సి) సూర్యకుమార్ (బి) రాణా 6; కార్స్ (సి) అర్ష్‌దీప్ (బి) వరుణ్ 0; ఓవర్టన్ (బి) రాణా 19; ఆర్చర్ (బి) బిష్ణోయ్ 0; రషీద్ నాటౌట్ 10; సకిబ్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 166.** **వికెట్ల పతనం:** 1–62, 2–65, 3–67, 4–95, 5–129, 6–133, 7–137, 8–146, 9–163, 10–166.
బౌలింగ్: అర్ష్‌దీప్ సింగ్ 3.4–0–35–1, హార్దిక్ పాండ్యా 1–0–11–0, వరుణ్ చక్రవర్తి 4–0–28–2, అక్షర్ పటేల్ 3–0–26–1, రవి బిష్ణోయ్ 4–0–28–3, హర్షిత్ రాణా 4–0–33–3.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కోహ్లి 6 అవుట్

- 12 ఏళ్ల తర్వాత 15 బంతుల్లోనే రంజీ ముచ్చట
- రైల్వేస్‌పై ఢిల్లీ ఆధిక్యం

న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత రంజీ బరిలోకి దిగిన విరాట్ కోహ్లి బ్యాటింగ్ ముచ్చట 15 బంతుల్లోనే ముగిసింది. కరతాళ ధ్వనులు, ఆర్సీబీ... ఆర్సీబీ... కోహ్లి... కోహ్లి... అనే అభిమానుల నినాదాల మధ్య ఉదయమే అతను క్రీజులోకి వచ్చాడు. అప్పటికే ఐదు వేల పైచిలుకు ప్రేక్షకులు మైదానంలోకి వచ్చేశారు. అయితే అతన్ని 6 పరుగుల వద్దే హిమాన్షు క్లీన్‌బౌల్డ్ చేయడంతో మరింత మంది అభిమానులు స్టేడియం లోపలికి వచ్చేందుకు ఆసక్తి కనబరచలేదు. కనీసం అతని బ్యాట్ నుంచి ఫిఫ్టీ వచ్చినా వేలసంఖ్యతో తొలిరోజులాగే అరుణ్ జైట్లీ స్టేడియం నిండిపోయేది. ఇక మ్యాచ్ విషయానికొస్తే సూపర్‌స్టార్ కోహ్లి విఫలమైనప్పటికీ ఎలైట్ గ్రూప్ 'డి'లో రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ 93 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఇంకా చేతిలో 3 వికెట్లున్నాయి. శుక్రవారం 41/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలిఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ ఆట నిలిచే సమయానికి 96 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. కెప్టెన్ ఆయుశ్ బదోని (99; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) పరుగు తేడాతో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. సుమిత్ మాథుర్ (78 బ్యాటింగ్, 7 ఫోర్లు), సిద్ధాంత్ శర్మ (15 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. రైల్వేస్ బౌలర్లలో హిమాన్షు సాంగ్వాన్, కునాల్ చెరో 2 వికెట్లు తీశారు.

విరాట్‌కు సన్మానం


ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ) తమ స్టార్ క్రికెటర్ కోహ్లిని సత్కరించింది. అంతర్జాతీయ కెరీర్‌లో భారత్ తరఫున వంద టెస్టులు పూర్తి చేసుకున్న తమ ఆటగాడిని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ శాలువకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మెమెంటోను బహూకరించారు. మూడేళ్ల క్రితమే 2022లోనే కింగ్ కోహ్లి వంద టెస్టుల మార్క్ దాటాడు. కానీ రంజీల బరిలోకి దిగకపోవడంతో ఆత్మీయ సత్కారం కోసం డీడీసీఏ ఇన్నేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది.

క్లుప్తంగా...

మహాకుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

దానాపూర్–చర్లపల్లి–దానాపూర్ మధ్య..



సాక్షి, హైదరాబాద్: మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దానాపూర్–చర్లపల్లి–దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దానాపూర్–చర్లపల్లి (07112) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 14వ తేదీ ఉదయం 11.10 గంటలకు దానాపూర్‌లో బయల్దేరి.. రెండో రోజు రాత్రి 11.55 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. చర్లపల్లి–దానాపూర్ (07077) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 18, 22 తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి.. రెండో రోజు రాత్రి 11.53 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. దానాపూర్–చర్లపల్లి (07078) ఫిబ్రవరి 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 3.15 గంటలకు దానాపూర్‌లో బయల్దేరి.. రెండో రోజు రాత్రి 11.45 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

హైదరాబాద్ - ఫుకెట్ విమాన సర్వీసు ప్రారంభం

- 3.45 గంటల వ్యవధిలో ఫుకెట్‌కు..
- వారంలో మూడు రోజులు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు




శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయం నుంచి థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్.. వారంలో మూడు రోజుల పాటు ఈ సర్వీసులు నడపనుంది. బుధ, శుక్ర, ఆదివారాల్లో శంషాబాద్ విమానాశ్రయం నుంచి సర్వీసులు అందుబాటులో ఉంటాయి. కేవలం 3.45 గంటల వ్యవధిలో విమానం ఫుకెట్‌కు చేరుకుంటుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు మరో అంతర్జాతీయ గమ్యస్థానానికి విమాన సర్వీసును ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్‌ఫణీకర్ అన్నారు. త్వరలో మరిన్ని సర్వీసులను కూడా నడపనున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సీఈవో అలోక్‌సింగ్ వెల్లడించారు.

ఆపరేషన్ స్మైల్ @ 4,357

మహిళా భద్రత విభాగం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్–11 స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 4,357 మంది చిన్నారుల జాడను గుర్తించినట్టు మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు. తప్పిపోయిన, జాడ తెలియకుండా పోయిన, బాల కార్మికులు, వెట్టిచాకిరీలో ఉన్న బాలురు, వీధి బాలలు ఇలా పలువురిని గుర్తించేందుకు కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టినట్టు మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ తెలిపారు. పోలీస్ శాఖ, కార్మిక, విద్య, మహిళా శిశుసంక్షేమశాఖల అధికారులతోపాటు ఎన్జీఓలతో కూడిన ప్రత్యేక బృందాలు రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండ్లు, ఖార్ఖానాలు, రద్దీ ప్రదేశాల్లో సోదాల్లో పాల్గొన్నట్టు వెల్లడించారు. తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన దర్పన్ అనే ప్రత్యేక సాంకేతికతను వినియోగించి అదృశ్యమైన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 4,357 మంది చిన్నారుల జాడను గుర్తించగా.. ఇందులో బాలురు 3,897.. బాలికలు 460 మంది ఉన్నట్టు వివరించారు. మొత్తం గుర్తించిన చిన్నారుల్లో ఇతర రాష్ట్రాలు, నేపాల్ సహా ఇతర దేశాల వారు 1,793 (బాలురు 1,599.. బాలికలు 194) ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తం జాడ గుర్తించిన చిన్నారుల్లో 3,905 మందిని తిరిగి వారి తల్లిదండ్రులకు, గార్డియన్లకు అప్పగించినట్టు చెప్పారు. అలాగే మరో 452 మందిని రెస్క్యూ హోంలకు తరలించినట్టు తెలిపారు. చిన్నారులతో పనులు చేయిస్తున్న వారిపై 1,038 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా.. ఇందులో 1,040 మందిని అరెస్టు చేశామన్నారు.



భాగ్యనగరంలో దోమల నివారణకు రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నా ఏటా డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా తదితర దోమకారక వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ సరికొత్త వ్యూహాన్ని అమలు చేయనుంది. సుమారు 400 ఎకరాల్లో విస్తరించిన కన్హా శాంతివనంలో అమలవుతున్న దోమల నివారణ విధానాన్ని ఇటీవల పరిశీలించిన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు అక్కడ దాదాపు 5 వేల మంది ఉంటున్నప్పటికీ ఇంతవరకు ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాకపోవడాన్ని గుర్తించారు. దీంతో 'కన్హా'మోడల్‌తోపాటు ఇప్పటికే చేపడుతున్న కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేశారు. కమిషనర్ ఆమోదంతో త్వరలో వాటిని అమలు చేస్తామని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

- సాక్షి, హైదరాబాద్

దోమల నివారణకు కన్హా బాట

జీహెచ్‌ఎంసీ అడుగులు.. తొలుత సర్కిల్‌కో వార్డులో పరిశీలన

వారంలో ఐదు రోజులపాటు యాంటీ లార్వా చర్యలు

కన్హా శాంతివనంలో దోమల నివారణ ఇలా..

- 31 జోన్లుగా కన్హా శాంతివనం విభజన.. దోమల నియంత్రణకు 31 బృందాలు. ఒక్కో బృందంలో ఇద్దరేసి సభ్యులు
- అన్ని జోన్లలో సోమవారం నుంచి శుక్రవారం వరకు బృందాల సర్వే.
- శనివారం ప్రత్యేకంగా హాట్‌స్పాట్ ఏరియాల గుర్తింపు. నీరు నిలిచే అవకాశమున్న ప్రాంతాలన్నీ మట్టి లేదా గ్రీన్‌నెట్‌తో కప్పివేత. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దొడ్డు ఉప్పు వేస్తారు. దోమలు అందులో చిక్కుకుంటాయి. వాటితోపాటు వినియోగంలో లేని టాయ్‌లెట్లను సైతం దొడ్డు ఉప్పుతో ట్రీట్‌మెంట్. ఫలితంగా లార్వా దశలోనే దోమల కట్టడి.
- దోమల్ని ట్రాప్ చేసేందుకు కార్బన్‌డయాక్సైడ్‌గల చిన్న సిలిండర్ల వినియోగం.
- డెంగీకారక ఏడిస్ దోమలు పెరగకుండా రసాయన ద్రావణం (ఐజీఆర్ ఓవిట్రాప్–1 పీపీఎం, ఏడెస్ట్ సొల్యూషన్) నింపిన నల్లని మట్టికుండీల ఏర్పాటు. వాటిల్లో పడే దోమలు గుడ్లుపెట్టినా దోమ దశ వరకు పెరగవు. నీటిలో ఆక్వా–కే, ఓత్రిన్ రసాయనం నిర్దేశిత పరిమాణంలో కలిపి పిచికారీ (కోల్డ్ ఫాగింగ్). నీటి గుంతలు, టాయ్‌లెట్ వెంట్స్ కప్పివేత. రిటైర్డ్ ప్రొఫెసర్ పర్యవేక్షణతో దోమ జాతుల పరిశీలన.

జీహెచ్‌ఎంసీ కార్యాచరణ ఇదీ..

- జీహెచ్‌ఎంసీలో ప్రయోగాత్మకంగా సర్కిల్‌కు ఒక వార్డు చొప్పున 30 వార్డుల్లో దోమల నివారణ కార్యక్రమాలు.
- రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఇంటింటిలో యాంటీ లార్వా ఆపరేషన్లు. శనివారాలు హాట్ స్పాట్ ప్రాంతాల్లో సర్వే.
- దోమలు పెరిగేందుకు వీలున్న నీటి నిల్వ ప్రాంతాలు, చెత్త కుప్పలు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు.
- దోమల జాతుల గుర్తింపునకు 'మస్కిటో ట్రాప్ కలెక్టర్'ల ఏర్పాటు.
- నీటినిల్వ ప్రాంతాల్లో దొడ్డు ఉప్పు చల్లడం.
- డెంగీకారక దోమలు పెరగకుండా చెరువులు, కాలువల్లో గంబూషియా చేపల పెంపకం, ఆయిల్‌బాల్స్ వదలడం వంటి మరిన్ని కార్యక్రమాల అమలు.



ఏడిస్ దోమలు పెరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన కుండీ

తెలంగాణలో తొలి 'జీబీఎస్' కేసు



నరాల సంబంధ వ్యాధిబారినపడ్డ సిద్దిపేట మహిళ

- కాళ్లు, చేతులు కదిలించలేని పరిస్థితుల్లో హైదరాబాద్‌కు తరలింపు
- జీబీఎస్‌గా నిర్ధారించిన ప్రైవేట్ ఆస్పత్రి.. వెంటిలేటర్‌పై చికిత్స
- అధికారికంగా నిర్ధారణ కాలేదన్న హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి

సాక్షి, సిద్దిపేట/రాంగోపాల్‌పేట్: మహారాష్ట్రలోని పుణేను వణికిస్తున్న నరాల సంబంధ వ్యాధి గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) తెలంగాణకు పాకింది. రాష్ట్రంలో తొలి జీబీఎస్ కేసు నమోదైంది. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలానికి చెందిన ఓ 25 ఏళ్ల మహిళ జీబీఎస్ బారినపడింది. విరోచనాలు, జ్వరంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి దిగజారడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఈ వ్యాధి బారిన పడిన రోగుల్లో రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున దాని సొంత నాడీ వ్యవస్థపై దాడి చేసినప్పుడు జీబీఎస్ సంభవిస్తుందని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, బాధితురాలికి సోకింది ఈ వ్యాధేనా కాదా అనే విషయాన్ని ఇంకా నిర్ధారణ కాలేదని హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి పేర్కొన్నారు.

ప్రసవం అనంతరం..

బాధిత మహిళ గత డిసెంబర్ 6న ఓ ఆడశిశువుకు జన్మనిచ్చింది. డిసెంబర్ 17న జ్వరం రావడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. అయినా తగ్గలేదు. జ్వరంతోపాటు ఎడమ చెయ్యి నొప్పి రావడంతో ఆ మర్నాడు న్యూరో ఫిజీషియన్‌కు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి డిసెంబర్ 20న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు కదిలించలేకపోతుండటంతో హైదరాబాద్‌లోనే మరో ఆస్పత్రికి మార్చారు. 25న రెండుసార్లు ప్లాస్మా డయాలసిస్ చేశారు. శ్వాస తీసుకోవడం సైతం ఇబ్బంది ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. జీబీఎస్ లక్షణాలు ఉండటంతో జనవరి 30న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో టెస్ట్ చేశారు. దీంతో జీబీఎస్ వచ్చినట్లు ఆ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. ఇప్పటివరకు సదరు మహిళ వైద్యం కోసం రూ. 15 లక్షలకుపైగా ఖర్చు చేసినట్లు బాధితురాలి కుటుంబం పేర్కొంది. అయినా ఆమె కోలుకోకపోవడంతో ఆందోళన చెందుతోంది.

మావల పార్క్‌లో అరుదైన హైనా



ట్రాప్ కెమెరాకు చిక్కిన స్ట్రైప్‌డ్ హైనా

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల హరితవనం పార్క్‌లో జనవరి 28 రాత్రి అరుదైన స్ట్రైప్‌డ్ హైనా దర్శనమిచ్చింది. పార్క్ ఆవరణలోని కుందేళ్ల నీటికుంట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్ కెమెరాలో.. హైనా సంచరిస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. ఐయూసీఎన్ ఎరుపు జాబితాలోని ఈ హైనా జాతి ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. అనుకూలమైన ఆవాసాలు లేకపోవడంతో వీటి ఉనికి రోజురోజుకు క్షీణిస్తోంది. ఈ విషయాన్ని ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ వద్ద 'సాక్షి'ప్రస్తావించగా.. మావల పార్క్‌లో ఈ వన్యప్రాణి ఆచూకీ లభ్యం కావడం జీవ వైవిధ్యానికి నిదర్శనమన్నారు. జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలతో అరుదైన అటవీ జంతువులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ హైనాలు ఉత్తర భారతదేశం, దక్కన్ పీఠభూమి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయన్నారు. ఈ జంతువు జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల నుంచి వచ్చినట్లు తెలుస్తోందన్నారు.

వలపు వల విసిరి.. వసూళ్లు చేసి..

ఫిమేల్ ఎస్కార్ట్ సర్వీస్ పేరిట ఆన్‌లైన్‌లో బురిడీ



నిందితుడు రాజస్తాన్ వాసి

సైబర్ మోసగాడిని అరెస్టు చేసిన తెలంగాణ సీఐడీ

నిందితుడిపై దేశవ్యాప్తంగా 16 కేసులు

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్ల వయసున్న అమ్మాయిలను సరఫరా చేస్తానని ఆన్‌లైన్‌లో వలపు వల విసిరి డబ్బు వసూలు చేసి మోసగించిన నిందితుడు రాజస్థాన్‌లో పట్టుబడ్డాడు. వ్యక్తిగత బలహీనతలను ఆసరాగా చేసుకుని ఫిమేల్ ఎస్కార్ట్ సర్వీస్ (సెక్స్ వర్కర్లను) సమకూరుస్తానంటూ.. ఆన్‌లైన్‌లో ప్రకటనలిచ్చి.. పలువురిని మోసగించిన నరేశ్ పాటిదార్‌ను తెలంగాణ సీఐడీ అధికారులు రాజస్తాన్‌లో అరెస్టు చేశారు. ఆన్‌లైన్ మోసాలపై అందిన ఫిర్యాదు మేరకు.. సైకాప్స్ అనే సాంకేతికతను ఉపయోగించి ఆన్‌లైన్‌లో శోధించి నిందితుని జాడను కనుగొన్నట్లు సీఐడీ డీజీ శిఖాగోయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్తాన్ రాష్ట్రంలోని దుంగర్‌పూర్ ప్రాంతానికి చెందిన నిందితుడు నరేశ్ పాటిదార్.. ఈ మోసాల వెనుక ఉన్నట్టు సాంకేతిక ఆధారాలు సేకరించారు. నిందితుడు www.in.sduko.com వెబ్‌సైట్‌లో.. 16 ఏళ్ల వయసున్న యువతులను సెక్స్ వర్కర్లుగా సరఫరా చేస్తానని ప్రకటనలు ఇచ్చాడు. ఇలా పలువురి నుంచి డబ్బు వసూలు చేసి మోసగించాడు. దీనిపై దేశవ్యాప్తంగా 16 కేసులు నమోదైనట్టు అధికారులు గుర్తించారు. నిందితుడు నరేశ్ పాటిదార్‌కు సంబంధించిన సాంకేతిక ఆధారాలను సీఐడీ సైబర్ క్రైమ్స్ డీఎస్పీ ఎస్.అశోక్‌కుమార్ బృందం సేకరించింది. ఇటీవలే నిందితుడిని రాజస్తాన్‌లో అరెస్టు చేసింది. స్థానిక కోర్టులో హాజరుపరచి, ట్రాన్సిట్ వారెంట్‌పై ఇక్కడికి తీసుకురానున్నట్టు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని సీఐడీ డీజీ శిఖాగోయల్ హెచ్చరించారు.

సుప్రీం తీర్పుపై పునఃసమీక్షించాలి

ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ ప్రవేశాలపై సుప్రీం కోర్టు తీర్పుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లుతుందని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పుపై పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రభుత్వం తగిన విధంగా ముందుకు వెళ్లాలని కోరారు. ఐఐఎం, ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ వర్సిటీల్లో రాష్ట్రాల 50% స్థానిక కోటాను ఎత్తేసే ప్రమాదం ఉందన్నారు.

అరకు చలి ఉత్సవం ప్రారంభం

వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు

సాక్షి, విశాఖపట్నం: పర్యాటక స్వర్గధామం.. ఆంధ్ర ఊటీ అరకులోయలో చలి ఉత్సవాలు శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు కొనసాగే ఈ ఉత్సవాలు 5కె రన్ మారథాన్ పోటీలతో మొదలయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి అరకు వచ్చిన ఆదివాసీలు, పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించేలా హెలీప్యాడ్ రైడ్, హాట్ ఎయిర్ బెలూన్, పారాగ్లైడింగ్ ఏర్పాటు చేశారు. హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా భూ ఉపరితలం నుంచి దాదాపు 300 మీటర్ల ఎత్తుకు వెళ్లి అరకులోయ అందాలు వీక్షిస్తున్నారు. హెలిప్యాడ్ రైడింగ్‌కు పర్యాటకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకుని గగనతలంలో విహారం చేస్తున్నారు. పద్మాపురం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పూణేకు చెందిన బృందం నిర్వహించిన పారాగ్లైడింగ్‌పై పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపారు. అరకులోయ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఆదివాసీల వంటకాల ఫుడ్ ఫెస్ట్, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పద్మాపురం గార్డెన్‌లో పూల'బాలలు'

ఐఏఎస్, ఐపీఎస్‌లు స్టెప్పులు

అరకు చలి ఉత్సవంలో భాగంగా సాయంత్రం ట్రైబల్ మ్యూజియంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు డాన్స్‌లు వేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, మహిళా అధికారులు ఎర్రటి క్లాత్‌తో తలపాగాలు కట్టుకుని స్టెప్పులు వేశారు. వీరితోపాటు పలువురు అధికారులు, స్థానిక గిరిజన యువత, సందర్శకులు సైతం చిందులేశారు.

టూరిస్ట్ డెస్టినేషన్‌గా అల్లూరి జిల్లా: అజయ్‌జైన్

అరకు చలి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్‌జైన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాను టూరిస్ట్ డెస్టినేషన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో విశాఖ నుంచి అరకుకు హెలికాప్టర్ సర్వీస్ నడిపేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. ఏడు రాష్ట్రాల గిరిజన కళాకారులు తమ సంప్రదాయ ప్రదర్శనలు ఇస్తున్నారు.

జెన్‌కో చేతికే రామగుండం థర్మల్‌ప్లాంట్!

సంయుక్త భాగస్వామ్య ప్రతిపాదనను విరమించుకున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రామగుండంలో సింగరేణితో కలిసి సంయుక్త భాగస్వామ్యంతో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్లాంట్ కట్టాలనే యోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకున్నట్టు తెలిసింది. స్వయంగా తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో ఆధ్వర్యంలోనే రామగుండంలో పవర్ ప్లాంట్ కట్టాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు జెన్‌కో యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి శుక్రవారం సమాచారం అందింది. రామగుండంలో 625 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఉండగా, ఇటీవలే మూతపెట్టారు. అయితే ఇక్కడ పుష్కలంగా భూములు ఉండటంతో సింగరేణి సంయుక్త భాగస్వామ్యంతో థర్మల్ పవర్ ప్లాంట్ కట్టాలనే ప్రతిపాదన తెరపైకి రాగా.. దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. ఓ దశలో సంయుక్త భాగస్వామ్యం కోసం అవసరమైన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. జెన్‌కో పూర్తిగా 100 శాతం రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ కాగా, సింగరేణిలో



తెలంగాణ ప్రభుత్వంతోపాటు కేంద్రానికి వాటా ఉంది. భూములు, అన్ని రకాల సౌకర్యాలు ఉండటంతో జెన్‌కోతోనే ప్లాంట్ నిర్మించాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉద్యమించాయి. పలు దఫాలుగా ప్రభుత్వానికి నివేదించాయి. వాస్తవానికి తెలంగాణ విద్యుత్ రంగంలో నాలుగు సంస్థలు ఉండగా.. అందులో జెన్‌కో, ట్రాన్స్‌కోలు లాభాల్లో నడుస్తున్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థలే నష్టాల్లో ఉన్నాయి. గత 11 ఏళ్లలో ఏ సంవత్సరంలోనూ డిస్కంలు లాభాలు చూసిన దాఖలాల్లేవు. పలు సందర్భాల్లో ఆయా సంస్థల్లోని ఉద్యోగ సంఘాలు కూడా జెన్‌కో/ట్రాన్స్‌కోను వేరుగా, డిస్కంలకు వేరుగా పరిగణించి, వేతన సవరణ వంటి ప్రక్రియల్లో నిర్ణయాలు తీసుకోవాలని కోరిన సందర్భాలూ ఉన్నాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలు, నిర్ణయాల్లో తప్పిదాలపై విచారణకు కూడా ఆదేశించింది. ఈ క్రమంలోనే రామగుండంలో నిర్మాణ బాధ్యతలను జెన్‌కోతో కాకుండా సింగరేణితో కలిసి చేపట్టడమే మేలని భావనతోనే సంయుక్త నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్టు సమాచారం. ఇక రామగుండంలో నిర్మించతలపెట్టిన పవర్‌ప్లాంట్ పిట్‌హెడ్ (బొగ్గు గని ఉపరితల భాగంలో) ఉంది. దేశవ్యాప్తంగా థర్మల్ కేంద్రాలన్నీ పిట్‌హెడ్ విధానంలో కడితేనే వాటితో ప్రయోజనం ఉంటుందని కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) కూడా స్పష్టం చేసింది. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి కేటాయింపులు ఉండటం, బొగ్గు లభ్యత ఉండటం, భూములు పుష్కలంగా ఉండటంతోనే జెన్‌కో నేతృత్వంలోనే ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

రెడ్ కారిడార్‌లో రయ్‌రయ్

- పామేడు-బీజాపూర్ మధ్య ప్రారంభమైన బస్ సర్వీస్
- నిన్నటి వరకు మావోయిస్టుల గుప్పిట్లో దండకారణ్యం
- రవాణాకు కాలిబాటలు, ట్రాక్టర్లు, బైకులే ప్రధానం
- తాజాగా దక్షిణ బస్తర్‌పై పట్టు సాధించిన ప్రభుత్వ బలగాలు



బస్సు సర్వీస్‌ను ఉపయోగించుకుంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రెడ్ కారిడార్‌లో బస్ రయ్‌రయ్ అంటూ పరుగులు పెడుతోంది. 77 ఏళ్ల తర్వాత ఆదివాసీలు గూడెలు ఎర్రబస్సు చూస్తున్నాయి. జనవరి 26వ తేదీ నుంచి రోజుకు ఒక ట్రిప్పు బీజాపూర్-పామేడు మధ్య బస్సు తిరుగుతోంది. దండకారణ్యం మీదుగా గతంలో బస్సులు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తెలంగాణ మీదుగా వెళితే... పామేడు-బీజాపూర్ మధ్య దూరం 240 కిలో మీటర్లుగా ఉండేది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోనే రవాణా సౌకర్యం ఏర్పడి బస్సు అందుబాటులోకి రావడంతో పామేడు-బీజాపూర్ మధ్య దూరం 110 కి.మీ.కు తగ్గిపోయింది. సగటున పదిహేను మంది వంతున బస్సు సేవలను ఉపయోగించుకుంటున్నారు.

తెలంగాణ మీదుగా సాయం

జిల్లా కేంద్రమైన బీజాపూర్ నుంచి తెలంగాణ సరిహద్దులో ఉన్న పామేడు పరిసర ప్రాంతాలకు రేషన్ సరుకులు తదితర ప్రభుత్వ సాయం అందించడం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి నిన్నామొన్నటి వరకు కత్తి మీద సాముగా ఉండేది. మావోయిస్టు ప్రభావిత దండకారణ్యం మీదుగా ప్రయాణించే సాహసం ప్రభుత్వ సిబ్బంది చేసేవారు కాదు. బీజాపూర్ నుంచి భూపాలపట్నం మీదుగా ములుగు జిల్లాలోకి వచ్చి అక్కడి నుంచి భద్రాద్రి జిల్లాకు చేరుకునే వారు. ఆపై చర్ల మీదుగా మొత్తంగా 240 కి.మీ ప్రయాణించి పామేడుకు చేరుకోవాల్సి వచ్చేది.

ఒకప్పుడు హిడ్మా అన్నీతానై...

దేశంలో మావోయిస్టుల అడ్డాగా దక్షిణ బస్తర్ ప్రాంతం ఉంది. బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ ప్రాంతంలో గడిచిన ముప్పై ఏళ్లుగా మావోయిస్టులదే పైచేయి. భారత సర్కార్‌కు ప్రత్యామ్నాయంగా ఇక్కడ జనతన సర్కార్ ఇరవై ఏళ్లకు పైగా అప్రతిహతంగా సాగింది. మావోలే పోడు చేయించారు, చెరువులు తవ్వించారు, బడులు కట్టించారు. మరోవైపు బట్టిగూడెంలో మావోయిస్టుల శిక్షణ కేంద్రం, కర్రిగుట్టల్లో ఆయుధ తయారీ కేంద్రం, కొండపల్లి కార్యక్షేత్రం ఏర్పాటు చేసుకున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో మావోయిస్టు హిడ్మా నేతృత్వాన ఐదు వేల మందికి పైగా సాయుధ మావోయిస్టులు సంచరించేవారు.

బస్ సర్వీస్ ఇలా...

ఆపరేషన్ కగార్ మొదలయ్యాక 2024 జనవరిలో తొలిసారిగా దండకారణ్యంలోకి భద్రతాదళాలు అడుగుపెట్టాయి. గుండం, జీడిపల్లి, కొండపల్లి, కొరగట్టు, ధర్మారం, పామేడు, చెన్నాపురం, చెలిమెల, తోగ్గూడెం, పూసుగుప్ప, ఆవుపల్లి, బాసగూడ తదితర ప్రాంతాల్లో భద్రతా దళాల క్యాంపులు ఏర్పాటయ్యాయి. దీంతో మావోలు ఈ ప్రాంతంపై గతంలో మాదిరి ఆధిపత్యం చెలాయించే పరిస్థితి లేకుండా పోయింది. మరోవైపు క్యాంపుల్లో ఉండే జవాన్ల కోసం సరుకు రవాణాకు దారి ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ దారి గుండానే పామేడు నుంచి బీజాపూర్ వరకు జనవరి 26న బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు.



మావోయిస్టు ప్రభావిత దండకారణ్యంలోని పామేడు - బీజాపూర్ మధ్య ప్రారంభమైన బస్సు సర్వీస్, బస్సును జనవరి 26న ప్రారంభించిన సందర్భంగా భద్రతా బలగాలు

మావోల అనుమతి ఉంటేనే

దండకారణ్య ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించాలంటే కాలిబాటలే దిక్కు. లేదంటే బైక్‌లపై ప్రయాణం చేయాలి. అప్పుడప్పుడు అడవిలో జరిగే సంతలకు ట్రాక్టర్లపై సరుకులు తరలించడం కనిపించేది. అయినా ఈ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించాలంటే మావోల అనుమతి తప్పనిసరి. అలాకాకుండా అడవిలో ప్రయాణించినా ఎక్కడ మందుపాతరలు అమర్చారో.. ఎక్కడ బూబీ ట్రాప్స్ ఉన్నాయో.. తెలియక అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడే పరిస్థితులు ఉండేవి.

కట్టుదిట్టమైన భద్రత

పామేడు నుంచి బీజాపూర్ వరకు ప్రతీ ఐదు కిలోమీటర్లకు ఒకటి వంతున భద్రతా దళాల క్యాంపులు ఉన్నాయి. ఇక్కడ ఉండే భద్రతా దళాలు బస్సు రాకపోకలకు భద్రత కల్పిస్తున్నాయి. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు బస్సు కదలికలు గమనిస్తున్నారు. ప్రతీ రెండున్నర కిలోమీటర్లకు ఒక క్యాంపు వంతున బస్సు ప్రయాణించే మార్గంలో డ్రోన్లు ఎగురవేస్తూ మావోల కదలికలపై నిఘా పెడుతున్నాయి. అవసరమైతే బస్సుకు ఎస్కార్ట్‌గా కూడా భద్రతాదళాలు వస్తున్నాయి.

సోనియా వ్యాఖ్యల వక్రీకరణ: సీతక్క



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంపై.. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరిస్తోందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో మండిపడ్డారు. అసలు సమస్యలను పక్కదారి పట్టించేలా లేనిపోని వివాదాలు సృష్టించడం.. బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంలో కేంద్రం అవాస్తవాలనే చేర్చిందని విమర్శించారు. సామాన్యుల సమస్యలను రాష్ట్రపతి ప్రసంగంలో పూర్తిగా విస్మరించారని తెలిపారు. నిరుద్యోగ సమస్య, ఆర్థికరంగ ఒడిదుడుకులు ఆ ప్రసంగంలో కనిపించలేదని వివరించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకే సోనియా గాంధీ వ్యాఖ్యలపై వివాదం సృష్టిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

కేసీఆర్ కోసమే నిరీక్షణ

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ బయటికి ఎప్పుడొస్తారా.. అని నిరీక్షిస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ తెలిపారు. ఆయన ఫామ్‌హౌస్ నుండి బయటికి వస్తే ఎలా ఉంటుందో.. చూస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై దయాకర్ స్పందిస్తూ.. ఇంకా ఆయనను భరించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుని ఫామ్‌హౌస్‌లో ఉండి.. ఇవాళ బయటికొస్తా.. అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ విధ్వంసం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి.. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం పడుతుందని వెల్లడించారు. ఏడాది పాటు కనిపించని కేసీఆర్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని బయటికొస్తారో చెప్పాలని ప్రశ్నించారు. వాళ్లను, వీళ్లను బతిమలాడుకొని పార్టీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఆటలో ఆయన ఎలా కీలుబొమ్మగా మారారో తెలుసునన్నారు. భారతీయ జనతా పార్టీ ముసుగులో బీఆర్ఎస్ పేరు పెట్టుకుని.. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌తో వస్తే ప్రజలు ఎలా స్వీకరిస్తారో చూద్దామని సవాల్ చేశారు. తెలంగాణలో తనకు ఇంకా రాజకీయ భవిష్యత్తు ఉంటుందనుకోవడం.. కేసీఆర్ మూర్ఖత్వం, రాజకీయ భ్రమేనని దయాకర్ పేర్కొన్నారు.

సోనియాగాంధీ క్షమాపణలు చెప్పాలి

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముపై సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మండిపడ్డారు. 'బోరింగ్', 'రబ్బరు స్టాంప్' అనే అహంకార వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంపై దాడినేనన్నారు. రాష్ట్రపతి హోదాను కించపర్చడం, గిరిజన మహిళను అవమానించడం దారుణమని ఒక ప్రకటనలో మండిపడ్డారు. సోనియా వ్యాఖ్యలు భారతీయుల మనోభావాలను దెబ్బతీశాయని, ప్రజాస్వామ్యాన్ని అవమానించిన సోనియా గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలని శిల్పారెడ్డి డిమాండ్‌చేశారు. రాష్ట్రపతి ముర్మును ఉద్దేశించిన 'ఓల్డ్ పూర్ లేడీ' అన్న సోనియా గాంధీ వ్యాఖ్యలు ఆదివాసీ గిరిజన సమాజానికి అవమానకరమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు సోనియాగాంధీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓ గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉండటం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచీ ఇష్టం లేదన్నారు.

వలస కార్మికుల ఆశలు తీరుస్తారా?

నిర్మలమ్మ బడ్జెట్‌పై గంపెడాశతో ప్రవాసులు

- విదేశాంగశాఖకు నిధులు కేటాయిస్తున్నా.. వలస కార్మికులను విస్మరిస్తున్నారని విమర్శలు
- తమ సంక్షేమంపై దృష్టిపెట్టాలని కార్మికుల డిమాండ్



మోర్తాడ్ (బాల్కొండ): మెరుగైన ఉపాధి కోసం విదేశాలకు వలస బాట పట్టిన కార్మికుల సంక్షేమంపై కేంద్రం దృష్టి సారించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు కేటాయింపులు భారీగానే ఉంటున్నా వలస కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని, ప్రవాస భారతీయులతో కేంద్రానికి భారీ మొత్తంలోనే విదేశీ మారకద్రవ్యం లభిస్తున్నా తమ గురించి పట్టించుకోవడంలేదని కార్మిక వర్గాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వలస కార్మికుల సంక్షేమ అంశాన్ని చేర్చాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఆదాయం దండిగా..

ప్రపంచంలోని ఇతర దేశాల ప్రవాసులతో పోలిస్తే భారతీయ ప్రవాసులు దేశానికి దండిగా ఆదాయం సమకూరుస్తున్నారని గణాంకాలు చెపుతున్నాయి. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం భారతీయులు విదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం వల్ల 2024లో రూ.10.25 లక్షల కోట్లు మన దేశానికి చేరవేశారని తెలుస్తోంది.

ఐసీడబ్ల్యూఎఫ్‌కు కేటాయింపులు పెంచితేనే...

గల్ఫ్ దేశాలతో పాటు మలేసియా, సింగపూర్, మాల్టా, ఇజ్రాయెల్ తదితర దేశాలకు వలస వెళ్లిన కార్మికులకు భారత రాయబార కార్యాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని వలస కార్మిక సంఘాల నాయకులు సూచిస్తున్నారు. వలస కార్మికుల్లో అనేక మందికి విదేశీ చట్టాలపై అవగాహన లేకపోవడంతో జైలుపాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసీడబ్ల్యూఎఫ్) కింద నిధులు కేటాయిస్తే వలస కార్మికులకు న్యాయ సహాయం అందించడానికి మార్గం సుగమం అవుతుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ.22,154 కోట్లు కేటాయించినా ఇందులో ఐసీడబ్ల్యూఎఫ్‌కు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో వలస కార్మికులకు ఎలాంటి న్యాయ సహాయం అందలేదని చెపుతున్నారు.

పునరావాసం కల్పించాలి..

విదేశాలనుంచి ఇంటిబాట పట్టిన వలస కార్మికుల పునరావాసంపై కేంద్రం దృష్టి సారించాలనే వాదన వినిపిస్తోంది. తమ పరిధిలో లేని అంశం అని కేంద్రం వదిలేయకుండా, ప్రత్యేక కేటాయింపులు జరిపి వలస కార్మికుల పునరావాసానికి ప్రాధాన్యం ఇస్తేనే వారి బతుకులు గాడిన పడతాయని వలస కార్మిక సంఘాల నేతలు అంటున్నారు.

అలసత్వం పనికిరాదు..




వలస కార్మికుల విషయంలో ఎలాంటి అలసత్వం పనికిరాదు. కేంద్రానికి భారీగా ఆదాయం వస్తున్నా, వలస కార్మికుల సంక్షేమాన్ని రాష్ట్రాల నెత్తిన పెట్టి.. ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సరైంది కాదు. విదేశీ మారకద్రవ్యం తెచ్చిపెడుతున్న వలస కార్మికులతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

ఆదాయాన్ని సవరించి లెక్కగట్టండి

టెక్ మహీంద్రా పిటిషన్‌లో ఐటీ శాఖను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రాకు హైకోర్టు ఊరటనిచ్చింది. 2002-03 నుంచి 2008-09 వరకు అసెస్‌మెంట్ సంవత్సరాలకు ఆదాయాన్ని సరైన విధంగా అంచనా వేయాలని చెప్పింది. ఈ మేరకు టెక్ మహీంద్రా దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది. 'సత్యం స్కాం'లో భాగంగా నివేదించిన కల్పిత ఆదాయాన్ని మినహాయించి, సవరించిన ఆర్థిక నివేదికల ఆధారంగా కంపెనీ ఆదాయాన్ని తిరిగి లెక్కించాలని ఆదాయపు పన్ను శాఖను ఆదేశించింది. సుదీర్ఘ విచారణ తర్వాత జస్టిస్ శామ్ కోషి, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఆదాయపు పన్ను శాఖ నిర్ణయాలు వివాదాస్పదంగా ఉన్నాయంటూ టెక్ మహీంద్రా 2011లో పిటిషన్ వేసింది. సత్యం కంప్యూటర్స్ మాజీ చైర్మన్ ఆదాయాన్ని ఎక్కువగా చూపి, కల్పిత ఆదాయంపై పన్నులు చెల్లించిన సంవత్సరాల్లో సమర్పించిన సవరించిన రిటర్నులను అనుమతించలేదని పేర్కొంది.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిన కారణంగానే సత్యం కంపెనీని టెక్ మహీంద్రా కొనుగోలు చేసింది. కుంభకోణం బయటపడిన వెంటనే కంపెనీని తన అధీనంలోకి తీసుకున్న కేంద్రం 'సత్యం'ను కాపాడేందుకు పెట్టుబడులు పెట్టేవారి కోసం వేలానికి యత్నించమని కంపెనీ లా బోర్డుకు సూచించింది. ఈ వేలంలో టెక్ మహీంద్రా.. 'సత్యం'ను రూ.3,000 కోట్లకు దక్కించుకుంది. ఒక రకంగా చూస్తే ఇది అనాథ లాంటి సత్యంను దత్తత తీసుకోవడమే. 53,000 మంది ఉద్యోగులు, పెట్టుబడిదారులు సహా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సత్యం సంస్థకు టెక్ మహీంద్రా ఊపిరిపోసింది. గత చైర్మన్ తీసుకున్న తప్పుడు నిర్ణయాల కారణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) టెక్ మహీంద్రాపై అనేక చర్యలను తీసుకుంది. సంస్థను బాధితురాలిగా నిర్ధారించిన సుప్రీంకోర్టు ఇలాంటి చర్యలన్నింటినీ చెల్లుబాటు కాకుండా ఆదేశించింది. సవరించిన ఆర్థిక నివేదికల ఆధారంగా ఆదాయాన్ని లెక్కగట్టేలా ఐటీ శాఖను ఆదేశించాలి' అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆదాయాన్ని మళ్లీ లెక్కగట్టాలని ఆదేశిస్తూ విచారణ ముగించింది.






శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గద్దర్ 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు గద్దర్ పాటల సీడీని ఆవిష్కరించారు. గద్దర్ ఫొటోలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న ఆడి పాడారు.

అలుముకున్న మంచు..ఆదమరిస్తే ముంచు



విజయనగరం జిల్లాలో శుక్రవారం ఉదయం రహదారులను పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగమంచు ప్రభావంతో గజపతినగరం రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనం – సాక్షి ఫొటోగ్రాఫర్ విజయనగరం

స్నేహమంటే ఇదేరా..



ఫొటోలో చిన్నారిపేరు సాయి. తిరుపతిలోని ఖాదీ కాలనీలో నివసిస్తుంటాడు. ఆ వీధిలో ఉండే బ్రూన్ అనే శునకంతో రోజూ ఆడుకుంటుంటాడు. శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చే సరికి అమ్మానాన్న ఇంకా ఇంటికిరాలేదు. గేటు ముందు కూర్చుంటే బ్రూన్ వచ్చి ఇలా చిన్నారి ఒడిలో తలపెట్టి ఇలా నిద్రపోయింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎమ్మెల్యే గారి స్పీడ్.. జనానికి బ్రేకర్



ఇది స్కూల్ జోన్ కాదు.. ఆసుపత్రి ప్రాంతమూ కాదు.. అయినా సరే రోడ్డుకి అడ్డంగా పెద్ద పెద్ద గుట్టల్లా స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఎమ్మెల్యే దామచర్ల ఇంటికి వెళ్లే మార్గం కావడంతో ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ట్రంక్ రోడ్ బీఆర్ అపార్ట్‌మెంట్స్‌కి ఎదురుగా ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేశారు. గుట్టల్లాంటి ఈ స్పీడ్ బ్రేకర్లు దాటలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా...

మల్లన్న సేవలో సినీనటి మీనాక్షిచౌదరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఇటీవల విడుదలైన ×సంక్రాంతికి వస్తున్నాం€ సినిమాలో నటించిన మీనాక్షి చౌదరి శుక్రవారం శ్రీశైలం చేరుకుని మల్లన్నకు రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం రోప్‌వేలో పాతాళగంగకు చేరుకుని బోటింగ్ చేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌మ్యాన్ కొండ విజయ్ శుక్రవారం శ్రీశైల మల్లన్నను దర్శించుకున్నారు.

కన్యకా పరమేశ్వరికి నూతన వస్త్రాల సమర్పణ

మండపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని కోనసీమ జిల్లా మండపేట రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ద్వారపూడిలో కొలువుదీరిన వాసవీ మాతకు నూతన వస్త్రాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల భాస్కరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

నేడు అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం రాక

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులను అంతర్జాతీయ నిపుణుల కమిటీ సభ్యులు శనివారం పరిశీలించనున్నారు. గియాన్ ఫ్రాన్ డి సిస్కో, డేవిడ్ బి పాల్‌తో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వస్తున్నారు. కొత్త డయాఫ్రమ్‌వాల్ పనులపై అధికారులు కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. డయాఫ్రమ్‌వాల్‌తో పాటు నిర్మాణాల డిజైన్‌లు, పనుల నాణ్యతపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలించి కమిటీ, సీడబ్ల్యూసీ సభ్యులు బోపాల్ సింగ్‌కు తెలియజేస్తారని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.59 కోట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలోని ఉభయ దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణ రూ.2,59,68,400 లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం దేవస్థాన చంద్రావతి కల్యాణ మండపంలో హుండీల లెక్కింపులు చేపట్టారు. గత 22 రోజుల్లో భక్తులు ఈ కానుకలను సమర్పించారు. నగదుతో పాటు బంగారం 64.200 గ్రాములు, వెండి 3.170 కిలోలు లభించినట్లు ఈఓ తెలిపారు. అలాగే యూఎస్ డాలర్లు 590, చైనా యువాన్స్ 100, సౌదీ అరేబియా రియాల్స్ 5, కువైట్ దినార్స్ 2, కెనడా డాలర్లు 10, యూఏఈ దిర్హమ్స్ 1090, సింగపూర్ డాలర్లు 14 మొదలైన విదేశీ కరెన్సీ కూడా లభించాయి.

వృద్ధ దంపతుల ఆత్మహత్య
కాకినాడలో ఘటన

కాకినాడ క్రైం: కాకినాడ నగరంలోని జగన్నాథపురం ఉప్పుటేరులో దూకి వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. దంపతుల్లో భర్త వయసు 65 ఏళ్లు కాగా, భార్య వయసు 60 ఏళ్లని, వీరు కాకినాడ జగన్నాథపురానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారని ఈ నేపథ్యంలో అనారోగ్యాన్ని తాళలేక వృద్ధురాలు, ఆమె వేదన చూడలేక మనోవేదనకు గురైన భర్త ఇద్దరూ చనిపోవాలని నిర్ణయించుకున్నారన్నారు. అనుకున్నదే తడవుగా జగన్నాథపురం వంతెన నుంచి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాలను గుర్తించిన బంధువులు ఉప్పుటేరు నుంచి తీసి అంతిమ సంస్కారాలు నిర్వహించారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని, పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

జువ్వలదిన్నె హార్బర్ పనులు సా...గతీత



- వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వేగంగా నిర్మాణం
- కూటమి ప్రభుత్వం వచ్చాక అడుగు ముందుకు పడని దుస్థితి
- మరోవైపు సముద్రంలో పెద్దబోట్లతో తమిళ జాలర్లు
- వేట సాగక పూట గడవని దుస్థితిలో ఏపీ మత్స్యకారులు

కావలి: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను అందుబాటులోకి తెచ్చే అంశంపై స్పష్టత కొరవడుతోంది. నెల్లూరు జిల్లాలో కొత్తగా అంతర్భాగమైన కందుకూరు నియోజకవర్గంతో కలిపి సుదీర్ఘమైన 189 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో మత్స్యకారుల జనాభా సుమారు 4 లక్షలు. వీరిలో ప్రత్యక్షంగా సముద్రం మీద ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల సంఖ్య 50,000. వీరికి 8,500 ఫైబర్ బోట్లు, 4,500 సంప్రదాయ తెప్పలు ఉన్నాయి.

తమిళ కార్పొరేట్ శక్తుల తిష్ట

సముద్రంలోకి కార్పొరేట్లు రంగప్రవేశం చేశారు. దీంతో చేపల వేట మత్స్య పరిశ్రమగా మారింది. పెరిగిన పోటీ కారణంగా సంప్రదాయ బోట్లతో వేట సాధ్యపడటం లేదు. ఎక్కడైతే మత్స్యకారులు స్వేచ్ఛగా జీవనం సాగించారో అక్కడే కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తమిళనాడుకు చెందిన కార్పొరేట్ శక్తులు రూ.కోట్ల పెట్టుబడి, భారీ బోట్లతో రంగప్రవేశం చేశాయి. వలల సైజు మార్చి, సముద్రాన్ని ఊడ్చేయడం మొదలుపెట్టాయి. వీటన్నింటి ఫలితంగా చిన్న మత్స్యకారులు మామూలు బోట్లలో వేటకు వెళ్లినా చేపలు దొరకని పరిస్థితి నెలకొంది.

'జువ్వలదిన్నె'కు వైఎస్ జగన్ శ్రీకారం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల శాశ్వత జీవనోపాధికి భరోసా కల్పించాలనే సంకల్పంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద 116 ఎకరాల విస్తీర్ణంలో రూ.288.80 కోట్లతో నిర్మించేందుకు 18 మార్చి 2021న అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మాణ సంస్థకు పనులు అప్పగించి, రెండేళ్లలో పూర్తి చేయాలని ఒప్పందం కుదుర్చుకుంది. మరుసటి రోజే.. అంటే 19 మార్చి 2021న ఫిషింగ్ హార్బరు నిర్మాణ పనులకు సీఎం హోదాలో వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 25,000 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం కలగాలనే లక్ష్యంతో, 1,250 బోట్లు నిలిపేలా హార్బర్ పనులు చేపట్టారు. ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి వస్తుందని అంచనా వేశారు.

ఇదీ... తాజా పరిస్థితి

- చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలు తర్వాత అంటే 2 ఆగస్టు 2024న ఫిషింగ్ హార్బర్‌ను జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఆరునెలల్లో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామని మంత్రి ఆనం ప్రకటించారు.
- ప్రధాని నరేంద్ర మోదీ 30 ఆగస్టు 2024న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు.
- 10.12.2024న కలెక్టర్ అధ్యక్షతన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ జిల్లా స్థాయి సలహా కమిటీ (డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ) ప్రథమ సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహిస్తూ వివిధ భాగస్వాముల మధ్య వచ్చే వివాదాలను పరిష్కరించుకుంటూ, హార్బర్ నిర్వహణ, వివిధ రుసుముల (ఫీజులు) వసూలు తదితర అంశాలు చర్చించారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ...

ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ వద్ద బకింగ్‌హాం కెనాల్ ఉంది. దానిపై 7 మీటర్ల వెడల్పులో చిన్న దారి ఉంది. ఈ కొద్దిపాటి ఇరుకు దారి హార్బర్‌కు రాకపోకలకు అనువుగా లేదు. అందుకే బకింగ్‌హామ్ కెనాల్‌పై 40 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించాలి. దానికి కనీసం రూ.30 కోట్లు ఖర్చవుతుంది. ఆ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేని



ఫిషింగ్ హార్బర్‌లో బకింగ్‌హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

పరిస్థితి. అలాగే హార్బర్‌కు ఉత్తరం వైపు రూ.5 కోట్లతో రోడ్డును కూడా నిర్మించాల్సి ఉంది.



-ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు కార్యకలాపాలు సాగించేందుకు చేపట్టిన నిర్మాణాలు

నిర్వహణ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బోట్ల యజమానులు, చేపల వ్యాపారస్తులు, చేపలు ఎండబెట్టే మహిళలతో కమిటీలు వేసి హార్బర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. హార్బర్‌లో నిలిచే బోట్ల నుంచి వసూలు చేయాల్సిన ఫీజులు ఎంత అనేది నిర్ధారించడానికి ఇతర ఫిషింగ్ హార్బర్ల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాం.

– ఎం.నాగేశ్వరరావు, జేడీ, జిల్లా మత్స్యశాఖ, నెల్లూరు

ప్రభుత్వ సేవలకు హౌస్‌హోల్డ్ నంబర్ తప్పనిసరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాదు... ఇక నుంచి ప్రభుత్వ ఆఫీసుల్లో ఏ సేవలు పొందాలన్నా హౌస్ హోల్డ్ నంబర్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవల కోసం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న కుటుంబాల జాబితా (హౌస్ హోల్డ్ డేటా)ల్లో తమ కుటుంబానికి కేటాయించిన నంబరును అర్జీలతోపాటు తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుంది. లేకపోతే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం ఉండదు. ఈ విధానం అమలు కోసం విధివిధానాలు రూపొందించాలని ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు మార్గదర్శకాలను రూపొందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటి వరకు హౌస్ హోల్డ్ డేటాలో 5.12 కోట్ల మంది వరకు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. మరో 10లక్షల నుంచి 15లక్షల మంది వరకు ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆఫీసుల్లో సేవల కోసం హౌస్ హోల్డ్ నంబర్ తప్పనిసరి చేస్తే వీరందరూ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నవారు కూడా స్థానికంగా వివిధ రకాల ప్రభుత్వ సర్వీసులు పొందాలంటే సమస్యలు తప్పవు.

టీటీడీ దాతల పేరుతో నకిలీ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు

తిరుమల: టీటీడీ దాతల పేరుతో నకిలీ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను విక్రయించి భక్తులను మోసగించిన దళారీపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదుచేశారు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన ఎం.ఉపేందర్ శ్రీవారిని దర్శించుకునేందుకు సహకరించాలని హైదరాబాద్‌కు చెందిన నళినీకాంత్ అనే వ్యక్తిని సంప్రదించాడు. అతను తనకు తెలిసిన సతీష్ అనే దళారీని పరిచయం చేశాడు. సతీష్ ముగ్గురు భక్తులకు గత నెల 20వ తేదీకి టీటీడీ రూ.10లక్షల దాతల వీఐపీ బ్రేక్ దర్శన టికెట్‌ను ఇప్పిస్తానని అందుకు రూ. 2,100 తీసుకుని టికెట్లు పంపించాడు. జనవరి 29 ఉదయం భక్తుడు వైకుంఠం క్యూకాంప్లెక్స్–1లో దర్శనానికి వెళ్లాడు. ఆ టికెట్‌ను స్కానింగ్ చేయగా నకిలీదిగా తేలింది. దీంతో భక్తుడు తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆ ఫిర్యాదుపై కేసును నమోదుచేసిన పోలీసులు దళారీకోసం గాలిస్తున్నారు.

గ్రామ స్థాయిలో వ్యవసాయ డ్రోన్స్

- ఒక్కో యూనిట్ రూ.10 లక్షల అంచనాతో ఏర్పాటు
- ముందుగా కొనుగోలు చేసుకోవల్సిన బాధ్యత సీహెచ్‌సీలదే



సాక్షి, అమరావతి : రైతు సేవా కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన గ్రామస్థాయి యాంత్రీకరణ కేంద్రాల(సీహెచ్‌సీ)కు కిసాన్ డ్రోన్స్‌ను అందించేందుకు రంగం సిద్ధమైంది. మండలానికి 3 చొప్పున 2 వేల ఆర్‌ఎస్‌కేల్లో వీటిని ఏర్పాటు చేయాలని వైఎస్ జగన్ ప్రభుత్వం రెండేళ్ల కిందట సంకల్పించింది. ఇందుకోసం అప్పట్లో పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి 596 మండలాల్లో 1,755 ఆర్‌ఎస్‌కేలను ఎంపిక చేసింది. ఒక్కో ఆర్‌ఎస్‌కే పరిధిలో రూ.10 లక్షల అంచనా వ్యయం కలిగిన ఈ డ్రోన్స్ నిర్వహణకు 4–5 రైతులతో సీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఈ గ్రూపుల్లో అర్హత కల్గిన వారిని ఎంపిక చేసి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇచ్చారు. పురుగు మందులు, సూక్ష్మ ఎరువులను పంటలకు అందించడానికి ఈ డ్రోన్లు ఉపయోగపడతాయి. తాజాగా కూటమి ప్రభుత్వం తెచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఎంపికైన సీహెచ్‌సీ ముందుగా రూ.10 లక్షలతో డ్రోన్‌ను కొనుగోలు చేయాలి. యూనిట్ అంచనా వ్యయంలో 50 శాతం రుణం రూపంలో బ్యాంకుల నుంచి పొందేందుకు అవసరమైన చేయూతనిస్తుంది. మిగిలిన 50 శాతం సీహెచ్‌సీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. యూనిట్ గ్రౌండ్ అయ్యాక 80 శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఆ కమిటీకి విడుదల చేస్తుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 875 సీహెచ్‌సీలకు రూ.70 కోట్ల రాయితీతో ఈ డ్రోన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డ్రోన్ మోడల్‌ను ఎంపిక చేసుకునే బాధ్యతను రైతు గ్రూపులకే అప్పగిస్తున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు చెప్పారు.

45 ఏళ్ల తర్వాత నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు

- నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు
- ముఖ్యఅతిథులుగా జాతీయ నేతలు బృందాకారత్, బేబీ, రాఘవులు, అరుణ్‌కుమార్



సాక్షి, అమరావతి: నెల్లూరు నగరం 45 ఏళ్ల తర్వాత సీపీఎం రాష్ట్ర మహాసభలకు అతిథ్యం ఇస్తోంది. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య సారథ్యంలో 1978లో 13వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో నిర్వహించారు. సరిగ్గా 45 సంవత్సరాల తర్వాత మరోసారి సీపీఎం రాష్ట్ర 27వ మహాసభలు నిర్వహిస్తున్నారు. మహాసభల ప్రాంగణానికి సీతారామ్ ఏచూరి పేరును ఖరారు చేశారు. ఫిబ్రవరి ఒకటి నుంచి మూడు రోజుల పాటు ఈ మహాసభలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు, అతిథులు హాజరుకానున్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ నాయకులు బృందా కారత్, ఎంఏ బేబి, బీవీ రాఘవులు, ఆర్.అరుణ్ కుమార్ తదితరులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 1న ప్రారంభ సభ జరుగుతుంది. అఖిలభారత నాయకులు, రాష్ట్ర నాయకత్వంతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితర వామపక్ష నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. 2, 3 తేదీల్లో ప్రతినిధుల సమావేశం, 3వ తేదీన సాయంత్రం 3 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ నుండి ప్రదర్శన, 4 గంటలకు వీఆర్ హైస్కూలు గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మహాసభలను పూర్తి చేసుకుని జాతీయ మహాసభలకు సన్నద్ధం అవుతున్న సీపీఎం ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర మహాసభలను పూర్తి చేసుకుని జాన్‌వెస్లీని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకుంది. ఇప్పుడు మరో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ సీపీఎం మహాసభలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కూటమి నేతల ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం వంటి అనేక ప్రజా సమస్యలు, కీలక అంశాలుపై మహాసభల్లో చర్చించనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రత్యామ్నాయ ప్రణాళికపై మహాసభలో తీర్మానం చేస్తామని ప్రకటించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,710 మంది స్వామిని దర్శించుకున్నారు. 15,635 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

వనదుర్గ అమ్మవారికి ఘనంగా చండీహోమం



అన్నవరం: రత్నగిరి వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవార్లకు పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీహోమం ప్రారంభించారు. 11–30 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతి అమ్మవారు విహారం

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారి ఊంజల్ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

విద్యా సమాచారం

రేపు ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా తృతీయ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏపీజీఈఏ అధ్యక్షులు ఎంవిఎస్ఎన్ఎన్ జగన్నాథం అధ్యక్షతన నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్ కుమార్ పాల్గొంటారని, కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి జి.రాంబా పర్యవేక్షిస్తారని జిల్లా అధ్యక్షుడు జగన్నాథం తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

ముమ్మిడివరం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం జీఎంసీ బాలయోగి బాలికోన్నత పాఠశాలకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.2.80 లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంటును సమకూర్చారు. ఈ ప్లాంటును శుక్రవారం ఎమ్మెల్యే దాట్ల ప్రారంభించారు.

28 నుంచి సదర్వ ఈవెంట్-2025

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28 నుంచి 2 రోజులు సదర్వ ఈవెంట్–2025 నిర్వహించనున్నట్టు వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆమె ఈవెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎస్పీడబ్ల్యూ విద్యార్థినులకు బెస్ట్ ఫర్ఫార్మెన్స్ అవార్డు



తిరుపతి సిటీ: తిరుపతి పోలీస్ గ్రౌండ్ వేదికగా ఈనెల 26న జరిగిన గణతంత్ర దినోత్సవ ఎన్‌సీసీ కవాతులో ప్రతిభ చూపి కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ ఫర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ నారాయణమ్మ అభినందించారు. గణతంత్రవేడుకలలో పాల్గొన్న ఎస్పీడబ్ల్యూ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు కావ్య, సరస్వతి, ఎన్ సాయి గోపిక, ఎల్ కులదీపిక కవాతులో ప్రతిభ కనబరచి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందుకోవడం అభినందనీయమన్నారు.

స్మార్ట్ పెట్‌లు వచ్చాయట!





మన ఇళ్లల్లో కుక్క పిల్లల్ని పెంచుకుంటాం. పిల్లుల్ని, కోళ్లని, పావురాలని, చిలుకలని కూడా కొందరు పెంచుతారు. అన్నింటి కంటే కుక్కలు చాలా ఫ్రెండ్లీగా ఉంటూ మనకు ప్రేమను పంచుతూ సరదా కలిగిస్తాయి. కుక్కపిల్లలతో స్నేహం చేసే పిల్లలకు చాలా వరకు ఆందోళన సమస్యలు రావు. కాబట్టి 'పెట్స్' పెంచడం మంచిదే అంటారు డాక్టర్లు. అయితే పెట్స్ మన మాట వినకపోవచ్చు. వాటి సేవకు చాలా టైమ్ అవసరం అవుతుంది కూడా. ఈ బాధలు లేకుండా చైనాలో 'స్మార్ట్ పెట్'లు వచ్చాయి. అంటే బుజ్జికుక్క పిల్ల లాంటి ఏ.ఐ. పవర్డ్ రోబో అన్నమాట. ఈ ఫోటోల్లో మీరు చూస్తున్నది 19 ఏళ్ల గ్వాంగ్ యుచున్ అనే అమ్మాయి 'బూబూ' పేరుతో మార్కెట్‌లో ఉన్న స్మార్ట్ పెట్‌ని. ఇది దాదాపు కుక్కపిల్ల లాగ మన మాటలకు రెస్పాండ్ అవుతూ గారాలు పోతూ ఉల్లాసం కలిగిస్తుంది. ఇప్పుడు బూబూలు అక్కడ ఎక్కువ అమ్ముడు పోతున్నాయి. స్కూలు పాఠాల వల్ల ఒంటరితనం వల్ల యాంగ్జయిటీ బాధపడుతున్న పిల్లలు వీటితో ఆడుకుంటూ చాలా చురుకుదనం తెచ్చుకుంటున్నారట. ఈ 'బూబూ'తో పాటు 'బేబీ ఆల్ఫా' పేరుతో కూడా ఒక స్మార్ట్ పెట్‌ను చైనాలో అమ్ముతున్నారు. ఇలాంటి పెట్స్ తయారు చేయడానికి వందల కోట్ల రూపాయల ఫ్యాక్టరీలు అక్కడ సిద్ధమవుతున్నాయి. ఈ బొమ్మలను 'సోషల్ రోబో'లు అంటున్నారు.

అయితే మనం వీటిని కొనే స్థితికి వెళ్లకూడదు. మనం స్కూల్లో, ఇంట్లో అందరితో ఫ్రెండ్లీగా ఉంటే బంధువులతో ఇరుగు పొరుగు వారితో సరదాగా గడిపితే ఆందోళనలు పోతాయి. అంతగా అవసరమైతే నిజం కుక్కపిల్లను పెంచుకుంటే సరి.

అట్ట ముక్కతో అవయవాలు



స్కూల్‌లో బాడీ పార్ట్స్‌ను టీచర్ చార్ట్ మీద చూపిస్తుంది. కాని మనం వాటిని అట్టతో తయారు చేసి క్లాస్‌రూమ్‌లో అంటించవచ్చు. లేదా వేలాడదీయవచ్చు. ఇక్కడ చూడండి. బ్రౌన్ పేపర్ లేదా బ్రౌన్ అట్టను ఎంత చక్కగా కట్ చేసి అవయవాల రూపం ఇచ్చారు. ముందు వాటి షేప్‌ను పేన్సిల్‌తో గీసుకుని జాగ్రత్తగా కట్ చేస్తే ఈ షేప్ వస్తుంది. కట్ చేయడానికి కత్తి, బ్లేడ్ వాడకూడదు. కత్తెరే వాడాలి. లేకుంటే చేయి తెగే ప్రమాదం ఉంది. సరేనా... ట్రై చేయండి.

● మన సినిమా

ఆర్ యు రెడీ టు వాలంటీర్ ?




కిడ్స్... మీరెప్పుడైనా మీ క్లాసులలో వాలంటీర్స్‌గా ఏదైనా టాస్కులు చేశారా? కాని ఇప్పుడు మనం చెప్పుకోబోయే టాస్క్ కోసం మీరెవరైనా వాలంటీర్‌గా రాగలిగితే మీకు హేట్సాఫ్. ఎందుకంటే అమెరికాలోని ఫ్లోరిడా స్టేట్ ఫోర్ట్ మేయర్స్ ఎలిమెంటరీ స్కూల్‌లోని ఫిఫ్త్ గ్రేడ్ టీచర్ తమ స్టూడెంట్స్ కోసం ఓ విచిత్రమైన టాస్క్ ఇచ్చి దాన్ని వాలంటీర్ చేయమని అడిగింది. ఓ 75 ఇయర్స్ ఓల్డ్ లిజర్డ్‌ని హాలిడే పీరియడ్‌లో తమ ఇంటికి తీసకుని వెళ్ళి చూసుకోవాలన్నదే టాస్క్. ఆ లిజర్డ్ పేరే లియో. తనకు ఇంకా 74 ఇయర్స్ అని తన ఒకే ఒక ఫ్రెండ్ అయిన టర్టిల్‌తో చెప్పుకుంటూ ఉంటుంది. సో ఈ టాస్క్ కోసం క్లాస్‌లో ఉన్న కొంతమంది స్టూడెంట్స్ వీక్‌కి ఒకరు చొప్పున లిజర్డ్‌ని చూసుకోవాలని డీల్ కుదుర్చుకుంటారు. మరి లిజర్డ్ ఫస్ట్ వెళ్లేది ఓ ఓవర్ టాకెటివ్ గర్ల్ ఇంటికి. అసలే లియో చాలా కామ్ గోయింగ్ మరి ఈ ఓవర్ టాకెటివ్ గర్ల్‌తో పాటు వారానికి ఒక స్టూడెంట్ దగ్గర ఎటువంటి కష్టాలు పడిందో తెలియాలంటే ది మోస్ట్ కామిక్ యానిమేటెడ్ మూవీ ఆఫ్ 2023 ఇయర్ 'లియో'ని నెట్ ఫ్లిక్స్ ఓటిటిలో చూసెయ్యండి. కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ టు వాచ్ ది వాలంటీర్ ఫర్ లియో.

- ఇంటూరు హరికృష్ణ

● మహనీయులు

చిన్ననాడే ధైర్యం చూపిన బాబు జగ్జీవన్ రామ్



అతను పుట్టింది బిహార్ రాష్ట్రంలో. ఒక అన్న, ముగ్గురు చెల్లెళ్లు. మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వారిని పెంచేవారు. పిల్లలకు చదువు ముఖ్యం అని చదివించారు. అంతా సజావుగా సాగిపోతున్న సమయంలో తండ్రి మరణించాడు. దీంతో వారికి ఇబ్బందులు మొదలయ్యాయి. ఆ సమయంలో కూడా తల్లి చదువులు మాన్పించలేదు. చక్కగా చదువుకోమని ప్రోత్సహించింది.

అలా ఆ బాలుడు ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చేరి, ఎంతో శ్రద్ధగా చదువుకున్నాడు. అలాంటి సమయంలో ఒకసారి అతని కులాన్ని తెలుసుకొని కొందరు అతనిపై వివక్ష చూపించారు. అయినా అతను కుంగిపోలేదు. ఆ రోజుల్లో బడుల్లో విద్యార్థులు నీళ్లు తాగేందుకు రెండు కుండలుండేవి. ఒకటి అంటరాని వారికి, మరొకటి ఇతర కులాలకు. ఈ విషయంపై కోపం తెచ్చుకున్న అతను ఆ కుండను పగులగొట్టాడు.

అలా చిన్నతనంలోనే ధైర్యం, తెగువ చూపిన అతను స్కూల్ అనంతరం బెనారస్ హిందూ యూనివర్సిటీలో చేరాడు. అక్కడా కులం కారణంగా వివక్ష చూపించడంతో అక్కడ చదువు మానేసి, కలకత్తా యూనివర్శిటీలో చేరాడు.

ఎలాగైనా దేశంలోని అంటరానితనాన్ని రూపుమాపాలని ు నిశ్చయించుకున్నాడు. చదువు పూర్తయ్యాక సామాజిక ఉద్యమాల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. 1937లో బిహార్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. ఆపై అఖిల భారత అణగారిన వర్గాల లీగ్ ఏర్పాటు చేసి అంటరానివారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాడు. దేవాలయాలు, ఊరిలోని బావులు అందరికీ చెందాలని డిమాండ్ చేశాడు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై, నెహ్రూ కేబినెట్‌లో సమాచార, రవాణా, రైల్వే శాఖలకు మంత్రిగా పనిచేశారు. సుమారు 30 ఏళ్ల పాటు ముగ్గురు ప్రధానుల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఘనత ఆయన సొంతం చేసుకున్నారు. దేశానికి నాలుగో ఉపప్రధానిగానూ ఉన్నారు. ఆయనే బాబూ జగ్జీవన్ రామ్. 1986లో ఆయన మరణించారు. ఏటా ఏప్రిల్ 5న ఆయన పుట్టిన రోజును 'సమతా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

చూశారుగా! మీరు కూడా జగ్జీవన్ రామ్‌లాగా ధైర్యం, తెగువ, పట్టుదలతో అనుకున్నది సాధిస్తే గొప్పవారిగా నిలిచిపోతారు.

సముద్రం ఒడ్డున రాళ్లు ఏరుతున్నారా.. వద్దొద్దు!



పిల్లలూ! మీరెప్పుడైనా సరదాగా సముద్రం చూసేందుకు వెళితే ఏం చేస్తారు? అక్కడ ఒడ్డున ఉన్న రాళ్లను ఏరుకుంటారు. వాటిని మీతో పాటు తెచ్చుకొని దాచుకుంటారు. నలుపు, తెలుపు రంగుల్లో నునుపుగా ఉండే ఆ రాళ్లు చూసేందుకు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. వాటిని ఇంట్లో పెట్టుకొని మురిసిపోతుంటారు. అయితే ఇకపై ఆ పని చేయొద్దు. ఎందుకో తెలుసా?

సముద్రంలో నిత్యం ఉవ్వెత్తున అలలు ఎగిసి పడుతుంటాయన్న విషయం మీకు తెలుసు కదా! ఆ అల్లు తాకిడికి తీరం కొట్టుకుపోకుండా రక్షించేది ఈ రాళ్లే. ఒడ్డున అందరూ ఆనందంగా ఉండాలన్నా, సముద్రం అలలు మన మీద ఉధృతంగా పడిపోకుండా ఉండాలన్నా ఈ రాళ్లు రక్షణ కవచాలుగా నిలబడతాయి. మీరు ఈ రాళ్లను మీతోపాటు తెచ్చుకుంటే ఆ రక్షణ వ్యవస్థ దెబ్బతింటుంది. దాంతో అలలు తీరాన్ని కోసుకుంటూ వెళ్లిపోతాయి. దానివల్ల ఎంతో నష్టం జరుగుతుంది. మేమొక్కరం కొన్ని రాళ్లు తెచ్చుకుంటే నిజంగా ఇంత సమస్య వస్తుందా అని అనుకోవద్దు. మీరొక్కరే కాకుండా నిత్యం ఎంతో మంది సముద్రం చూసేందుకు వస్తారు. వారంతా మీలాగే ఆలోచించి తలా ఒక రాయి తీసుకొని వెళితే నష్టం తప్పక జరుగుతుంది. అందుకే ఉత్తర ఇంగ్లండ్‌లోని కంబర్‌ల్యాండ్ కౌన్సిల్ ప్రాంతంలో కొత్తగా ఒక చట్టం తీసుకొచ్చారు. ఎవరైనా సముద్రం ఒడ్డున రాళ్లు ఏరి, తీసుకెళ్తున్నట్టు తెలిస్తే వాళ్లకు 100 పౌండ్లు(సుమారు రూ.10 వేలు) జరిమానా విధిస్తారు. ఇదంతా సముద్రాన్ని, చుట్టూ ఉన్న తీరు ప్రాంతాన్ని కాపాడటం కోసమే!

మన దేశంలో అలా రాళ్లు ఏరినందుకు ఎవరూ జరిమానా వేయరు. కానీ సముద్రం చుట్టూ ఉన్న ప్రాంతానికి హాని కలగకుండా ఉండాలంటే మనమే సొంతంగా ఆ పని మానేయాలి. సముద్రం ఒడ్డున హాయిగా పరుగులు పెడుతూ, సముద్రం అలల్ని చూస్తూ గడపాలి. కావాలంటే ఆ రాళ్లతో అక్కడే ఆడుకోవాలి తప్ప వాటిని ఏరుకొని ఇంటికి తీసుకురాకూడదు. తెలిసిందా!

శివమణితో ఈక్వల్





డ్రమ్స్ పేరు చెప్తే ఇండియాలో శివమణి గుర్తుకు వస్తాడు. ఆయనో పెద్ద డ్రమ్స్ ప్లేయర్. ప్రతీష్ కూడా ఏం తక్కువ కాదు. జూనియర్ శివమణి అని చెప్పొచ్చు. ఎ.ఆర్.ప్రతీష్ వయసు 13 ఏళ్లు. ప్రస్తుతం తల్లిదండ్రులతోపాటు ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. ఐదేళ్ల వయసులో అతను తొలిసారి డ్రమ్స్ చూశాడు. సరదాగా దాని మీద ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. ఆ తర్వాత అదే అతనికి పనిగా మారింది. వయసులో తనకన్నా పెద్దవాళ్ళతో పోటీ పడి మరీ వాయించేవాడు.డ్రమ్స్ మీద రకరకాల ప్రయోగాలు చేసేవాడు. 8వ తరగతి వచ్చే నాటికి ప్రదర్శనలు ఇస్తూ అందరి చేతా శభాష్ అనిపించుకునేవాడు. ఆ తర్వాత అతని దృష్టి గిన్నిస్ రికార్డ్ మీద పడింది. ఎలాగైనా దాన్ని సాధించాలని అత్యంత వేగంగా డ్రమ్స్ వాయించడాన్ని నేర్చుకున్నాడు. ఏడు నెలల పాటు అదే పనిగా డ్రమ్స్ వాయించి ఆ పట్టు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత గిన్నిస్ ప్రతినిధుల ముందు నిమిషానికి 2,370 సార్లు డ్రమ్స్ వాయించాడు. అంటే ఒక సెకనుకు దాదాపు 40 సార్లు డ్రమ్ వాయించాడు. అతని ప్రతిభ చూసి గిన్నిస్ ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. అత్యంత చిన్న వయసులో ఒక నిమిషంలో అత్యధిక సార్లు డ్రమ్స్ వాయించిన వ్యక్తిగా అధికారిక రికార్డు అందజేశారు. ప్రీతీష్ కల నెరవేరింది.

● పాడుదాం గేయం

తారకలు



తారకలు..తారకలు..
తళతళ మెరిసే తారకలు
ఆకాశంలో అందంగా
మెరిసే తెల్లని దీపికలు

చంద్రుడి పక్కన చుక్కల్లా
మెరిసే బంగరు గోపికలు
అంబరానికి తోరణమై
నిలిచే అందాల జ్ఞాపికలు

ఎగరేసే దారం లేదు
ఎవరి చేతి ఆధారం లేదు
ఎత్తున నిలిచే ఊతం
అయినా మెరిసే తారకలు

ఏ రోజూ సెలవు లేదు
ఏనాడూ అలుపు రాదు
వజ్రాలంటి మెరుపు పోదు
అందుకే అవి తారకలు

తారకలు..తారకలు..
తళతళ మెరిసే తారకలు
ఆకాశంలో అందంగా
మెరిసే తెల్లని దీపికలు

● కథ

గజ్జెల దయ్యం



శేషయ్య, రామయ్యలవి పక్క పక్క ఇళ్లు. వాళ్ళిద్దరూ ఒక రోజు పక్క ఊరిలోరి సంతకు వెళ్లారు. సరుకులు అన్నీ కొనేసరికి బాగా చీకటి పడింది.

శేషయ్యకు చీకటంటే చాలా భయం. 'రామయ్యా... మనం ఈరోజు ఇక్కడ్నే పడుకొని రేపు పోదాం' అన్నాడు.

రామయ్య నవ్వి 'ఎందుకు శేషయ్యా భయపడతావు. ఈ ఊరిలో ఎక్కడని వుంటాం. ఇద్దరం మాటలు చెప్పుకుంటూ నడుచుకుంటూ పోతే గంటలో మనింటిలో వుంటాం' అన్నాడు.

దానికి శేషయ్య 'దారిలో దయ్యాలు తిరుగుతూ వుంటాయంట. మనుషులు కనబడితే వదలకుండా వెంటబడతాయంట. నేను రాను. అంతగా పోవాలనుకుంటే నువ్వు పో' అన్నాడు.

వేరే దారిలేక రామయ్య ఒక్కడే ఇంటి దారి పట్టాడు. సగం దూరం పోయేసరికి పన్నెండయ్యింది. చుట్టూ చీకటి. తాను తప్ప మరెవ్వరూ లేరు. శేషయ్య మాటలు మతికి వచ్చాయి. నిజంగా ఈ దారిలో దయ్యాలున్నాయా... నిజంగా వుంటే అవి నన్ను పట్టుకుంటాయా.... ఆలోచనలు దయ్యాల చుట్టూ తిరుగుతుండేసరికి భయం మొదలయింది.

పరుగులాంటి నడకతో పోసాగాడు. ఇంకో అరగంటలో ఊరు చేరొచ్చనగా గజ్జెలు ఘల్లుమన్నాయి. రామయ్య అదిరిపడి ఆగిపోయాడు. చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. మరలా ముందుకు రెండు అడుగులు వేశాడు. 'ఘల్... ఘల్...' అని వినబడింది. అదిరిపడ్డాడు .

'దేవుడా... నిజంగానే ఇక్కడ దయ్యాలు తిరుగుతున్నట్టున్నాయి. దగ్గరకు వచ్చి మీద పడకముందే తప్పించుకోవాలి' అనుకున్నాడు.

ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు. గజ్జెల చప్పుడు అంతే వేగంగా వెంట రాసాగింది. రామయ్య ఎక్కగా పరుగు ఆపలేదు. వేగంగా ఇంటికి వచ్చి గబగబా లోపల దూరి గడియ పెట్టాడు. అప్పుడు గాని గజ్జెల చప్పుడు ఆగలేదు.

తలుపుకు చెవి పెట్టి విన్నాడు. బైట ఎటువంటి అలికిడి లేదు. 'హమ్మయ్య' అనుకున్నాడు. పొద్దున్నే లేచి బయటకు అడుగు వేశాడు. 'ఘల్' మని చప్పుడయింది.

అదిరిపడ్డాడు. భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టాయి. అంటే దెయ్యం వెళ్లిపోలేదా?

అంతలో ఎదురింటిలోని ఐదవ తరగతి పాప ఎదురైంది.

'ఏం బాబాయి... చెప్పులకు గజ్జెలు తగిలించుకొని తిరుగుతున్నావు. భలేగున్నాయే. సంతలో కొన్నావా' అని నవ్వుతూ అడిగింది.

రామయ్య అదిరిపడి కిందికి వంగి చూశాడు. చెప్పులకు రెండు గజ్జెలు తగులుకొని కనబడ్డాయి. వాటిని చూడగానే ఫక్కున నవ్వొచ్చింది. వాటిని తన మేనకోడలి కోసం సంతలో కొన్నాడు. నడిచేప్పుడు సంచిలో నుంచి జారి చెప్పుకు మెలిపడినట్టున్నాయి.

'అరెరే. వీటి చప్పుడు విని భయపడి చచ్చింది. దయ్యం లేదు. గియ్యం లేదు. భయం నా ఆలోచనను చంపేసింది. ఇంకెప్పుడూ భయపడగూడదు, పిరికివారి మాటలు అస్సలు వినకూడదు' అనుకున్నాడు.

- డా.ఎం.హరికిషన్

● ఊరి ఆటలు

కర్ర బిళ్ల.. ఆడారా ఎప్పుడైనా?





చాలా సరదాగా ఉండే ఈ ఆటను పల్లెల్లో పిల్లలు ఆడుతూ ఉంటారు. దీని కథ తెలుసుకుందామా?

గ్రామీణ ప్రాంతాల్లో పేరు పొందిన ఈ ఆటను గిల్లిదండా, కోడి బిళ్ల, బిళ్ళంగోడు, జిల్లాకోడి అని కూడా పిలుస్తారు. ఈ ఆట ఆడేందుకు విశాలమైన స్థలంతోపాటు ఒక పొడవు కర్ర, చిన్న కర్రముక్క కావాలి. ఆ పొడవాటి కర్రను 'కోడి' అనీ, చిన్న కర్రను 'బిళ్ల' అని అంటారు. ఈ ఆట ఆడేందుకు రెండు జట్లు కావాలి. ఒక్కో జట్టులో ఒకరికి మించి ఎంతమందైనా ఉండొచ్చు. ముందుగా రెండు జట్లు ఒక స్కోరు మీద ఒప్పందం చేసుకోవాలి. ఈ స్కోరును ఎవరు ముందుగా చేరుకుంటే ఆ జట్టు గెలిచినట్లు లెక్క. ఆటను ఎవరు ముందుగా ప్రారంభించాలో బొమ్మా బొరుసు వేసి తేలుస్తారు. ఆ తర్వాత నేల మీద ఒక చిన్న గుంత తవ్వి (దీన్నే ఊశి అంటారు), బిళ్లను దాని మీద పెడతారు. అవతలి జట్టు నిలబడి ఉన్న వైపు ఆ బిళ్లని బలంగా పెద్ద కర్ర (కోడి)తో ఎగరేసి కొడతారు.

అలా ఎరిగిన బిళ్లని మధ్యలో ఎవరైనా గాలిలోనే పట్టుకోగలిగితే దాన్ని కొట్టిన ఆటగాడు అవుట్ అయినట్టు లెక్క. ఎవరూ ఆ బిళ్లను పట్టుకోలేకపోతే ఆటగాడు బిళ్ళను మరోసారి గాలిలోకి ఎగరేసి, కింద పడకుండా పైపైకి కొడుతూ ఉంటాడు. కిందపడకుండా ఎన్నిసార్లు కొడితే అంత స్కోర్ వచ్చినట్టు.ఇంకా రూల్స్ ఆట పద్ధతులు ఉన్నాయి. చెప్తే అర్థం కావు. ఆడాలి. అప్పుడు తెలుస్తాయి. అయితే ఈ ఆట ఆడేప్పుడు కళ్లు జాగ్రత్తగా చూసుకోవాలి. బిళ్ల తగిలే ప్రమాదం ఉంటుంది. ఆ జాగ్రత్త తీసుకుని మైదానంలో ఓసారి ఆడి చూడండి. భలే బాగుంటుంది.

బిజినెస్ రీల్

బంగారం పైపైకే..

ఒక్కరోజే రూ.1,100 జంప్



న్యూఢిల్లీ: వరుసగా రెండు రోజుల నుంచి ర్యాలీ చేస్తున్న బంగారం, శుక్రవారం ఒక్క రోజే రూ.1,100 ఎగిసి పడింది. ఢిల్లీలో 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,100 పెరిగి రూ.84,900కు చేరుకుంది. జనవరి 1 నుంచి చూస్తే నికరంగా రూ.5,510 రూపాయిలు (7 శాతం) పెరగడం గమనార్హం. 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.1,100 పెరిగి రూ.84,500కు చేరుకుంది. మరోవైపు వెండి కిలోకి రూ.850 లాభపడి రూ.95,000కు చేరుకుంది. ''బంగారం, వెండికి బుల్లిష్ ధోరణి కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 2,800 డాలర్లను దాటిపోవడంతో, ఢిల్లీలో స్పాట్ మార్కెట్ ధర రూ.84,000 (10గ్రాములు) మార్క్‌ను అధిగమించింది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

ప్రీమియం కస్టమర్లకు 'కెనరా క్రెస్ట్' మెంబర్‌షిప్ ప్రోగ్రాం



బెంగళూరు: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు కస్టమర్ల కోసం 'కెనరా క్రెస్ట్, కెనరా క్రెస్ట్ ప్లస్' మెంబర్‌షిప్ ప్రోగ్రాం తీసుకొచ్చింది. సేవింగ్ అకౌంట్ కలిగిన సంపన్న వినియోగదారులకు ప్రీమియం బ్యాంకింగ్ సేవలు, అదనపు ప్రయోజనాలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. త్రైమాసికంలో సగటున రూ.10 లక్షలకు పైగా బ్యాలెన్స్ కలిగిన ఖాతాదారులు 'క్రెస్ట్', రూ.50 లక్షలు అంతకు పైగా బ్యాలెన్స్ మెయింటెన్స్ చేసే అకౌంట్ హోల్డర్లు 'క్రెస్ట్ ప్లస్' విభాగాలకు అర్హులు. సభ్యత్వ నమోదు పూర్తిగా ఉచితం. ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 'క్రెస్ట్ మెంబర్‌షిప్' పూర్తి వివరాలకు దగ్గర్లోని తమ బ్రాంచులను సంప్రదించాలని కెనరా బ్యాంకు తెలిపింది.

మెడ్‌ప్లస్ లాభం శాతం జూమ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ విక్రయాల్లో ఉన్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ డిసెంబర్ త్రైమాసికంలో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 234 శాతం అధికమై రూ.45.8 కోట్లు సాధించింది. ఎబిటా 42.8 శాతం దూసుకెళ్లి రూ.145 కోట్లు నమోదైంది. టర్నోవర్ 8.3 శాతం వృద్ధి చెంది రూ.1,561 కోట్లకు చేరింది. మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో శుక్రవారం 0.83 శాతం క్షీణించి రూ.724.60 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-1-2025

విశాఖ	505-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	280.2	4.87
POWERGRID	295.9	2.8
HEROMOTOCO	4,185.00	2.76
BHARTIARTL	1,642.50	2.63
CIPLA	1,459.95	2.53

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	699.95	-6.98
ITCHOTELS	163.25	-5
ADANIENT	2,247.90	-3.05
SHRIRAMFIN	540.85	-2.29
BAJAJFINSV	1,750.00	-2.26

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	61,138
ఎన్ఎస్ఈ	1,03,891
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,78,495
ఎఫ్ఐఐ	- 1,189
డీఐఐ	+ 2,232

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	72.65	$	72.73
బ్రెంట్	75.75	$	75.89

ఆర్థిక సర్వే

అన్ని చేతులూ కలిస్తేనే తయారీ దిగ్గజం



భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం, ప్రైవేటు రంగం, విద్యా సంస్థలు, పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సంస్థలు, ఆర్థిక సంస్థల మధ్య సమన్వయంతో కూడిన సహకారాత్మక చర్యలు అవసరమని ఆర్థిక సర్వే సూచించింది. నియంత్రణలు సడలించడం, అవసరమైన నైపుణ్యాలు, ఉపాధి కల్పన వ్యూహాలు అమలు చేయడం, ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకమైన మద్దతు చర్యలతో భారత పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచొచ్చని అభిప్రాయపడింది. అప్పుడు అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, సవాళ్లను భారత సంస్థలు ఎదుర్కొని రాణించగలవని వివరించింది.


బంగారం తగ్గొచ్చు.. వెండి పెరగొచ్చు



బంగారం ధరలు ఈ ఏడాది తగ్గొచ్చని, వెండి ధరలు పెరగొచ్చని ఆర్థిక సర్వే అంచనాలు వెల్లడించింది. ప్రపంచ బ్యాంక్ కమోడిటీ మార్కెట్ అవుట్‌లుక్ 2024 నివేదికను ప్రస్తావిస్తూ.. కమోడిటీ ధరలు 2025లో 5.1 శాతం, 2026లో 1.7 శాతం తగ్గుతాయన్న అంచనాలను ప్రస్తావించింది. మెటల్స్, వ్యవసాయ ముడి సరకుల ధరలు స్థిరంగా ఉంటాయని, చమురు ధరలు తగ్గొచ్చని, సహజ వాయువు ధరలు పెరగొచ్చని పేర్కొంది. బంగారం ధరలు తగ్గడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపించొచ్చని తెలిపింది. దేశం దిగుమతి చేసుకునే కమోడిటీల ధరలు తగ్గడం అది సానుకూలమని, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లను తగ్గిస్తుందని అభిప్రాయపడింది.

చైనాపై ఆధారపడడాన్ని తగ్గించాలి..

ఈవీల తయారీలో స్వావలంబన



ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ తయారీలో స్వావలంబన దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే నొక్కి చెప్పింది. ముడి సరుకులు, విడిభాగాల కోసం చైనా తదితర కొన్ని దేశాలపై ఎక్కువగా ఆధారపడడాన్ని తగ్గించాలని, సరఫరా వ్యవస్థలోని రిస్కులను తొలగించే చర్యలు చేపట్టాలని సూచించింది. కీలక విడిభాగాలు, ముడి సరుకులపై అంతర్జాతీయంగా చైనా ఆధిపత్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. సంప్రదాయ వాహనంతో పోల్చి చూసినప్పుడు ఈవీల తయారీలో ఆరు రెట్లు అధికంగా ఖనిజాలను వినియోగించాల్సిన పరిస్థితిని ప్రస్తావించింది. ఈ ఖనిజాల్లో చాలా వరకు మన దగ్గర లభించకపోవడాన్ని గుర్తు చేసింది. ''సోడియం అయాన్, సాలిడ్ స్టేట్ బ్యాటరీలు తదితర అత్యాధునిక బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానాలకు పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) నిధులు పెంచడం ద్వారా స్వావలంబన ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించాలి. ఈ విభాగంలో మేధో హక్కులను సంపాదించుకోవాలి. బ్యాటరీ రీసైక్లింగ్ సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలి. దీనివల్ల భారత ఆటోమొబైల్ రంగానికి దీర్ఘకాల ప్రయోజనాలు ఒనగూరుతాయి''అని ఆర్థిక సర్వే సూచించింది. మరోవైపు పర్యావరణ అనుకూల ఇంధనాలకు మళ్లే విషయంలోనూ చైనా దిగుమతులపై అధికంగా ఆధారపడడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. నియంత్రణలు సడలించడం ద్వారా దేశీ పరిశ్రమకు మద్దతుగా నిలవాలని సూచించింది. పీఎల్ఐ, ఫేమ్ పథకాలను ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో ఈవీల అవసరాలను తీర్చే విధానాలపై దృష్టి సారించాలని పేర్కొంది.

వారానికి 60 గంటలు మించి పని.. ఆరోగ్యానికి హానికరం..



వారానికి 60 గంటలకు మించి పని చేస్తే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఎకనమిక్ సర్వే పేర్కొంది. ఆఫీస్ డెస్క్ ముందు గంటల తరబడి కూర్చోవడమనేది మానసిక ఆరోగ్యానికి హానికరమని వివరించింది. రోజూ 12 గంటలకు పైగా డెస్క్‌లోనే గడిపే వారు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. ఉద్యోగి ఉత్పాదకతకు ఆఫీసులో గడిపిన సమయమే కొలమానమని అభిప్రాయం నెలకొన్నప్పటికీ మెరుగైన జీవన విధానాలు, వర్క్‌ప్లేస్ సంస్కృతి, కుటుంబ సంబంధాలు మొదలైనవి కూడా ఉత్పాదకతకు కీలకమని సేపియన్ ల్యాబ్స్ సెంటర్ అధ్యయన నివేదికలో వెల్లడైనట్లు ఆర్థిక సర్వే వివరించింది. వారానికి 70-90 గంటలు పని చేయాలన్న ఇన్ఫీ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.

మెరుగుపడిన విమాన కనెక్టివిటీ



కొత్త విమానాశ్రయాలు, ఉడాన్ స్కీముతో దేశీయంగా ఎయిర్ కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడినట్లు ఆర్థిక సర్వే తెలిపింది. 2020-25 ఆర్థిక సంవత్సరాల మధ్య నిర్దేశించిన రూ. 91,000 కోట్ల పెట్టుబడి వ్యయాల లక్ష్యంలో ఎయిర్‌పోర్ట్ డెవలపర్లు, ఆపరేటర్లు దాదాపు 91 శాతాన్ని ఖర్చు చేసినట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్‌లో ఏవియేషన్ మార్కెట్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, భారతీయ ఎయిర్‌లైన్స్ భారీ స్థాయిలో కొత్త విమానాలకు ఆర్డర్లిచ్చాయని సర్వే వివరించింది. మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) పరిశ్రమకు సంబంధించి భారత్‌లో ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటూ తయారీ కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపింది.

11.6 బిలియన్ డాలర్లకు డేటా సెంటర్ మార్కెట్



మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశీయంగా డేటా సెంటర్ మార్కెట్ 2032 నాటికి 11.6 బిలియన్ డాలర్ల స్థాయికి చేరవచ్చని ఎకనమిక్ సర్వే అంచనా వేసింది. 2023లో ఇది 4.5 బిలియన్ డాలర్లుగా ఉంది. ఐటీ, డిజిటల్ సేవల వ్యవస్థ పటిష్టంగా ఉండటం, రియల్ ఎస్టేట్ ధరలు తక్కువగా వల్ల డేటా సెంటర్ల ఏర్పాటు వ్యయాలు చౌకగా ఉండటం భారత్‌కు లాభిస్తుందని పేర్కొంది. డేటా సెంటర్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాలో సగటున ప్రతి మెగావాట్‌కు వ్యయాలు 9.17 మిలియన్ డాలర్లుగా, అమెరికాలో 12.73 మిలియన్ డాలర్లుగా ఉండగా భారత్‌లో 6.8 మిలియన్ డాలర్లేనని సర్వే వివరించింది.

ఏఐతో ఉద్యోగాలకు రిస్కే

కృత్రిమ మేధతో (ఏఐ) ఎంట్రీ స్థాయి ఉద్యోగాలకు ముప్పు ఉంటుందని, ముఖ్యంగా జీవనోపాధి కోసం ఉద్యోగాల మీదే ఎక్కువగా ఆధారపడే భారత్‌లాంటి దేశాల్లో ఈ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళికలు లేకుండా ఉద్యోగుల స్థానాన్ని ఏఐతో భర్తీ చేసేందుకు కంపెనీలు తొందరపడటం శ్రేయస్కరం కాదని ఐఎంఎఫ్ నివేదికను ఉటంకిస్తూ, సూచించింది. ఒకవేళ అలా చేసిన పక్షంలో ఉపాధి కోల్పోయిన వర్కర్లకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్వయంగా జోక్యం చేసుకుని, కార్పొరేట్ల లాభాలపై మరింతగా పన్నులు విధించడం, ఇతరత్రా పాలసీపరమైన చర్యలు తీసుకునే పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని వివరించింది.



జీసీసీల్లో 'గ్లోబల్' ఉద్యోగాలు



భారత్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) అంతర్జాతీయ కార్యకలాపాలకి సంబంధించి నియమించుకునే (గ్లోబల్) ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరగనుందని ఆర్థిక సర్వే తెలిపింది. 2030 నాటికి ఇది నాలుగు రెట్లు పెరిగి 30,000కు చేరుతుందని వివరించింది. ప్రస్తుతం ఈ సంఖ్య 6,500గా ఉంది. గత దశాబ్ద కాలంలో భారత్‌లో జీసీసీ వ్యవస్థ పురోగమించిందని, ప్రోడక్ట్ మేనేజర్లు, ఆర్కిటెక్టుల్లాంటి హై-ఎండ్ ఇంజినీరింగ్ ఉద్యోగాలను కూడా టెక్ నిపుణులు దక్కించుకుంటున్నారని సర్వే తెలిపింది. 2019లో 1,430గా ఉన్న జీసీసీల సంఖ్య 2024 నాటికి 1,700కు పెరిగిందని, వీటిల్లో దాదాపు 19 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని పేర్కొంది.

రియల్ ఎస్టేట్‌లో బలమైన డిమాండ్



ఆర్థిక స్థిరత్వం, రహదారులు, మెట్రో నెట్‌వర్క్‌ల కల్పన వంటివి దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో డిమాండ్‌ను పెంచినట్టు ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ రంగ నియంత్రణ కోసం 'రెరా'తోపాటు, జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం ఈ రంగానికి మేలు చేసినట్టు తెలిపింది. 2036 నాటికి ఇళ్లకు డిమాండ్ 9.3 కోట్ల యూనిట్లకు చేరుకుంటుందన్న పలు నివేదికల అంచనాలను ప్రస్తావించింది. 2024 మొదటి ఆరు నెలల్లో ఇళ్ల అమ్మకాలు 11 ఏళ్ల గరిష్టానికి చేరుకోవడాన్ని గుర్తు చేసింది. రెరా రాకతో రియల్‌ఎస్టేట్ రంగంలో మోసాల నుంచి రక్షణ లభించిందని, పారదర్శకత, సకాలంలో ప్రాజెక్టుల పూర్తికి దారి చూపిందని వివరించింది. ఇళ్ల ప్లాన్లకు ఆన్‌లైన్ అనుమతులుతో జాప్యం తగ్గి, పారదర్శకత పెరిగినట్టు తెలిపింది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు(రీట్‌లు) ప్రోత్సాహం వాణిజ్య రియల్ ఎస్టేట్‌కు సానుకూలిస్తుందని అభిప్రాయపడింది.

ఎఫ్‌డీలకు అన్ని అడ్డంకులు తొలగాలి



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) భారత్ మరింతగా ఆకర్షించేందుకు వీలుగా అన్ని అవరోధాలను తొలగించాలని, పన్నుల పరమైన నిలకడను తీసుకురావాలని ఆర్థిక సర్వే సూచించింది. సమీప కాలంలో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు ఉన్నా కానీ, దీర్ఘకాలానికి భారత్ ఎఫ్‌డీలకు అనుకూల కేంద్రంగా కొనసాగుతుందని అభిప్రాయపడింది. బలమైన దేశ ఆర్థిక మూలాలు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాత్మక సంస్కరణలు, కన్స్యూమర్ మార్కెట్ వృద్ధి సానుకూలతలుగా పేర్కొంది. ఇప్పటికే చాలా రంగాల్లో ఎఫ్‌డీలను ఆటోమేటిక్ మార్గంలో అనుమతిస్తున్నట్టు తెలిపింది.




డిజిటల్ కనెక్టివిటీకి 5జీ దన్ను

దేశవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో 5జీ సర్వీసులను ప్రవేశపెట్టడంతో పాటు టెలికం మౌలిక సదుపాయాలను, యూజర్ అనుభూతిని మెరుగుపర్చేందుకు నియంత్రణ సంస్థ తీసుకుంటున్న చర్యలతో డిజిటల్ కనెక్టివిటీ మెరుగుపడినట్లు ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుతం 783 జిల్లాలకుగాను 779 జిల్లాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నట్లు వివరించింది. భారత్ నెట్ ప్రాజెక్టు కింద 2024 డిసెంబర్ నాటికి 6.92 లక్షల కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) వేసినట్లు పేర్కొంది.

టార్గెట్‌లో 57 శాతానికి ద్రవ్య లోటు

డిసెంబర్ ఆఖరు నాటికి రూ. 9.14 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసమైన ద్రవ్య లోటు, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో రూ. 9,14,089 కోట్లకు చేరింది. ఇది పూర్తి సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యంలో 56.7 శాతమని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును రూ. 16,13,312 కోట్లకు పరిమితం చేయాలని కేంద్రం నిర్దేశించుకుంది. సీజీఏ డేటా ప్రకారం డిసెంబర్ వరకు కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన నికర ఆదాయం రూ. 18.43 లక్షల కోట్లు. ఇది 2024-25 బడ్జెట్ అంచనాల్లో (బీఈ) 71.3 శాతం. మరోవైపు బీఈలో మొత్తం వ్యయాలు 67 శాతానికి (రూ. 32.32 లక్షల కోట్లు) చేరుకున్నాయి. 2023-24లో స్థూల దేశీయోత్పత్తిలో 5.6 శాతంగా ఉన్న లోటును ఈసారి 4.9 శాతానికి కట్టడి చేయాలని ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఆదాయానికి మించి ఉన్న ఖర్చుల కోసం ప్రభుత్వం సమీకరించాల్సిన రుణమొత్తాన్ని ఇది సూచిస్తుంది.

10 శాతం మించడానికి వీల్లేదు

- ఆరోగ్య బీమా వార్షిక ప్రీమియం పెంపునకు చెక్
- ఐఆర్‌డీఏఐ నుంచి సీనియర్ సిటిజన్లకు ఊరట



ముంబై: ఆరోగ్య బీమా రంగ కంపెనీలు ఇకపై సీనియర్ సిటిజన్ల వార్షిక ప్రీమియంలో పెంపుదలను 10 శాతంలోపునకే పరిమితం చేయవలసి ఉంటుంది. ఇందుకు వీలుగా బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. వెంటనే అమల్లోకి వచ్చే విధంగా పత్రికా ప్రకటన విడుదల చేసింది. తక్కువ ఆదాయ వనరులతో జీవించే సీనియర్ సిటిజన్లకు దీంతో ఉపశమనం లభించనుంది. వయసురీత్యా పలు కంపెనీలు ప్రీమియంలను భారీగా పెంచుతున్న నేపథ్యంలో తాజా ఆదేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. వయసురీత్యా ఆరోగ్య పరిరక్షణ మరింత అవసరమయ్యే వీరికి పెరుగుతున్న బీమా ప్రీమియంలు ఆర్థికంగా భారమవుతున్న సంగతి తెలిసిందే.

భారత్‌లో ఐఫోన్ టాప్

యాపిల్ సీఈవో టిమ్ కుక్



న్యూఢిల్లీ: 'భారత్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా ఐఫోన్ అవతరించింది. రికార్డు స్థాయిలో వ్యాపారాన్ని నమోదు చేసిన భారత్‌పై కంపెనీ చాలా ఆసక్తిగా ఉంది' అని యాపిల్ సీఈవో టిమ్ కుక్ శుక్రవారం తెలిపారు. కౌంటర్‌పాయింట్ రిసర్చ్ ప్రకారం భారత స్మార్ట్‌ఫోన్ విపణిలో 2024లో విలువ పరంగా 23 శాతం వాటాతో యాపిల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే స్మార్ట్‌ఫోన్స్ సంఖ్య పరంగా టాప్-5గా నిలిచింది. 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లో గొప్ప ఫలితాలను సాధించాం. ముఖ్యంగా భారత్‌పై నేను ఆసక్తిగా ఉన్నాను. డిసెంబర్ త్రైమాసికంలో భారత్ రికార్డును నెలకొల్పింది. ఈ త్రైమాసికంలో ఐఫోన్ అత్యధికంగా అమ్ముడైంది. ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లకు రెండవ అతిపెద్ద, పర్సనల్ కంప్యూటర్స్, టాబ్లెట్ పీసీలకు భారత్ మూడవ అతిపెద్దది మార్కెట్. కాబట్టి ఇక్కడ భారీ మార్కెట్ ఉంది. మరిన్ని యాపిల్ ఔట్‌లెట్లను ప్రారంభించే యోచనలో ఉన్నాం. యాపిల్ ఇంటెలిజెన్స్‌ను విస్తరిస్తున్నాం. స్థానికీకరించిన ఇంగ్లీష్ వెర్షన్‌ను భారత్‌లో ఏప్రిల్‌లో విడుదల చేస్తాం' అని టిమ్ కుక్ వివరించారు. కాగా, డిసెంబర్ త్రైమాసికంలో యాపిల్ మొత్తం ఆదాయం రికార్డు స్థాయిలో 4 % వృద్ధితో 124.3 బిలియన్ డాలర్లు నమోదైందని వెల్లడించారు. లాభం 7 శాతం క్షీణించి 33.91 బిలియన్ డాలర్లకు చేరింది.

వేదాంతా లాభం హైజంప్

- క్యూ3లో రూ. 3,547 కోట్లు
- జూన్-జులైకల్లా విడదీత పూర్తి




న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 76 శాతం జంప్‌చేసి రూ. 3,547 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,013 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 10 శాతం ఎగసి రూ. 39,795 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 32,215 కోట్ల నుంచి రూ. 33,134 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 11,284 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. ఇబిటాలో అల్యూమినియం బిజినెస్ 58%, జింక్ విభాగం 28 శాతం చొప్పున జంప్‌చేశాయి. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ స్థూల రుణభారం రూ. 78,496 కోట్లుగా నమోదైంది. బాండ్ల జారీ ద్వారా గత 4 నెలల్లో మాతృ సంస్థ వేదాంతా రిసోర్సెస్ 3.1 బిలియన్ డాలర్లను పునర్వ్యవస్థీకరించినట్లు వేదాంతా వెల్లడించింది.

వేదాంతా షేరు బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 441 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ లాభాల దూకుడు

క్యూ3లో రూ. 4,508 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా జంప్‌చేసి రూ. 4,508 కోట్లకు చేరింది. కీలక వడ్డీ ఆదాయం పెరగడం, మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 2,223 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 29,962 కోట్ల నుంచి రూ. 34,752 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 27,288 కోట్ల నుంచి రూ. 31,340 కోట్లకు బలపడింది. ఈ బాటలో నికర వడ్డీ ఆదాయం సైతం రూ. 10,293 కోట్ల నుంచి రూ. 11,032 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 6.24 శాతం నుంచి 4.09 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.96 శాతం నుంచి 0.41 శాతానికి దిగివచ్చాయి.

పీఎన్‌బీ షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 101 వద్ద ముగిసింది.

మౌలికం మందగమనం

డిసెంబర్‌లో వృద్ధి 4 శాతమే

న్యూఢిల్లీ: కీలక మౌలిక(ఇన్‌ఫ్రా) రంగ వృద్ధి 2024 డిసెంబర్ నెలలో కాస్త మందగించింది. 4 శాతానికి పరిమితమైంది. 8 మౌలిక రంగాల వృద్ధి అంతక్రితం ఏడాది ఇదే నెలలో 5.1 శాతంగా నమోదైంది. నెలవారీగా చూస్తే అంటే 2024 నవంబర్‌లోనూ 4.4 శాతం పురోగతి సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం నేచురల్ గ్యాస్ ఉత్పత్తి క్షీణతను చవిచూసింది. అంతేకాకుండా వివిధ రంగాలలో ఉత్పత్తి నీరసించింది. బొగ్గు 5.3 శాతం, రిఫైనరీ ప్రొడక్టులు 2.8 శాతం, ఎరువులు 1.7 శాతం, స్టీల్ 5.1 శాతం చొప్పున వృద్ధి సాధించాయి. అయితే అంతక్రితం డిసెంబర్‌లో వీటి ఉత్పత్తిలో వరుసగా 10.8 శాతం, 4.1 శాతం, 5.9 శాతం, 8.3 శాతం చొప్పున పురోగతి నమోదైంది. కాగా.. సిమెంట్ తయారీ 4 శాతం, విద్యుదుత్పత్తి 5.1 శాతం వృద్ధిని అందుకున్నాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్‌లో కీలక రంగాలు బొగ్గు, చమురు, నేచురల్ గ్యాస్, రిఫైనరీ ప్రాడక్టులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి 4.2 శాతం పుంజుకుంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో 8.3 శాతం వృద్ధి నమోదైంది. ఈ 8 కీలక మౌలిక రంగాలు దేశీ పారిశ్రామిక ప్రగతిని సూచించే పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ)లో 40 శాతానికిపైగా వాటాను కలిగి ఉన్న సంగతి తెలిసిందే.



సన్ ఫార్మా లాభం అప్

- క్యూ3లో రూ. 2,903 కోట్లు
- షేరుకి రూ. 10.5 డివిడెండ్



న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం ఎగసి రూ. 2,903 కోట్లను తాకింది. వివిధ ప్రాంతాలలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,524 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 10.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,381 కోట్ల నుంచి రూ. 13,675 కోట్లకు బలపడింది. మొత్తం అమ్మకాలలో 32 శాతం వాటాను ఆక్రమిస్తున్న దేశీ ఫార్ములేషన్లు 14 శాతం ఎగసి రూ. 4,300 కోట్లను తాకాయి.

సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో ఫ్లాట్‌గా రూ. 1,743 వద్ద ముగిసింది.

తన్మయ్ సూపర్ సెంచరీ

- హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 326
- విదర్భ రెండో ఇన్నింగ్స్ 56/2
- రంజీ ట్రోఫీ


తన్మయ్

నాగ్‌పూర్: సహచరుల నుంచి పెద్దగా సహకారం లభించకపోయినా... ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (232 బంతుల్లో 136; 13 ఫోర్లు, 1 సిక్స్) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా విదర్భతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకోగలిగింది. ఓవర్‌నైట్ స్కోరు 90/2తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు చివరకు 91.4 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. తన్మయ్ ఒంటరి పోరాటం చేయగా... తక్కినవాళ్లు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. హిమతేజ (64 బంతుల్లో 31; 3 ఫోర్లు), వరుణ్ గౌడ్ (55 బంతుల్లో 24; 2 ఫోర్లు), రాహుల్ బుద్ధి (43 బంతుల్లో 26; 3 ఫోర్లు), తనయ్ త్యాగరాజన్ (24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ చామా మిలింద్ (38; 8 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. వీరందరితోనూ తన్మయ్ భాగస్వామ్యాలు నమోదు చేశాడు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 3 వికెట్లు పడగొట్టగా... హర్ష్, ఆకాశ్, పార్థ్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 19.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. ధ్రువ్ షోరే (23), ఆదిత్య (5) ఔట్ కాగా... అథర్వ తైడె (20 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హైదరాబాద్ బౌలర్లలో మొహమ్మద్ సిరాజ్, రక్షణ్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. చేతిలో 8 వికెట్లు ఉన్న విదర్భ... హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 80 పరుగులు వెనుకబడి ఉంది. మరోవైపు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు... జట్టు ఆటతీరును ప్రశంసించారు. ఈ సీజన్‌లో 4 సెంచరీలు, 2 హాఫ్‌సెంచరీలు సాధించిన ఓపెనర్ తన్మయ్ అగర్వాల్‌కు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ రూ. 1 లక్షనగదు బహుమతిని ప్రకటించారు. ఈ సీజన్‌లో 33 వికెట్లు తీసిన తనయ్ త్యాగరాజన్, కెప్టెన్ చామా మిలింద్, టీమిండియా ప్లేయర్ మొహమ్మద్ సిరాజ్‌ను జగన్‌మోహన్ రావు ప్రత్యేకంగా అభినందించారు.

ముంబై సెంచరీల మోత

- సిద్ధేశ్, ఆకాశ్, షమ్స్ శతకాలు
- తొలి ఇన్నింగ్స్‌లో 670/7 డిక్లేర్డ్
- రంజీ ట్రోఫీ


శార్దుల్


సిద్ధేశ్

ఇండోర్: టీమిండియా సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే (177 బంతుల్లో 96; 11 ఫోర్లు, 1 సిక్స్) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా మేఘాలయతో జరుగుతున్న మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 140.5 ఓవర్లలో 671/7 భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. సిద్ధేశ్ లాడ్ (250 బంతుల్లో 145; 17 ఫోర్లు, 1 సిక్స్), ఆకాశ్ ఆనంద్ (151 బంతుల్లో 103; 15 ఫోర్లు), షమ్స్ ములానీ (86 బంతుల్లో 100 నాటౌట్; 16 ఫోర్లు) శతకాల మోత మోగించారు. 'హ్యాట్రిక్' హీరో శార్దుల్ ఠాకూర్ (42 బంతుల్లో 84; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) బ్యాట్‌తోనూ మెరుపులు మెరిపించాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను చీల్చి చెండాడిన శార్దుల్ 200 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. సూర్యాన్ష్ (61), తనుశ్ కొటియాన్ (34 నాటౌట్) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో 86 పరుగులకే పరిమితమైన మేఘాలయ జట్టు... శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది. చేతిలో 8 వికెట్లు ఉన్న మేఘాలయ ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే ఇంకా 558 పరుగులు చేయాలి.

హర్ష్, శుభమ్ డబుల్ సెంచరీలు

హర్ష్ గావ్లీ (387 బంతుల్లో 258; 25 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభమ్ శర్మ (280 బంతుల్లో 208; 18 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీలతో కదంతొక్కారు. ఫలితంగా రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా... ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న పోరులో మధ్యప్రదేశ్ భారీ స్కోరు చేసింది. శుక్రవారం రెండో రోజు 335/1 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్... 160 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 670 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రజత్ పాటీదార్ (10) విఫలం కాగా... సుభ్రాన్షు సేనాపతి (44), సాగర్ సోలంకీ (72) రాణించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, విజయ్ కుమార్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 95 పరుగులు చేసింది. అభిషేక్ గోస్వామి (66 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్), మాధవ్ కౌశిక్ (26 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న ఉత్తరప్రదేశ్ జట్టు ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 575 పరుగులు వెనుకబడి ఉంది.

కర్ణాటకకు నిరాశ...

రంజీ ట్రోఫీలో గత తొమ్మిది సీజన్‌లలోనూ నాకౌట్‌కు చేరిన కర్ణాటక జట్టుకు ఈ సారి నిరాశ ఎదురైంది. ముందంజ వేయాలంటే హరియాణాపై బోనస్ పాయింట్‌తో గెలవాల్సిన స్థితిలో కర్ణాటక ఆ అవకాశాన్ని దక్కించుకోలేకపోయింది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా జరుగుతున్న పోరులో కర్ణాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులకు ఆలౌట్ కాగా... శుక్రవారం ఆట ముగిసే సమయానికి హరియాణా తొలి ఇన్నింగ్స్‌లో 66 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది. ప్రత్యర్థిని ఫాలోఆన్‌లో పడేయగలిగితేనే బోనస్ పాయింట్ లభించే అవకాశం ఉండగా... కర్ణాటక బౌలర్లు అందులో సఫలం కాలేకపోయారు. హరియాణా కెప్టెన్ అంకిత్ కుమార్ (154 బంతుల్లో 118; 19 ఫోర్లు) జట్టును ఆదుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కర్ణాటక విజయం సాధించినా... హరియాణా కంటే ఒక పాయింట్ తక్కువే సాధించే అవకాశాలు ఉండటంతో... ఈ గ్రూప్ నుంచి కేరళ, హరియాణా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించనున్నాయి.

మెరిసిన పృథ్వీరాజ్

- నాలుగు వికెట్లు తీసిన ఆంధ్ర పేసర్
- రాజస్తాన్ రెండో ఇన్నింగ్స్ 95/7
- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 220 ఆలౌట్
- రంజీ ట్రోఫీ


పృథ్వీరాజ్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, రాజస్తాన్ జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో రాజస్తాన్ ఓ మాదిరి స్కోరు చేయగా... ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో మంచి ఆరంభం లభించినా... మెరుగైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. అనంతరం ఆంధ్ర బౌలర్లు విజృంభించడంతో రాజస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 34.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 49/0తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 57.1 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ (58 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో రాణించగా.. వంశీకృష్ణ (32; 5 ఫోర్లు), షేక్ రషీద్ (25; 3 ఫోర్లు), పృథ్వీరాజ్ (28; 1 ఫోర్, 3 సిక్స్‌లు), వినయ్ కుమార్ (23; 3 ఫోర్లు, 1 సిక్స్), శశికాంత్ (20) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ హనుమ విహారి (4), రికీ భుయ్ (8), కరణ్ షిండే (0) విఫలమయ్యారు. రాజస్తాన్ బౌలర్లలో మానవ్ సుతార్ 4, ఖలీల్ అహ్మద్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రాజస్తాన్‌ను ఆంధ్ర బౌలర్లు కట్టిపడేశారు. పృథ్వీ రాజ్ (4/34), విజయ్ (2/17) ధాటికి రాజస్తాన్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. అభిజీత్ తోమర్ (31) ఫర్వాలేదనిపించాడు. రామ్ చౌహాన్ (2), కెప్టెన్ మహిపాల్ లోమ్రర్ (5), కార్తీక్ శర్మ (0), శుభమ్ గర్వాల్ (6), మానవ్ సుతార్ (7), సమర్పిత్ జోషి (0) పెవిలియన్‌కు క్యూ కట్టారు. చేతిలో 3 వికెట్లు ఉన్న రాజస్తాన్ జట్టు ఓవరాల్‌గా 133 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అజయ్ సింగ్ (17 బ్యాటింగ్), అరాఫత్ ఖాన్ (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

అనిరుధ్ జోడీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)–చార్లెస్ బ్రూమ్ (బ్రిటన్) జోడీ 6-1, 3-6, 8-10తో 'సూపర్ టైబ్రేక్' లో గోవింద్ నందా–క్రిస్టియన్ లాంగ్మో (అమెరికా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్ లో అనిరుధ్–బ్రూమ్ జోడీ ఏడు ఏస్ లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్ లు చేసింది. తమ సర్వీస్ ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్ ను రెండుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక టైబ్రేక్ లో అమెరికా జోడీ కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. అనిరుధ్–బ్రూమ్ జంటకు 1,010 డాలర్ల (రూ. 87 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 16 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.





హైదరాబాద్ X బెంగాల్

హెచ్ఐఎల్ ఫైనల్ చేరిన ఇరు జట్లు
నేడు తుది పోరు

రూర్కేలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో హైదరాబాద్ తూఫాన్స్, ష్రాచీ రార్ బెంగాల్ టైగర్స్ జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్లో హైదరాబాద్ తూఫాన్స్ 3-1 గోల్స్ తేడాతో సూర్మా హాకీ క్లబ్‌పై విజయం సాధించగా... హోరాహోరీగా సాగిన పోరులో ష్రాచీ రార్ బెంగాల్ టైగర్స్ షూటౌట్‌లో తమిళనాడు డ్రాగన్స్‌పై గెలుపొందింది. హైదరాబాద్ జట్టు తరఫున అమన్‌దీప్ లక్రా (25వ నిమిషంలో), జాకబ్ అండర్సన్ (35వ నిమిషంలో), నీలకంఠ శర్మ (43వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. సూర్మ హాకీ క్లబ్ తరఫున మ్యాచ్ చివరి నిమిషంలో జెరెమీ హేవార్డ్ (60వ ని.లో) ఏకైక గోల్ కొట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబర్చిన హైదరాబాద్ తూఫాన్స్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. ఇక బెంగాల్ టైగర్స్, తమిళనాడు డ్రాగన్స్ మధ్య తీవ్ర ఉత్కంఠ భరితంగా సాగిన మరో సెమీస్‌లో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2-2 గోల్స్‌తో సమంగా నిలిచాయి. బెంగాల్ టైగర్స్ తరఫున ప్రదీప్ సింగ్ సంధు (30వ నిమిషంలో), స్యామ్ లేన్ (53వ ని.లో) చెరో గోల్ చేయగా... డ్రాగన్స్ తరఫున నాథన్ ఎఫ్రామ్స్ (18వ ని.లో), సెల్వం కార్తి (32వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. దీంతో ఫలితం తేల్చేందుకు షూటౌట్ నిర్వహించగా... బెంగాల్ టైగర్స్ జట్టు 'సడెన్ డెత్'లో 6-5 గోల్స్ తేడాతో తమిళనాడు డ్రాగన్స్ పై గెలిచింది. ఆదివారం జరగనున్న తుది పోరులో బెంగాల్ టైగర్స్‌తో హైదరాబాద్ తూఫాన్స్ టైటిల్ కోసం పోటీ పడనుంది.



సచిన్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేయనుంది. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలికెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరుమీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును బోర్డు వార్షిక పురస్కారాల్లో ప్రదానం చేస్తున్నారు. నేడు బోర్డు నిర్వహించే కార్యక్రమంలో 51 ఏళ్ల సచిన్‌కు ఈ అవార్డు బహూకరిస్తారు. రెండు దశాబ్దాల పైచిలుకు భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన బ్యాటింగ్ తురుపుముక్క సచిన్ సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో 664 మ్యాచ్‌లాడాడు. 200 టెస్టుల్లో 15, 291 పరుగులు, 51 శతకాలు... 463 వన్డేల్లో 18,426 పరుగులు, 49 సెంచరీలు సాధించాడు. ఈ రెండు ఫార్మాట్‌లో కలిపి 100 సెంచరీలు బాదిన ఏకైక బ్యాటర్‌గా క్రికెట్ పుటల్లోకెక్కాడు. 'పాలీ ఉమ్రిగర్ బెస్ట్ క్రికెటర్' అవార్డు పురుషుల్లో బుమ్రాకు , మహిళల్లో స్మృతి మంధానకు అందజేస్తారు.

భారత్ X టోగో

- డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్ -1 ప్లే ఆఫ్స్
- తొలిసారి బరిలోకి దిగుతున్న తెలుగు కుర్రాడు రిత్విక్


రిత్విక్

న్యూఢిల్లీ: డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్-1 ప్లే ఆఫ్స్‌లో భారత టెన్నిస్ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఈవెంట్‌లో టోగో జట్టుతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. శనివారం జరగనున్న పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామనాథన్ బరిలోకి దిగనుండగా... ఆదివారం జరగనున్న రెండు డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ-రిత్విక్ బొల్లిపల్లి, రివర్స్ సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామ్‌నాథన్ ఆడనున్నారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే... భారత జట్టు సెప్టెంబర్‌లో జరగనున్న వరల్డ్ గ్రూప్-1లో పోటీ పడనుంది. చాన్నాళ్ల తర్వాత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శశికుమార్ ముకుంద్ మెరుగైన ప్రదర్శన చేయాలని చూస్తుండగా... ఇటీవల తన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ బరిలోకి దిగిన తెలుగు కుర్రాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయనున్నాడు. శ్రీరామ్ బాలాజీతో కలిసి అతడు డబుల్స్ మ్యాచ్ ఆడనున్నాడు. ఇటీవలి కాలంలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న రిత్విక్ చౌదరి మాట్లాడుతూ... 'కల నిజమైనట్లు ఉంది. జాతీయ జట్టు తరఫున మంచి ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా' అని అన్నాడు. రిత్విక్‌తో కలిసి ఆడటం ఆనందంగా ఉందని ఇద్దరి మధ్య చక్కటి అవగాహన ఉందని... పరిస్థితులను త్వరగా ఆకలింపు చేసుకోవడం రిత్విక్‌కు అలవాటు అని బాలాజీ పేర్కొన్నాడు. శనివారం జరగనున్న తొలి సింగిల్స్ మ్యాచ్‌లో లివో అజావోన్ (టోగో)తో శశికుమార్ ముకుంద్, థామస్ సెటోజీ (టోగో)తో రామ్‌కుమార్ రామనాథన్ తలపడనున్నారు.

శ్రీలంక 136/5


దినేశ్ చండిమాల్

గాలె: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక జట్టును వర్షం ఆదుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 44/3తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 42 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. తొలి సెషన్ పూర్తి కాకముందే భారీ వర్షం ముంచెత్తడంతో ఆటకు ఆటంకం కలిగింది. అనంతరం ఎంత ఎదురు చూసినా వరుణుడు తెరిపినివ్వకపోవడంతో... మ్యాచ్ సాగలేదు. దీంతో ప్రస్తుతానికి శ్రీలంక జట్టు క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడింది. స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై కంగారూ బౌలర్లు జోరుమీదున్న సమయంలో వర్షం ముంచెత్తడంతో... లంకేయులు ఊపిరి పీల్చుకున్నారు. దినేశ్ చండిమాల్ (115 బంతుల్లో 63 బ్యాటింగ్; 9 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... కమిందు మెండిస్ (15), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (22) విఫలమయ్యారు. చండిమాల్‌తో పాటు కుశాల్ మెండిస్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిషెల్ స్టార్క్, మాథ్యూ కూనెమన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఆస్ట్రేలియా 654/6 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. దీంతో చేతిలో 5 వికెట్లు ఉన్న శ్రీలంక... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 518 పరుగులు వెనుకబడి ఉంది.

యూకీ బాంబ్రీ జంట పరాజయం



పారిస్: మోంట్ పెలియర్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీకి నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ యూకీ బాంబ్రీ-ఇవాన్ డోడిగ్ ద్వయం 4-6, 5-7తో మాన్యుయెల్ గినార్డ్-గ్రెగోరి జాక్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓటమి పాలైంది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-క్రొయేషియన్ జంట తమ సర్వీస్ ను రెండుసార్లు చేజార్చుకుంది. యూకీ-డోడిగ్ జోడీకి 5,500 యూరోల (రూ. 4 లక్షల 95 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ముగిసిన భారత్ పోరు


శ్రీకాంత్

బ్యాంకాక్: థాయ్ లాండ్ మాస్టర్స్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్... మహిళల సింగిల్స్ లో రక్షిత శ్రీ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లలో శ్రీకాంత్ 17-21, 16-21తో వాంగ్ జెంగ్ జింగ్ (చైనా) చేతిలో; శంకర్ ముత్తుస్వామి 21-19, 18-21, 13-21తో జు జువాన్ చెన్ (చైనా) చేతిలో; రక్షిత శ్రీ 21-19, 14-21, 9-21తో థ మోన్ వన్ నితిత్ క్రాయ్ (థాయ్ లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాయి ప్రతీక్-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ జోడీ (భారత్) 19-21, 18-21తో డేనియల్ మార్టిన్-షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

చాంపియన్స్ ట్రోఫీకి మార్ష్ దూరం

సిడ్నీ: ఆస్ట్రేలియా పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. వెన్నెముక నొప్పితో బాధపడుతున్న మార్ష్... ఈ నెల 19 నుంచి జరగనున్న చాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండబోడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'వెన్ను గాయంతో ఇబ్బంది పడుతున్న మార్ష్ చాంపియన్స్ ట్రోఫీలో ఆడడు. మార్ష్ గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదని వైద్య బృందం నివేదిక ఇవ్వడంతో... జాతీయ సెలెక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది' అని సీఏ తెలిపింది.

ఆప్ ఢిల్లీ అభివృద్ధిని అడ్డుకుంది

రాజధానిని రాజకీయ ఏటీఎంలా వాడుకుంటోంది | ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అభివృద్ధిని ఆప్ అడ్డుకుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ పురోగతి కోసం ఢిల్లీని రాజకీయ ఏటీఎంలా వాడుకుంటోందన్నారు. మోదీ శుక్రవారం నాడిక్కడ ద్వారకలో ప్రచారసభలో మాట్లాడారు. ఢిల్లీ పురోభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారును ఎన్నుకోవాల్సిందిగా ప్రజలను కోరారు. అధునాతన ఢిల్లీకి బీజేపీ కట్టుబడి ఉందనడానికి ఇటీవల ప్రారంభించిన యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ఉదాహరణ అన్నారు. వేరే రాష్ట్రాల్లో విస్తరించేందుకు ఆప్ ఢిల్లీ వనరులను ఖాళీ చేసిందని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఢిల్లీని ఏటీఎం కార్డు లాగా వాడుకుంటోందన్నారు. కాంగ్రెస్ రాజకుటుంబం గిరిజన రాష్ట్రపతిని అవమానించిందన్నారు. ఆప్ ప్రభుత్వం తమ సమయమంతా ఇతర రాష్ట్రాలతో పేచీలకే వెచ్చిస్తోందని మండిపడ్డారు. కేంద్రంతోనూ, ఉత్తరప్రదేశ్, హరియాణాలతో నిత్యం కలహిస్తోందన్నారు. దాంతో ఢిల్లీ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఇలాంటి వాళ్లు అధికారంలో ఉంటే అభివృద్ధిలో ఢిల్లీ వెనుకబడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కలహాలలో మునిగి తేలే ప్రభుత్వం కంటే సమన్వయంతో ముందుకు సాగే ప్రభుత్వం ఢిల్లీకి అవసరమన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూసే ప్రభుత్వం కావాలన్నారు. బీజేపీని గెలిపిస్తే అవినీతిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అన్నా హజారే ఉద్యమాన్ని అపహాస్యం చేస్తూ ఆప్ సర్కార్ అవినీతిలో మునిగిపోయిందని, ప్రజలకు ద్రోహం చేసిందని మోదీ అన్నారు. ఢిల్లీ బడ్జెట్‌లో ఆప్ 20 శాతమే అభివృద్ధిపై ఖర్చు పెడుతోందని, మౌలికసదుపాయాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజల కోసం డబ్బు ఖర్చు పెట్టకుండా సొంత ప్రచారానికి నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. అద్దాల మేడలో నివసించే వాళ్లు పేదల ఇళ్ల గురించి పట్టించుకోరని, ఆప్ మధ్యతరగతికి వ్యతిరేకమని మోదీ అన్నారు.

ఆప్ అక్రమాలను తవ్వితీస్తాం

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే ఆప్ ప్రభుత్వం అక్రమాలను తవ్వితీస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాగ్ నివేదికను ఢిల్లీ సర్కారు తొక్కిపెట్టాలని చూసిందని ఆరోపించారు. మద్యం పాలసీతో సహా ఆప్ విధానాలను కాగ్ తప్పుపట్టిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే కాగ్ నివేదికను ప్రవేశపెడతామని మోదీ అన్నారు. ఢిల్లీ అభివృద్ధికి శాయశక్తులా బీజేపీ సర్కారు కృషి చేస్తుందన్నారు. దోపిడి, అబద్ధాల నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. ఢిల్లీ ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే తన కల అని, ఆప్ దీనిని అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను పేదలకు కేటాయించకుండా ఆప్ అడ్డుకుంటోందని, తాము అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లు అందేలా చూస్తామని, ఇది తన గ్యారంటీ అని మోదీ పేర్కొన్నారు.



మహాకుంభమేళా సందర్భంగా సంగంలోని త్రివేణీ సంగమంలో బుధవారం జనం పెద్ద సంఖ్యలో తరలిరావడం భారీగా తొక్కిసలాటకు దారి తీయడం తెలిసిందే. ఆ సమయంలో యమునా నది ఒడ్డున నెలకొన్న రద్దీని తెలిపే ఉపగ్రహ ఛాయా చిత్రమిదీ. మాక్సార్ కంపెనీ తాజాగా విడుదల చేసింది.

మా పథకాలతో రూ.25 వేల ఆదా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆప్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఢిల్లీలోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.25 వేల వరకు ఆదా అవుతోందని ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. మరోసారి తమకు అధికారమిస్తే అదనంగా రూ.10 వేలు ఆదా అయ్యేలా కొత్తగా పథకాలను తీసుకువస్తామని ప్రకటించారు. శుక్రవారం ఆయన 'బచత్ పాత్ర' ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. ఆప్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎంత మేరకు లబ్ధి కలుగుతుందో తెలుసుకునేందుకు తమ వలంటీర్లు ఇంటింటికీ వచ్చి 'బచత్ పాత్ర' గురించి వివరిస్తారన్నారు. కొత్త పథకాల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన వంటివి ఉన్నాయని కేజ్రీవాల్ వివరించారు. 'సామాన్యంగా బడ్జెట్‌తో ద్రవ్యోల్బణం, సామాన్యులపై ఏ మేరకు ప్రభావం చూపుతుంది వంటి అంశాలను తెలుపుతుంది. కానీ, ఢిల్లీ ఆప్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి అయ్యే ఆదాపైనే దృష్టి పెడుతుంది' అని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం సన్నిహితులైన వాణిజ్యవేత్తలకు ఎలాంటి ప్రయోజనాలను కల్పించాలని యోచిస్తోందని ఆరోపించారు. ముంబైలోని ధారావిలో మురికివాడల వాసుల భూమిని ఇప్పటికే తమ సంబంధీకులకు కట్టబెట్టిందని, ఢిల్లీలో కూడా భూముల్ని ఆక్రమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు.

70లో 60 సీట్లు మావే: ఆప్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే 5న జరిగే ఎన్నికల్లో అసెంబ్లీలోని 70 స్థానాలకు 60 సీట్లను చేజిక్కించుకుంటుందని ఆయన చెప్పారు. బీజేపీ ఇప్పటికే ఓటమిని అంగీకరించిందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని లక్ష్మీనగర్‌లో జరిగిన జనసభలో ఆయన మాట్లాడారు.

తెలుగు నేతలంతా హస్తినలోనే

- ప్రచారం జోరు పెంచిన బీజేపీ నేతలు
- అభ్యర్థుల విజయం కోసం శ్రమిస్తున్న కమలదళం

సాక్షి, న్యూఢిల్లీ: మరో నాలుగు రోజుల్లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికార పీఠం దక్కించుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రచారం కోసం తెలుగు నేతలంతా హస్తినలోనే మకాం వేశారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం కమలం నేతలు తమవంతు కృషి చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధానంగా తెలుగు ప్రజల ప్రాబల్యమున్న ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం నుంచి బీజేపీ ప్రచారం జోరు మరింత పెరగనున్నది.

ఒక్కొక్కరికి ఒక నియోజకవర్గం

ఢిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఎంపీలందరూ ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేలా బీజేపీకి ప్రణాళిక రచించింది. ఒక్కో నేతకు ఒక్కో మండలం బాధ్యతలు అప్పగించింది. తెలంగాణకు చెందిన ఎనిమిది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలకు తెలుగు ఓటర్లు ఎక్కువగావున్న నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో నేతలు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు కరోల్‌బాగ్‌లో ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆర్కేపురం, జంగ్‌పురా నియోజకవర్గాలను కేటాయించగా అక్కడ ఆయన గత 15 రోజులుగా ప్రచారం చేస్తున్నారు. పార్లమెంటులో శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత.. కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో బీజేపీ నేతలు రంగంలోకి దిగనున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం ఘోండా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి అజయ్ తరఫున ప్రచారం చేశారు.

ఏపీ నేతలకు వ్యూహాత్మకంగా బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేతలు కూడా ఢిల్లీలో గత వారం రోజులుగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి రంగ్‌పురి నియోజకవర్గంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ ప్రాంతంలో తెలుగు ప్రజలను కలిసి బీజేపీ అభ్యర్థి కోసం ఓట్లు అభ్యర్థించారు. కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి మటియా మహల్ నియోజకర్గం బాధ్యతలు అప్పగించారు. ఆదోనిలో ముస్లిం ఓటర్లు ఎక్కువ. వారి ప్రభావంతో పార్థసారథి విజయం సాధించారని భావించిన అధిష్టానం ఆయనకు మటియా మహల్ ప్రాంతం బాధ్యతలు అప్పగించిందని తెలుస్తోంది. ఆయన ఆదోనికి చెందిన ముస్లిం నేతలతో కలిసి బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు. అలాగే బీజేపీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవ్ తదితరులు కూడా బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయనున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు.

'యమున'పై ఈసీకి కేజ్రీవాల్ వివరణ

న్యూఢిల్లీ: ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ఎన్నికల కమిషన్ (ఈసీ) కార్యాలయానికి వచ్చారు. యమునా నదీ జలాల్లో విషం కలిసిందంటూ చేసిన వ్యాఖ్యలపై అధికారులు జారీ చేసిన నోటీసుకు ఆయన సమాధానం ఇచ్చారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీకి సరఫరా చేసే యమునా జలాల్లో అమోనియాను కలిపి విషపూరితం చేసిందని ఈ నెల 27న కేజ్రీవాల్ ఆరోపించారు. అయితే, ఢిల్లీ జల్ బోర్డు ఇంజనీర్లు ఆ విషయం తెలిసి, వెంటనే ఢిల్లీకి ఆ నీరు రాకుండా ఆపేశారు. ఆ నీరే తాగు నీటిలో కలిసినట్లయితే ఎంతో పెద్ద విపత్తు జరిగి ఉండేది' అని అన్నారు. దీనిపై ఈసీ కేజ్రీవాల్‌కు రెండుసార్లు నోటీసులు పంపించింది. దీనిపై శుక్రవారం కేజ్రీవాల్ ఈసీ అధికారుల ఎదుట తన వాదనను వివరించారు. జనవరి 15న 3.2 పీపీఎం ఉన్న అమోనియా స్థాయిలు జనవరి 27వ తేదీ నాటికి 7 పీపీఎంకు పెరిగినట్లు తెలిపే నివేదికను అందజేశారు. ఆయన వెంట సీఎం ఆతిశీ, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఉన్నారు. ఈసీని కలిసేందుకు ఆయన ముందుగా ఎలాంటి అపాయింట్‌మెంట్ తీసుకోలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తుది గడువు సమీపిస్తున్నందున కేజ్రీవాల్‌తో సమావేశమై ఆయన వాదనను సావధానంగా విన్నట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ వాసులకు విష జలాలను సరఫరా చేసేందుకు బీజేపీ పన్నిన కుట్రను కేజ్రీవాల్ ఈసీ అధికారులకు వివరించారని అనంతరం ఆప్ తెలిపింది. అమోనియా కలుషితాలున్న విషయం తెలిపేందుకు మూడు బాటిళ్లలో యమునా నీటిని కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించింది. దీనిపై తాము దర్యాప్తు చేపట్టనున్నట్లు ఈసీ తెలిపిందని పేర్కొంది.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ఉభయ సభల సంయుక్త సమావేశానికి వెళ్తూ అంగరక్షకుడి అశ్వానికి ఇలా మేత అందిస్తూ కెమెరాకు చిక్కారు. రాష్ట్రపతి భవన్ ఈ చిత్రాన్ని విడుదల చేసింది.



ఈ శకలాలు గురువారం ఆర్మీ హెలికాప్టర్, ప్రయాణికుల విమానం ఢీకొట్టిన ఘటనకు సంబంధించినవి. వాషింగ్టన్ డీసీలోని పొటొమాక్ నది ఒడ్డుకు అధికారులు వీటిని చేర్చారు. ఘటనలో మొత్తం 67 మంది ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే.

మార్చిలో నింగిలోకి నిసార్ ఉపగ్రహం

ఇస్రో, నాసా ఆధ్వర్యంలో షార్ నుంచి ప్రయోగం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) సంయుక్తంగా 2,800 కిలోల బరువు కలిగిన నిసార్ (నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ శాటిలైట్) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోపు సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్వీ ఎఫ్16) ద్వారా ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఉపగ్రహాన్ని లోయర్ ఎర్త్ ఆర్బిట్ (లియో)లోకి ప్రవేశపెట్టనున్నారు. ఇది పూర్తి రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ (దూర పరిశీలనా ఉపగ్రహం) కావడం విశేషం. ఈ ఉపగ్రహం భూగోళం మొత్తాన్ని 12 రోజుల్లో మ్యాప్ చేస్తుంది. ఈ ఉపగ్రహంలోని పేలోడ్స్‌తో భూమి యొక్క పర్యావరణ వ్యవస్థలు, మంచు ద్రవ్యరాశి, వృక్షసంపద జీవసంపద, సముద్రమట్టం పెరుగుదల, భూగర్భ జలాలు, భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాలు, కొండచరియలు విరిగిపడడం వంటి విపత్తుల గురించి స్థిరమైన డేటాను అందిస్తుంది. నిసార్ ఉపగ్రహంలో ఎల్ మరియు ఎస్ డ్యూయల్ బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ (ఎస్ఏఆర్)ని కలిగి వుంటుంది. ఇది అధిక రిజల్యూషన్ డేటాతో పెద్ద స్వాత్‌ను స్వీప్ సార్ టెక్నిక్‌తో పని చేస్తుంది. ఈ ఉపగ్రహంలో ఎస్ బ్యాండ్, సింథటిక్ అపార్చర్ రాడార్‌ను ఇస్రో, ఎల్ బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్‌ను నాసా సమకూర్చాయి. ఈ రెండు దేశాలకు చెందిన సింథటిక్ అపార్చర్ రాడార్లు సుమారు 12 మీటర్లు వ్యాసార్థంలో వున్న రిఫ్లెక్టర్ యాంటెన్నాను ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా నాసా మిషన్ కోసం ఇంజినీరింగ్ పేలోడ్స్‌ను అందిస్తుంది. ఇందులో పేలోడ్ డేటా సబ్‌సిస్టమ్, హై–రేట్ సైన్స్ డౌన్‌లింక్ సిస్టమ్, జీపీఎస్ రిసీవర్లు మరియు సాలిడ్ స్టేట్ రికార్డర్ ఉన్నాయి. ఎల్ బ్యాండ్ అండ్ ఎస్ బ్యాండ్‌లలో ఇది మొదటి డ్యూయల్ ఫ్రీక్వెన్సీ రాడార్ ఇమేజింగ్ మిషన్ అవుతుంది. నాసా వారి సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సైంటిఫిక్ పరికరాలతో బెంగళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్ఎస్సీ)లో నిసార్ ఉపగ్రహాన్ని రూపొందిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించే అవకాశం ఉంది.

బుల్లి కారులో వచ్చి శీష్‌మహల్ స్థాయికి ఎదిగారు

కేజ్రీవాల్‌పై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ: ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కేజ్రీవాల్ అబద్ధాలు మాట్లాడుతూ, తప్పుడు వాగ్దానాలు ఇస్తున్నారన్నారు. రాజకీయాలను మారుస్తానంటూ చిన్న కారులో వచ్చిన ఈ వ్యక్తి నేడు వాగన్ ఆర్ కారులో శీష్ మహల్‌కు వెళ్లే స్థాయికి ఎదిగారంటూ మండిపడ్డారు. ఢిల్లీ సీఎంగా ఉన్న సమయంలో అధికార నివాసం శీష్ మహల్‌లో విలాసాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసిన ఈయన ఇప్పుడు ఇతర పార్టీలు అవినీతికి పాల్పడ్డాయంటూ విమర్శలు చేస్తున్నారన్నారు. గత పదేళ్లలో అవినీతిలో మునిగి తేలడం, కాలుష్యాన్ని పెంచడం మినహా ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ చేసిందేమీ లేదన్నారు. సమాజంలో హింసను, విద్వేషాలను బీజేపీ వ్యాపింపజేస్తోందని, తమ కాంగ్రెస్‌పార్టీ మాత్రమే ప్రజలకు జవాబుదారీగా ఉంటుందని చెప్పారు. తన మంత్రివర్గాన్ని నవ రత్నాలంటూ కేజ్రీవాల్ చెప్పుకుంటున్న వారిలో ఒక్కరూ ఓబీసీ, మైనారిటీ, దళిత, గిరిజన వర్గాలకు చెందిన వారు లేరన్నారు. అందరూ అగ్ర కులాలకు చెందిన వారేనని రాహుల్ చెప్పారు. 'ఢిల్లీ రాజకీయాల్లో మార్పు తెస్తానమంటూ ప్రకటించుకున్న కేజ్రీవాల్.. అతిపెద్ద మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. యమునా నదిలో మునిగి, యమునా జలాలను తాగుతానని ఐదేళ్ల క్రితం చెప్పిన కేజ్రీవాల్ ఆ విషయం మర్చేపోయారు' అని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఢిల్లీ ఎన్నికలు అవకాశవాద పోటీ కాదని చెప్పారు. రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ ఆశయాలను పరిరక్షించే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. మదీపూర్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడారు.

ఈ సందర్భంగా రాహుల్ బీజేపీపైనా విమర్శలు సంధించారు. సమాజంలో కులాలు, భాషల ప్రాతిపదికన విభేదాలు పెంచి, హింసను బీజేపీ ఎగదోస్తోందన్నారు. ప్రజలను సమస్యల నుంచి మళ్లించేందుకు, సంపదను బడా పారిశ్రామిక వేత్తల ధారాదత్తం చేసేందుకు కుట్రలు పన్నుతోందని చెప్పారు. టాప్ 25 పారిశ్రామికవేత్తలు తీసుకున్న రూ.16 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన మోదీజీ.. ఢిల్లీలోని విద్యార్థులు, చిరు వ్యాపారులు, గృహిణుల రుణాలెన్నిటిని రద్దు చేశారు? అంటూ ప్రశ్నించారు.

మోదీ, కేజ్రీవాల్ ఒక్కటే

అవినీతి విషయంలో ప్రధాని మోదీ, ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇద్దరూ ఒక్కటేనని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు. ముస్తాఫాబాద్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ ఆమె.. విభేదాలు సృష్టించడమే బీజేపీ నైజమని చెప్పారు. మోదీ రాజ్‌మహల్ గురించి ఆప్ నేతలు మాట్లాడుతుంటే, కేజ్రీవాల్ శీష్ మహల్ గురించి బీజేపీ నేతలు విమర్శిస్తున్నారని, ఈ రెండు పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు తెచ్చేందుకే తప్ప ప్రజలకు రహదారులు, మంచి నీరు, విద్య వంటి వాటి గురించి బీజేపీ మాట్లాడటం లేదని చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్‌కు మోదీకి మధ్య తేడాయేలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి

ఫిరోజ్‌పూర్: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది చనిపోగా 15 మంది గాయాలపాలయ్యారు. గురుహర్‌సాయి సబ్ డివిజన్‌లో శుక్రవారం ఉదయం పికప్ వ్యాన్, ట్రక్కు ఢీకొన్నాయి. వ్యాన్‌లోని వారంతా జలాలాబాద్‌లో ఓ ఫంక్షన్‌లో వెయిటర్లుగా పని చేసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించారమని సీనియర్ ఎస్పీ సౌమ్యా మిశ్రా చెప్పారు.

కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ఘోరం

ఘాజీపూర్(యూపీ): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నుంచి తిరిగి వస్తున్న భక్తులు ప్రమాదానికి గురయ్యారు. ఎనిమిది మంది చనిపోగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో శుక్రవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బాధితులంతా గోరఖ్‌పూర్ జిల్లా హల్దిచోక్ గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. నంద్‌గంజ్ సమీపంలోని రేవాసా గ్రామం వద్ద వీరి వ్యానును వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొంది. ఈ ఘటనలో కిందిపడిపోయిన వారిపైగా ట్రక్కు దూసుకెళ్లిందన్నారు. క్షతగాత్రులు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

కెనడా ప్రధాని రేసులో...రూబీ దల్లా!

లిబరల్ పార్టీ పగ్గాలపై కన్ను

కెనడా ప్రధాని పదవి కోసం మరో భారతీయ నేత తలపడనున్నారు. ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో త్వరలో బాధ్యతల నుంచి తప్పుకుంటుండటం తెలిసిందే. అధికార లిబరల్ పార్టీ సారథ్య బాధ్యతలను కూడా వదులుకోనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో లిబరల్ పార్టీ నేత పదవికి భారత సంతతికి చెందిన పార్టీ నాయకురాలు రూబీ దల్లా పోటీ పడనున్నారు.

రూబీ దల్లా తల్లిదండ్రులు పంజాబ్ నుంచి కెనడా వలస వెళ్లారు. ఆమె కెనడాలో మనిటోబాలోని విన్నిపెగ్‌లో జన్మించారు. బయో కెమిస్ట్రీ, ఆరోగ్య సంరక్షణలో డిగ్రీ చేశారు. కొంతకాలం ఆరోగ్య సంరక్షకురాలు (చిరోప్రాక్టర్)గా పని చేశారు. తర్వాత అందాల పోటీల్లో, సినిమాల్లోనూ రాణించారు. 1993లో మిస్ ఇండియా–కెనడా పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. అనంతరం పారిశ్రామికవేత్తగా రాణించారు. దల్లా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సీఈఓగా ఉన్నారు. కెనడా పార్లమెంటుకు మూడుసార్లు వరుసగా ఎన్నికైన తొలి భారత సంతతి మహిళగా నిలిచారు. అదే ఊపులో ఆ దేశ ప్రధాని పదవి చేపట్టిన తొలి నల్లజాతి మహిళగా కూడా రికార్డు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2008లో జరిగిన ఓ సర్వేలో కెనడా పార్లమెంటులో సెక్సీయెస్ట్ ఎంపీల్లో రూబీ మూడో స్థానంలో నిలిచారు. అదే ఏడాది మాక్సిమ్ మేగజైన్ ఆమెకు ప్రపంచంలోని హాటెస్ట్ రాజకీయవేత్తల్లో మూడో ర్యాంకు ఇచ్చింది. తాను ప్రధాని అయితే అక్రమ వలసదారులందరినీ కెనడా నుంచి పంపించేస్తానని ప్రకటించడం ద్వారా రూబీ ఇటీవలే వార్తల్లో నిలిచారు. అందుకు తన వద్ద స్పష్టమైన ప్రణాళికలున్నాయని కూడా చెప్పుకొచ్చారు. పార్టీ సారథ్యం, ప్రధాని పదవి విషయంలో బ్యాంక్ ఆఫ్ కెనడా గవర్నర్ మార్క్ కార్నీ, మాజీ ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ నుంచి ఆమె గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. లిబరల్ పార్టీ తదుపరి నేత ఎవరన్నది మార్చి 9న తేలే అవకాశముంది.

పదేళ్ల వయసులోనే ఇందిరకు లేఖ

పదేళ్ల వయసులోనే నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీకి లేఖ రాసి రూబీ ఔరా అనిపించారు. పంజాబ్‌లో అస్థిరత, అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంపై చేపట్టిన బ్లూస్టార్ సైనిక చర్యలపై తన అభిప్రాయాలను లేఖలో సూటిగా వెల్లడించారు. ''పంజాబ్ హింసాకాండను టీవీలో చూసి వికలమైన మనసులో మీకు లేఖ రాస్తున్నా. అమాయక సిక్కుల ఊచకోతను, స్వర్ణ దేవాలయంపై దాడులను దయచేసి అడ్డుకోండి. సమస్యను ఇరు వర్గాలూ చర్చల ద్వారా పరిష్కరించుకుంటే మేలు. ఈ విషయంలో నేను చేయగల సాయమేమైనా ఉంటే దయచేసి చెప్పండి'' అంటూ రాశారు. ఆ లేఖకు ఇందిర బదులివ్వడమే గాక ఈ విషయాన్ని మీడియాతో కూడా పంచుకున్నారు! చిన్నారి రూబీని భారత్‌కు ఆహ్వానించారు. కానీ ఆలోపే ఇందిర హత్యకు గురయ్యారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

వర్క్ పర్మిట్లపై బైడెన్ నిర్ణయాన్ని రద్దు చేయాలి

ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్ల తీర్మానం

వాషింగ్టన్: అమెరికాలో ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్(ఈఏడీ) గడువు 180 రోజుల నుంచి ఆటోమేటిక్‌గా 540 రోజులకు పెరిగేలా వెసులుబాటు కల్పిస్తూ జో బైడెన్ ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. దీనివల్ల హెచ్–1బీ వీసాదార్ల జీవిత భాగస్వాములకు ప్రయోజనం చేకూరుతోంది. జో బైడెన్ ప్రభుత్వం పాలనలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఈ ఏడాది జనవరి 13న డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఫైనలైజ్ చేసింది. అయితే, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. వలసదార్ల విషయంలో నూతన అధ్యక్షుడు ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. వర్క్ పర్మిట్ల రెన్యూవల్ గడువును 180 నుంచి 540 రోజులకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు జాన్ కెన్నెడీ, రిక్ స్కాట్ గురువారం కాంగ్రెస్‌లో ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. ఈఏడీ గడువు పెంచడాన్ని రద్దు చేయకపోతే అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉద్యోగాలు చేస్తున్నవారిని గుర్తించడం చాలా కష్టమవుతుందని పేర్కొన్నారు.

దేశంలో తొలిసారి భూదానాలు చేసిన రాజులు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్యుల అనంతర యుగం

భారతదేశ చరిత్రలో మౌర్య సామ్రాజ్యం పతనమైనప్పటి నుంచి గుప్తుల పరిపాలన ప్రారంభమయ్యేంత వరకు ఉన్న కాలాన్ని (క్రీ.పూ. 200 - క్రీ.శ. 300) 'మౌర్యుల అనంతర యుగం'గా పిలుస్తారు. ఈ కాలంలో అనేక దేశీయ, విదేశీ రాజ్యాలు ఏర్పడ్డాయి. దేశంలో రాజకీయ వికేంద్రీకరణ, అనిశ్చిత పరిస్థితులు ఉండటం వల్ల కొంతమంది చరిత్రకారులు దీన్ని 'చీకటి యుగం'గా పేర్కొన్నారు. సాంస్కృతికంగా, ఆర్థికంగా ఈ యుగంలో అనేక కీలక పరిణామాలు సంభవించి తర్వాతి కాలంలో భారతదేశ చరిత్రపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి.

దేశీయ రాజవంశాలు

శుంగవంశం

విదిష రాజధానిగా మగధను పాలించారు.

పుష్యమిత్ర శుంగుడు: శుంగ వంశ స్థాపకుడు. చివరి మౌర్య చక్రవర్తి బృహద్రథుని వద్ద సేనాధిపతిగా ఉంటూ, చక్రవర్తిని చంపి ఇతడు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. పతంజలి ఇతడి వద్ద ప్రధాన పురోహితునిగా పనిచేశాడు. ఇతడి ఆధ్వర్యంలోనే పుష్యమిత్రుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు.

అగ్నిమిత్రుడు: పుష్యమిత్రుని తర్వాత సింహాసనం అధిష్టించిన రాజు ఇతడు. కాళిదాసు రచించిన 'మాళవికాగ్నిమిత్ర' అనే కావ్యంలోని కథానాయకుడు ఇతడే. అగ్నిమిత్రుని తర్వాత జేఠమిత్రుడు, వసుమిత్రుడు, వజ్రమిత్రుడు అనే అంతగా ప్రాధాన్యం లేని రాజులు పాలించారు.

భాగవతుడు: బేసనగర్ స్తంభ శాసనంలో పేర్కొన్న భాగభద్రుడు ఇతడే. ఇండో గ్రీకు రాజు యాంటియాల్‌సిదాస్ రాయబారి హెలియోడోరస్ ఇతడి ఆస్థానాన్ని సందర్శించాడు.

దేవభూతి: శుంగ వంశంలో చివరి రాజు. ఇతడు తన మంత్రి వాసుదేవుని చేతిలో హత్యకు గురయ్యాడు.

కణ్వ వంశం

ఇది శుంగుల తర్వాత మగధను పాలించిన మరో బ్రాహ్మణ వంశం. వీరి రాజధాని పాటలీపుత్రం.

వాసుదేవకణ్వుడు: కణ్వ వంశ స్థాపకుడు. ఇతని తర్వాత భూమిమిత్రుడు, నారాయణుడు అనే బలహీన రాజులు పాలించారు.

సుశర్మ: ఇతడు కణ్వవంశంలో చివరి పాలకుడు. ఆంధ్ర శాతవాహన రాజు (వాశిష్టి పుత్ర పులోమావి లేదా మొదటి పులోమావి అని చరిత్రకారుల అభిప్రాయం) మగధపై దాడిచేసి ఇతడిని అంతం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.

చేది వంశం

దీన్నే 'మహా మేఘవాహన' వంశం అని కూడా పిలుస్తారు. ఈ వంశస్థాపకుడు మహా మేఘవాహనుడు.

ఖారవేలుడు: చేది వంశంలో అందరికంటే గొప్పవాడు ఖారవేలుడు. ఇతడు తన పాలనా కాలంలోని తొలి 14 ఏళ్ల చరిత్ర గురించి తెలియజేస్తూ భువనేశ్వర్ సమీపంలోని ఉదయగిరి కొండలపై 'హాతిగుంఫ' అనే గుహ వద్ద ఒక శాసనం వేయించాడు. ఇతడు మగధను జయించి, నందుల కాలంలో కళింగ నుంచి తీసుకు వెళ్లిన జైన తీర్థంకరుల విగ్రహాలను వెనక్కి తెచ్చాడు. శాతవాహనులను కూడా ఓడించి వారి సామ్రాజ్యంలోని 'పితుండ' అనే నగరాన్ని ధ్వంసం చేశాడు.

సంగం రాజ్యాలు

ఈ కాలంలో దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ, చేర, పాండ్య రాజ్యాలను 'సంగం' రాజ్యాలుగా పేర్కొంటారు. సంగం అంటే పాండ్యుల రాజధాని మధురైలో జరిగిన కవి సమ్మేళనాలు. ఈ సమావేశాల్లో సంకలనం చేసిన సాహిత్యమే సంగం సాహిత్యం. అశోకుని శిలా శాసనాల్లోనూ, మెగస్తనీస్ ఇండికాలోనూ ఈ రాజ్యాల ప్రస్తావన ఉంది.

చోళరాజ్యం

వీరి మొదటి రాజధాని ఉరయూరు. రెండో రాజధాని పుహార్ లేదా కావేరి పట్టణం. వీరి రాజచిహ్నం పులి.

ఎలారా: శ్రీలంకను జయించిన తొలి చోళరాజుగా ప్రసిద్ధి చెందాడు.

పెరునార్‌కిల్లి: చోళుల్లో రాజసూయ యాగాన్ని నిర్వహించిన ఏకైక రాజు.

కరికాల చోళుడు: ప్రాచీన చోళుల్లో అందరికంటే గొప్పవాడు. పుహార్ రాజధాని నగర నిర్మాత. తంజావూర్ సమీపంలోని వెన్నియుద్ధంలో ఇతడి విజయం గురించి పత్తినపలై అనే సంగం సాహిత్య గ్రంథంలో కీర్తించారు. ఇతడు శ్రీలంక నుంచి బందీలుగా తెచ్చిన కార్మికులతో కావేరి నదికి ఆనకట్టలు నిర్మించాడు. వహైప్పరండాలి అనే మరో యుద్ధంలో 9 తెగల కూటమిపై ఘన విజయం సాధించాడు.

సెంగానన్: చోళవంశంలో మరో ముఖ్యమైన రాజు. గొప్ప శివభక్తుడు. శివునికి 70 ఆలయాలు నిర్మించాడు.

చేర రాజ్యం

నేటి కేరళ ప్రాంతాన్ని వీరు పాలించారు. వీరి రాజధాని వంజీ లేదా కరూర్.



ఉదయాంజిరెల్: చేరవంశంలో తొలి పాలకుడు. ఇతడు ఒక భారీ వంటశాలను నిర్మించాడని ప్రతీతి. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న కౌరవ, పాండవ సైన్యాలకు భోజనాలు పెట్టించాడని 'పురాననూరు' గ్రంథంలో పేర్కొన్నారు.

నెడుంజెరల్ ఆదన్: ఇతడికి 'ఇమయా వరంబన్' అనే బిరుదు ఉంది. హిమాలయాలను తన రాజ్య సరిహద్దులుగా కలిగి ఉన్నాడు.

సెంగుట్టువన్: ఇతడికి 'ఎర్ర చేర' అనే బిరుదు ఉంది. ఇతడు హిమాలయాల నుంచి తెచ్చిన శిలతో కన్నగి విగ్రహాన్ని ప్రతిష్టించాడు. కన్నగిని ఆదర్శపత్నిగా కొలిచే 'పత్తిని' పూజా పద్ధతిని ప్రవేశపెట్టాడు.

పాండ్యులు

వీరి రాజధాని మధురై.

నెడుంజెళియన్: పాండ్యుల్లో ముఖ్యమైనరాజు. తలైయా లంగాణ అనే యుద్ధ విజేత. ఇతడి ఆస్థాన కవి మంగుడి మరుదన్ 'మధురైక్కంజి' అనే గ్రంథాన్ని రాశాడు. మరో ఆస్థాన కవి నక్కీరార్. ఇలాంగో అడిగల్ రచించిన 'శిలప్పాధిగారం' గ్రంథంలో ప్రస్తావించిన కోవలన్‌ను ఉరితీసిన సంఘటన ఈ రాజు కాలంలోనే జరిగింది.

శాతవాహన రాజ్యం

ఈ వంశంలో సుమారు 30 మంది రాజులు 45 ఏళ్ల పాటు దక్కన్ ప్రాంతాన్ని పాలించారు. వీరి రాజధాని ప్రతిష్టానపురం. మౌర్యుల పాలన నుంచి పొందిన అనుభవం ఆధారంగా పటిష్టమైన పాలనా వ్యవస్థను నిర్మించుకున్నారు. ఐతరేయ బ్రాహ్మణంలో వీరి తొలి ప్రస్తావన ఉంది. మెగస్తనీస్ వీరి బలసంపత్తిని వర్ణించాడు. శాతవాహనుల కులం, వంశం, జన్మస్థలం మొదలైన అంశాలపై చరిత్రకారుల మధ్య భిన్న వాదనలు కొనసాగుతున్నాయి.

శ్రీముఖుడు: ఇతడు శాతవాహన వంశస్థాపకుడు. కోటిలింగాల వద్ద ఇతడి కాలంనాటి నాణేలు లభించాయి.

కన్హ (కృష్ణ): ఇతడు శ్రీముఖుని సోదరుడు. ఈ వంశంలో రెండో రాజు. శాతవాహన రాజ్య విస్తరణను ప్రారంభించింది ఇతడే.

మొదటి శాతకర్ణి: వైదికమతాన్ని శాతవాహనుల అధికారిక మతంగా చేశాడు. అనేక వైదిక యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించాడు. ఇతడి విజయాల గురించి అతడి భార్య నాగనిక వేయించిన నానాఘాట్ శాసనం తెలియజేస్తోంది. ఇతడికి 'దక్షిణాపథపతి' అనే బిరుదు ఉంది.

కుంతల శాతకర్ణి: ఇతడి ఆస్థానంలో శర్వవర్మ, గుణాఢ్యుడు అనే కవులుండేవారు. శర్వ వర్మ 'కాతంత్ర వ్యాకరణం', గుణాఢ్యుడు 'బృహత్కథ' అనే గ్రంథాలు రచించారు. వాత్స్యాయనుడు కూడా ఈ కాలానికి చెందినవాడే అనే అభిప్రాయం ఉంది.

హాలుడు: ఈ వంశంలో 17వ రాజు. ఇతడు 'గాథాసప్తశతి' అనే ప్రాకృత కావ్యాన్ని రచించాడు. దీనికి మరో పేరు 'శాలివాహన సప్తశతి'. హాలుడు తన ఆస్థానంలో అనేక మంది కవులకు ఆశ్రయమిచ్చి 'కవివత్సలుడు' అనే బిరుదు పొందాడు.

గౌతమీపుత్ర శాతకర్ణి: శాతవాహన చక్రవర్తులందరిలో గొప్పవాడు. ఇతడి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ ప్రశస్తి ఇతడి విజయాల గురించి తెలియజేస్తోంది. క్షహరాట నహపాణుడిని ఓడించి శకుల రాజ్యాన్ని ఆక్రమించాడు. జోగల్‌తంబి వద్ద లభించిన నాణేలు ఈ విజయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఇతడికి ఏకబ్రాహ్మణ, ఆగమనిలయ, త్రి సముద్ర తోయ పీత వాహన అనే బిరుదులున్నాయి.

వాశిష్టీపుత్ర పులోమావి: ఇతడు కార్ధమక శక రాజు చష్టానునికి సమకాలీనుడు.

యజ్ఞశ్రీ శాతకర్ణి: ఇతడు ఓడ గుర్తు కలిగిన నాణేలను జారీ చేశాడు. ఆచార్య నాగార్జునుడు రాసిన 'సుహృల్లేఖ' గ్రంథం ఈ రాజును ఉద్దేశించిందేనని చరిత్రకారుల అభిప్రాయం. బాణుడు ఇతడిని 'త్రిసముద్రాధిపతి' అనే బిరుదుతో ప్రస్తావించాడు.

మూడో పులోమావి: ఇతడు శాతవాహన వంశంలో చివరి రాజు.

మాదిరి ప్రశ్నలు

1. పతంజలి రాసిన మహాభాష్యం దేనికి వ్యాఖ్యాన గ్రంథం?
   ఎ) పాణిని అష్టాధ్యాయి
   బి) వసుమిత్రుడి మహావిభాషా శాస్త్రం
   సి) అశ్వఘోషుడి శారిపుత్ర ప్రకరణం
   డి) చరకుడి చరకసంహిత
2. రాజవంశాలు, వాటి రాజచిహ్నాలకు సంబంధించి కిందివాటిలో సరికానిది?
   ఎ) చోళులు - పులి
   బి) చేర - విల్లు, బాణం
   సి) పాండ్యులు - ఏనుగు
   డి) పైవన్నీ
3. కరీంనగర్ జిల్లా కోటిలింగాలలో ఏ రాజు కాలంనాటి నాణేలు బయటపడ్డాయి?
   ఎ) శ్రీముఖ శాతకర్ణి బి) కృష్ణ లేదా కన్హ
   సి) మొదటి శాతకర్ణి
   డి) పైన పేర్కొన్న అందరివీ లభించాయి
4. అశ్వమేధ యాగాన్ని నిర్వహించిన తొలి శాతవాహన రాజు?
   ఎ) గౌతమీ పుత్ర శాతకర్ణి
   బి) రెండో శాతకర్ణి
   సి) మొదటి శాతకర్ణి డి) శ్రీముఖుడు
5. పుష్యమిత్ర శుంగుని సమకాలీనుడైన ఇండో-గ్రీకు రాజు?
   ఎ) మినాండర్ బి) డెమిట్రియస్
   సి) డియోడోటస్ డి) యూథీడిమస్
6. నాసిక్ శాసనాన్ని ఎవరి పాలనా కాలంలో వేశారు?
   ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి
   బి) వాశిష్టీపుత్ర పులోమావి
   సి) యజ్ఞశ్రీ శాతకర్ణి
   డి) మూడో పులోమావి
7. రోమన్ చక్రవర్తులు అగస్టస్, ట్రోజన్ వద్దకు రాయబారులను పంపిన దక్షిణ భారతదేశ రాజులు?
   ఎ) చోళులు బి) చేరరాజులు
   సి) శాతవాహనులు డి) పాండ్యులు
8. సంగం సాహిత్యానికి సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
   ఎ) శిలప్పాధిగారం - ఇలాంగో అడిగల్
   బి) మణిమేగలై - సిత్తాలై సత్తానార్
   సి) తిరుక్కురల్ - తిరువల్లువార్
   డి) తొల్కప్పియం - అగట్టియార్
9. రుద్రదమనుని కుమార్తెను వివాహమాడిన శాతవాహనరాజు?
   ఎ) వాశిష్టీపుత్ర శివశ్రీ శాతకర్ణి
   బి) వాశిష్టీపుత్ర మొదటి పులోమావి
   సి) వాశిష్టీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి
   డి) గౌతమీపుత్ర యజ్ఞశ్రీ
10. తమిళ లిపికి ఆధారమైన లిపి ఏది?
   ఎ) బ్రాహ్మీలిపి బి) గ్రంథలిపి
   సి) ఖరోష్టిలిపి డి) అరమిక్ లిపి
11. భారతదేశంలో తొలిసారిగా భూదానాలు చేసిన రాజులు?
   ఎ) శుంగులు బి) గుప్తులు
   సి) శాతవాహనులు డి) మౌర్యులు
12. 'గాథాసప్తశతి'ని ఏ భాషలో రచించారు?
   ఎ) సంస్కృతం బి) ప్రాకృతం
   సి) పాలీ డి) మగధి
13. రాజ్యాలు-వాటి రాజధానులకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) శాతవాహనులు - ప్రతిష్టానపురం
   బి) శుంగులు - పాటలీపుత్రం
   సి) కణ్వులు - విదిష
   డి) చోళులు - మధురై

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) సి; 5) బి; 6) బి; 7) డి; 8) డి; 9) ఎ; 10) బి; 11) సి; 12) బి; 13) ఎ.

'ఆపాదమస్తకం' అంటే అర్థం ఏమిటి?



అర్థాలు - నానార్థాలు ప్రకృతి - వికృతులు

తెలుగులో 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాల ఆధారంగా 'అర్థాలు -నానా ర్థాలు, ప్రకృతి-వికృతులపై తప్పనిసరిగా ప్ర శ్నలు అడుగుతారు. కాబట్టి విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. 'అనవుడు' పదానికి అర్థం ఏమిటి?
   1) వినినంతనే 2) అనినంతనే
   3) చెప్పినంతనే 4) చేసినంతనే
2. 'ఆపాదమస్తకం' అంటే అర్థం ఏమిటి?
   1) పాదం 2) శిరస్సు
   3) శరీరమంతా 4) ఉదరం
3. 'ఈప్సు' పదానికి అర్థం?
   1) కోరిక 2) అసూయ
   3) విసుగు 4) కోపం
4. 'అహరహం' పదానికి అర్థం?
   1) అహం 2) రాత్రి
   3) పగలు 4) ప్రతి దినం
5. 'అంబుజనాభుడు' పదానికి అర్థం?
   1) అగ్ని దేవుడు 2) విష్ణువు
   3) బ్రహ్మ 4) శివుడు
6. 'అనృతం' అంటే అర్థం ఏమిటి?
   1) అమృతం 2) సత్యం
   3) అసత్యం 4) నేయి
7. 'అంబోధి' పదానికి అర్థమేంటి?
   1) నది 2) ప్రవాహం
   3) సముద్రం 4) ఆకాశం
8. 'ఉద్వృత్తి' పదానికి అర్థం?
   1) గొప్ప వృత్తి 2) తొందరపాటు
   3) గర్వం 4) యాచక వృత్తి
9. 'ఋక్కు' పదానికి అర్థం?
   1) నక్షత్రం 2) ఆకాశం
   3) వేదశ్లోకం 4) గ్రంథం
10. 'ఎలనాగ' అంటే అర్థమేంటి?
   1) నాగజాతి 2) సంతోషం
   3) దుఃఖం 4) స్త్రీ
11. 'ఎఱకలు' పదానికి అర్థం?
   1) ఎర్ర కలువ 2) జాతి
   3) రెక్కలు 4) వెంట్రుకలు
12. 'కులిశం' పదానికి అర్థమేంటి?
   1) తులసి 2) వజ్రాయుధం
   3) మెరుపుతీగె 4) నక్షత్రం
13. 'ఛాత్రులు' పదానికి అర్థం?
   1) శాస్త్రవేత్తలు 2) చట్టకోవిదులు
   3) శిష్యులు 4) పెద్దలు
14. 'కైరవం' పదానికి అర్థం?
   1) పెద్ద ధ్వని 2) తెల్ల కలువ
   3) తామర పుష్పం 4) బాణం
15. 'కూర్మం' అంటే ఏమిటి?
   1) మొసలి 2) చేప
   3) తాబేలు 4) కప్ప
16. 'ఉప్పరం' పదానికి అర్థం?
   1) పొంగుట 2) భూమి
   3) ఆకాశం 4) నక్షత్రం
17. 'కంఠీరవం' పదానికి అర్థం?
   1) కంఠహారం 2) సింహం
   3) పులి 4) ఎలుగుబంటు
18. 'కుడ్యం' పదానికి అర్థం?
   1) చిత్రం 2) గోడ
   3) మేడ 4) గోయి
19. 'జానపదులు' అంటే ఎవరు?
   1) దేవతలు 2) నాగరికులు
   3) పల్లెటూరి ప్రజలు 4) పట్టణ ప్రజలు
20. 'నిదాఘం' పదానికి అర్థమేంటి?
   1) ఇంకిన నది 2) చలి కాలం
   3) వేసవి కాలం 4) రాత్రి వేళ
21. 'పరాభవం' పదానికి అర్థం?
   1) గౌరవం 2) పరలోకం
   3) అతి వినయం 4) అవమానం
22. 'పారాశర్యుడు' అని ఎవరికి పేరు?
   1) దుర్వాసుడు 2) వ్యాసుడు
   3) విశ్వామిత్రుడు 4) వశిష్ఠుడు
23. 'సౌదామిని' పదానికి అర్థం?
   1) మేఘం 2) నక్షత్రం
   3) మెరుపు తీగ 4) ఆకాశం
24. 'హితైషులు' అంటే అర్థం?
   1) శత్రువులు 2) మిత్రులు
   3) వీరులు 4) యాచకులు
25. ఒక పదానికి అనేక అర్థాలు ఉండడాన్ని ఏమంటారు?
   1) పర్యాయ పదం 2) బహుళార్థం
   3) నానార్థం 4) అనేకార్థం
26. 'అర్థి' పదానికి నానార్థం కానిది?
   1) ధనవంతుడు 2) యాచకుడు
   3) సేవకుడు 4) అసత్యవాది
27. 'కళ' పదానికి నానార్థం?
   1) చదువు 2) శిల్పం
   3) చంద్రుడిలో పదహారో వంతు
   4) పైవన్నీ
28. 'కుండలి' పదానికి నానార్థం కాని పదం?
   1) పాము 2) ఎలుక
   3) నెమలి 4) వరుణుడు
29. కింది వాటిలో 'కులం' పదానికి నానార్థం?
   1) వంశం 2) జాతి
   3) ఇల్లు 4) పైవన్నీ
30. 'గురువు' పదానికి నానార్థం కానిది?
   1) ఉపాధ్యాయుడు 2) తండ్రి
   3) సుతుడు 4) పురోహితుడు
31. 'వనం' పదానికి నానార్థం?
   1) అడవి 2) తోట
   3) జలం 4) పైవన్నీ
32. 'ధాత' పదానికి నానార్థం కాని పదం?
   1) బ్రహ్మ 2) తాత
   3) సూర్యుడు 4) రక్షకుడు
33. 'అక్షరం' పదానికి నానార్థం?
   1) ధ్వనికి లిపి రూపం
   2) నాశనం లేనిది
   3) పరబ్రహ్మం 4) పైవన్నీ
34. 'దారం, స్వభావం, వింటినారి' అనే నానార్థాలు ఉన్న పదం?
   1) కరణం 2) గుణం
   3) విల్లు 4) తురగం
35. 'ఆజ్ఞ' పదానికి నానార్థం కాని పదం?
   1) ఉత్తరువు 2) అహం
   3) దండనం 4) భ్రూమధ్యస్థానం
36. 'అమృతం' పదానికి నానార్థం?
   1) నీరు 2) నేయి
   3) పాలు 4) పైవన్నీ
37. 'పృథ్వి' పదానికి నానార్థం కానిది?
   1) భూమి 2) సముద్రతీరం
   3) అతిశయం 4) నల్ల జీలకర్ర
38. కింది వాటిలో 'అంబరం' పదానికి నానార్థం?
   1) ఆకాశం 2) వస్త్రం
   3) దూది 4) పైవన్నీ
39. 'దాహం' పదానికి నానార్థం కానిది?
   1) దప్పిక 2) కాలుట
   3) ఆకలి 4) మంట
40. 'పాలు' పదానికి నానార్థం ఏది?
   1) పెరుగు 2) మజ్జిగ
   3) క్షీరం 4) నీరు
41. 'శ్రీ' పదానికి నానార్థం కానిది?
   1) లక్ష్మి 2) సిరి
   3) సాలె పురుగు 4) వాణి
42. 'కులిశం' పదానికి నానార్థం?
   1) వజ్రాయుధం 2) పిడుగు
   3) బలం 4) పైవన్నీ
43. 'అంతర్యామి' పదానికి నానార్థం?
   1) చేప 2) యజ్ఞం
   3) పరమాత్మ 4) విష్ణువు
44. 'అంబిక' పదానికి నానార్థం కానిది?
   1) పార్వతి 2) తల్లి
   3) పురాణ స్త్రీ 4) లక్ష్మి
45. 'ధార' పదానికి నానార్థం?
   1) జడివాన 2) రథం
   3) కత్తి పదును 4) పైవన్నీ
46. 'సుధ' పదానికి నానార్థం కానిది?
   1) సున్నం 2) అన్నం
   3) పాలు 4) అమృతం
47. 'కరము' పదానికి నానార్థం కానిది?
   1) చేయి 2) కిరణం
   3) శిరస్సు 4) తొండం
48. 'కేసరి' పదానికి నానార్థం?
   1) పులి 2) మేక
   3) సింహం 4) రాక్షసి
49. 'పుండరీకం' పదానికి నానార్థం కానిది?
   1) పెద్ద పులి 2) తెల్ల తామర
   3) తెల్ల గొడుగు
   4) ఎలుగుబంటు
50. 'ఉమ' పదానికి నానార్థం కానిది?
   1) పార్వతి 2) సరస్వతి
   3) కాంతి 4) పసుపు
51. 'విద్య' పదానికి వికృతి రూపం?
   1) విదియ 2) విజ్జ
   3) విద్దె 4) విధ్య
52. 'బిచ్చము' పదానికి ప్రకృతి రూపం?
   1) బత్తెము 2) భిక్షము
   3) భైక్షము 4) బిచ్చెము
53. 'మత్స్యము' పదానికి వికృతి రూపం?
   1) మచ్చీ 2) మత్తియము
   3) మచ్చెము 4) మత్యము
54. 'జాతర' పదానికి ప్రకృతి రూపం?
   1) యాతర 2) యాత్ర
   3) జైత్ర 4) యాతరము
55. 'గృధ్రము' పదానికి వికృతి రూపం?
   1) గృద్ర 2) గెద్ద
   3) గద్ద 4) గద్దె
56. 'బంతి' పదానికి ప్రకృతి రూపం?
   1) పంతి 2) పంక్తి
   3) భంతి 4) భక్తి
57. 'ఆశ్చర్యము' పదానికి వికృతి రూపం?
   1) అచ్చెర్యము 2) ఆచ్చెర్యము
   3) అచ్చెరువు 4) అచ్చేర్యము
58. 'ఆన' పదానికి ప్రకృతి రూపం?
   1) యాన 2) ఆజ్ఞ
   3) యజ్ఞ 4) విఘ్న
59. 'పక్షి' పదానికి వికృతి రూపం?
   1) పక్కె 2) పక్కెము
   3) పక్కి 4) పక్క
60. 'బాగ్గెము' పదానికి ప్రకృతి రూపం?
   1) బోగము 2) బోగ్గెము
   3) భాగ్యము 4) భాగ్గెము
61. 'దూరం' పదానికి వికృతి రూపం?
   1) దెవ్వ 2) తెరవు
   3) ధవ్వ 4) దవ్వు
62. 'పగ్గియ' పదానికి ప్రకృతి రూపం?
   1) పగ్గెము 2) ప్రజ్ఞ
   3) పెగ్గెము 4) పగ్గము
63. 'పుష్పం' పదానికి వికృతి రూపం?
   1) సుమము 2) పూపము
   3) పువ్వు 4) పువ్వము
64. 'సింగారం' పదానికి ప్రకృతి రూపం?
   1) శృంగారి 2) శృంగారము
   3) సింగారి 4) ఏదీకాదు
65. 'ధర్మము' పదానికి వికృతి రూపం?
   1) ధమ్మము 2) దామము
   3) దమ్మము 4) ధర్మువు
66. 'పక్కెము' పదానికి ప్రకృతి రూపం?
   1) పక్కము 2) పక్షము
   3) ప్రాపకము 4) పాకెము
67. 'అంబ' పదానికి వికృతి రూపం?
   1) ఆంబ 2) ఆమ్మ
   3) అమ్మ 4) హమ్మ
68. 'పుత్రుడు' పదానికి వికృత రూపం?
   1) సుతుడు 2) పొత్రుడు
   3) వారసుడు 4) బొట్టెడు
69. 'కబ్బం' పదానికి ప్రకృతి రూపం?
   1) కావ్యం 2) కాబ్యం
   3) కవ్వం 4) కర్జ
70. 'ప్రస్తరం' పదానికి వికృతి రూపం?
   1) ప్రతారం 2) పాత్రం
   3) పొత్తరం 4) పొత్తారం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 2; 6) 3; 7) 3; 8) 3; 9) 3; 10) 4; 11) 3; 12) 2; 13) 3; 14) 2; 15) 3; 16) 3; 17) 2; 18) 2; 19) 3; 20) 3; 21) 4; 22) 2; 23) 3; 24) 2; 25) 3; 26) 4; 27) 4; 28) 2; 29) 4; 30) 3; 31) 4; 32) 2; 33) 4; 34) 2; 35) 2; 36) 4; 37) 3; 38) 4; 39) 3; 40) 3; 41) 4; 42) 4; 43) 3; 44) 4; 45) 4; 46) 2; 47) 3; 48) 3; 49) 4; 50) 2; 51) 3; 52) 2; 53) 3; 54) 2; 55) 3; 56) 2; 57) 3; 58) 2; 59) 3; 60) 3; 61) 4; 62) 2; 63) 3; 64) 2; 65) 3; 66) 2; 67) 3; 68) 4; 69) 1; 70) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇర్కాన్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్).. రెగ్యులర్ ప్రాతిపదికన జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 04.

పోస్టుల వివరాలు: జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్)-02, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్)-02.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. -వయసు: 45 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు జాయింట్ జనరల్ మేనేజర్ రూ.80,000 నుంచి రూ.2,20,000. డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000.

ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ జనరల్ మేనేజర్/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.

దరఖాస్తులకు చివరితేది: 07.02.2025.

వెబ్‌సైట్: https://www.ircon.org/

సీఎంపీఎఫ్‌వో, జార్ఖండ్‌లో 115 గ్రూప్-సీ పోస్టులు

కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(సీఎంపీఎఫ్‌వో).. గ్రూప్-సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 115.

పోస్టుల వివరాలు: స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3-11, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్-104.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.

వేతనం: నెలకు రూ.28,000.

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరితేది: 15.02.2025.

వెబ్‌సైట్: https://cmpfo.gov.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
శనివారం। 1-2-2025

దేశంలో ఏకైక టైడల్ ఓడరేవు ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశంలో రవాణా

జల రవాణా

రవాణా మార్గాలన్నింటిలోకెల్లా అతి తక్కువ ఖర్చుతో కూడినది జల రవాణా. కారణం.. నీటికి కదిలే గుణం ఉండటం వల్ల దానిపై తేలే వస్తువులను సులభంగా కదిలిస్తుంది. జల రవాణాలో ఇంధన ఖర్చు కూడా తక్కువ. ఈ వ్యవస్థ ద్వారా నిత్యం వేల టన్నుల సరుకును ఖండాతరాలకు చేరవేస్తున్నారు.

నౌకాయానంలో ప్రపంచంలో భారత్ 17వ స్థానంలో ఉంది. దేశంలో జలమార్గాలను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి... 1) భారతదేశంతో అనుసంధానమైన అంతర్జాతీయ జల మార్గాలు, 2) అంతః స్థలీయ జల మార్గాలు

భారతదేశంతో అనుసంధానమైన అంతర్జాతీయ జలమార్గాలు:

ఇవి అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వర్ధమాన దేశాలన్నింటికంటే భారతదేశానికి అత్యధిక వాణిజ్య నౌకలున్నాయి. అంతర్జాతీయ జల మార్గాల్లో ముఖ్యమైనవి....

సూయజ్ కెనాల్ మార్గం

ఈ మార్గానికి రూపకల్పన చేసిన ఇంజనీర్ ఫెర్డినాండ్ డిలెప్స్. ఇది భారతదేశాన్ని ఐరోపా దేశాలతో కలుపుతుంది. విదేశాలతో సముద్ర మార్గం ద్వారా జరిగే వివిధ వస్తువుల రవాణాలో అత్యధిక భాగం దీనిదే. కాబట్టి భారతదేశ ఎగుమతి, దిగుమతుల్లో 75 శాతం సరకు రవాణా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. అలెగ్జాండ్రియాకు చెందిన 'ఫిలిప్స్' అనే ఫ్రెంచ్ కౌన్సిలర్ 1859లో సూయజ్ కాలువ నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఇది మధ్యధరా, హిందూ మహాసముద్రాల్లో నౌకాయాన సౌకర్యాలను కల్పిస్తోంది. ఈ కాలువ ప్రారంభం కావడంతో ముంబై - లండన్‌ల మధ్య 7040 కి.మీ.లు, లండన్ - సింగపూర్‌ల మధ్య 5336 కి.మీ.లు, లండన్ - కోల్‌కతాల మధ్య 5627 కి.మీ.ల దూరం తగ్గింది.

పనామా కాలువ

ఈ మార్గం పసిఫిక్, అట్లాంటిక్ మార్గాలను కలుపుతుంది. పనామా కాలువ ప్రారంభమైన తర్వాత పసిఫిక్ తీరంలో ట్రాఫిక్ బాగా ఎక్కువైంది. ఈ కాలువ వల్ల 4000 కి.మీ. నుంచి 12,000 కి.మీ. వరకు దూరం తగ్గింది. దీనివల్ల దక్షిణ అమెరికా పశ్చిమ తీర ప్రాంతానికి, తూర్పు సంయుక్త రాష్ట్రాలకు మధ్య వ్యాపారం పెరిగింది.

అంతః స్థలీయ జలరవాణా

భారత్‌లో దాదాపు 14,500 కి.మీ.ల పొడవైన జల మార్గాలు ఉన్నాయి. ఇందులో 10,049 కి.మీ.ల పొడవున నదులు, 4,303 కి.మీ.ల పొడవున కాలువల ద్వారా జలరవాణా జరుగుతోంది. దేశంలోని అంతఃస్థలీయ జలమార్గాల్లో ఆరింటిని జాతీయ జల మార్గాలుగా గుర్తించారు. అవి..

ఎ) జాతీయ జల మార్గం-1

(1,620 కి.మీ.): పశ్చిమ బెంగాల్‌లోని హాల్దియా నుంచి అలహాబాద్ వరకు ఇది విస్తరించి ఉంది. దీన్నే 'గంగా-భాగీరథ - హుగ్లీ నది' జల మార్గం అని పిలుస్తారు.

బి) జాతీయ జల మార్గం-2 (891 కి.మీ.)

అసోంలోని సదియా నుంచి బంగ్లాదేశ్ సరిహద్దులోని దుబ్రి వరకు ఇది విస్తరించి ఉంది. దీన్నే 'బ్రహ్మపుత్ర నది' జల మార్గం అని పిలుస్తారు.

సి) జాతీయ జల మార్గం-3

కేరళలోని కొల్లాం నుంచి కొట్టాపురం వరకు విస్తరించి ఉంది. దీన్నే 'పశ్చిమ తీర కాలువ' అని పిలుస్తారు.

డి) జాతీయ జల మార్గం-4:

కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు వెళ్లే జల మార్గం. దీన్నే 'బకింగ్‌హామ్ కాలువ' అని పిలుస్తారు.

ఇ) **జాతీయ జలమార్గం-5:** బ్రాహ్మణి నది నుంచి మహానది డెల్టా వ్యవస్థలో భాగంగా ఉంది. దీన్నే 'తూర్పు తీర కాలువ' అని పిలుస్తారు.



ఎఫ్) జాతీయ జల మార్గం-6

లకీపూర్ నుంచి భాంగా వరకు బారక్ నదిలో భాగంగా నిర్మించే జల మార్గం. దీన్నే 'బారక్ కెనాల్' జల మార్గం అని పిలుస్తారు. ఇది మణిపూర్ ద్వారా ప్రవహిస్తుంది.

దేశంలోని ప్రధాన ఓడరేవులు

సముద్రాన్ని భూభాగంతో కలిపే ముఖ ద్వారాన్ని 'ఓడరేవు' అని పిలుస్తారు. ప్రస్తుతం మనదేశంలో 13 ప్రధాన ఓడరేవులు ఉన్నాయి.

1) కాండ్ల ఓడరేవు:

గుజరాత్‌లోని కచ్ సింధుశాఖలో దీన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని ఏకైక టైడల్ ఓడరేవు. దీన్నే 'ట్రింగ్ ఆఫ్ పార్టిషన్' అని పిలుస్తారు.

2) ముంబై ఓడరేవు

దేశంలోని అతి పెద్ద, సహజ సిద్ధ ఓడరేవు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండేది కూడా ఇదే. ప్రధానంగా ఈ ఓడరేవు నుంచే పెట్రోలియాన్ని దిగుమతి చేసుకుంటున్నారు.

3) నవసేవ ఓడరేవు

దీన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఓడరేవు అని కూడా అంటారు. దేశంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని ఏర్పాటు చేశారు. ముంబై ఓడరేవు రద్దీని తగ్గించడానికి దీన్ని అభివృద్ధి చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద కంటెయినర్ ఓడరేవు.

4) మార్మగోవా ఓడరేవు:

ఇది జువారి నది ఎడమవైపు ఒడ్డున ఉంది. ఇక్కడి నుంచి ఇనుప ఖనిజాన్ని పశ్చిమదేశాలకు ఎగుమతి చేస్తారు.

5) **న్యూ మంగళూరు ఓడరేవు:** దీన్నే 'గేట్ ఆఫ్ కర్ణాటక' అని పిలుస్తారు. ఇది గురుపూర్ నది ఒడ్డున ఉంది.

6) **కొచ్చిన్ ఓడరేవు:** దీన్ని 'క్వీన్ ఆఫ్ అరే బియా' అని పిలుస్తారు. ఇది వెంబనాడ్ కాయల్ వద్ద ఉంది. ఇక్కడి నుంచి ప్రధానంగా సుగంధ ద్రవ్యాలు, కంటెయినర్లు ఎగుమతి చేస్తారు.

7) **ట్యూటికోరిన్ ఓడరేవు:** హిందూ మహా సముద్ర తీరంలో ఉన్న ఏకైక ఓడరేవు. ఇది ముత్యం చిప్పలకు ప్రసిద్ధి చెందిన ఓడరేవు.

8) **చెన్నై ఓడరేవు:** దేశంలోని పురాతన, పశ్చిమ తీరంలో ఉన్న అతిపెద్ద ఓడరేవు.

9) **ఎన్నోర్ ఓడరేవు:** ఇది దేశంలోని ఏకైక కార్పొరేట్ ఓడరేవు. నెదర్లాండ్స్ సహకారంతో చెన్నై ఓడరేవుపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి దీన్ని నిర్మించారు. ప్రస్తుతం దీన్ని 'కామరాజన్' ఓడరేవుగా పేరు మార్చారు.

10) **విశాఖపట్నం ఓడరేవు:** ఇది దేశంలోనే అత్యంత లోతైన సహజసిద్ధ ఓడరేవు. అతిపెద్ద కన్వేయర్ బెల్ట్, ఔటర్ హార్బర్ ఉన్న ఓడరేవు. దీనికి సహకారంగా విశాఖ తీరంలో 'గంగవరం పోర్ట్'ను నిర్మించారు. జపాన్‌కు ఇనుప ఖనిజాన్ని ఎక్కువగా ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తారు.

11) **పారాదీప్ ఓడరేవు:** ఇది ఒడిశా తీరంలో ఉంది. జపాన్‌కు ఈ ఓడరేవు నుంచి ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేస్తున్నారు.

12) **కోల్‌కతా ఓడరేవు:** ఇది దేశంలో నదీ ఆధారిత ప్రధాన ఓడరేవు. హుగ్లీ నది కుడివైపున ఉంది.

13) **హాల్దియా ఓడరేవు:** నదీ ఆధారిత ఓడ రేవు. హుగ్లీ నది ఎడమ గట్టున ఉంది. పూడిక సమస్య ఎక్కువగా ఉన్న ఓడరేవు.

మాదిరి ప్రశ్నలు

1. దేశంలో ఓడరేవులు ఎక్కువ సంఖ్యలో ఉన్న రాష్ట్రం ఏది?
   ఎ) తమిళనాడు బి) మహారాష్ట్ర
   సి) గుజరాత్ డి) ఆంధ్రప్రదేశ్
2. దేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏది?
   ఎ) కొచ్చిన్ బి) గోవా
   సి) కృష్ణాపట్నం డి) గంగవరం
3. కింది వాటిలో నదీ ఆధారిత ఓడరేవు ఏది?
   ఎ) పారాదీప్ బి) మంగళూరు
   సి) కొచ్చిన్ డి) హాల్దియా
4. దేశంలో 25 శాతం వాణిజ్యాన్ని నిర్వహిస్తోన్న మిక్కిలి పెద్ద ఓడరేవు?
   ఎ) చెన్నై బి) ముంబై
   సి) నవసేవ డి) కొచ్చిన్
5. కింది వాటిలో సహజసిద్ధ ఓడరేవు కానిది?
   ఎ) కాండ్ల బి) మార్మగోవా
   సి) కొచ్చిన్ డి) విశాఖపట్నం
6. జాతీయ జలమార్గాల్లో గుర్తించిన చంపారన్ కాలువ ఏ రాష్ట్రంలో ఉంది?
   ఎ) తమిళనాడు బి) పశ్చిమబెంగాల్
   సి) కేరళ డి) ఒడిశా
7. సూయజ్ - కొలంబో అంతర్జాతీయ జలమార్గానికి సమీపంలో ఉన్న రేవు పట్టణం ఏది?
   ఎ) ముంబై బి) మార్మగోవా
   సి) కొచ్చిన్ డి) న్యూమంగళూరు
8. భారతదేశంలో అతిపెద్ద కంటెయినర్ పోర్ట్ ఏది?
   ఎ) చెన్నై బి) ముంబై
   సి) కోల్‌కతా డి) నవసేవ
9. సాగరమాల అనే పదం కింది వాటిలో దేనికి సంబంధించింది?
   ఎ) డ్రిల్లింగ్ వాహనం
   బి) ఓడరేవు అభివృద్ధి ప్రాజెక్ట్
   సి) చమురు బావి డి) బొగ్గు బావి
10. జపాన్‌కు ఇనుప ఖనిజాన్ని ఎక్కువగా ఏ ఓడరేవు నుంచి ఎగుమతి చేస్తున్నారు?
    ఎ) కోల్‌కతా బి) పారాదీప్
    సి) విశాఖ డి) చెన్నై
11. జవహర్‌లాల్ నెహ్రూ ఓడరేవు అని ఏ ఓడ రేవును పిలుస్తారు?
    ఎ) ముంబై బి) కాండ్ల
    సి) నవసేవ డి) కొచ్చిన్
12. ముత్యం చిప్పల అభివృద్ధికి ప్రసిద్ధి చెందిన ఓడరేవు?
    ఎ) ధనుష్కోటి బి) నవసేవ
    సి) ట్యూటికోరిన్ డి) కాండ్ల
13. 'బకింగ్ హామ్ కెనాల్' జలమార్గం ఏ రాష్ట్రంలో ఉంది?
    ఎ) ఒడిశా బి) తమిళనాడు
    సి) కేరళ డి) ఆంధ్రప్రదేశ్
14. దేశంలో పొడవైన జాతీయ జలమార్గం ఏది?
    ఎ) గంగ-భాగీరథ-హుగ్లీ నదీ జలమార్గం
    బి) బ్రహ్మపుత్ర నదీ జలమార్గం
    సి) పశ్చిమతీర కాలువ
    డి) బకింగ్ హామ్ కెనాల్
15. మన దేశంలో ఏ రేవు పట్టణం అధికంగా పూడిక సమస్యను ఎదుర్కొంటోంది?
    ఎ) కోల్‌కతా బి) హాల్దియా
    సి) చెన్నై డి) కొచ్చిన్
16. సుగంధద్రవ్యాల ఎగుమతికి ప్రసిద్ధి చెందిన ఓడరేవు ఏది?
    ఎ) ముంబై బి) మంగళూరు
    సి) కొచ్చిన్ డి) చెన్నై
17. 'క్వీన్ ఆఫ్ అరేబియా' అని ఏ ఓడరేవును పిలుస్తారు?
    ఎ) గోవా బి) ముంబై
    సి) కొచ్చిన్ డి) చెన్నై
18. దేశంలో ఏకైక టైడల్ ఓడరేవు ఏది?
    ఎ) గోవా బి) కొచ్చిన్
    సి) కాండ్ల డి) ముంబై
19. నూతనంగా నిర్మించబోయే బారక్ కెనాల్ జలమార్గం ఏ రాష్ట్రంలో ఉంది?
    ఎ) అసోం బి) ఒడిశా
    సి) పశ్చిమ బెంగాల్ డి) మణిపూర్
20. రవాణా మార్గాలన్నింటిలో అతి తక్కువ ఖర్చుతో అయ్యే రవాణా ఏది?
    ఎ) జల రవాణా బి) వాయు రవాణా
    సి) రైల్వే రవాణా డి) రోడ్డు రవాణా

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) బి; 5) బి;
6) ఎ; 7) సి; 8) డి; 9) బి; 10) సి;
11) సి; 12) సి; 13) డి; 14) ఎ; 15) బి;
16) సి; 17) సి; 18) సి; 19) డి; 20) ఎ.

The scientific objectives include..

MODEL QUESTIONS

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. If I was president (1)/ I will (2)/ make health care (3)/ more affordable. (4)/ No error (5)
2. Despite government sponsored endeavors (1)/ to improve classroom performance, (2)/ an extraordinary high percentage of students(3)/ fail to gain admission to higher education.(4)/No error (5)
3. Wordsworth was one of the first European poet (1)/ to consider (2)/ the lowliest members of society (3)/ to be valid subjects for poetry. (4)/ No error (5)
4. It is probable (1)/ that the prototype cellular motor (2)/ might be ready for testing (3)/ around the end of next year. (4)/ No error (5)
5. The publishers, unwilling to shoulder the entire risk, (1)/ insisted that the author (2)/ shou-ld pay half the cost of the initial print run (3)/ of his controversial new book. (4)/ No error (5)

Directions (Q. 6 to 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. It ought to be her with whom you share your secrets, not me.
   1) her with whom you share your secrets, not I.
   2) she with whom you share your secrets, not me.
   3) she with whom you share your secrets, not I.
   4) her with who you share your secrets, not me.
   5) No correction required
7. The government requires that these forms should be submitted before the end of the financial year.
   1) that these forms should be submitted
   2) that these forms be submitted
   3) for these forms to be submitted
   4) these forms submission
   5) No correction required
8. A conjunction is used to connect words and sentences together.
   1) words and sentences together
   2) words or sentences together
   3) words and sentences
   4) words or sentences
   5) No correction required
9. You taking a loan to buy a car annoyed Father.
   1) Your taking a loan to buy a car annoyed Father.
   2) Your taking a loan to buy a car aggravated Father.
   3) You taking a loan to buy a car annoyed Father.
   4) Father was annoyed by you taking a loan to buy a car.
   5) No correction required
10. Between you and I, I doubt that he will come.
    1) and I, I doubt that he will come.
    2) and I, I doubt that he would come.
    3) and me, I doubt that he will come.
    4) and me, I doubt that he would come.
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The scientific objectives include atmospheric entry science, long range and close-up surface imaging, rock and soil composition and material properties experiments, and meteorology, with the general objective being to characterize the Martian environment for further exploration.

B) Mars Pathfinder was an ambitious mission to send a lander and a separate, remote-controlled rover to the surface of Mars.

C) The mission had the primary objective of demonstrating the feasibility of low-cost landings on and exploration of the Martian surface.


D) This was the second of NASA's low-cost planetary Discovery missions to be launched.

E) This objective was met by tests of communications between the rover and lander, and the lander and Earth, tests of the imaging devices and sensors, and tests of the maneuverability and systems of the rover on the surface.

F) It demonstrated a number of innovative, economical, and highly effective approaches to spacecraft and mission design of a planetary landing mission.

11. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B 3) D
    4) E 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) C
13. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D
    4) E 5) F
14. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D
    4) E 5) F
15. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F

BANK EXAMS
GENERAL ENGLISH



Directions (Q. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Contrary to the weekly action in the market which is ____ with activity, today it presents a ____ picture.
    1) Abuzz, grim 2) critical, solid
    3) appreciated, wonderful
    4) honoured, celebrating
    5) praise, amazing
17. He ____ his demand for registration of a case against the ____.
    1) Assured, law
    2) support, punished
    3) believed, persons
    4) reiterated, culprits
    5) withheld, sensitive
18. Severity of the heat ____ in many regions reached new heights with the ____ temperature rising above 43 degrees.
    1) Transforms, matters
    2) summer, issues
    3) boils, issues
    4) wave, maximum
    5) minimizes, problems
19. The government ____ an expert committee to study the ____ of the project.
    1) Grown, participation
    2) people, utility
    3) upcoming, involve
    4) constituted, feasibility
    5) urban, content
20. The Srisailam dam ____ constructed and completed in all ____ in 1984.
    1) Had, aspect 2) has, expects
    3) expertise, were
    4) have, issues
    5)was, respects

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Many decades ____ (21), radio commentary used to be the best way to catch the cricket ____ (22). Then ____ (23) live television. It may now well be the age of data, ____ (24) live over smart phones and shareable ____ (25) social media. Cricket analytics and content firms, which came up in recent years to serve the burgeoning ____ (26) of professional teams in an era of non-stop cricket, now ____ (27) they have a new audience to serve. This, even as they are finding newer ways ____ (28) teams make better decisions and players iron out their grey areas. "Gone are the days when people chased cricket. It is cricket that is running behind fans with data and scorecards," Mr. Ramakrishnan says. His idea is to keep cricket fans engaged without their having to watch it live, which is possible because of ____ (29) Internet. So a ____ (30) travelling in a bus will not only be able to have an informed opinion about a match currently taking place but also can be in a position to share that immediately on social media.

21. 1) before 2) ago 3) after
    4) old 5) behind
22. 1) action 2) deed 3) act
    4) exploit 5) battle
23. 1) comes 2) will came
    3) came 4) come 5) coming
24. 1) delivered 2) brings
    3) transport 4) pass 5) fetch
25. 1) on 2) in 3) with
    4) for 5) from
26. 1) interest 2) wish 3) needs
    4) serve 5) progress
27. 1) demand 2) substitute 3) bear
    4) burden 5) recognize
28. 1) to help 2) for helping
    3) helps 4) helped 5) help
29. 1) some 2) any one
    3) ethernet 4) mobile 5) date
30. 1) buff 2) fan 3) prediction
    4) fawn 5) preference

ANSWERS

1) 1 2) 3 3) 1 4) 3 5) 3
6) 5 7) 2 8) 4 9) 1 10) 3
11) 2 12) 4 13) 2 14) 4 15) 3
16) 1 17) 4 18) 4 19) 4 20) 5
21) 2 22) 1 23) 3 24) 1 25) 1
26) 3 27) 5 28) 1 29) 4 30) 2

విద్య, ఉద్యోగ సమాచారం

సిడ్బీలో వివిధ ఉద్యోగాలు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ)లో.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** టీమ్ లీడర్-జెండర్ అండ్ ఫైనాన్షియల్ లిటరసీ-01, అసోసియేట్ మేనేజర్-ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్-01.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సోషల్ వర్క్ /కామర్స్/ఎకనామిక్స్ /బిజినెస్ మేనేజ్‌మెంట్/రూరల్ మేనేజ్‌మెంట్ లేదా తత్సమాన విభాగాల్లో పీజీ/పీహెచ్‌డీ ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి టీమ్ లీడర్-జెండర్ అండ్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టుకు 35 ఏళ్లు, అసోసియేట్ మేనేజర్‌కు 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్టింగ్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.02.2025.
» **వెబ్‌సైట్:** www.sidbi.in

బీఆర్ఐసీ-టీహెచ్ఎస్‌టీఐలో వివిధ పోస్టులు

ఫరీదాబాద్‌లోని ఆర్ఐసీ-ట్రాన్స్ లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ).. వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ మేనేజర్, టెక్నికల్ ఆఫీసర్-1, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ మేనేజర్ (బిజినెస్ డెవలప్‌మెంట్)-01, టెక్నికల్ ఆఫీసర్1-01, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత డిగ్రీ(ఫైనాన్స్), బీఈ, బీటెక్(లైఫ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బయో ఇన్ఫర్మేటిక్స్), ఎంఎస్సీ(లైఫ్ సైన్సెస్/బయోఇన్ఫర్మేటిక్స్), ఎంఈ, ఎంటెక్(లైఫ్ సైన్సెస్/కంప్యూటర్ సైన్స్/బయోఇన్ఫర్మేటిక్స్).
» **వయసు:** ప్రాజెక్ట్ మేనేజర్‌కు 35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2025.
» **వెబ్‌సైట్:** https://thsti.res.in